శ్రీహర్షవాసవదత్తా గ్రంథమాల - 7

సకలవేదాంతాల సారభూత గ్రంథం

శ్రీ వేదవ్యాస విరచిత

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## మొదటి భాగం

వ్యాఖ్యాత :
డాక్టర్ కానాల నలచక్రవర్తి

శ్రీ వేంకటాంబ పబ్లికేషన్స్
తిరుపతి (ఆం.ప్ర.)

శ్రీహర్షవాసవదత్తా గ్రంథమాల - 7

సకలవేదాంతాల సారభూత గ్రంథం

శ్రీ వేదవ్యాస విరచిత

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## మొదటి భాగం


*వ్యాఖ్యాత :*

**డాక్టర్ కానాల నలచక్రవర్తి**

*వ్యాకరణ శిరోమణి, శిక్షాశాస్త్రి*

*M.A (సంస్కృతం), M.A. (తెలుగు), M.Ed.*

*విద్యావారిధి (Ph.D ), (విద్యావాచస్పతి D.Lit.)*

సీనియర్ లెక్చరర్

రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం

(డీమ్డ్ యూనివర్సిటీ)

తిరుపతి, ఆంధ్రప్రదేశ్, 517 507



**శ్రీ వేంకటాంబ పబ్లికేషన్స్**

తిరుపతి (ఆం.ప్ర.)

ఈ గ్రంథం తిరుమల-తిరుపతి దేవస్థానం
ఆర్థిక సహాయంతో ముద్రించబడింది

ప్రథమ ముద్రణ : 1996

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

ప్రతులు : 1000

వెల : రు. 65/-

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc No. 53812
Date.
TIRUPATI

ప్రతులకు :

శ్రీమతి కె. శ్రీలక్ష్మీదేవి,
C/o డాక్టర్ కానాల నలచక్రవర్తి
సీనియర్ లెక్చరర్,
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం,
(డీమ్డ్ యూనివర్సిటీ)
తిరుపతి - 517 507

ముద్రణ :

ఉషా లేజర్ గ్రాఫిక్స్,
G-18, సావరిన్ షెల్టర్స్,
లక్డీకాపూల్, హైదరాబాద్ - 4.
Phone : 3325997

# ఆముఖం

సరస్వతీ సత్పుత్ర
కవితాంగంగోత్రి
సహస్రావధాన సంస్థాపనాచార్యులు

**ఆచార్య డాక్టర్ మేడసాని మోహన్,**
డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్టు
తిరుమల - తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ।**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ ॥**

మహాభారతం యొక్క గొప్పదనమేమిటో స్పష్టంగా తెలియచేసిన శ్లోకమిది. భారతీయులకు ప్రధానమైనవి చతుర్విధపురుషార్థాలు. చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన అంశాలు ఈ మహాభారతం నందు ఏవి చెప్పబడినాయో అవే ప్రపంచమం దంతటా చెప్పబడినాయి. ఇందు ఏవి చెప్పబడలేదో అవి ప్రపంచంలో చెప్పబడలేదు. దీన్నిబట్టి మహాభారతం యొక్క గొప్పదనం సాటిలేనిదనీ తెలుస్తుంది

ఇంతటి గొప్ప గ్రంథంలో మిక్కిలి గొప్పగా చెప్పుకోదగింది శాంతిపర్వం నందలి మోక్షధర్మపర్వం. మోక్షధర్మ మనగానే చతుర్థ పురుషార్థం మనకు గుర్తుకు వస్తుంది. చతుర్థపురుషార్థానికి అవసరమైన అంశాలన్నీ ఇందు చెప్పబడినాయి. ధర్మరాజును నిమిత్తంగా చేసుకొని కురుకుల పితామహుడయిన భీష్ముడు ఆధ్యాత్మిక రహస్యాలన్నీ పూస గ్రుచ్చినట్లుగా చెప్పడం ఇందు జరిగింది. ఇంతవరకు సంస్కృతానికే పరిమితమయిన ఈ అంశాలను సామాన్యజనులకు సహితం అందుబాటు లోకి తెచ్చి ఈ రచయిత ఆంధ్రలోకానికి మహోపకారం గావించాడనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

**"మహాభారతం - మోక్షధర్మ పర్వం"** అనే ఈ గ్రంథంలో శోకనివారణం ఎలా? శ్రేష్ఠ పురుషుల కర్తవ్యమేమి? త్యాగమహిమ ఎలాంటిది? ధనం వల్ల కలిగే అనర్థమేమి? సృష్టిక్రమం ఎలా జరిగింది? పంచభూతాల తత్త్వమేమి? సత్యమహిమ ఎలాంటిది? నాలుగు ఆశ్రమవాసుల కర్తవ్యమేమి? మొదలగు అంశాలకు చక్కటి సరళమైన అనువాదం చేసి వేదాంతాన్ని అందరికీ అందుబాటులోనికి తెచ్చారు ఈ గ్రంథకర్తలు.

మహాభారతం - మోక్షధర్మపర్వం అనువాదకులు డాక్టర్ కానాల నలచక్రవర్తిగారు మంచి రచయితలు, బహుగ్రంథకర్తలు, వక్తలు, పరిశీలకులు, విమర్శకులుకూడా. వీరు రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలో ఉండి అఖిల భారత స్థాయి విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్వాంసులకు మేలు బంతియైన గ్రంథాలను రచిస్తూ ఆంధ్రదేశానికి మాత్రమే పరిమితం గాక అఖిలభారత స్థాయిలో ఉత్తమ రచయితలుగా, ఆదర్శ అధ్యాపకులుగా పేరుగాంచి సంస్కృతాంధ్ర హిందీ భాషలకు సేవ చేస్తున్న మనీషి.

డాక్టర్ కానాల నలచక్రవర్తిగారు రచించిన **"సంస్కృత శిక్షణే ప్రాయోగికాధ్యాపన విధానమ్,"** సంస్కృతాధ్యాపనమ్, **"మధ్వమంత్రార్థమంజలి"** "(ప్రకాశిత తాళపత్ర గ్రంథం)" **"తెలుగు బోధిని విధానం"** అనే గ్రంథాలు అఖిలభారత సంస్కృత విద్వాంసుల మన్నలకు పాత్రములైనాయి వీరు సంస్కృతాధ్యాపన శాస్త్రంలో ఒక వినూత్న ఒరవడిని సృష్టిస్తూ సంస్కృతాంధ్ర హిందీ భాషలకు ఎనలేని సేవచేస్తున్నారు. స్వయంగా వీరు విద్వాంసులు. స్వయంగా ఖ్యాతిగాంచడమేకాక వీరు తమ కుమారుడైన తొమ్మిది సంవత్సరముల చి॥ కానాల శ్రీహర్షచక్రవర్తిని కూడ సంస్కృతాంధ్రాలలో తీర్చిదిద్దినారు. పట్టుమని పదేళ్ళునిండని ఆ బాలుడు సంస్కృతాంధ్రాంగ్ల హిందీ భాషలలో వేయికిపైగా గద్యపద్యాలను, అన్నమాచార్య, త్యాగరాజ, రామదాస మీరాబాయి సంకీర్తనలను కాదంబర్యాది గద్యాలను ధారణచేసి అలవోకగా చెప్పగలడు. ఆ చిన్నారి బాలునితో ఆంధ్రప్రదేశంలోను, భారతదేశంలోని ప్రధాన నగరాలలోను సాహితీ సంగీత కార్యక్రమాలను ఇప్పించడానికి కృషిచేస్తున్నారు. వీరి నిరంతరకృషికి ఇది కూడా ఒక మచ్చుతునక.

డాక్టర్ కానాల నలచక్రవర్తి గారు అధ్యయనం, అధ్యాపనం, గ్రంథరచన, అనుసంధానాలకే పరిమితంగాక అఖిల భారత స్థాయిలో అవధాన సాహితీ కార్యక్రమాలలో పాల్గొంటూ అఖిల భారత సంస్కృత సమావేశాలలో పాల్గొంటూ సంచలనాత్మక పరిశోధన వ్యాసాలను వ్రాస్తూ సంస్కృతాంధ్ర హిందీ భాషలకు విశిష్టసేవ చేస్తున్నారు. వీరి పరిశోధనా వ్యాసాలను, గ్రంథాలను ప్రశంసించని విద్వాంసులు లేరంటే అతిశయోక్తిగాదు. ఇకపోతే తిరుమల తిరుపతి దేవస్థానాల్లో గ్రంథపరిశీలన కమిటీ సభ్యులుగా ఉంటూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో, ఇతర సమయాలలో ధార్మికోపన్యాసాలనిస్తూ, దూరదర్శన్, ఆకాశవాణి మొదలగు ప్రసార సాధనాలలో ప్రత్యక్షవ్యాఖ్యానం చేస్తూ ఎంతోమంది భక్తులను ఆకట్టుకొనే వీరి కలం నుండి వెలువడ్డ ఈ గ్రంథం అందరి మన్ననలకు పాత్రం కాగలదనీ మున్ముందు మరింత ప్రతిష్ఠాత్మకమయిన ఉత్తమ గ్రంథాలు వీరి కలం నుండి వెలువడాలని ఆశిస్తున్నాను.

డాకర్ మేడసాని మోహన్
7-12-1996

# నివేదనం

*శిరోమణి* సముద్రాల లక్ష్మణయ్య, M.A
కార్యదర్శులు
ధర్మప్రచార పరిషత్
తిరుమల తిరుపతి దేవస్థానము

**"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్!'** అని చెప్పిన విధంగా భారతం సర్వవిషయ సంకలితం. అందులోనూ ధర్మతత్వజ్ఞులు దీనిని విశేషించి ధర్మశాస్త్రంగా పేర్కొన్నారు. మానవుని మనుగడకు ధర్మమే ఆధారం. అచ్యుతుడే ధర్మప్రభువు. ఈ ధర్మాలను ప్రతిపాదించడంలో మహాభారతాన్ని మించిన మరొక గ్రంథం **"న భూతో న భవిష్యతి".**

మహాభారతంలోని శాంతిపర్వంలోనూ, అనుశాసనిక పర్వంలోనూ భీష్ముడు శ్రీకృష్ణుని సమక్షంలో యుధిష్ఠిరునికి సకల విధాలైన ధర్మాలను బోధిస్తాడు. మన జీవన యాత్రలో మాటిమాటికీ కలిగే ధర్మసందేహాలన్నిటికీ పరిష్కారం తెలిపే సూక్ష్మధర్మ ప్రతిపాదన పై ఘట్టాలలో కానవస్తుంది. అందుకే ప్రపంచ సారస్వతంలో భారతానికి సాటిరాదగిన గ్రంథం మరొకటి లేదనడం అతిశయోక్తి కాదు.

భారతంలోని ధర్మాలను వివరించే గ్రంథాలు కొన్ని ప్రాచీన కాలంలోనే వెలువడ్డాయి. అయినా ఆధునిక ప్రజానీకానికి అరమయ్యేరీతిలో ఆ ధర్మతత్వాన్ని వివరించే గ్రంథాలు అరుదనే చెప్పాలి. ఆ లోటు ఈ గ్రంథంతో చాలావరకు తీరిందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ గ్రంథాన్ని సంకలనం చేసి అనువదించిన వారు డాక్టర్ కానాల నలచక్రవర్తిగారు. వీరు తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలో సంస్కృతాధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరు కర్నూలు జిల్లా నంద్యాల మండలం కానాల గ్రామంలో సమితి ఎలిమెంటరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను శ్రీ పూదోట పోశంపాపిరెడ్డి సంస్కృతోన్నత పాఠశాలలో మాధ్యమిక విద్యను అభ్యసించారు కడప జిల్లా ప్రొద్దుటూరులో మహర్షి శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి పేర స్థాపించిన సంస్కృత విద్యాలయంలో సంస్కృత ఎంట్రన్స్ పూర్తి చేశారు. తదుపరి తిరుపతి ఓరియంటల్ కాలేజిలో ఉన్నత విద్యను అభ్యసించినారు. స్వంతకృషితో సంస్కృతంలో M.A. పట్టాను సంపాదించి శిక్షాశాస్త్రాధ్యయనంలో డాక్టరేట్ పొందారు

వీరు సదా పరిశ్రమశీలురై అధ్యయనం, అధ్యాపనం, గ్రంథలేఖనం, ప్రవచనం, సభానిర్వహణం అనుసంధానం మొదలైన కార్యాలు చేస్తూ ఉంటారు. సహజంగా ఉత్సాహవంతులు. సంస్కృతవాఙ్మయాన్ని అభివృద్ధిలోకి తేవాలన్న పట్టుదల గలవారు. ఇంతకు ముందే ఎన్నో గ్రంథాలు వ్రాసి ప్రకటించినారు. వాటిలో చెప్పుకోదగినవి. వ్యాస సిద్ధాంత మార్తాండం, సంస్కృత శిక్షణే ప్రాయోగికాధ్యాపనం, సంస్కృతాధ్యాపనం, మధ్వమంత్రార్థమంజరి శ్రీ మదయ్యావ్వగీత తెలుగు బోధన విధానం మొదలయినవి. వీరి గ్రంథాలు ఆంధ్రరాష్ట్రంలోనే కాక అఖిల భారతస్థాయిలోనూ విద్వాంసుల మన్నలను పొందినాయి అని తెలియజేయుటకు ఎంతో సంతసించుచున్నాను.

ఈ రీతిగా శరపరంపరగా శ్రీ కానాల వారి కలం నుండి జాలువారే గ్రంథాలలో **"మహాభారతం - మోక్షధర్మపర్వం"** అనేది అన్యతమం. ఇందులో మానవుడు గ్రహించవలసిన పరమోత్తమ ధర్మాలెన్నో ప్రతిపాదింపబడ్డాయి. వాటిని చక్కని అనువాదంతో పరోపకార దృష్టితో లోకానికి అందించిన శ్రీ డాక్టర్ నలచక్రవర్తిగారు అభినందనీయులు.

వారి నిరంతర కృషి ఇంకా ముమ్మందుకు సాగి ఎన్నో గ్రంథరత్నాలను సహృదయ లోకానికి ప్రసాదించాలని మనసారా కాంక్షిస్తున్నాను.

సముద్రాల లక్ష్మణయ్య
5-12-1996

# అవతారిక

శ్రీకృష్ణద్వైపాయనులని పేరుగాంచిన మహర్షి వేదవ్యాసులవారు నిఖిల విశ్వంలోకెల్లా పేరుగాంచిన మహర్షులు. వీరు విశ్వానికి అందులోను ఆధ్యాత్మిక ప్రపంచానికి చేసిన సేవ అనితరసాధ్యం. సంహితాకారంగానున్న వేదాలను ఋగ్యజుస్సా మాధర్వణాలనే పేరుతో నాల్గింటిగా విభజించి వేదాధ్యయనాన్ని సరళతరం గావించారు. ఆ తర్వాత వేదాలను ఉపనిషత్తులను ఆధారంగా చేసుకొని బ్రహ్మసూత్రాలనే సిద్ధాంత గ్రంథాన్ని వ్రాశారు వ్యాసుల వారు. మొత్తం ప్రపంచంలోనే ఇంత గొప్పనైన గ్రంథం మరొకటి లేదు. శ్రీమద్భాగవతాన్ని, అష్టాదశ పురాణాలను అష్టాదశ ఉపపురాణాలను వ్రాసిన మేధా సంపన్నులు. సకల గ్రంథాల సారాన్ని అర్ధశ్లోకంలో ఇమిడ్చిన వారు. వీరు -

శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥

ఆ మహానుభావులు మనకిచ్చిన సందేశం ఏమనగా మానవులారా! మీరు ఇతరులకు ఉపకారం చేస్తే పుణ్యం కలుగుతుంది. ఇతరులకు అపకారం చేస్తే పాపం వస్తుంది. ఇదే సకల గ్రంథాల సారం అని నొక్కి వక్కాణించారు.

అట్టి మహాత్ములు ఆనాటి భారతదేశ స్థితిగతులను చక్కగా పరిశీలించి ముఖ్యంగా వేదాలు కొందరికే అందుబాటులో ఉన్నాయని వాటిలోని అంశాలు అందరికీ అందుబాటులో ఉండాలనే భావంతో వేదాలతో సమానమైన మరోవేదాన్ని వ్రాసినారు. అదే పంచమ వేదం అనే పేరుతో ఖ్యాతినొందింది. ఆ పంచమ వేదమే మహాభారతంగా చెలామణి అవుతూ ఉంది. ఆనాడు వేదవ్యాసులవారి ఆశయాలు నెఱవేరినాయి.

ఈనాడు వారు వ్రాసిన గ్రంథాలను చదివేవారు లేరు. కారణం మహాభారతగ్రంథం సంస్కృతంలో ఉండడమే. సంస్కృతభాష అందరికీ అందుబాటులో లేదు. ఫలితంగా ఋషుల కృషి సామాన్యులకు అందుబాటులో లేదు. ఇట్టి పరిస్థితులలో మహాభారతాన్ని తెలుగులోకి అనువదించాలనే కోరిక కలిగింది. నన్నయాదులు ఇంతకు ముందు అనువదించినా ఆ కావ్యాన్ని చదివి అర్థం చేసుకోవటానికి కూడా ఉత్సాహం చూపించడం లేదు నేటి ప్రజలు. కారణం అది గ్రాంథిక భాషలోనుండడమే. గ్రాంథికం నుండి వ్యావహారికం వైపు పయనించింది మాతృభాష. అందుకై

మూలమహాభారతాన్ని వ్యావహారిక భాషలోకి అనువాదం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహాభారతమంతా అనువాదం చేయడం ఎంతైనా అవసరం. అయితే

"యత్సారభూతం తదుపాసనీయం
హంసో యథా క్షీరమివాంబు మిశ్రమ్॥"

అనే హంస యొక్క నీరక్షీరవివేచనన్యాయాన్ననుసరించి సకల ఆధ్యాత్మిక జ్ఞానానికి కేంద్రభూతమయిన మోక్షధర్మపర్వాన్ని అనువదించినట్లయితే అజ్ఞానాంధకారంలో కొట్టుకొనిపోయే మానవాళికి కొంత ఉపశమనం కలుగుతుందనే అభిప్రాయంతో ఈ గ్రంథాన్ని ఐదుభాగాలుగా చేసి అనువదించడం జరిగింది. ఇప్పుడు మొదటి భాగం మాత్రమే పాఠకులకు అందజేయడం జరుగుతూ ఉంది. త్వరలోనే సప్తాద్రినాథుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి అండదండలతో మిగిలిన భాగాలను కూడా అందజేయగలవాడను.

**"మహాభారతం - మోక్షధర్మపర్వం"** అనే ఈ గ్రంథంలో భీష్ముడు - ధర్మరాజు వీరిరువురికి మధ్య జరిగిన ఆధ్యాత్మిక రహస్యాలు వివరించబడ్డాయి. ధర్మరాజు భీష్మున్ని వేదాంత ప్రశ్నలను అడగడం ఆయన తాను విన్న, కన్న, తెలుసుకున్న అంశాలను సోదాహరణంగా చెప్పడం ఇందలి ప్రత్యేకత. ఇందు జీవుని దుఃఖనివారణం, పురుషుని కర్తవ్యం, త్యాగమహిమ, డబ్బువల్ల కలిగే దుఃఖం, అజగర వృత్తి ప్రశంస, సద్బుద్ధివల్ల ముక్తి పొందడం, మంచిచెడుల పరిణామాన్ని అనుభవించే విధానం, జగదుత్పత్తి, పంచభూతాల గుణాలు, జీవశక్తి నిరూపణ, నాలుగు ఆశ్రమధర్మాల వివరణ, శిష్టాచారఫలం, ఆధ్యాత్మజ్ఞాన నిరూపణం, ధ్యానయోగ మహిమ, జపమహత్వం, పరంధామ మహత్వం మొదలైన అంశాలు వివరించడం జరిగింది.

వేదాంతాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలనేది నా సంకల్పం. ఆ సంకల్పాన్ని అనుసరించే ఈ గ్రంథాన్ని అనువదించడం జరిగింది. ఎంతో సమయం, ధనం వెచ్చించి ఈ గ్రంథాన్ని సమాజానికి అందించడం జరిగింది. ఈ కృషిలో సమాజానికి ఏ కొంత లాభం జరిగినా అది నా పూర్వజన్మ సుకృతమని భావిస్తాను.

*గురుబుధజనారాధన తత్పరుడు*
డాక్టర్ కానాల నలచక్రవర్తి

# కృతజ్ఞతానివేదనం

"మహాభారతం - మోక్షధర్మపర్వం" అనే ఈ అనువాద గ్రంథం నాలుగు సంవత్సరాల క్రిందటే రచింపబడింది. అయితే వెంటనే ముద్రణభాగ్యానికి నోచుకోలేక పోయింది. నాలుగు సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత సప్తాద్రినాథుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షం వల్ల ఈ పుస్తకం మీ చేతిలోకి వచ్చింది. ఇంతటి మహత్తర అవకాశం ఇచ్చిన ఆ దేవునికి ముందుగా భక్తిపూర్వక కృతజ్ఞతలను తెలియజేసుకుంటున్నాను.

ఈ గ్రంథాన్ని పూర్తిగా చదివి నా ముఖతః కొన్ని వివరణలను ఓపికగా విని కవన - ప్రశాసన - అవధాన - ఉపన్యాస - ధార్మికోపన్యాస కార్యక్రమాల్లో క్షణం తీరిక లేకపోయినప్పటికీ నాపై ఎంతో అభిమానంతో తమ అమూల్య అభిప్రాయాన్ని ఆముఖరూపంలో వ్రాసి ఇచ్చిన సరస్వతీ సత్పుత్రులు, అవధాని జగదేక సార్వభౌములు, సహస్రావధాన సంస్థాపనాచార్యులునైన ఆచార్య డాక్టర్ మేడసాని మోహన్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలను తెలుపుకొంటున్నాను.

అడిగిందే తడవుగా గ్రంథం తీసుకుంటూనే వేదాంత - సాహిత్య - ధార్మికోపన్యాస - ప్రాశాసనిక కార్యక్రమాల్లో లీనమై ఉండి కూడా తమ అమూల్య అభిప్రాయాన్ని నివేదనమనే పేరుతో సత్వరమే వ్రాసి ఇచ్చిన వారు వేదాంత కేసరిగా ప్రఖ్యాతినొందినవారు ఆచార్య సముద్రాల లక్ష్మయ్యగారు. గ్రంథరచనకు సదాప్రోత్సాహమిచ్చే వీరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలుపుకొంటున్నాను.


ఇకపోతే తిరుపతిలో ఉంటూ ఎల్లప్పుడూ తనుమనోజ్ఞానపూర్వకంగా ప్రోత్సాహమందజేసే మా మార్గదర్శకులు డాక్టర్ ఆర్.యన్. అరళీకట్టి గారికి, మిత్రులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి గారికి, మా విద్యాపీఠం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యస్.బి. రఘునాధాచార్యుల వారికి, మిత్రులు ప్రొఫెసర్ ప్రతాప్ గారికి, శ్రీయుతులు బి.సి. హుశ్శైన్ గారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

ఈ గ్రంథప్రకాశనంలో కొంత మేరకు ఆర్థిక సహాయాన్ని అందజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు శ్రీయుతులు S.P.Y రెడ్డి గారికి, బాల్యం నుంచి నన్ను ప్రోత్సహిస్తున్న మా పాఠశాల ప్రధానాధ్యాపకులు శ్రీయుతులు N. తులారాంపాండేగారికి, మా అధ్యాపకులు శ్రీయుతులు K.V. నారాయణరెడ్డి గారికి కృతజ్ఞతలను తెలుపుకొంటున్నాను.

ఈ గ్రంథాన్ని కంప్యూటరైజ్డ్ (D.T.P.) చేయించటానికి తగిన ప్రోత్సాహాన్ని, చేయూతనిచ్చిన యువకిశోరం, యువకవి స్నేహశీలియైన చి॥ మఠ్జి కృష్ణారెడ్డి గారికి, మరియు ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రించిన ఉషాలేజర్ గ్రాఫిక్స్ యాజమాని శ్రీ నందమూరి సోమేశ్వర రావుగారికి మరియు వారి సిబ్బందికి కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను.

*అనువాదకర్త*

డాక్టర్ కానాల నలచక్రవర్తి



# అంకితం

వైద్యమే వృత్తిగా స్వీకరించి
వైద్యాన్నే కర్తవ్యంగా భావించి
సామాన్యజనులకు సైతం
అందుబాటులో ఉంటూ
వైద్యవృత్తికి వన్నె తెచ్చే
సహృదయ మిత్రులు
**డాక్టర్ కె. బ్రహ్మానందం గారికి**

# విషయానుక్రమణిక


| వ. నెం. | అధ్యాయం నెం. | విషయం | పేజీ నెం. |
|---|---|---|---|
| 1. | 174 | శోకంతో కూడిన మనస్సుగలవాని శాంతికై సేనజిత్తురాజు మరియు బ్రాహ్మణునికి మధ్య జరిగిన సంవాదం. | 1 - 12 |
| 2. | 175 | తన శ్రేయస్సునందు కోరికగల పురుషుని కర్తవ్యమేది? అనే విషయంలో తండ్రికి కొడుకు చేసిన జ్ఞానోపదేశం. | 13 - 21 |
| 3. | 176 | త్యాగమహిమను గూర్చి శంపాకుడనే బ్రాహ్మణుడు ఉపదేశించిన విధానం. | 22 - 26 |
| 4. | 177 | మంకిగీత - డబ్బుపై గల కోరికవల్ల కలిగే దుఃఖం వాటిని వదలుట వల్ల గలిగే పరమసుఖాన్ని గూర్చి తెలుపడం. | 27 - 36 |
| 5. | 178 | జనకుని మాటలు - నహుషరాజు ప్రశ్నలకు సమాధానంగా బోధ్యగీత. | 37 - 39 |
| 6. | 179 | ప్రహ్లాద అవధూతల సంవాదం - అజగర వృత్తి ప్రశంస. | 40 - 47 |
| 7. | 180 | సద్బుద్ధి నాశ్రయించినందువల్ల ఆత్మహత్య మొదలగు పాపకర్మాల నుండి ముక్తి పొందవచ్చుననే విషయంపై కాశ్యప బ్రాహ్మణునికి ఇంద్రునికి మధ్య జరిగిన సంవాదం. | 48 - 57 |
| 8. | 181 | మంచి చెడు పనులవల్ల కలిగే పరిణామాన్ని కర్త తప్పక అనుభవించాలని ప్రతిపాదన చేయడం. | 58 - 61 |
| 9. | 182 | భరద్వాజ భృగుసంవాదంలో జగదుత్పత్తికి చెందిన విభిన్న తత్త్వాలను గూర్చి వర్ణించడం. | 62 - 69 |
| 10. | 183 | ఆకాశం నుండి ఇతర నాలుగు స్థూలభూతాల పుట్టుకను గూర్చి వర్ణించడం. | 70 - 73 |
| 11. | 184 | పంచ మహాభూతాల గుణాలను గూర్చి విస్తృతంగా వర్ణించడం. | 74 - 81 |

| | | | |
|---|---|---|---|
| 12. | 185 | శరీరంలో జఠరాగ్ని ప్రాణాపానవాయువుల స్థితిని గూర్చి వర్ణించడం | 82 - 85 |
| 13. | 186 | జీవశక్తిని నానారకాలైన యుక్తులతో శంకోపస్థాపనం చేయడం. | 86 - 88 |
| 14. | 187 | జీవశక్తి నిత్యత్వాన్ని యుక్తులతో సిద్ధింపజేయడం | 89 - 95 |
| 15. | 188 | వర్ణవిభాగాలతో కూడిన మానవులు మరియు ప్రాణుల ఉత్పత్తిని గూర్చి వర్ణించడం. | 96 - 99 |
| 16. | 189 | నాలుగవర్ణాల వారి వేరువేరు కర్మలు. సదాచారం, వైరాగ్యంవల్ల కలిగే పరబ్రహ్మ ప్రాప్తిని గూర్చి వర్ణించడం. | 100 - 103 |
| 17. | 190 | సత్యమహిమ - అసత్యదోషం ఇహలోక పరలోకాలందలి సుఖదుఃఖ వివేచనాన్ని గూర్చి తెలుపడం. | 104 - 108 |
| 18. | 191 | బ్రహ్మచర్యగృహస్థాశ్రమ ధర్మాలను గూర్చి వర్ణించడం | 109 - 114 |
| 19. | 192 | వానప్రస్థం మరియు సన్యాస ధర్మాలను గూర్చి వర్ణించడం, హిమాలయానికి ఉత్తరపు దిక్కున ఉన్న ఉత్కృష్ట లోకం యొక్క విశిష్టత - దాని మహత్వ ప్రతిపాదనం, భృగు భరద్వాజుల సంవాదపు ముగింపు. | 115 - 122 |
| 20. | 193 | శిష్టాచార ఫలం - పాపాన్ని కప్పిపుచ్చడం వల్ల గలిగే హాని - ధర్మ ప్రశంసను గూర్చి వర్ణించడం. | 123 - 129 |
| 21. | 194 | అధ్యాత్మజ్ఞాన నిరూపణం | 130 - 142 |
| 22. | 195 | ధ్యానయోగాన్ని గూర్చి వర్ణించడం | 143 - 147 |
| 23. | 196 | జపయజ్ఞ విషయంలో ధర్మరాజు ప్రశ్న - దానికి భీష్ములవారి సమాధానం, జపం మరియు ధ్యాన మహిమను గూర్చి వర్ణించడం - దాని ఫలాన్ని గూర్చి వివరించడం. | 148 - 152 |
| 24. | 197 | జపం చేసేవానికి దోషం వచ్చేటప్పుడు అతనికి కలిగే నరక ప్రాప్తిని గూర్చి వర్ణించడం | 153 - 155 |
| 25. | 198 | పరమధామానికి అధికారియైన జాపకునికి దేవలోకం కూడా నరకంతో సమానం అనే అంశాన్ని ప్రతిపాదించడం | 156 - 158 |

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 174వ అధ్యాయం

**1.** శోకంతో కూడిన మనస్సుగలవాని శాంతికై సేనజిత్తురాజు మరియు బ్రాహ్మణునకు మధ్య జరిగిన సంవాదం.

*యుధిష్ఠిర ఉవాచ :-*

**1.** ధర్మాః పితామహేనోక్తాః రాజధర్మాశ్రితాః శుభాః ।
ధర్మమాశ్రమిణాం శ్రేష్ఠం వక్తుమర్హసి పార్థివ ॥

*ధర్మరాజు పలికెను :-*

పితామహుడా! ఇంతవరకు రాజ ధర్మాలకు చెందిన శ్రేష్ఠమైన ధర్మాలను ఉపదేశించినావు. ఇప్పుడు నీవు ఆశ్రమవాసులకు చెందిన ఉత్తమ ధర్మాలను గూర్చి చెప్పవలసింది అని కోరెను.

*భీష్మ ఉవాచ :-*

**2.** సర్వత్ర విహితో ధర్మః స్వర్గ్యః సత్యఫలం తపః ।
బహుద్వారస్య ధర్మస్య నేహాస్తి విఫలాక్రియా ॥

*భీష్ముడు పలికెను :-*

ధర్మారాజా! వేదములందంతటా ఆశ్రమవాసులకు స్వర్గసాధక యథార్థ ఫలాన్ని పొందింపజేసే తపస్సు చెప్పబడింది. ధర్మానికి అనేకరకాలయిన దారులున్నాయి. ప్రపంచంనందు ఫలంలేని క్రియ ఏదీలేదు. అనగా ప్రతిక్రియకూడా ఫలాన్నిచ్చేదే అని తెలుసుకోవాలి.

**3.** యస్మిన్ యస్మింస్తు విషయే యో యో యాతి వినిశ్చయమ్ ।
స తమేవాభిజానాతి నాన్యం భరతసత్తమ! ॥

భరతశ్రేష్ఠా ! ఏ ఏ పురుషుడు ఏ ఏ విషయంలో పూర్ణ నిశ్చయం గలవాడై ఏ ఏ దాన్ని పొందుతున్నాడో దాన్నే తన కర్తవ్యంగా తెలుసుకొంటున్నాడు. ఇతరమైన దానిని కర్తవ్యంగా తెలుసుకోవడం లేదు.

**4.** యథా యథా చ పర్యేతి లోకతన్త్రమసారవత్ ।
తథా తథా విరాగోఽత్ర జాయతే నాత్ర సంశయః ॥

మానవుడు ఏ ప్రకారంగా ప్రపంచంలోని పదార్థాలను సారహీనాలుగా తెలుసుకొంటున్నాడో అదే ప్రకారంగా వాటియందు వైరాగ్యాన్ని కూడా పొందుతున్నాడు. ఇందేమాత్రం అనుమానంలేదు.

**5.** ఏవం వ్యవసితే లోకే బహుదోషే యుధిష్ఠిర! ।
**ఆత్మ మోక్ష నిమిత్తం వై యతేత మతిమాన్ నరః ॥**

ధర్మారాజా! ఈ విధంగా ఈ లోకం (జగత్తు) అనేక దోషాలతో కూడు కొన్నదని నిశ్చయించుకొని బుద్ధిమంతుడగు పురుషుడు మోక్షంకోసం ప్రయత్నించాలి.

*యుధిష్ఠిర ఉవాచ :-*

**6.** నష్టే ధనే వా దారే వా పుత్రే పితరి వా మృతే ।
యయా బుద్ధ్యా నుదేచ్ఛోకం తన్మే బ్రూహి పితామహవా! ॥

యుధిష్ఠిరుడు పలికెను :- తాత! ధన నష్టం జరిగినపుడు భార్య కొడుకు లేక తండ్రి మరణించినపుడు ప్రపంచం దుఃఖాన్ని పొందుతున్నది. మానవుడు ఈ దుఃఖాన్ని దూరంచేసుకోవడానికి శమం దమం మొదలగు సాధనాలను అనుష్ఠించే విధాన్ని నాకు తెలియజేసేది.

**7.** నష్టే ధనే దారే వా పుత్రే పితరి వా మృతే ।
అహో! దుఖఃమితి ధ్యాయన్ శోకస్యాపచితిం చరేత్ ॥

కుమారా! ఎప్పుడు ధనం నష్టమగునో, భార్య, పుత్రులు, లేక తండ్రి చనిపోవునో అపుడు ఆహా! ఈ ప్రపంచం చాలా దుఃఖమైంది కదా! అని ఆలోచించి దుఃఖాన్ని పారద్రోలే శమము, దమము మొదలైన సాధనాలను అనుష్ఠిస్తాడు.

**8.** అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
యథాసేనజితం విప్రః కశ్చిదేత్యాబ్రవీత్ సుహృత్ ॥

ఈ విషయంలో ఒకానొక హితైషి అయిన బ్రాహ్మణుడు రాజగు సేనజిత్తు వద్దకు వచ్చి అతనికి ఎలాంటి ఉపదేశాన్ని ఇచ్చినాడో ఆ ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణగా తీసికొని చెబుతున్నాను నీకు.

**9.** పుత్రశోకాభి సంతప్తం రాజానం శోకవిహ్వలమ్ ।
విషణ్ణమనసం దృష్ట్వా విప్రో వచనమబ్రవీత్ ॥

రాజగు సేనజిత్తు కుమారుడు మృత్యువునొందెను. అందువల్ల ఆ రాజు పుత్ర శోకాగ్నితో బాధపడుచుండెను. అప్పుడు అతని మనస్సు విషాదంలో మునిగిపోయింది. దుఃఖంతో విలవిలలాడు ఆరాజును చూచి బ్రాహ్మణుడీవిధంగా పలికినాడు.

**10.** కిం ను ముహ్యసి మూఢస్త్వం శోచ్యః కిమనుశోచసి ।
యదా త్వామపి శోచన్తః శోచ్యాయాస్యన్తి తాం గతిమ్ ॥

ఓ రాజా! నీవు తెలివిలేని మానవునివలె ఎందుకు మోహాన్ని పొందుతున్నావు.? దుఃఖానికి నీవొక్కడవే తగియున్నట్లు మరల ఇతరులకు ఎందుకు దుఃఖాన్ని కలిగించుచున్నావు- అయ్యో! ఈ నీ దుఃఖం వల్లే ఇతరమానవులు నీకొఱకై దుఃఖాన్ని పొందగలుగుస్థితి ఒక రోజు రావచ్చును.

**11.** త్వం చైవాహఞ్చ యే చాన్యే త్వాముపాసన్తి పార్థివ ।
సర్వే తత్ర గమిష్యామో యతఏవాగతాః వయమ్ ॥

ఓ రాజా! నీవు, నేను, ఇతర ప్రజలు ఈ సమయంలో నీ వద్ద కూర్చున్నాం. మనమందంరం ఎక్కడి నుండి వచ్చినామో ఒకనాడు అక్కడికి వెళ్ళగలం.

**12.** కా బుద్ధిః? కిం తపో? విప్ర కః? సమాధిస్తపోధన! ।
కిం జ్ఞానం? కిం శ్రుతం? చైవ యత్ప్రాప్య న విషీదసి ॥

తపమే డబ్బుగాగల ఓ బ్రాహ్మణుడా! నీ బుద్ధి ఎలాంటిది? నీ సమాధి ఎలాంటిది? నీ జ్ఞానమెలాంటిది? నీవు చదివిన శాస్త్రమెట్టిది? దేన్ని పొందినీవు ఎట్టి విషాదాన్ని పొందకున్నావు.?

**హృష్యన్తమవసీదన్తం సుఖదుఃఖ విపర్యయే ।**
**ఆత్మానమనుశోచామి మమైషహృది సంస్థితః ॥**

సుఖదుఃఖాల చక్రం ఎప్పుడూ తిరుగుతూ ఉంటుంది. సుఖసమయంలో నేను సంతోషసాగరంలో ఉంటాను. దుఃఖసమయంలో ఖిన్నుడనగుచుంటాను. ఇట్టి స్థితిలో ఉన్నా నాయంతకు నాకు ఎప్పుడూ దుఃఖం కలుగుతూ ఉంటుంది. ఈ దుఃఖం నా హృదయంలోనే తిష్ఠవేసుకొని ఉంటుంది.

బ్రాహ్మణ ఉవాచ :-

**13.** పశ్య భూతాని దుఃఖాని వ్యతిషిక్తాని సర్వశః ।
ఉత్తమాధమమధ్యాని తేషు తేష్వివ కర్మసు ॥

ఓ రాజా! ఈ ప్రపంచంలో ఉత్తమ -మధ్యమ-అధమ ప్రాణులన్నీ వేరు వేరు పనులను చేస్తూ దుఃఖగ్రస్తాలగుతూ ఉన్నాయి.

( అహమేకోన కశ్చిన్నాహమన్యస్య కస్యచిత్
న తం పశ్యామి యస్యాహం తం న పశ్యామి యో మమ॥ )

నేను ఒంటరిగా ఉన్నాను. నావాడు మరొకడు లేడు. నేనెవ్వరికీ చెందిన వాడను కాను. నేనా పురుషున్ని చూడడం లేదు. ఎవడు నావాడై యున్నాడో వాన్ని కూడా నేను చూడడం లేదు. నాపై ఎవరికీ మమకారం లేదు. నేనెవరిపైననూ మమకారం చూపడం లేదు.

**14.** ఆత్మాపి చాయం న మమ సర్వా వా పృథివీ మమ ।
యథా మమ తథా న్యేషామితి చిన్త్య న మే వ్యథా ।
ఏతాం బుద్ధిమహం ప్రాప్య న ప్రహృష్యే న చ వ్యథా ॥

ఈ శరీరం నాది కాదు ఈ భూమండలం నాది కాదు. ఈ వస్తువులన్నీ ఏ విధంగా నావి కావో అదే విధంగా ఇతరులకు కూడా చెందినవి కావు అని ఆలోచించినందువల్లనే నా మనస్సులో ఏ బాధ లేదు. ఈ విధమగు బుద్ధి ఉండడం వల్లనే నాకు సంతోషంగాని దుఃఖంగాని లేవు.

**15.** యథాకాష్ఠఞ్చ కాష్ఠఞ్చ సమేయాతాం మహోదధౌ ।
సమేత్య చ వ్యపేయాతాం తద్వద్భూత సమాగమః ॥

ఏ విధంగా సముద్రంలో కొట్టుకొని పోతున్న రెండు కర్రలు అప్పుడప్పుడు ఒక దానితో ఒకటి కలిసికొని మరల విడిపోతూ ఉంటాయో అదే విధంగా లోకంలో ప్రాణులయొక్క కలయిక విడిపోవుటలు కూడా కలవు.

**16.** ఏవం పుత్రాశ్చ పౌత్రాశ్చ జ్ఞాతయో బాన్ధవాస్తథా ।
తేషాం స్నేహో న కర్తవ్యో విప్రయోగో ధ్రువో హి తైః ॥

సుఖం తర్వాత దుఃఖం దుఃఖం తర్వాత సుఖం వస్తూ ఉంటాయి. మానవుల సుఖదుఃఖాలు బండిచక్రం వలె తిరుగుతూ ఉంటాయి.

**20.** సుఖాత్ త్వం దుఃఖామాపన్నః పునరాపత్స్యసే సుఖమ్ ।
న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్ ॥

ఈ సమయంలో నీవు సుఖం నుండి దుఃఖంలోకి వచ్చినావు. ఇప్పుడు మరల సుఖాన్ని పొందగలవు. ఇక్కడ ఏ ప్రాణికైనా ఎల్లప్పుడు సుఖం కాని దుఃఖం గాని ఉండదు.

**21.** శరీరమేవాయతనం సుఖస్య
దుఃఖస్య చాప్యాయతనం శరీరమ్ ।
యద్యచ్ఛరీరేణ కరోతి కర్మ
తేనైవ దేహీ సముపాశ్నుతే తత్ ॥

ఈ శరీరమే సుఖానికి ఆధారంగా ఉంది. ఈ శరీరమే దుఃఖానికి కూడా ఆధారం. దేహాభిమానియగు పురుషుడు శరీరం ద్వారా ఏ ఏ కర్మలు చేస్తున్నాడో దానిని అనుసరించి అతడు సుఖదుఃఖరూపమైన ఫలాన్నిపొందుతున్నాడు.

**22.** జీవితఞ్చ శరీరేణ జాత్యైవ సహ జాయతే ।
ఉభే సహ వివర్తేత ఉభే సహ వినశ్యతః ॥

ఈ జీవనం తనంతకు తానే శరీరం వెంట పుట్టుతున్నది. ఈ రెండూ కలిసి నివసిస్తూ ఉన్నాయి. కలిసి నశిస్తూ ఉన్నాయి.

**23.** స్నేహ పాశైర్బహువిధైరావిష్టవిషయా జనాః ।
అకృతార్థాశ్చ సీదన్తే జలైః సైకతసేతవః ॥

మానవులు అనేక రకాలైన స్నేహబంధనాలతో బంధింపబడుతున్నారు. అందువలన వారు ఎల్లప్పుడు విషయాసక్తితో ఆవరింపబడుతున్నారు. ఏ విధంగా ఇసుకతో కట్టుబడిన వంతెన జల వేగంతో కొట్టుకొని పోతుందో అదే విధంగా ఆ మానవుల విషయకామన సఫలమవడంలేదు. దానివలన వారు దుఃఖాన్నే పొందుతున్నారు.

**24.** స్నేహేన తిలవత్సర్వం సర్గచక్రే నిపీడ్యతే ।
తిలపీడైరివాక్రమ్య క్లేశైరజ్ఞాన సమ్భవైః ॥

నూనె తీసేవారు నూనెకోసం నువ్వులను సర్గచక్రంలో పెట్టి పీడించి నూనెను ఎలా తయారుచేస్తుంటారో అలాగే ప్రజలందరూ అజ్ఞానం వలన కల్గిన కష్టాలద్వారా సృష్టిచక్రంలో పిప్పిచేయబడుతున్నారు.

25. సంచినోత్యశుభం కర్మ కలత్రాపేక్షయా నరః ।
స ప్రజ్ఞః ప్రజ్ఞయా హీనో దైవేన లభతే సుఖమ్ ॥

మేలు చేకూర్చే మానవుడు మిత్రులతో కలిసిననూ కలువకున్ననూ, శత్రువు వెంట ఉన్ననూ, మిత్రునివెంట ఉన్ననూ, బుద్ధిమంతుడైననూ, బుద్ధిహీనుడైననూ దేవునకు అనుకూలంగా ఉన్నట్లయితే సుఖాన్ని పొందగలుగుతున్నాడు.

29. నాలం సుఖాయ సుహృదో నాలం దుఃఖాయ శత్రవః ।
న చ ప్రజ్ఞాలమర్థానాం న సుఖానామలం ధనమ్ ॥

మిత్రులు సుఖాన్నివ్వడంలో సమర్థులు కాకపోయినట్లయితే శత్రువులు దుఃఖాన్నివ్వడంలో సమర్థులు కాకపోయినట్లయితే ధనాన్నివ్వడంలో బుద్ధి సమర్థం కాకపోతే డబ్బుకూడా సుఖాన్నివ్వడంలో సమర్థం కాజాలదు.

30. న బుద్ధిర్ధనలాభాయ న జాడ్యమసమృద్ధయే ।
లోకపర్యాయ వృత్తాన్తం ప్రాజ్ఞో జానాతి నేతరః ॥

బుద్ధి డబ్బును పొందింపజేయడానికి కారణం కాదు. మూర్ఖత పేదరికాన్ని పొందిచుటకు కారణంకాదు. నిజానికి సంసారమనే చక్రపుగతిని జ్ఞానియగు పురుషుడు తెలుసుకుంటాడేకాని వేరొకడు తెలుసుకోలేడు.

31. బుద్ధిమన్తఞ్చ శూరఞ్చ మూఢం భీరుం జడం కవిమ్ ।
దుర్బలం బలవన్తఞ్చ భాగినం భజతే సుఖమ్ ॥

బుద్ధిమంతుడు, శూరుడు, మూర్ఖుడు, భయపడువాడు, జడుడు, కవి, దుర్బలుడు, బలవంతుడు మొదలగువారిని ప్రయత్నం లేకుండగనే సుఖం వారిని సమీపిస్తున్నది.

32. ధేనుర్వత్సస్య గోపస్య స్వామినస్తస్కరస్య చ ।
పయః పిబతి యస్తస్యాధేనుస్తస్యేతి నిశ్చయః ॥

పాలనిచ్చే ఆవు దూడకు సంబంధించిందా? మేపేవానికి సంబంధించినదా? పాలను దొంగిలించుకొనిపోయే దొంగదా? అని ప్రశ్నించినట్లయితే నిజానికి ఎవరుదాని పాలుతాగుతారో వారిదే ఆ ఆవు అని విద్వాంసుల నిశ్చయం.

33. యే చ మూఢమతా లోకే యే చ బుద్ధేః పరం గతాః ।
తే నరాః సుఖమేధన్తే క్లిశ్యత్యన్తరితో జనః ॥

ఈ ప్రపంచంలో ఎవరు మిక్కిలి మూర్ఖులుగా ఉంటారో ఎవరు బుద్ధికి ఆవల ఉంటారో ఆ మానవులే సుఖసంపన్నులు. మధ్యలోనున్న ప్రజలందరూ కష్టాలను ననుభవిస్తూ ఉండేవారే

**34.** **అన్యేషు రేమిరే ధీరాః న తే మధ్యేషు రేమిరే ।**
**అన్యప్రాప్తిం సుఖామాహుర్దుఃఖమన్తరమన్త్యయోః ॥**

జ్ఞానులగు పురుషులు చివరిస్థితులలో రమించు చుందురే గాని మధ్యస్థితియందు కాదు. అంతిమ స్థితియొక్క ప్రాప్తి సుఖ స్వరూపాన్ని తెలుపుతుంది. రెండింటి మధ్యస్థితి దుఃఖరూపమని చెప్పియున్నారు.

**సుఖం స్వపితి దుర్మేధాః స్వాని కర్మాణ్యచిన్తయన్ ।**
**అవిజ్ఞానేన మహతా కమ్బలేనేవ సంవృతః ॥**

దుష్టబుద్ధిగల మూర్ఖులగు మానవులు తమవైన శుభాశుభ కర్మలను లెక్కబెట్టక సుఖంగా నిద్రింస్తూఉంటారు. ఎందుకంటే వారు కంబళిని కప్పుకొన్న పురుషునివలె గొప్ప అజ్ఞానమనే చీకటితో కప్పబడియుందురు

**35.** **యే చ బుద్ధిసుఖం ప్రాప్తా ద్వన్ద్వాతీతా విమత్సరాః ।**
**తాన్ నైవార్థా న చానర్థా వ్యథయన్తి కదాచన ॥**

కాని ఎవరికైతే జ్ఞానం వల్ల సుఖం కలుగుతున్నదో, ఎవరైతే సుఖ దుఃఖాలనే ద్వంద్వాలకు అతీతంగా ఉంటారో అట్లే ఎవరి యందు మాత్సర్యం లేదో అట్టివారిని అర్థానర్థాలు ఎన్నటికీ పీడించవు.

**36.** **అథ యే బుద్ధిమప్రాప్తా వ్యతి క్రాన్తాశ్చ మూఢతామ్ ।**
**తేఽతివేలం ప్రహృష్యన్తి సన్తాపముపయాన్తి చ ॥**

ఎవరు మూర్ఖతతో యుందురో, ఎవరికి జ్ఞానం కలుగదో అట్టివారు సుఖాన్ని అనుభవించేటప్పుడు మిక్కిలి ఉల్లాసాన్ని దుఃఖాన్ననుభవించేటప్పుడు మిక్కిలి బాధను పొందుతుంటారు.

**37.** **నిత్యం ప్రముదితా మూఢా దివి దేవగణా ఇవ ।**
**అవలేపేన మహతా పరిభూత్యా విచేతసః ॥**

మూర్ఖ మానవులు స్వర్గంనందలి దేవతలవలె విషయ సుఖాలలో నిమగ్నులై ఉంటారు. ఎందుకంటే వారి మనస్సు విషయాలపై ఆసక్తి అనే బురదలో చిక్కుకొన్నందున మోహాన్ని పొందుతుంటారు.

**38.** **సుఖం దుఃఖాన్తమాలస్యం దుఃఖం దాక్ష్యం సుఖోదయమ్ ।**
**భూతిస్త్వేవం శ్రియాసార్ధం దక్షే వసతి నాలసే ॥**

మొదట సోమరితనం సుఖంవలె కనిపిస్తుంది. కాని చివరికి అది దుఃఖ దాయకమవుతుంది. కార్య కౌశలం దుఃఖం వలె ఉంటుంది. కాని అది సుఖాన్ని

కలిగిస్తుంది కార్యకుశులుడైన పురుషుని యందే లక్ష్మీసహిత ఐశ్వర్యం నివసిస్తుందే కాని సోమరియందు కాదు.

**39.** సుఖం వా యది వా దుఃఖం ప్రియం వా యది వా ప్రియమ్ ।
ప్రాప్తం ప్రాప్తముపాసీత హృదయేనాపరాజితః ॥

అందువల్ల బుద్ధిమంతుడైన పురుషుడు సుఖం కాని, దుఃఖం కాని, ప్రియం కాని, అప్రియం కాని వీటిలో ఏది దొరకినా నిండుమనస్సుతో స్వీకరించాలేగాని వద్దని అనకూడదు.

**40.** శోకస్థానసహస్రాణి భయస్థానశతాని చ ।
దివసే దివసే మూఢమావిశ్తని న పణ్డితమ్ ॥

ప్రతిరోజూ మానవులకు దుఃఖాన్ని కలిగించే సంఘటనలు వేలకొలదీ భయాన్ని కలిగించే సంఘటనలు వందలకొలదీ కలుగుతూ ఉంటాయి. ఈ సంఘటనలు మూర్ఖులమీద తమ ప్రభావాన్ని చూపిస్తాయేగాని విద్వాంసులపైగాదు. అనగా విద్వాంసులు వీటిని లెక్కించరని భావం.

**41.** బుద్ధిమన్తం కృతప్రజ్ఞం శుశ్రూషమనసూయకమ్ ।
దాన్తం జితేన్ద్రియఞ్చాపి శోకో న స్పృశతే నరమ్ ॥

ఎవడు బుద్ధిమంతుడో, ఊహాపోహలలో కుశులుడో, శిక్షితబుద్ధిమంతుడో, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని వినడానికి ఇష్టపడతాడో, ఎవరిలోను దోషాలను చూడకుంటాడో, మనస్సును అధీనంనందుంచుకుంటాడో, జితేంద్రియుడై యుంటాడో అట్టిమానవునికి ఎన్నడూ దుఃఖం అంటదు.

**42.** ఏతాం బుద్ధిం సమాస్థాయ గుప్త చిత్తశ్చరేద్బుధః ।
ఉదయాస్తమయజ్ఞం హి న శోకః స్ప్రష్టుమర్హతి ॥

విద్వాంసుడైన పురుషుడు ఈ విచారాన్ని ఆధారంగా చేసుకొని కామం, క్రోధం మొదలగు శత్రువులను దూరంగా ఉంచుకొని ఉత్తమ గూఢచారియై తిరుగుతూ ఉంటాడు. అతడు ఉత్పత్తి, వినాశం మొదలగు తత్వాలను తెలుసుకుంటూ ఉంటాడు. అలాంటి వానికి శోకం ఎన్నటికీ అంటదు.

**43.** యన్నిమిత్తం భవేచ్ఛోకస్తాపో వా దుఃఖమేవ చ ।
ఆయాసో వా యతో మూలమేకాంగమపి తత్ త్యజేత్ ॥

దేనివల్ల శోకం, తాపం, దుఃఖాలు కలుగుతాయో, దేనికారణంగా ఎక్కువ కష్టపడవలసి వస్తుందో, అలాంటి దుఃఖానికి మూలకారణం శరీరంలో ఒక అవయవమైనప్పటికీ దాన్ని తప్పక వదలివేయాలి.

44. కించిదేవ మమత్వేన యదా భవతి కల్పితమ్ ।
తదేవ పరితాపార్థం సర్వం సమ్పద్యతే తథా ॥

మానవుడు ఎప్పుడైతే ఏదైనా ఒక పదార్థంపై మమకారం ఉంచుకొంటున్నాడో అప్పుడా మమకారమే అతని దుఃఖానికి కారణభూతమవుతూ ఉంటుంది.

45. యద్యద్త్యజతి కామానం తత్ సుఖస్యాభిపూర్యతే ।
కామానుసారీ పురుషః కామాననువినశ్యతి ॥

మానవుడు ఏ ఏ కోర్కెలను వదులుతూ ఉన్నాడో ఆయా కోర్కెలే అతనికి సుఖాన్ని కలుగజేస్తూఉంటాయి. ఏ ఏ పురుషుడు ఏ ఏ కోర్కెలను అనుసరిస్తూ ఉంటాడో అవే అతన్ని అనుసరిస్తూ నష్టాన్ని కలుగజేస్తూ ఉంటాయి.

46. యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయ సుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్ ॥

ప్రపంచంలో భోగాలవల్ల కలుగు సుఖమేదైతే ఉందో స్వర్గం వల్ల కలుగు సుఖమేదైతే ఉందో అలాంటి ఈ రెండూ ఆశానాశంవల్ల కలిగే సుఖంలో 16వ పాలు (భాగం)తో కూడా సమానమైనట్టిది కాదు.

48. ఏవమేవ కిలైతాని ప్రియాణ్యేవాప్రియాణి చ ।
జీవేషు పరివర్తన్తే దుఃఖాని చ సుఖాని చ ॥

ఈ విధంగా ప్రియాప్రియ, సుఖదుఃఖాల ప్రాప్తి మరల మరల క్రమంగా సాగుతూఉంటుంది. ఈ విషయంలో ఏ మాత్రం అనుమానమే లేదు.

49. ఏతాం బుద్ధిం సమాస్థాయ సుఖమాస్తే గుణాన్వితః ।
సర్వాన్కామాన్ జుగుప్సేత కామాన్కుర్వీత పృష్ఠతః ॥

ఇట్టి బుద్ధిని ఆశ్రయించి కోర్కెల త్యాగరూపమైన గుణంతో కూడుకొన్న మానవుడు సుఖంగా ఉంటాడు. దీనివల్ల అతడు అన్నిరకాల భోగాల నుండి విరక్తుడై విముఖుడౌతాడు.

50 వృత్త ఏష హృది ప్రౌఢో మృత్యురేష మనోభవః ।
క్రోధో నామ శరీరస్థో దేహినాం ప్రోచ్యతే బుధైః ॥

హృదయాన్నుండి పుట్టే కోరిక హృదయం నందే వృద్ధి అవుతూఉంటుంది. మరల ఈ కోరికే మృత్యురూపాన్ని ధరిస్తూ ఉంటుంది. ఇదే కోపమనే పేరుతో విద్వాంసులద్వారా పిలువబడుతూ ఉంది.

51. యదా సంహరతే కామాన్ కూర్మో ఙ్గానీవ సర్వశః ।
తదాత్మజ్యోతిరాత్మా యమాత్మన్యేవ ప్రపశ్యతి ॥

తాబేలు ఏ విధంగా తన అవయవాలను ముడుచుకొంటుందో అదే విధంగా ఈ జీవుడు ఎప్పుడైతే తన కోర్కెలను సంకోచించుకొంటున్నాడో (లేకుండాచేసుకుంటున్నాడో) అప్పుడతడు తన విశుద్ధమైన అంతఃకరణంలో స్వయంగా ప్రకాశస్వరూపుడైన పరమాత్మను సాక్షాత్కారం చేసుకొంటున్నాడు.

52. న బిభేతి యదాచాయం యదా చాస్మాన్ న బిభ్యతి ।
యదా నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సమ్పద్యతే తదా ॥

ఎప్పుడైతే ఈ మానవుడు భయాన్ని లెక్కబెట్టడో ఇతనివల్ల ఎవరికీ భయం ఉండదో, ఏ వస్తువును కోరడో, ఏ వస్తువునూ ద్వేషించడో అప్పుడే ఇతడు పరబ్రహ్మయగు పరమాత్మను పొందుతున్నాడు.

53. ఉభే సత్యానృతే త్యక్త్వా శోకానన్దౌ భయాభయే ।
ప్రియాప్రియే పరిత్యజ్య ప్రశాన్తాత్మా భవిష్యతి ॥

ఎప్పుడైతే సాధకుడైన మానవుడు సత్యాసత్యాలు, జగత్తులో కన్పించని పదార్థాలు, దుఃఖానందాలు, భయాభయాలు, ప్రియాప్రియాలు మొదలగు ద్వంద్వాలను వదులుకుంటాడో అప్పుడు అతని మనస్సు శాంతంగా ఉంటుంది.

54. యదా న కురుతే ధీరః సర్వభూతేషు పాపకమ్ ।
కర్మణా మనసా వాచా బ్రహ్మసమ్పద్యతే తదా ॥

ఎప్పుడు ధైర్యంతోకూడిన జ్ఞానవంతుడైన పురుషుడు ఏ జీవిని ఉద్దేశించి మనసా, వాచా, కర్మణా పాపాలను చేయడో అప్పుడతడు పరబ్రహ్మయైన పరమాత్మను పొందుతుంటాడు.

55. యా దుస్త్యజా దుర్మతిర్భియా న జీర్యతి జీర్యతః ।
యోఽసౌ ప్రాణాన్తికో రోగస్తాం తృష్ణాం త్యజతస్సుఖమ్ ॥

దుష్టబుద్ధిగల మానవులకు ఏ త్యాగం కష్టమౌతుందో, ఏ మానవుడు ముసలివాడైనప్పటికీ స్వయంగా ముసలితనాన్ని పొందడో, ఎవడు ప్రాణాలు పోయే రోగాలను కలిగి యుంటాడో ఎవడు ఏ ఆశనైతే వదలుకుంటాడో అట్టివాడు మాత్రమే సుఖాన్ని పొందగలుగుతున్నాడు.

**56.** అత్ర పింగలయా గీతా గాథాః శ్రూయన్తి పార్థివ ।
యథా సా కృచ్ఛ్ర కాలేఽపి లేభే ధర్మం సనాతనమ్ ॥

రాజా! ఈ విషయంలో పింగళ అనే వేశ్య చెప్పిన కథలను నీకు వినిపిస్తాను. ఆమె ఈ కథలను అనుసరించే కష్టకాలంలో కూడా సనాతన ధర్మాన్ని పొందింది.

**57.** సంకేతే పిఙ్గళా వేశ్యా కాంతేనాసీత్ వినా కృతా ।
అథ కృచ్ఛ్రగతా శాన్తా బుద్ధిమాస్థాపయత్ తథా ॥

ఒకసారి పింగళ అనే వేశ్య చాలా సేపు సంకేత స్థలంలో కూర్చొని ఉండగా ఆమె ప్రియుడు ఎంతసేపైనా ఆమె వద్దకు రాలేకపోయినాడు దీనివల్ల ఆమె చాలాబాధపడింది. అప్పుడామె ఈ ప్రకారంగా ఆలోచింపసాగింది.

*పిఙ్గళోవాచ :-*

**58.** ఉన్మత్తాహమనున్మత్తం కాన్తమన్వవసం చిరమ్ ।
అన్తికే రమణం సన్తం నై నమధ్యగమం పురా ॥

*పింగళ పలికెను :-*

నా నిజమైన ప్రియతముడు చాలాకాలం సమీపంలోనే ఉండేవాడు. నేను ఎల్లప్పుడు అతనివెంట ఉంటూవచ్చాను. అతనెప్పుడూ ఉన్మత్తుడు కాలేదు. కాని నేనుమాత్రం నేడీ స్థితికి వచ్చినాను. ఈ రోజునుంచి అతడు నా ఎదుటికి వచ్చినా నేను అతన్ని గుర్తించలేను.

**59.** ఏకస్థూణం నవద్వారమపి ధాస్యామ్యగారకమ్ ।
కా హి కాన్త మిహాయాన్తమయం కాన్తేతి మంస్యతే ॥

ఒకే స్తంభం, తొమ్మిది ద్వారాలు గల ఈ శరీర రూపమైన ఇంటిలో ఈ రోజు నుంచి నేను ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉన్నాను. ఇక్కడికి వచ్చే ఆ నిజమైన ప్రియతమున్ని తెలిసికొనికూడా ఏ స్త్రీ అలాంటి మాంసపు బొమ్మను తన ప్రాణవల్లభునిగా అంగీకరిస్తుంది?

**60.** అకామాః కామరూపేణ ధూర్తా నరకరూపిణః ।
న పునర్వఞ్చయిష్యన్తి ప్రతిబుద్ధాస్మి జాగృమి ॥

ఇప్పుడు నేను మోహనిద్రనుండి మేల్కొన్నాను. ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉన్నాను. కోర్కెల నన్నింటినీ వదలివేస్తున్నాను. అందువల్ల నరక రూపాన్ని ధరించిన ధూర్తులైన మానవులు కామరూపాన్ని ధరించి ఇప్పుడు నన్ను మోసగించలేరు.

**61.** అనర్థో హి భవేదర్థో దైవాత్ పూర్వకృతేన వా ।
సమ్బుద్ధాహం నిరాకారా నాహముద్యా జితేన్ద్రియా ॥

అదృష్టం వల్ల గాని ముందటి జన్మలో చేయబడ్డ శుభకర్మల ప్రభావం వల్లగాని అప్పుడప్పుడు అనర్థం కూడా అర్థరూపమవుతూ ఉంటుంది. దీనివల్ల ఈ రోజు నేను నిరాశురాలినై ఉత్తమ జ్ఞానంతో సంపన్నురాలినయ్యాను. ఇప్పుడు నేను అజితేంద్రియురాలను కాదు.

**62.** సుఖం నిరాశః స్వపితి నైరాశ్యం పరమం సుఖమ్ ।
ఆశామనాశాం కృత్వా హి సుఖం స్వపితి పిఙ్గళా ॥

నిజానికి దేనివల్ల ఏ రకమైనా ఆశ ఉండదో, అదే సుఖాన్ని కల్గిస్తూ ఉంటుంది. ఆశలేకపోవడమే మిక్కిలి సుఖం. చూడు ధర్మరాజా! ఆశను నిరాశగా చేసుకొని పింగళ అనే వేశ్య సుఖం అనే నిద్రలో మునిగింది.

*ఉవాచ:-*

**63.** ఏతైశ్చాన్యైశ్చ విప్రస్య హేతుమద్భిః ప్రభాషితైః ।
పర్యవస్థాపితో రాజా సేనజిన్ముముదే సుఖీ ॥

ఓ రాజా ! బ్రాహ్మణుడు చెప్పిన అనేక రకాలైన యుక్తి యుక్త వచనాలతో సేనజిత్తురాజు మనస్సుకుదుటబడింది. అతడు దుఃఖాన్ని వదలి సుఖాన్ని పొంది ఆనందంగలవాడయ్యాడు.

*174వ అధ్యాయం ముగిసింది*

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 175 అధ్యాయం

2. తన శ్రేయస్సునందు కోరిక గల పురుషుని యొక్క కర్తవ్యమేది? అనే విషయంలో తండ్రికి కొడుకు చేసిన జ్ఞానోపదేశం.

*యుధిష్ఠిర ఉవాచ :-*

**1. అతి క్రామతి కాలేఽస్మిన్ సర్వభూత క్షయావహే ।**
**కిం శ్రేయః ప్రతి పద్యేత తన్మే బ్రూహి పితామహ! ॥**

*ధర్మరాజు పలికెను :-*

తాతా! సమస్త భూతాలను సంహారం చేసే ఈ కాలం సమానంగా గడచి పోతూఉంది. ఈ స్థితిలో మానవుడేమి చేస్తే శుభప్రదుడవుతాడు అనే ఈ అంశాన్ని నాకు తెలియ జేయవలసింది.

*భీష్మ ఉవాచ:-*

**2. అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।**
**పితుః పుత్రేణ సంవాదం తం నిబోధ యుధిష్ఠిర! ॥**

*భీష్ముడిట్లు పలికెను :-*

ధర్మరాజా! ఈ విషయంలో తండ్రీకొడుకుల మధ్య జరిగిన సంవాదరూపమైన ఈ ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణంగా ఇస్తున్నాను. నీవు ఈ సంవాదాన్ని శ్రద్ధగా వినవలసింది.

**3. ద్విజాతేః కస్యచిత్ పార్థ! స్వాధ్యాయ నిరతస్య వై ।**
**బభూవ పుత్రో మేధావీ మేధావీ నామ నామతః ॥**

కుంతీ కుమారా! ప్రాచీన కాలంలో ఎల్లప్పుడు వేద శాస్త్రాలను స్వాధ్యాయం చేస్తూ ఒక బ్రాహ్మణుడుండే వాడు. అతనికి ఒక పుత్రుడుండేవాడు. అతడు గుణంచేత, పేరు చేత మేధావే.

4. సోఽబ్రవీత్ పితరం పుత్రః స్వాధ్యాయ కరణే రతమ్ ।
మోక్షధర్మార్థకుశలో లోకతత్త్వవిచక్షణః ॥

అతడు మోక్షధర్మార్థాలలో కుశలుడు. అట్లే లౌకిక విషయాలలో కూడా మంచి నేర్పరి. ఒక రోజు ఆ పుత్రుడు స్వాధ్యాయ తత్పరుడగు తన తండ్రితో ఇలా పలికినాడు.

*పుత్ర ఉవాచ:-*

5. ధీరః కింస్విత్ తాత! కుర్యాత్ ప్రజానన్
క్షిప్రం హ్యాయుర్భ్రశ్యతే మానవానామ్ ।
ప్రియస్తదాచక్ష్వ యదార్థయోగం
మమానుపూర్వ్యా యేన ధర్మం చరేయమ్ ॥

*పుత్రుడు పలికెను :-*

తండ్రీ! మానవుల ఆయుస్సు వేగంగా ముందుకు పోతూఉంటుంది. ఇది తెలుసుకొని ధీరుడైన పురుషుడు చేయాల్సిన పని ఏమి? తండ్రీ! నీవు ఆ యథార్థ ఉపాయాన్ని గూర్చి నాకు ఉపదేశించు. దాన్ని తెలిసికొని నేను ధర్మాన్ని ఆచరిస్తాను.

*పితోవాచ :-*

6. వేదానధీత్య బ్రహ్మచర్యేణ పుత్ర
పుత్రానిచ్ఛేత్ పావనార్థం పితౄణామ్ ।
అగ్నీనాధాయ విధివచ్చేష్టయజ్ఞో
వనం ప్రవిశ్యాథ మునిర్బుభూషేత్ ॥

*తండ్రి పలికెను :-*

కుమారా ! మొదట బ్రహ్మచర్య పాలన చేసి నాలుగు వేదాలను అధ్యయనం చేయడం బ్రాహ్మణుడు చేయవలసినపని. మరల గృహస్థాశ్రమంలో ప్రవేశించి తల్లిదండ్రుల సద్గతి కొఱకు పుత్రోత్పత్తిని చేయాలి. శాస్త్ర పూర్వకంగా మూడు విధాలైన అగ్నులను నెలకొల్పి యజ్ఞానుష్ఠానాన్ని చేయాలి. ఆ తర్వాత వానప్రస్థాశ్రమం చేపట్టాలి. ఆ తర్వాత మౌనంగా ఉంటూ సన్యాసాశ్రమం చేపట్టాలి.

*పుత్ర ఉవాచ :-*

7. ఏవమభ్యాహతే లోకే సమన్తాత్ పరివారితే ।
అమోఘాషుపతన్తీషు కిం ధీర ఇవ భాషసే? ॥

*పుత్రుడు పలికెను :-*

తండ్రీ! ఈ లోకం మృత్యువు ద్వారా చంపబడుతూ ఉంది. ముసలితనం నాలుగు వైపులా ఆక్రమిస్తూ ఉంది. రాత్రింబవళ్ళు సఫలతా పూర్వక ఆయుక్షయ రూపమగు కార్యాన్ని చేస్తున్నాయి. ఇట్టి దశయందు తమరు ధీరుని వలె ఎలా మాట్లాడగులుగతున్నారు?

*పితోవాచ :-*

**8.** కథమభ్యాహతో లోకః కేన వా పరివారితః ।
అమోఘాః కాః పతన్తీహ కిం ను భీషయసీవ మామ్ ॥

*తండ్రి పలికెను :-*

కుమారా! నీవు నన్ను భయభీతునిగా ఎందుకు చేస్తున్నావు? నిజం చెప్పు. ఈ లోకం ఎవరిచే చంపబడుతున్నది? ఏ దానితో ఇది ముట్టడింపబడుచున్నది. ఇక్కడ సఫలతా పూర్వకుడై తన పనిని తాను చేసుకొంటూ ఉండే వ్యక్తి ఎవరివల్ల ఉంటున్నాడు?

*పుత్ర ఉవాచ :-*

**9.** మృత్యునాభ్యాహతో లోకో జరయా పరివారితః ।
అహోరాత్రా పతన్త్యేతే నను కస్మాన్నబుధ్యసే ॥

*పుత్రుడు పలికెను :-*

తండ్రీ! చూడు ఈ సంపూర్ణలోకం మృత్యువు ద్వారా చంపబడుతూ ఉంది. ముసలితనం నాలుగు వైపుల నుండి ముట్టడేస్తూ ఉంది. సఫలతా పూర్వకంగా ప్రాణుల ఆయువు యొక్క అపహరణ స్వరూపుడు తనపని తాను చేసుకొంటూ ఉండే రాత్రింబవళ్ళే ఆ వ్యక్తి. ఈ అంశాలను ఎందుకు నీవు తెలుసుకోలేకున్నావు?

**10.** అమోఘాః రాత్రయశ్చాపి నిత్యమాయాన్తి యాన్తి చ ।
యథాహమేతజ్జానామి న మృత్యుస్తిష్ఠతీతి హ ॥
సోఽహం కథం ప్రతీక్షిష్యే జాలేనాపి హితశ్చరన్ ॥

ఈ అమోఘమైన రాత్రులు నిత్యం వస్తూ పోతూ ఉంటాయి. ఎప్పుడైతే ఈ విషయాన్ని నేను తెలుసుకుంటున్నానో అప్పుడు మృత్యువు క్షణమాత్రం కూడా ఆగకున్నది. దానివలలో తగుల్కొని నేను తిరుగుతూ ఉన్నాను. అలాంటప్పుడు కొంతసేపయినా ఎలా వేచియుండగలను?

**11.** రాత్ర్యాం రాత్ర్యాం వ్యతీతాయామాయురల్పతరం యదా ।
గాధోదకే మత్స్య ఇవ సుఖం విన్దేత కస్తదా ॥

ఎప్పుడైతే ఒక్కొక్క రాత్రి గడుస్తూ ఉంటుందో దానివెంట ఆయుస్సు కూడా తరుగుతూ ఉంటుంది. అప్పుడు నీటిలో నున్న చేపవలే ఎవరు సుఖాన్ని పొందగలరు?

**12.** ( యస్యాం రాత్ర్యాం వ్యతీతాయాం న కిఞ్చిచ్ఛుభమాచరేత్ ।)

తదైవవన్ధ్యం దివసమితి విద్యాత్ విచక్షణః ।
అనవాప్తేషు కామేషు మృత్యురభ్యేతి మానవమ్ ॥

ఏ రాత్రి గడిచిన పిమ్మట ఏ శుభకర్మను చేయకున్నాడో "ఆరోజు వ్యర్థముగనే గడచినదని" విద్వాంసుడు తెలిసికొంటున్నాడు. మానవుని కోర్కెలు పూర్తిగా నెరవేరడం లేదు. ఎందుకంటే మృత్యువు అతని వెంట పయనిస్తూ ఉంటుంది.

**13.** శష్పాణీవవిచిన్వన్త మన్యత్ర గతమానసమ్ ।
వృకీవోరణమాసాద్య మృత్యురాదాయ గచ్ఛతి ॥

ఏవిధంగా గడ్డి మేస్తున్న తోడేలు వద్దకు అకస్మాత్తుగా పులి వచ్చి పడితే అది అన్యమనస్సు గలది అవుతుంది. అదే విధంగా మానవుని మనస్సు ఎప్పుడైతే రెండవ వైపు మరలుతుందో అప్పుడు వెంటనే మృత్యువు వచ్చి అతనిని వెంటతీసుకొని పోతూ ఉంటుంది.

**14.** అద్యైవ కురు యచ్ఛ్రేయో మా త్వాం కాలోఽత్యగాదయమ్ ।
అకృతేష్వేవ కార్యేషు మృత్యుర్వై సమ్ప్రకర్షతి ॥

అందువలన ఏ శుభప్రదమగు కార్యం ఉందో దాన్ని ఈ రోజే చేయాలి. ఈ సమయాన్ని వదలకూడదు. అలావదలితే మొత్తం కార్యాలు మిగిలి పోతాయి. అంతేకాదు మృత్యువు వచ్చి అతనిని లాక్కొనిపోతూ ఉంటుంది.

**15.** శ్వః కార్యమద్యకుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ।
న హి ప్రతీక్షతే మృత్యుః కృతమస్య న వా కృతమ్ ॥

రేపు చేయబోయే కార్యాన్ని ఈ రోజే చేయాలి. ఏ పనిని సాయంకాలం చేయాలనుకుంటామో దాన్ని ఉదయమే చేయాలి. ఎందుకంటే మృత్యువు ఇతని పని పూర్తి అవుతుందా? లేదా? అని ఎదురుచూస్తూ ఉండదు.

కో హి జానాతి కస్యాద్య మృత్యుకాలో భవిష్యతి।
(న మృత్యురామన్త్రయతే హర్తుకామో జగత్ప్రభుః।
అబుద్ధ ఏవాక్రమతే మీనాన్ మీనగ్రహో యథా॥)

ఈ రోజే చావు వస్తుందని ఎవరికి తెలుసు? సంపూర్ణ ప్రపంచం మీద అధికారం కల్గియుండే చావు ఎవరిని ఎత్తుకొనిపోవాలను కొంటుందో వారికి ముందుగా ఆహ్వానం పంపదు. (హెచ్చరిక చేయదు) ఏ విధంగా చేపలు పట్టే వాడు వచ్చి చేపలకు తెలియకుండా పట్టుకొని పోతున్నాడో అదేవిధంగా మృత్యువు కూడా దాగియుండి ప్రాణుల్ని తీసికొనిపోతూ ఉంటుంది.

**16.** యువైవ ధర్మశీలః స్యాదనిత్యం ఖలు జీవితమ్।
కృతే ధర్మే భవేత్ కీర్తిరిహ ప్రేత్య చ వై సుఖమ్ ॥

అందువల్ల యువావస్థయందే అందరూ ధర్మంచేస్తూ ఉండాలి. ఎందువలనంటే జీవనం నిస్సందేహంగా అనిత్యం. ధర్మాచరణంవల్ల ఈ లోకంలో కీర్తి పరలోకంలో సుఖం కలుగుతూ ఉంటాయి.

**17.** మోహేన హి సమావిష్టః పుత్రదారార్థముద్యతః।
కృత్వా కార్యమకార్యం వా పుష్టిమేషాం ప్రయచ్ఛతి॥

ఏ మానవుడు మోహంలో మునుగుతున్నాడో అతడు పెండ్లాం, కొడుకు మొదలగు వారికై ఉద్యోగము చేయడానికి ఇష్టపడతాడు. ఆ విధంగా ఇది చేయవచ్చు ఇది చేయకూడదు అని ఆలోచింపక అన్ని పనులను చేసి వారినందరిని పోషిస్తాడు.

**18.** తం పుత్రపశుసంపన్నం వ్యాసక్తమనసం నరమ్ ।
సుప్తం వ్యాఘ్రో మృగమివ మృత్యురాదాయ గచ్ఛతి ॥

ఏ ప్రకారం నిద్రించిన మృగాన్ని పులి లేపుతుందో అదేవిధంగా పుత్ర పశువులచే సంపన్నుడైన వాడు వాటియందే మనస్సును లగ్నం చేసినపుడు ఏదో ఒకనాడు మృత్యువు వచ్చి వాన్ని తీసుకొని పోతుంది.

**19.** సంచిన్వానకమేవైనం కామానామవితృప్తకమ్ ।
వ్యాఘ్రః పశుమివాదాయ మృత్యురాదాయ గచ్ఛతి ॥

ఎంతవరకైతే మానవుడు భోగాలతో తృప్తినొందడో వాటిని ఎంతవరకు అనుభవిస్తూ ఉంటాడో అంతవరకు అతన్ని మృత్యువు తీసికొనిపోతూ ఉంటుంది. ఏవిధంగా పులి పశువును తీసికొని పోతుందో అదే విధంగా మృత్యువు మానవున్ని తీసుకొని పోతూఉంటుంది.

**20.** ఇదం కృతమిదం కార్యమిదమన్యత్ కృతాకృతమ్ ।
ఏవమిహ సుఖాసక్తం కృతాన్తః కురుతే వశే ॥

మానవుడనుకొనేదేమంటే ఈ పని పూర్తి అయింది. ఈ పని ఇప్పుడు పూర్తి చేయాలి. దీన్ని చేసినాను. దీన్ని చేయలేదు అని అనుకొంటూ ఉంటాడు. ఈ విధంగా చేష్టాజనిత సుఖంనందు ఆసక్తుడయ్యే మానవున్ని కాలం తన అధీనంలోకి తెచ్చుకుంటూ ఉంటుంది.

**21.** కృతానాం ఫలమప్రాప్తం కర్మాణాం కర్మసజ్ఞితమ్ ।
క్షేత్రాపణగృహాసక్తం మృత్యురాదాయ గచ్ఛతి ॥

మానవుడు పొలంపై అంగడిపై ఇంటిపై ఆసక్తుడై ఉంటాడు. వాటికోసం తాను చేసిన కర్మల ఫలాన్ని కూడా పొందకుండగనే దానికంటె ముందే కర్మాసక్తుడైన ఆ మానవున్ని మృత్యువు తీసుకొని పోతూఉంటుంది.

**22.** దుర్బలం బలవన్తంచ శూరం భీరుం జడం కవిమ్ ।
అప్రాప్తం సర్వకామార్థాన్ మృత్యురాదాయ గచ్ఛతి ॥

దుర్బలుడైనా బలవంతుడైనా లేక శూరుడైనా వీరుడైనా మూర్ఖుడైనా విద్వాంసుడైనా మృత్యువు అతని కోర్కెలన్నీ నెఱవేరకముందే అతనిని తీసుకొని పోతూ ఉంటుంది.

**23.** మృత్యుర్జరా చ వ్యాధిశ్చ దుఃఖంచానేక కారణమ్ ।
అనుషక్తం యదా దేహే కిం స్వస్థ ఇవ తిష్ఠతి ॥

తండ్రీ! ఎప్పుడైతే ఈ శరీరంలో మృత్యువు ముసలితనం, వ్యాధి మొ॥ అనేక కారణాలవల్ల కలుగు దుఃఖాల ఆక్రమణం ఉన్నప్పటికీ మీరు ఎలా స్వస్థులై నిలబడి యున్నారు?

**24.** జాతమేవాన్తకోఽన్తాయ జరాచాన్వేతి దేహినమ్ ।
అనుషక్తాద్వయేనైతే భావః స్థావరజంగమాః ॥

దేహాన్ని ధరించిన జీవుడు జన్మనెత్తినప్పటి నుండి చచ్చేంతవరకు ముసలితనం అతన్ని అనుసరిస్తూ ఉంటుంది. తిరిగే ప్రాణులు తిరుగని ప్రాణులు ఈ రెండూ దీనితో బంధింపబడి యున్నాయి.

**25.** మృత్యోర్వా ముఖమేతద్ వై యాగ్రామే వసతో రతిః ।
దేవానామేష వై గోష్ఠో యదరణ్యమితి శ్రుతిః ॥

గ్రామంలో లేక నగరంలో నివసిస్తూ పెండ్లాం, కొడుకులు మొ॥ వారి మీద ఆసక్తి పెంచుకుంటే అది మృత్యు ముఖమే అవుతుంది. అడవిని ఆశ్రయిస్తే

ఇంద్రియ రూపాలగు ఆవులను బంధించు గోశాలతో సమానమవుతుంది ఇది వేదం చెప్పిన మాట.

**26.** నిబంధనీ రజ్జురేషా యా గ్రామే వసతో రతిః ।
ఛిత్త్వైతాం సుకృతో యాన్తి నైనాం ఛిన్దన్తి దుష్కృతః ॥

గ్రామంలో నివసించినప్పటికీ అక్కడ పెండ్లాం, కొడుకు మరియు విషయాలపై ఆసక్తి చూపితే ఇదే జీవుని బంధించునట్టి త్రాడుతో సమానమని తెలుసుకోవాలి. పుణ్యాత్ముడైన పురుషుడే ఈ త్రాడును తెంచుకొని ముక్తుడగుతున్నాడు.

**27.** న హింసయతి యో జన్తూన్ మనోవాక్కాయహేతుభిః ।
జీవితార్థాపనయనైః ప్రాణిభిర్న స హింస్యతే ॥

ఏ మానవుడు మనస్సు, వాక్కు, శరీర రూపాలైన సాధనాల ద్వారా ప్రాణులను హింసించకుండా ఉంటాడో, అప్పుడతని జీవితాన్ని డబ్బును నాశనంజేసే హింసక ప్రాణులు అతన్ని హింసించడం లేదు.

**28.** న మృత్యుసేనామాయాన్తీం జాతు కశ్చిత్ ప్రబాధతే ।
ఋతే సత్యమసత్ త్యాజ్యం సత్యేహ్యమృత మాశ్రితమ్ ॥

సత్యం తప్ప మరేదీ మానవుని ముందుకొచ్చి మృత్యుసేనను ఎప్పటికీ ఎదురించలేదు. అందువల్ల అసత్యాన్ని వదలి వేయాలి. ఎందుకంటే అమృతత్వం సత్యంనందే ప్రతిష్ఠితమై ఉంది.

**29.** తస్మాత్ సత్యవ్రతాచారః సత్యయోగ పరాయణః ।
సత్యాగమః సదా దాన్తః సత్యేనైవాన్తికం జయేత్ ॥

అందువల్ల మానవుడు సత్యవ్రతాన్ని ఆశ్రయించాలి. సత్యయోగంలో తత్పరుడై శాస్త్రాలలో చెప్పబడిన వాక్యాలను సత్యాన్ని అంగీకరించి శ్రద్ధా పూర్వకుడై మనస్సును ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. ఈ విధంగా సత్యం ద్వారానే మానవుడు మృత్యువు మీద విజయాన్ని సాధించుచున్నాడు.

**30.** అమృతం చైవ మృత్యుశ్చ ద్వయం దేహే ప్రతిష్ఠితమ్ ।
మృత్యుమాపద్యతే మోహాత్ సత్యేనాపద్యతేఽమృతమ్ ॥

అమృతం మరియు మృత్యువు ఈ రెండునూ ఈ శరీరమునందున్నవి మానవుడు మోహం వలన మృత్యువును, సత్యం వలన అమృతాన్ని పొందుతున్నాడు.

**31.** సోఽహం హ్యహింస్ర సత్యార్థీః కామక్రోధబహిష్కృతః ।
సమదుఃఖసుఖఃక్షేమీ మృత్యుం హాస్యామ్యమర్త్యవత్ ॥

అందువల్లనే నేను హింసనుండి దూరంగా ఉండి సత్యాన్వేషణ చేస్తున్నాను. కామక్రోధాలను హృదయం నుండి వెళ్ళగొట్టి సుఖదుఃఖాలతో సమాన భావాన్ని ఉంచుతున్నాను. అట్లే అందరి కొఱకు కళ్యాణకారినై దేవతలతో సమానంగా మృత్యుభయం నుండి విముక్తుడ నవుతున్నాను.

**32.** శాంతియజ్ఞరతో దాన్తో బ్రహ్మయజ్ఞే స్థితో మునిః ।
వాఙ్మనః కర్మయజ్ఞశ్చ భవిష్యామ్యుదగాయనే ॥

నేను నివృత్తిమార్గ పరాయణుడనై శాంతిమయుడనై యజ్ఞతత్పరుడ నగుచున్నాను. మనస్సు మరియు ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని బ్రహ్మ యజ్ఞంలో (వేద శాస్త్రాల స్వాధ్యాయంలో) నేను నిమగ్నమవుతున్నాను. ముని వృత్తిని చేపట్టుతున్నాను. ఉత్తరాయణ మార్గమున వెళ్ళుటకు నేను జపాన్ని స్వాధ్యాయ రూపమైన వాగ్యజ్ఞాన్ని, ధ్యానరూపమగు మనోయజ్ఞాన్ని మరియు అగ్నిహోత్రాన్ని అట్లే గురుశుశ్రూషాది రూపమగు కర్మయజ్ఞాన్ని అనుష్ఠిస్తున్నాను.

**33.** పశుయజ్ఞైః కథం హింస్రైర్మాదృశో యష్టుమర్హతి ।
అన్తవద్భిరివ ప్రాజ్ఞ క్షేత్రయజ్ఞైః పిశాచవత్ ॥

నాలాంటి విద్వాంసుడగు పురుషుడు నశ్వరమగు ఫలం నిచ్చునట్టి హింసతో కూడిన పశుయజ్ఞాన్ని మరియు పిశాచాలతో సమానంగా తన శరీరం యొక్క రక్తమాంసాలద్వారా చేయబడు తామస యజ్ఞాలను ఎలా చేయగలడు?

**34.** యస్య వాఙ్మనసీ స్యాతాం సమ్యక్ ప్రణిహితే సదా ।
తపస్త్యాగశ్చ సత్యం చ స వై సర్వమవాప్నుయాత్ ॥

ఎవని వాక్కు, మనస్సు రెండును ఎల్లప్పుడు చక్కగా ఏకాగ్రంగా ఉంటున్నాయో అట్లే ఏ త్యాగం తపస్సత్యాలతో సంపన్నమవుతున్నదో అది నిశ్చయంగా అన్నింటిని పొందుతూ ఉంది.

**35.** నాస్తి విద్యాసమం చక్షుర్నాస్తి సత్య సమం తపః ।
నాస్తిరాగసమం దుఃఖం నాస్తి త్యాగసమం సుఖమ్ ॥

ప్రపంచంలో విద్యతో సమానమైన కన్ను మరొకటి లేదు. అట్లే సత్యంతో సమానమైన తపస్సు మరొకటి లేదు. రాగముతో సమానమైన దుఃఖం కూడా మరొకటి లేదు. అట్లే త్యాగంతో సమానమైన సుఖం ఇంకొకటి లేదు.

**36.** **ఆత్మన్యేవాత్మనా జాత ఆత్మనిష్ఠో౽ప్రజో౽పి వా।**
**ఆత్మన్యేవ భవిష్యామి న మాం తారయతి ప్రజాః॥**

నేను సంతానరహితుడనైనప్పటికీ పరమాత్మయందే పరమాత్మ ద్వారా పుట్టినాను పరమాత్ముని యందే యున్నాను. ముమ్ముందు కూడా పరమాత్మయందే లీనం కాగలవాడను. సంతానం నన్ను తరింపజేయ లేదు.

**37.** నైతాదృశం బ్రాహ్మణస్యాస్తి విత్తం
యథైకతా సమతా సత్యతా చ।
శీలం స్థితిర్దండ నిధానమార్జవం
తతస్తతశ్చో పరమః క్రియాభ్యః ॥

పరమాత్ముని వెంట ఏకత్వం, సమత్వం, సత్యభాషణం, సదాచారం, బ్రహ్మనిష్ఠ దండ పరిత్యాగం (అహింస) సరళత్వం, అన్ని కార్యాల ఎడల నివృత్తి ఉండాలి. వీటితో సమానమైన ధనం బ్రాహ్మణునికి మరొకటి లేదు.

**38.** కిం తే ధనైర్బాంధవైర్వాపి కిం తే
కిం తే దారైర్బ్రాహ్మణ యో మరిష్యసి
ఆత్మానమన్విచ్ఛ గుహాం ప్రవిష్టం
పితామహాస్తే క్వ గతాః పితా చ॥

బ్రహ్మనిష్ఠుడవైన ఓ తండ్రీ! ఎప్పుడో ఒకప్పుడు నీవు మరణించగలవు కాబట్టి ఈ ధనంతో నీవేమీ చేయలేవు. సోదరులతో నీకేమి పని? అట్లే పెండ్లాం కొడుకులతో నీకేమి ప్రయోజనం సిద్ధిస్తుంది? నీవు నీ హృదయ రూపమైన గుహయందున్నట్టి పరమాత్మను వెదకు. అట్లే నీ తండ్రితాతలను వెదకు అని పల్కినాడు.

*భీష్మ ఉవాచ :-*

**39.** పుత్రస్యైతత్ వచః శ్రుత్వా యథాకార్షీత్ పితా నృప! ।
**తథా త్వమపి వర్తస్వ సత్యధర్మపరాయణః॥**

*భీష్ముడు పలికెను :-*

నరేశ్వర ! పుత్రుడు పలికిన మాటలను విని తండ్రి ఏ విధంగా సత్యధర్మాన్ని అనుష్ఠించినాడో అదే విధంగా నీవు సత్యధర్మ తత్పరుడవై యథాయోగ్యంగా నడుచుకో.

***175వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 176 - వ అధ్యాయం

3. త్యాగమహిమను గూర్చి శంపాకుడనే బ్రాహ్మణుడు ఉపదేశించిన విధం.

*యుధిష్ఠిర ఉవాచ :-*

1. ధని నశ్చాధనా యేచ వర్తయన్తే స్వతన్త్రిణః ।
సుఖదుఃఖాగమాస్తేషాం కః కథం వా పితామహ! ॥

*యుధిష్ఠిరుడు పలికెను :-*

తాతా! డబ్బుగలవారు డబ్బులేనివారు ఈ ఇద్దరూ సొంతంగానే తమ వ్యవహారాన్ని చూసుకుంటూ ఉన్నారు. మరి వారికి సుఖ దుఃఖాలు ఎలా కలుగుతున్నాయి ?

*భీష్మ ఉవాచ:-*

2. అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్
శమ్పాకేనేహ ముక్తేన గీతం శాన్తిగతేన చ ॥

*భీష్ముడు పలికెను :-*

ధర్మరాజా! ఈ విషయంలో విద్వాంసుడైన పురుషుడు చెప్పిన పురాతన ఇతిహాసాన్ని ఉదారహణంగా తీసుకొని చెబుతున్నాను. దాన్ని పరమశాంతితో కూడిన జీవన్ముక్తుడైన శంపాకుడు చెప్పినాడు.

3. అబ్రవీన్మాం పురా కశ్చిద్ బ్రాహ్మణస్త్యాగమాశ్రితః ।
క్లిశ్యమానః కుదారేణ కుచైలేన బుభుక్షయా ॥

ఇది పూర్వం జరిగిన వృత్తాంతం. చిరిగిన బట్టలతో దుష్టురాలయిన భార్యతో ఆకలి కారణంగా మిక్కిలి కష్టాలను అనుభవించిన త్యాగ సంపన్నుడయిన బ్రాహ్మణుడొక డుండేవాడు. అతని పేరు శంపాకుడు. అతడు ఒకప్పుడు నాతో ఇలా చెప్పినాడు

**4. ఉత్పన్నమిహ లోకే వై జన్మప్రభృతి మానవమ్ ।**
**వివిధాన్యుపవర్తన్తే దుఃఖాని చ సుఖాని చ ॥**

ఈ ప్రపంచంలో ఏ మానవుడు పుట్టుతున్నాడో (అతడు ధనికుడైనను నిర్ధనుడైనను) అతడు జన్మచేతనే నానారకాలైన సుఖ దుఃఖాలను అనుభవించ వలసి ఉంటుంది.

**5. తయోరేకతరే మార్గే యదేనమభిసన్నయేత్ ।**
**న సుఖం ప్రాప్య సంహృష్యేన్నాసుఖం ప్రాప్య సంజ్వరేత్ ॥**

బ్రహ్మ ఇతన్ని సుఖదుఃఖాలనే రెండింటిలో ఏదైనా ఒక మార్గంలో తీసుకొని పోదలచినట్లైతే సుఖాన్ని పొంది ప్రసన్నుడు కాలేడు. దుఃఖాన్ని పొంది బాధ నొందలేడు.

**6. న వై చరసి యచ్ఛ్రేయ ఆత్మనో వా యదీశిషే ।**
**అకామాత్మాపి హి సదా ధురముద్యమ్య చైవ హ ॥**

నీవు ఏ కోరికలు లేని వాడవైనప్పటికీ ఏ కళ్యాణాన్ని సాధించుకోలేక పోయినచో మనస్సును అధీనంలో ఉంచుకోలేక పోయినట్లైతే దీనికి కారణమిదే. నీవు రాజ్యభారాన్ని నీపై ఉంచుకోవడమే.

**7. అకిఞ్చనః పరిపతన్ సుఖ మాస్వాదయిష్యసి ।**
**అకిఞ్చనః సుఖం శేతే సముత్తిష్ఠతి చైవ హ ॥**

ఒక వేళ నీవు అన్నింటిని వదిలివేసి ఏ వస్తుసంగ్రహాన్ని ఉంచుకోకపోయినట్లైతే అంతటా తిరుగుతూ సుఖాన్నే అనుభవించగలవు. ఎందుచేతనంటే ఎవడు దరిద్రుడుగా నుండునో ఎవని దగ్గర ధనముండదో అతడు సుఖంగా నిద్రించగలడు ఎప్పుడూ మేల్కొని యుండగలడు.

**8. అకిఞ్చన్యం సుఖం లోకే పథ్యం శివమనామయమ్ ।**
**అనమిత్రపథో హ్యేష దుర్లభః సులభో మతః ॥**

ప్రపంచంలో దారిద్ర్యమే సుఖానిచ్చేది. అదే మేలు చేకూర్చేది. శుభాన్ని కలిగించేది. ఆపద లేకుండా చేయునట్టిది. ఈ మార్గములో ఏవిధమైన శత్రువుల దాడి యుండదు ఇది దుర్లభమైనప్పటికీ సులభమైంది.

9. అకిఞ్చనస్య శుద్ధస్య ఉపపన్నస్య సర్వతః ।
అవేక్షమాణస్త్రీన్ లోకాన్ న తుల్యమిహ లక్షయే ॥

నేను మూడు లోకాలలో దృష్టిసారించి చూస్తున్నాను. నాకు దరిద్రుడు పరిశుద్ధుడు మరియు అన్నింట వైరాగ్య సంపన్నుడగు పురుషునితో సమానుడైన వాడు వేరొకడు కనిపించడం లేదు.

10. అకిఞ్చన్యం చ రాజ్యం చ తులయా సమతోలయమ్ ।
అత్యరిచ్యత దారిద్ర్యం రాజ్యాదపి గుణాధికమ్ ॥

నేను దారిద్ర్యాన్ని రాజ్యాన్ని బుద్ధి అనే తక్కెడపై తూకం వేస్తే గుణాలు అధికంగా ఉండే కారణంగా రాజ్యం కంటే దారిద్ర్యం వైపే నాకు ఎక్కువ మొగ్గు కనబడింది.

11. అకిఞ్చన్యే చ రాజ్యే చ విశేషః సుమహానయమ్ ।
నిత్యోద్విగ్నో హి ధనవాన్ మృత్యోరాస్యగతో యథా ॥

దారిద్ర్యం, రాజ్యం ఈ రెండింటి మధ్యగల భేదం చాలా గొప్పదైనది. ధనవంతుడగు రాజు నిత్యం ఉద్విగ్నుడై ఉంటాడు. ఏ విధంగా మానవుడు నిత్యం మృత్యుముఖంలో ఉంటాడో ఆ విధంగా అతడు ఉద్విగ్నుడై ఉంటాడు.

12. నైవాస్యాగ్నిర్నచారిష్టో న మృత్యుర్న చ దస్యవః ।
ప్రభవన్తి ధనత్యాగాత్ విముక్తస్య నిరాశిషః ॥

కాని ఏ మానవుడు డబ్బును వదలి దాని మీదగల ఆసక్తినుండి విముక్తుడవుతాడో మనస్సునందు ఎట్టికోర్కెలు ఉంచుకోకుండా ఉంటాడో అతనిపై అగ్ని ప్రభావం గాని, చెడుకారకాలైన గ్రహాల ప్రభావంగాని మృత్యువు ప్రభావం గాని హంతకులైన దొంగల ప్రభావం కాని ఉండదు.

13. తం వై సదా కామచరమనుపస్తీర్ణ శాయినమ్ ।
బాహూపధానం శామ్యన్తం ప్రశంసన్తి దివౌకసః ॥

అతడెల్లప్పుడూ దైవం ఇష్ట ప్రకారం నడుచుకొంటూ ఉంటాడు. భూమిపై దుప్పటి గిప్పటి చాప లేకుండానే నిద్రిస్తాడు. చెయ్యిని దిండుగా పెట్టుకొని ఎల్లప్పుడూ శాంత స్వభావంగా ఉంటాడు. దేవతలు కూడా అతనిని గూర్చి మిక్కిలి కొనియాడుతూ ఉంటారు.

**14.** ధనవాన్ క్రోధలోభాభ్యామావిష్టో నష్టచేతనః ।
తిర్యగీక్షః శుష్కముఖః పాపకో భ్రుకుటీ ముఖః ॥

ఎవడు ధనవంతుడో అతడు కోపలోభాలతో కూడి తన విచారశక్తిని కోల్పోతూ ఉంటాడు. అడ్డ చూపులతో చూస్తూ ఉంటాడు. అతని ముఖం ఎండిపోయి ఉంటుంది. బొమముడి గలవాడై పాపకార్యాలు చేయుటలో తలమునకలై ఉంటాడు.

**15.** నిర్దశన్నధరోష్ఠం చ క్రుద్ధో దారుణ భాషితా ।
కస్తమిచ్ఛేత్ పరిద్రష్టుం దాతుమిచ్ఛతిచేన్మహీమ్ ॥

కోపకారణంగా అతని క్రింది పెదవి వణుకుతూ ఉంటుంది. మిక్కిలి కఠినమైన మాటలు మాట్లాడుతూ ఉంటాడు. ఇలాంటి మానవుడు భూమండలాన్నంతా ఇచ్చివేయుటకిష్టపడి నప్పటికీ అతనివైపు ఎవరు చూడడానికి ఇష్టపడరు.

**16.** శ్రియాహ్యాభీక్ష్ణం సంవాసో మోహయత్యవిచక్షణమ్ ।
సా తస్య చిత్తం హరతి శారదాభ్రమివానలః ॥

ఎల్లప్పుడు ధన సహవాసంతో నుండు మూర్ఖ మానవుని మనస్సును లోభపెట్టి వానిని మోహం నందే ఎస్తున్నది. ఎట్లైతే వాయువు శరదృతువు నందలి మేఘాలను ఎగురగొట్టుతుందో అట్లే ఆ సంపద మానవుని మనస్సును ఎగరగొట్టుతూ ఉంటుంది. (పీడించుతూ ఉంటుంది)

**17.** అథైనం రూపమానశ్చ ధనమానశ్చ విన్దతి ।
అభిజాతోఽస్మి సిద్ధోఽస్మి నాస్మి కేవలమానుషః ॥

మరల అతని పైన రూపం యొక్క అహంకారం ధనమదం స్వారి చేస్తూ ఉంటాయి. నేను గొప్ప కులంలో పుట్టినాను. నేను సిద్ధున్ని. మామూలు మనిషిని కాదు అని తలపోస్తూ ఉంటాడు.

**18.** ఇత్యేభిః కారణైస్తస్య త్రిభిశ్చిత్తం ప్రమాద్యతి ।
సంప్రసక్తమనా భోగాన్ విసృజ్య పితృసంచితాన్ ।
పరిక్షీణః పరస్వానామాదానం సాధు మన్యతే ॥

రూపం, ధనం, కులం ఈ మూడింటి యొక్క అభిమాన కారణంగా అతని మనస్సునందు ప్రమాదం నిండుకుని ఉంటాది. అతడు భోగములందు ఆసక్తుడై తాతలు తండ్రులు సంపాదించిన డబ్బును పోగొట్టుకొని దరిద్రుడై ఇతరుల డబ్బును దొంగిలించడం బాగుంటుందని భావిస్తూ ఉంటాడు.

**19.** తమతిక్రాన్త మర్యాదమాదదానం తతస్తతః ।
ప్రతిషేధన్తి రాజానో లుబ్ధా మృగమివేషుభిః ॥

ఈ విధంగా హద్దు మీరి అతడు ఇక్కడక్కడనుండి డబ్బు దొంగిలించి తీసికొంటాడు ఏ విధంగా బోయవాడు బాణాలతో మృగాలను చంపి వాటి నడకను అడ్డుకొంటున్నాడో అదేవిధంగా రాజు అతన్ని కఠోరంగా దండిస్తాడు.

**20.** ఏవమేతాని దుఃఖాని తాని తానీహ మానవమ్ ।
వివిధాన్యుపపత్యన్తే గాత్ర సంస్పర్శజాన్యపి ॥

ఈ విధంగా మనస్సును బాధించు శరీర స్పర్శను పొందు నానారకాలైన దుఃఖాలు మానవున్ని పొందుతూ ఉన్నాయి.

**21.** తేషాం పరమదుఃఖానాం బుద్ధ్యా భైషజ్యమాచరేత్ ।
లోకధర్మమవజ్ఞాయ ధ్రువానామధ్రువైస్సహ ॥

అందువల్ల అనిత్యాలైన శరీరాల వెంట ఎల్లప్పుడు లగ్నమైయుండు భార్య కావాలి. పుత్రుడు కావాలి. డబ్బు కావాలి అనే లోకధర్మాలను అవహేలన చేసి తప్పక కలిగెడు ముందు చెప్పిన గొప్ప దుఃఖాలకు విచార పూర్వక చికిత్స చేయాలి.

**22.** నాత్యక్త్వా సుఖమాప్నోతి నాతక్త్వా విన్దతే పరమ్ ।
నాత్యక్త్వా చాభయః శేతే త్యక్త్వా సర్వం సుఖీ భవ ॥

ఏ మానవుడైనా త్యాగం చేయకనే సుఖాన్ని పొందలేడు. త్యాగాన్ని చేయకుండగనే నిర్భయంగా నిద్రించలేడు. అందువల్ల నీవును అన్నీ వదులుకొని సుఖవంతుడవు కావలసింది.

**23.** ఇత్యేతద్హాస్తినపురీ బ్రాహ్మణేనోపవర్ణితమ్ ।
శమ్పాకేన పురా మహ్యం తస్మాత్ త్యాగః పరో మతః ॥

ఈ ప్రకారం పూర్వకాలంనందు శంపాకుడను బ్రాహ్మణుడు నాతో త్యాగం యొక్క మహిమను వర్ణించియున్నాడు. అందువల్ల త్యాగమే అన్నింటికంటే శ్రేష్ఠమైందని అంగీకరింపబడింది.

*176వ అధ్యాయం ముగిసింది*

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 177వ అధ్యాయం

4. మంకిగీత - డబ్బుపైగల కోరిక వల్ల కలిగే దుఃఖం వాటిని వదులుట వల్ల కలిగే పరమసుఖాన్ని గూర్చి తెలపడం

యుధిష్ఠిర ఉవాచ :-

**1. ఈహమానః సమారమ్భాన్ యది నాసాదయేద్ధనమ్ ।
ధనతృష్ణాభిభూతశ్చ కిం కుర్వన్ సుఖమవాప్నుయాత్ ॥**

*యుధిష్ఠిరుడు పలికెను :*

తాతా! ఏ మానవుడైననూ డబ్బుదాహంతో కూడి రకరకాల ఉద్యోగం చేసినప్పటికీ డబ్బును పొందలేక పోతే అతడేమి చేస్తాడు. ఏపని చేయుడం వల్ల అతడు సుఖాన్ని పొందగలడు?

**2. సర్వసామ్య మనాయాసం సత్యవాక్యం చ భారత ।
నిర్వేదశ్చావిధిత్సా చ యస్య స్యాత్ స సుఖీ నరః ॥**

*భీష్ముడు పలికెను :*

ఓ భారలూ! అందరి యందును సమత్వ భావన, వ్యర్థ పరిశ్రమ లేకపోవడం, సత్యం మాట్లాడటం, సంసారంపై వైరాగ్యం కలగడం, పనులు చేయడంలో ఇష్టం లేకపోవడం ఈ ఐదు గుణాలు ఎవని యందుంటాయో వాడు సుఖాన్ని పొందగలడు.

**3. ఏతాన్యేవ పదాన్యాహుః పఞ్చ వృద్ధాః ప్రశాన్తయే ।
ఏష స్వర్గశ్చ ధర్మశ్చ సుఖం చానుత్తమం మతమ్ ॥**

జ్ఞాన వృద్ధుడైన పురుషునికి ఐదు వస్తువులు కారణాలని చెప్పుచున్నాడు. ఇదే స్వర్గము. ఇదే ధర్మము. ఇదే పరమోత్తమమైన సుఖంగా చెప్పబడుతున్నది.

**4. అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్।
నిర్వేదాన్మఙ్కినాగీతం తన్నిబోధ యుధిష్ఠిర ॥**

ధర్మరాజా! ఈ విషయం నందు ఎరుకగల పురుషుని యొక్క ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణంగా ఇస్తూ ఉన్నాను. మంకి అను పేరుగల ముని భోగాల నుండి విరక్తుడై ఏ విధంగా నిర్వేదాన్ని ప్రకటించాడో అదే ఈ ఇతిహాసంలో వర్ణింపబడింది. దాన్ని నీకు తెలుపుతున్నాను. శ్రద్ధగా వినవలసింది.

5 ఈహమానో ధనం మఙ్కిర్భగ్నేహశ్చ పునః పునః ।
కేనచిత్ ధనశేషేణ క్రీతవాన్ ధమ్యగోయుగమ్ ॥

మంకి ముని డబ్బు కొఱకు అనేక పనులను చేస్తూ ఉండేవాడు కాని ప్రతిసారి అతని పనులు వ్యర్థమైపోతూ ఉండేవి. చివరికి చాలా తక్కువ డబ్బు మిగలగా ఆ డబ్బుతో రెండు కోడెలను కొన్నాడు.

6. సుసమ్బద్ధౌ తు తౌ దమ్యౌ దమనాయాభినిస్సృతౌ ।
ఆసీనముష్ట్రం మధ్యేన సహసైవాభ్యధావతామ్ ॥

ఒక రోజు ఆ రెండు కోడెలను జోడు చేసి నాగలి పట్టుటలో అనుభవం సంపాదించుటకై వాటిని తీసికొనిపోతూ ఉన్నాడు. ఎప్పుడైతే ఆ రెండు కోడెలు గ్రామం వెలుపలకు రాగా అప్పుడు అచట కూర్చొని యున్న ఒక ఒంటె మీదుగా వేగముగా పరిగెత్తినాయి.

7. తయోః సంప్రాప్తయోరుష్ట్రః స్కంధదేశమమర్షణః ।
ఉత్థాయోత్క్షిప్య తౌ దమ్యౌ ప్రససార మహాజవః ॥

ఎప్పుడైతే అవి ఒంటె మెడను చిక్కించుకున్నాయో అప్పుడది సహించలేక పైకి లేచింది. ఆ కోడెలను పైకి వ్రేలాడునట్లు చేసి వేగముగా పరిగెత్తసాగింది.

8. హ్రియమాణౌ తు తౌ దామ్యౌ తేనోష్ట్రేణ ప్రమాథినా ।
మ్రియమాణౌ చ సంప్రేక్ష్య మఙ్కి స్తత్రాబ్రవీదిదమ్ ॥

ఆ ఒంటె ద్వారా బల పూర్వకంగా ఈడ్చుకొని పోబడుతున్న ఆ కోడెలను చూసి మంకి ఈ ప్రకారంగా పలికినాడు.

9. న చైవావిహితం శక్యం దక్షేణాపీహితుం ధనమ్ ।
యుక్తౌ న శ్రద్ధయా సమ్యగీహాం సమనుతిష్ఠతా ॥

మనుష్యులెట్లయిననూ చతురులెందుకు కాలేరు. ఏవైతే అతని అదృష్టాన ఉండదో ఆ ధనానికై అతడు చక్కగా ప్రయత్నము చేసినప్పటికీ దానిని పొందలేక పోతున్నాడు.

10. కృతస్య పూర్వం చానర్థైర్యుక్తస్యాప్యనుతిష్ఠతః ।
ఇమం పశ్యత సంగత్యా మమదైవముపప్లవమ్ ॥

డబ్బు కొఱకై నేను మొదట ఏ ప్రయత్నాలను చేసినానో వాటియందు అనేక రకాలయిన అనర్థాలు ఎదురైనాయి. ఆ అనర్థాలు చూచినప్పటికీ నేను ధనాన్ని

సంపాదించడంలోనే మునిగిపోయినాను. కాని చూడు ఈ రోజు ఈ కోడెల విషయంలో నాపై ఎట్టి ఉపద్రవమొచ్చిపడిందో!

**11.** **ఉద్యమ్యోద్యమ్య యౌ దమ్యౌ విషయేణైవ గచ్ఛతః ।**
**ఉక్షిప్య కాకతాలీయముత్పథౌ నైవ ధావతః ॥**

**12.** **మణీవోష్ట్రస్యలంబేతే ప్రియౌ వత్సతరౌ మమ ।**
**శుద్ధం హి దైవమేవేదం హఠేనైవాస్తి పౌరుషమ్ ॥**

ఈ ఒంటె నా కోడెలనెత్తుకొని ఎగురుతూ ఎగురుతూ విషమ మార్గమున వెల్తున్నది. కాకతాళీయన్యాయంన (దైవసంయోగము వలన) కోడెలను మెడపై నెత్తుకొని వక్రమార్గంలో పరిగెత్తుతున్నాది. ఈ ఒంటె మెడలో నా ప్రియమైన కోడెలు మణులతో సమానంగా వ్రేలాడుతున్నాయి ఇది కేవలం దైవలీలే. హఠపూర్వకంగా చేయబడు పురుషార్థము వల్ల ఏమి అవుతుంది?

**13.** **యది వాప్యుపపద్యేత పౌరుషం నామ కర్హిచిత్ ।**
**అన్విష్యమాణం తదపి దైవమేవావతిష్ఠతే ॥**

ఒక వేళ ఎప్పుడైనా ఏదైనా పురుషార్థం సఫలమైనట్లు కనబడితే అక్కడ కూడా వెదకినట్లైతే అందు దైవసహాయోగమున్నట్లు తెలుస్తుంది.

**14.** **తస్మాత్ నిర్వేద ఏవేహ గన్తవ్యః సుఖమిచ్ఛతా ॥**
**సుఖం స్వపితి నిర్విణ్ణో నిరాశశ్చార్థ సాధనే ॥**

అందువల్ల సుఖం కోరు పురుషుడు డబ్బు మొదలగు విషయాలలో వైరాగ్యాన్నే ఆశ్రయించాలి. ధనాన్ని సంపాదించవలెననే చేష్టతో నిరాశ గలవాడై ఎవడు ఉంటాడో అతడు సుఖమనెడి నిద్రలో నిద్రిస్తూ ఉంటాడు.

**15.** **అహో! సమ్యక్ శుకేనోక్తం సర్వతః పరిముచ్యతా ।**
**ప్రతిష్ఠతా మహారణ్యం జనకస్య నివేశనాత్ ॥**

ఆహా! శుక మహాముని జనకుని రాజమహలు నుండి విశాలవనానికి వెళ్ళే సమయంలో మానవుడు అన్ని దిక్కులనుండి బంధన ముక్తుడైతేనే మంచిదని చెప్పియున్నాడు.

**16.** **యః కామానాప్నుయాత్ సర్వాన్ యశ్చైతాన్ కేవలాంస్త్యజేత్ ।**
**ప్రాపణాత్ సర్వ కామానాం పరిత్యాగో విశిష్యతే ॥**

ఏ మానవుడు తన సమస్త కోర్కెలను పొందుతున్నాడో అట్లే ఏ కోర్కెలనన్నింటిని త్యాగం చేస్తున్నాడో ఈ రెండు కార్యాలలో సమస్త కోర్కెలను పొందుటకన్న వాటిని వదిలిపెట్టడమే శ్రేష్ఠమని తెలుస్తున్నది.

**17.** నాన్తం సర్వ విధిత్సానాం గత పూర్వోఽస్తి కశ్చన ।
శరీరే జీవితే చైవ తృష్ణా మన్దస్య వర్ధతే ॥

మొదట ఎవరైనా ధనం మొదలగు వాటికి అయ్యే సంపూర్ణ ప్రవృత్తుల యొక్క అంతాన్ని పొందడంలేదు శరీరం మరియు జీవనాల యెడల మూర్ఖ మనుష్యుని తృష్ణ పెరుగుతూనే ఉంటుంది.

**18.** నివర్తస్వ విధిత్సాభ్యః శామ్య నిర్విద్య కాముక ।
అసకృచ్చాసి నికృతో న చ నిర్విద్యసే తతః ॥

కోర్కెలకు బానిస యైన ఓమనసా! నీవు అన్ని విధాల చేష్టల నుండి మరలి వెళ్ళు. వైరాగ్యపూర్ణమగు శాంతిని ధరించు. నీవు డబ్బువైపు మరలినప్పుడు అనేకమార్లు ఖండింపబడినావు. అయినప్పటికీ వాటివైపు నీకు వైరాగ్యం కలగడం లేదు.

**19.** యది నాహం వినాశ్యస్తే యద్యేవం రమసే మయా ।
మా మాం యోజయ లోభేన వృథా త్వం విత్తకాముక ॥

డబ్బును కోరే ఓ మనసా! నీవల్ల నేను నశించకూడదు. ఒక వేళ నీవు ఈ ప్రకారంగా నా వెంట ఆనంద పూర్వకంగా ఉండాలనుకొంటే నన్ను వ్యర్థమైన లోభంలో పడవేయవద్దు.

**20.** సంచితం సంచితం ద్రవ్యం నష్టం తవ పునః పునః ।
కదాచిన్మోక్ష్యసే మూఢ ధనేహాం ధనకాముక ॥

నీవు అనేకమార్లు డబ్బును ప్రోగుచేసినావు. అయినప్పటికి అది మరల నష్టమవుతూనే ఉంది. డబ్బును కోరేడి ఓ మూఢా! నీ వెప్పుడైనా ధన తృష్ణ అనే ఈ కోరికను త్యాగము చేయగలవా?

**21.** అహో ను మమ బాలిశ్యం యోఽహం క్రీడనకస్తవ ।
కిం నైవం జాతపురుషః పరేషాం ప్రేష్యతామియాత్ ॥

ఆహా! ఏమి నా మూర్ఖత నేను నీ చేతి ఆటబొమ్మనైనాను కదా! ఒక వేళ, నేను ఈ విధంగా, కాకపోయినట్లయితే నేను నీకు దాసుడనై ఉండేవాడినా?

**22.** న పూర్వే నాపరే జాతు కామానామన్తమాప్నువన్ ।
త్యక్త్వా సర్వసమారమ్భాన్ ప్రతి బద్ధోఽస్మి జాగ్రుమి ॥

పూర్వీకులు, ఆధునికులు అయిన మానవులు కూడా ఎన్నటికినీ కోర్కెల అంతాన్ని చూడలేకపోయివారు. అందువల్ల నేను సమస్త కర్మల ఆయోజనాన్ని త్యాగము చేసి సావధానుడనై యున్నాను. సంపూర్ణంగా మేల్కొనియున్నాను.

**23. నూనం తే హృదయం కామ వజ్రసారమయం దృఢమ్ ।**
**యదనర్థ శతావిష్టం శతధా న విదీర్యతే ॥**

ఓ కామమా ! నిశ్చయముగా నీ హృదయం వజ్రంతో చేయబడి ది. అందువల్ల అది అత్యంత సుదృఢమైనది. నూరు విధాలగు అనర్థాలచే కూడు కొన్నప్పటికీ నూరు ముక్కలు కాకున్నది.

**24. జానామి కామ త్వాం చైవ యచ్చ కించిత్ ప్రియం తవ ।**
**తవాహం ప్రియ మన్విచ్ఛన్నాత్మన్యుపలభే సుఖమ్ ॥**

ఓ కామమా! నిన్ను నేను చక్కగా తెలుసుకొంటున్నాను. నీవలన గలుగు ప్రియం కూడా పరిచితమై యున్నది. చాలా కాలమునుండి నీకు మేలును కలుగు జేయాలనే తలంపుతోనే ఉన్నాను. అయినప్పటికీ ఎన్నడూ నా మనస్సులో సుఖానుభవాన్ని పొందలేక పోయినావు.

**25. కామ జానామి తే మూలం సంకల్పాత్ కిల జాయసే ।**
**న త్వాం సంకల్పయిష్యామి సమూలో న భవిష్యసి ॥**

ఓ కామమా! నీమూలాన్ని నేను తెలుసు కొంటున్నాను. నిశ్చయంగా నీవు సంకల్పం ద్వారానే పుట్టుతున్నావు. ఇప్పుడు నేను నిన్ను కోరుకోవడంలేదు దాని వల్ల నీవు సమూలంగా నష్టపడగలవు.

**26. ఈహా ధనస్య న సుఖా లబ్ధ్వా చిన్తా చ భూయసీ ।**
**లబ్ధనాశో యథా మృత్యుర్లబ్ధం భవతి వా న వా ॥**

డబ్బుపై కోరిక లేక చేష్ట సుఖాన్నిచ్చేదికాదు. ఒకవేళ డబ్బు లభించినట్లైతే దాన్ని రక్షించడంలో మిక్కిలి ఆలోచన కలుగుతుంది. ఒకసారి లభించి మరల నష్టమైనట్లైతే అప్పుడు మృత్యువుతో సమానమైన భయంకర కష్టం కలుగుతుంది. ఉద్యోగం చేసినప్పటికీ ధనం లభిస్తుందో లేదో నిశ్చయమవడం లేదు.

**27. పరిత్యాగేన లభతే తతో దుఃఖతరం ను కిమ్ ।**
**న చ తుష్యతి లబ్ధేన భూయ ఏవ చ మార్గతి ॥**

శరీరాన్ని వదిలినప్పటికీ మానవుడెప్పుడు డబ్బును పొందలేడో అప్పుడు దానికొఱకై ఇంతకంటే గొప్ప దుఃఖమే అనుభవిస్తాడు. ఒక వేళ ధనం లభించినప్పటికీ దానితోనే అతడు సంతుష్టుడు కాలేడు. ఇంకా ఎక్కువ డబ్బును సంపాదింపవలయుననే సంకల్పముతోనే ఉంటాడు.

**28.** అనుతర్షుల ఏవార్థో స్వాదు గాఙ్గమివోదకమ్ ।
మద్విలాపనమేతత్తు ప్రతిబుద్ధోఽస్మి సంత్యజ ॥

ఓ కామమా! రుచికరమగు గంగా జలంతో సమానంగా ఈ డబ్బు తృష్ణనే అధికంగావిస్తూ ఉన్నది. ఈ తృష్ణ యొక్క పెరుగుదల నా వినాశనానికి కారణం కాగలదని నేను చక్కగా తెలుసుకొంటున్నాను. అందువల్ల నీవు నన్ను వదలి పెట్టాలి.

**29.** య ఇమం మామకం దేహం భూతగ్రామః సమాశ్రితః ।
స యాత్వితో యథా కామం వసతాం వా యథా సుఖమ్ ॥

నా యీ శరీరాన్ని ఆశ్రయం చేసుకొని పంచభూతాల సమూహం ఉంది. అది వీటివల్ల తన యిష్టానుసారం స్నేహ పూర్వకంగా ఉన్నా లేకున్నా ఫరవాలేదు నాకు.

**30.** న యుష్మాస్విహ మే ప్రీతిః కామలోభానుసారిషు ।
తస్మాదుత్సృజ్య కామాన్ వై సత్త్వమేవాశ్రయామ్యహమ్ ॥

ఓ పంచభూత గణమా! అహంకారాదుల వెంట మీరందరూ కామలోభాలలో తగుల్కొని యున్నారు. అందువల్ల నీపైన స్నేహము లేదు నాకు. అందువల్ల నేను సమస్తకోర్కెలను వదిలి కేవలం సత్వ గుణాన్ని మాత్రమే ఆశ్రయిస్తూ ఉన్నాను.

**31.** సర్వ భూతాన్యహం దేహే పశ్యన్ మనసి చాత్మనః ।
యోగే బుద్ధిం శ్రుతే సత్త్వం మనో బ్రహ్మణి ధారయన్ ॥

**32.** విహరిష్యామ్యనాసక్తః సుఖీ లోకాన్ నిరామయః ।
యయా మాం త్వం పునర్నైవం దుఃఖేషు ప్రణిధాస్యసి ॥

నేను నా శరీరంనందలి మనస్సులోపల సంపూర్ణ భూతాలను చూస్తూ బుద్ది నియోగం నందును ఏకాగ్రమనస్సును శ్రవణ మననము మొదలగు సాధనములందు మనస్సును, పరబ్రహ్మయైన పరమాత్మయందు ఉంచి రోగశోకాలు లేకుండా సంపూర్ణలోకంలో అనాసక్త భావంతో సంచరించగలను. దీనివల్ల మరల నీవు ఈ రకమైన దుఃఖంలో నన్ను ముంచలేవు.

**33.** త్వయా హి యే ప్రణున్నస్య గతిరన్యా న విద్యతే ।
తృష్ణా శోకశ్రమాణాం హి త్వం కామ ప్రభవః సదా ॥

ఓ కామమా! ఆశ, శోకం మరియు పరిశ్రమ మొదలగువాటికి ఎల్లప్పుడూ నీవే ఉత్పత్తి స్థానానివి. ఎంతవరకు నీవు నన్ను ప్రేరితుని జేసి ఇటు అటు నన్ను తిప్పుతూ ఉంటావో అంతవరకు నాకు వేరే గతి ఏదీ ఉండదు.

**34.** ధన నాశేఽధికం దుఃఖం మన్యే సర్వమహత్తరమ్ ।
జ్ఞాతయోహ్యవమన్యన్తే మిత్రాణి చ ధనాచ్చ్యుతమ్ ॥

డబ్బుపోతే అది మిక్కిలి దుఃఖకరమని నేను భావిస్తూ ఉన్నాను. ఎందుకంటె ఎవడు ధనచ్యుతుడగుచున్నాడో అతడు మిత్రులచేతను దాయాదుల చేతను అవమానింపబడుచున్నాడు.

**35.** అవజ్ఞాన సహస్రైస్తు దోషాః కష్టతరాఽధనే ।
ధనే సుఖ కలా యా తు సా పి దుఃఖైర్విధీయతే ॥

దరిద్రుడు వేల కొలది అవమానములను భరించవలసి ఉంటుంది. అందువలన డబ్బులేని స్థితియందు అనేక విధాల కష్టదాయకాలైన దోషాలుండును. డబ్బులో ఏ అల్ప సుఖమైతే ఉంటుందో అది కష్టం చేతనే సంపాదింపబడుతున్నది.

**36.** ధనమస్యేతి పురుషం పురో నిఘ్నన్తి దస్యవః ।
క్లిశ్యన్తి వివిధైర్దండైర్నిత్యముద్వేజయన్తి చ ॥

ఏ పురుషుని వద్ద డబ్బు ఉందని అనుమానం ఉంటుందో ఆ డబ్బును దొంగిలించడానికి అతన్ని దొంగలు చంపి వేస్తారు. లేక అతనికి రకరకాల బాధలను కలుగజేసి పీడిస్తారు లేక వివిధ దండనలతో ఉద్వేగపరుస్తారు.

**37.** అర్థలోలుపతా దుఃఖమితి బుద్ధం చిరాన్మయా।
యద్ యదాలమ్బసే కామ తత్తదేవానురుధ్యసే ॥

ధనలోలుపత దుఃఖానికి కారణం. ఈ విషయం చాలాకాలం తరువాత నాకు తెలిసింది ఓ కామమా! నీవు ఎవరెవరిని ఆశ్రయిస్తున్నావో వారందరూ వెనుకబడుతూనే ఉన్నారు.

**38.** అతత్త్వ జ్ఞోఽసి బాలశ్చ దుస్తోషోఽపూరణోఽనలః ।
నైవ త్వం వేత్థ సులభం నైవ త్వం వేత్థ దుర్లభమ్ ॥

నీవు తత్త్వజ్ఞానరహితుడవై బాలకునితో సమానంగా నున్నమూఢుడవు. నీకు సంతోషం కులుగ జేయడం కఠినమే. అగ్నివలే నీ పొట్ట నింపడం అసంభవమే. ఏ వస్తువు సులభమైంది, ఏ వస్తువు దుర్లభమైంది అనే అంశం నీవు తెలుసుకోవడంలేదు.

**39.** పాతాళ ఇవ దుష్పూరో మాం దుఃఖైర్యోక్తుమిచ్ఛసి ।
నాహమద్య సమావేష్టుం శక్యః కామ పునస్త్వయా ॥

ఓ కామమా ! పాతాళంతో సమానంగా నున్న నిన్ను భరించడం కష్టమే. నీవు నన్ను దుఃఖాలలో ముంచడాని ఇష్టపడుతున్నావు. కాని యిప్పుడు మాత్రం నీవు మరల నా హృదయంలో ప్రవేశించలేవు

**40.** నిర్వేదమహమాసాద్య ద్రవ్యనాశాత్ యదృచ్ఛయా ।
నిర్వృత్తిం పరమాం ప్రాప్య నాద్య కామాన్ విచిన్తయే ॥

అనుకోకుండా డబ్బు నాశనమవడంవల్ల వైరాగ్యం పొందిన నాకు ఇప్పుడు పరమసుఖం లభించింది. ఇప్పుడు నేను భోగాలను గూర్చి ఆలోచింపలేకున్నాను.

**41.** అతిక్లేశాన్ సహామీహ నాహం బుద్ధ్యామ్యబుద్ధిమాన్ ।
నికృతో ధననాశేన శర సర్వాఙ్గ విజ్వరః ॥

ముందు నేను ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ ఉండేవాన్ని. ధన సంపాదనలో కష్టమున్నది అనే విషయాన్ని తెలిసికొనలేక పోయిన బుద్ధిహీనున్ని. కాని యిప్పుడు ధననాశనమైనందున దానిచే మోసగింపబడిన నేను శరీరంలోని అన్ని అంగాలలో ఉన్న కష్టం మరియు దిగుళ్ళను వదలి సుఖంగా నిద్రిస్తున్నాను

**42.** పరిత్యజామి కామ! త్వాం హిత్వా సర్వమనోగతీః ।
న త్వం మయా పునః కామ వత్స్యసే న చ రంస్యసే ॥

ఓ కామమా! నేను పూర్తిగా మానసిక వ్యాపారాలను దూరంగా తరిమి నిన్ను వదలి పెడ్తున్నాను. ఇప్పుడు నీవు నా వెంట ఉండలేవు. నాతో రమించలేవు.

**43.** క్షమిష్యే క్షిపమాణానాం న హింసిష్యే విహింసితః ।
ద్వేష్యయుక్తః ప్రియం వక్ష్యామ్యనాదృత్య తదప్రియమ్ ॥

ఇప్పుడు ఏ ప్రజలు నన్ను అపేక్షిస్తారో, తిరస్కరిస్తారో వారిని నేను పట్టించుకోను. ఏ ప్రజలు నన్ను కొడ్తారో కష్ట పెడ్తారో వారితో నేను అలా ప్రవర్తించను. ద్వేషింపదగిన పురుషుడు వెంట ఉన్నా వారు నన్ను గూర్చి అప్రియంగా పలికినప్పటికీ నేను వారిపై దృష్టినుంచక వారితో వారికిష్టంలేని మాటలను మాట్లాడను.

**44.** తృప్తః స్వస్థేన్ద్రియో నిత్యం యథా లబ్ధేన వర్తయన్ ।
న సకామం కరిష్యామి త్వామహం శత్రుమాత్మనః ॥

నేను ఎల్లప్పుడు తృప్తి నొంది స్వస్థమైన ఇంద్రియాలతో కూడుకొని అదృష్టవశాన ఏ కొంచమైనా లభిస్తే దానితోనే జీవిస్తున్నాను. కాని నన్నెన్నడూ ఎప్పుడూ నీవు ఏమీ చేయలేవు. ఎందుకనగా నీవు నా శత్రువువు.

**45.** నిర్వేదం నిర్వృతిం తృప్తిం శాన్తిం సత్యం దమం క్షమామ్ ।
సర్వభూతదయాం చైవ విద్ధి మాం సముపాగతమ్ ॥

నాకు వైరాగ్యం, సుఖం, తృప్తి, శాంతి, సత్యం, దమం, ఓర్పు, జీవులన్నిటి యెడల దయాభావం మొదలగు సద్గుణాలన్నీ లభించినాయనే విషయం నీవు చక్కగా తెలుసుకో.

**46.** తస్మాత్ కామశ్చ లోభశ్చ తృష్ణా కార్పణ్యమేవ చ ।
త్యజన్తు మాం ప్రతిష్ఠన్తం సత్త్వస్థోఽహ్యస్మి సామ్ప్రతమ్ ॥

అందువల్ల కామం, ఆశ, లోభితనం, మోక్షం వైపు పయనిస్తున్న నన్ను చూసి వదలి పోవుగాక ! ఇప్పుడు నేను సత్త్వగుణంలో ప్రతిష్ఠితుడనై యున్నాను

**47.** ప్రహాయ కామం లోభం చ సుఖం ప్రాప్తోఽస్మి సామ్ప్రతమ్ ।
నాద్య లోభవశం ప్రాప్తో దుఃఖం ప్రాప్స్యామ్యనాత్మవాన్ ॥

ఈ సమయంలో నేను కామాన్ని లోభాన్ని వదలి ప్రత్యక్షంగా సుఖాన్ని అనుభవిస్తూ ఉన్నాను. అందువల్ల అది జితేంద్రియ పురుషునివలె ఇప్పుడు నేను లోభంలో తగుల్కొననందున దుఃఖాన్ని పొందడం లేదు.

**48.** యద్యద్ త్యజతి కామానం తద్ సుఖస్యాభిపూర్యతే ।
కామస్య వశగో నిత్యం దుఃఖమేవ ప్రపద్యతే ॥

మానవుడు ఏయే కోర్కెలను వదులుచున్నాడో అది అతని ఎడల సుఖమే అవుతున్నది. కోర్కెలకు వశీభూతుడై అతడు ఎల్లప్పుడూ దుఃఖాన్నే పొందుచున్నాడు.

**49.** కామానుబన్ధం నుదతే యద్ కించిద్ పురుషో రజః ।
కామక్రోధోద్భవం దుఃఖమహ్రీరరతిరివ చ ॥

కామంతో సంబంధం ఉంచుకొనే మానవునికి ఏ కొంచెం రజో గుణం ఉన్నా దాన్ని దూరంగా ఉంచుకోవాలి. దుఃఖం సిగ్గులేకపోవడం అనేవి కామక్రోధాలతో పుట్టినవి.

**50.** ఏష బ్రహ్మ ప్రతిష్ఠోఽహం గ్రీష్మశీతమివ హ్రదమ్ ।
శామ్యామి పరి నిర్వామి సుఖం మామేతి కేవలమ్ ॥

ఏ విధంగా గ్రీష్మ ఋతువులో ప్రజలు చల్లని నీరుండే సరోవరాన్ని చేరుకొంటున్నారో అట్లే ఇప్పుడు నేను పరబ్రహ్మయందు ప్రతిష్ఠితుడనై యున్నాను. ఇప్పుడు నేను శాంతుడనై యున్నాను. అన్ని వైపులనుండి నిర్వాణప్రాప్తి పొంది యున్నాను. ఇప్పుడు నాకు కేవలం సుఖమే లభిస్తున్నది.

**51.** యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్య మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయ సుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్ ॥

ఈ లోకంలో ఏ విషయసుఖం ఉందో అట్లే పరలోకంలో ఏ దివ్య మహాసుఖం ఉందో అట్టి ఈ రెండూ సుఖతృష్ణ నాశాల వల్ల కలిగే సుఖం యొక్క 16వ కళకు కూడా సమానం కాకున్నది.

**52.** ఆత్మనా సప్తమం కామం హత్వా శత్రు మిహోత్తమమ్ ।
ప్రాప్యావధ్యం బ్రహ్మపురం రాజేవ స్యామహం సుఖీ ॥

కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, మమత అనే ఈ ఏడు శత్రువుల వంటివి. ఇందులో ఏడవదైన కామరూప శత్రువు అన్నింటికంటె మిక్కిలి బలమైంది. వీటితోపాటు మహాశత్రువైన కామాన్ని నాశనంచేసి అవినాశియైన బ్రహ్మపురంలో నిలిచి ఉండే నేను రాజుతో సమానంగా వెలుగుచున్నాను.

**53.** ఏతాం బుద్ధిం సమాస్థాయ మంఙ్కిర్నిర్వేద మాగతః ।
సర్వాన్ కామాన్ పరిత్యజ్య ప్రాప్య బ్రహ్మ మహత్సుఖమ్ ॥

రాజా ! ఇట్టి బుద్ధిని ఆధారంగా చేసుకొని మంకిముని డబ్బు భోగాల నుండి విముక్తుడైనాడు. అంతేకాదు ఆయన కోర్కెల నన్నింటిని వదిలి పరమానందస్వరూపుడైన పరమాత్మను చేరుకొన్నాడు.

**54.** దమ్యనాశ కృతే మఙ్కిరమృతత్త్వం కిలాగమత్ ।
అచ్ఛినత్ కామ మూలం స తేన పాప మహత్సుఖమ్ ॥

కోడెల నాశాన్ని నిమిత్తంగా తీసుకొని మంకిముని అమృతత్వాన్ని పొందినాడు. అతడు కామపు మూలాన్ని పెకలించివేశాడు. అందువల్లనే ఆయన సుఖాన్ని పొందగల్గినాడు.

*177వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 178వ అధ్యాయం

5. జనకుని మాటలు - నహుషరాజు ప్రశ్నలకు సమాధానంగా బోధ్యగీత

*భీష్మ ఉవాచ:-*

1. అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
   గీతం విదేహరాజేన జనకేన ప్రశామ్యతా ॥

*భీష్ముడు పలికెను:-*

ఓ రాజా! ఈ విషయంలో శాంత భావాన్ని పొందిన విదేహరాజైన జనకుడు చెప్పిన మాట ఇది. ఆ ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణగా తీసికొని చెబుతున్నాను. వినవలసింది.

2. అనన్తమివ మే విత్తం యస్య మే నాస్తి కిఞ్చన ।
   మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కిఞ్చన ॥

*జనకుడు పలికెను :-*

నా దగ్గర లెక్కలేనంత డబ్బు ఉంది. అయినప్పటికీ నా వద్ద ఏమీలేదు. ఈ మిథిలానగరం అగ్నిలోబడి కాలిపోయినప్పటికీ నా సొమ్ము ఏమికాలిపోవడం లేదు.

3. అత్రైవోదాహరన్తీమం బోధ్యస్య పదసఞ్చయమ్ ।
   నిర్వేదం ప్రతి విన్యస్తం తం నిబోధ ద్విజోత్తమ ॥

ధర్మరాజా! ఈ ప్రసంగంలో వైరాగ్యంతో కూడుకొన్న బోధ్యుడను పేరుగల ముని ఏ మాటలను చెప్పినాడో వాటిని నీకు తెలియజేస్తున్నాను చక్కగా వినవల్సింది.

4. బోధ్యం శాన్తమృషిం రాజా నాహుషః పర్యపృచ్ఛత ।
   నిర్వేదాచ్ఛాన్తిమాపన్నం శాన్త ప్రజ్ఞాన తర్పితమ్ ॥

ఒకసారి నహుషుని కుమారుడైన యయాతి వైరాగ్యంవల్ల శాంతి భావాన్ని పొందించే శాస్త్రం యొక్క ఉత్కృష్ట జ్ఞానంతో తృప్తిపడిన పరమశాంత బోధ్య ఋషితో ఇలా అన్నాడు.

5. ఉపదేశం మహాప్రాజ్ఞ శమస్యోపదిశస్వ మే ।
కాం బుద్ధిం సమనుధ్యాయ శాన్తశ్చరసి నిర్వృతః ॥

గొప్ప బుద్ధి గలవాడా! నాకు దేని వల్ల శాంతి గలుతుందో అట్టి ఉపదేశం నాకు చేయవసింది. మీరెలాంటి బుద్ధి నాశ్రయించి శాంతి సంతోషాలతో ఉన్నారో తెలుపవలసింది.

*బోధ్య ఉవాచ :-*

6. ఉపదేశేన వర్తామి నానుశాస్మీహ కఞ్చన ।
లక్షణం తస్య వక్ష్యేహం తత్ స్వయం పరిమృశ్యతామ్ ॥

*బోధ్యుడు పలికెను :-*

నేనెవరికీ ఉపదేశించడంలేదు. ఎందుకంటే నేను ఇతరుల ద్వారా పొందిన ఉపదేశం మేరకు నడచుకొంటూ ఉన్నాను. నేను పొందిన ఉపదేశలక్షణాన్ని తెలుపుతున్నాను. విను (ఎవరిద్వారా ఉపదేశం పొందినానో ఆ గురువుల యొక్క మార్గాన్ని వివరిస్తున్నాను. దానిపై నీవు స్వయంగా విచారించు.)

7. పిఙ్గళా కురరః సర్పః సారఙ్గాన్వేషణం వనే ।
ఇషుకారః కుమారీ చ షడేతే గురవః మమ ॥

పింగళ, పెన్నడ పక్షి (కొంచపక్షి) సర్పం, వనంలో జింకను వెదకేవాడు, బాణాన్ని తయారుచేసేవాడు, కన్య ఈ ఏడుగురు నాగురువులు.

*భీష్మ ఉవాచ :-*

8. ఆశా బలవతీ రాజన్ ! నైరాశ్యం పరమం సుఖమ్ ।
ఆశాం నిరాశాం కృత్వా తు సుఖం స్వపితి పిఙ్గళా ॥

*భీష్ముడు పలికెను :-*

రాజా ! బోధ్యుడు తనగురువుల ద్వారా ఏ ఉపదేశాన్ని పొందినాడో దానినీ ప్రకారంగా తెలుసుకోవాలి. ఆశ అనేది మిక్కిలి బలమైంది. అదే అందరికీ దుఃఖాన్నిచ్చేది. నిరాశే గొప్ప సుఖాన్నిచ్చేది. ఆశను నిరాశగా మార్చుకొన్న పింగళ అనే వేశ్య సుఖంగా నివసించి సుఖాన్ని పొందింది. పింగళ ఆశయొక్క త్యాగాన్ని గూర్చి బోధించింది గావున ఆమె నా గురువు అయింది

9. సామిషం కురరం దృష్ట్వా వధ్యమానం నిరామిషైః ।
ఆమిషస్య పరిత్యాగాత్ కురరః సుఖమేధతే ॥

మాంసపు ముక్కను ముక్కుతో తీసికొనిపోయే క్రౌంచపక్షిని మాంసం లేని ఇతర పక్షులు దాన్ని చంపసాగాయి. అప్పుడా క్రౌంచపక్షి మాంసపు ముక్కను వదలివేసింది. పక్షులు దాన్ని వెంబడించడం మానివేశాయి. ఈ ప్రకారం మాంసాన్ని వదలి క్రౌంచపక్షి సుఖాన్ని పొందింది. భోగాలను వదలివేయాలి అనే ఉపదేశాన్ని అందించింది కాబట్టి క్రౌంచపక్షి గురువయింది నాకు.

**10. గృహోభరమో హి దుఃఖాయ న సుఖాయ కదాచన ।**
**సర్పః పరకృతం వేశ్మ ప్రవిశ్య సుఖమేధతే ॥**

ఇల్లు కట్టుకోవడం కూడా దుఃఖానికి కారణమే ఇల్లు గలవానికి ఎన్నడూ సుఖం ఉండదు. చూడు పాము చీమలు పెట్టిన పుట్టల్లో ప్రవేశించి సుఖంగా నివాసం చేస్తూ ఉంది. అందువల్ల ఇళ్ళను కట్టుకొని ఆలోచనల్లో పడవద్దని ఉపదేశించే సర్పమే నాకు గురువయింది.

**11. సుఖం జీవన్తి మునయో భైక్ష్యవృత్తిం సమాశ్రితాః ।**
**అద్రోహేనైవ భూతానాం సారఙ్గా ఇవ పక్షిణః ॥**

ఏ విధంగా చాతకపక్షి ఏ ప్రాణితో వైరం పెట్టుకోక తన యాచనా వృత్తితో జీవనం గడుపుతూ ఉందో అట్లే మహర్షులు భిక్షాటనతో సుఖంగా తమ జీవనాన్ని గడుపుకొంటున్నారు. అద్రోహాన్ని ఉపదేశించిన కారణంగా చాతక పక్షి నాకు గురువు అయింది.

**12. ఇషుకారో నరః కశ్చిదిషావాసక్త మానసః ।**
**సమీపేనాపి గచ్ఛన్తం రాజానం నావబుద్ధవాన్ ॥**

ఒకసారి బాణాలు చేసేవాడు తన పనిలో నిమగ్నమై తన ఎదుటికి వచ్చిన రాజునుకూడా చూడలేక పోయినాడు. అతనిద్వారా ఏకాగ్ర చిత్తం అనే ఉపదేశాన్ని పొందిన కారణంగా అతడు గురువయినాడు.

**13. బహూనాం కలహో నిత్యం ద్వయోః సంకథనం ధ్రువమ్ ।**
**ఏకాకీ విచరిష్యామి కుమారీ శంఖకో యథా ॥**

అనేకమంది ఒక చోట ఉన్నట్లయితే వారికి ప్రతిదినం కొట్లాట ఏర్పడుతూ ఉంటుంది. ఇద్దరున్నా వారి మధ్య తప్పక సంభాషణ జరుగుతుంది. కుమారి కన్యక చేతియందు ధరించిన నిధి రాశితో ఒంటరిగా వెళ్తుంది. కన్యక ఒంటరిగా ఉండడం నాకు నేర్పించింది కావున ఆమె నాకు గురువయింది.

***178 వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 179 వ అధ్యాయం

6. ప్రహ్లాద అవధూతల సంవాదం - అజగర వృత్తి ప్రశంస.

*యుధిష్ఠిర ఉవాచ :-*

**1.** కేన వృత్తేన వృత్తజ్ఞ వీతశోకశ్చరేన్మహీమ్ ।
కిఞ్చ కుర్వన్నరో లోకే ప్రాప్నోతి గతిముత్తమామ్ ।

*ధర్మరాజు పలికెను :-*

తాతా ! నీవు చక్కటి ఆచారస్వరూపాన్ని తెలిపినావు. ఏ విధమగు ఆచారాన్ని చేపట్టితే మానవుడు దుఃఖం లేనివాడై ఈ భూమిపై తిరుగగల్గుతాడు? ఈ లోకంలో ఏమిచేస్తే అతడు ఉత్తమ గతిని పొందగల్గుతాడు? ఈ అంశాన్ని దయచేసి నాకు తెలుపవలసింది.

*భీష్మ ఉవాచ :-*

**2.** అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
ప్రహ్లాదస్య చ సంవాదం మునేరాజగరస్య చ ॥

*భీష్ముడు పలికెను :-*

ఓ రాజా! ఈ విషయంలో కూడా ప్రహ్లాదుడు మరియు అజగరవృత్తిచే జీవనం గడిపే ముని యొక్క సంవాదరూపమైన ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణగా తీసికొని చెబుతున్నాను వినవలసింది.

**3.** చరన్తం బ్రాహ్మణం కఞ్చిత్ కల్పచిత్తమనామయమ్ ।
పప్రచ్ఛ రాజా ప్రహ్లాదో బుద్ధిమాన్ బుద్ధిసమ్మతమ్ ॥

సుదృఢమైన మనస్సు గలవాడు, సుఖదుఃఖరహితుడు బుద్ధిమంతుడైన ఒక బ్రాహ్మణుడు భూమిపై తిరుగుచుండడం చూచి బుద్ధిమంతుడైన ప్రహ్లాదరాజు ఇలా పలికినాడు

*ప్రహ్లాద ఉవాచ :-*

**4.** స్వస్థః శక్తో మృదుర్దాన్తో నిర్విధిత్సోఽనసూయకః ।
సువాక్ ప్రగల్భో మేధావీ ప్రాజ్ఞశ్చరసి బాలవత్ ॥

*ప్రహ్లాదుడు పలికెను :-*

ఓ బ్రాహ్మణుడా ! నీవు ఆరోగ్యవంతుడవు. శక్తిమంతుడవు మెత్తని స్వభావం కలవాడవు, జితేంద్రియుడవు, కర్మారంభాలకు దూరంగా ఉండే వాడవు, ఇతరులు చేసే దోషాలపై దృష్టినుంచని వాడవు, సుందర మధురమైన మాటల మాట్లాడేవాడవు, భయంలేని వాడవు, ప్రతిభాశాలివి, మేధావివి మరియు తత్వజ్ఞుడవు అయినప్పటికీ బాలురతో సమానంగా తిరుగుచున్నావు.

**5.** నైవ ప్రార్థయే లాభం నాలాభేష్వనుశోచసి ।
నిత్య తృప్త ఇవ బ్రహ్మన్ న కిఞ్చిదివ మన్యసే ॥

ఓ బ్రాహ్మణుడా ! నీవు లాభాన్ని కోరడం లేదు. నీకు హాని కల్గినప్పటికీ, దుఃఖించడం లేదు. నీవు నిత్యం తృప్తిగా ఉన్నప్పటికీ ఏ వస్తువును ఇష్టమయిన దాన్నిగా ఇష్టం కాని దాన్నిగా భావించడం లేదు.

**6.** స్రోతసా హ్రియమాణాసు ప్రజాసు విమనా ఇవ।
ధర్మకామార్థకార్యేషు కూటస్థ ఇవ లక్ష్యసే ॥

ప్రజలంతా కామం, కోపం మొదలగు ప్రవాహాలలోబడి కొట్టుకుపోతున్నారు. కాని నీవు వాటిపై మొగ్గు చూపక ఉదాసీనంగా ఉన్నట్లు కన్పిస్తున్నావు. అట్లే ధర్మార్థకామసంబంధమయిన పనులను కూడా ఊరకచూస్తూ ఉన్నావు.

**7.** నాను తిష్ఠసి ధర్మార్థౌ న కామే చాపి వర్తసే ।
ఇన్ద్రియార్థాననాదృత్య యుక్తశ్చరసి సాక్షివత్ ॥

ధర్మార్థ సంబంధాలయిన కార్యాలను నీవు చేయడం లేదు. కామం నందు ప్రవృత్తుడవు కావడం లేదు. నీవు ఇంద్రియ విషయాలన్నింటిలో ఉపేక్ష వహించి సాక్షిభూతుడవై ముక్తరూపుడవై తిరుగుతున్నావు.

**8.** కా ను ప్రజ్ఞా శ్రుతం వా కిం వృత్తిర్వా కా ను తే మునే ।
క్షిప్రమాచక్ష్వ మే బ్రహ్మన్ ! శ్రేయో యదిహ మన్యసే ॥

*భీష్ముడు పలికెను :-*

ఓ రాజా! ప్రహ్లాదుడీ ప్రకారంగా పలుకగా లోకధర్మ విధానం తెలిసిన ఆ మేధావియైన ముని మధురం మరియు సార్థకమైన మాటలతో ఇలా పలికినాడు.

**10.** పశ్య ప్రహ్లాద భూతానాముత్పత్తిమనిమిత్తతః ।
హ్రాసం వృద్ధిం వినాశఞ్చ న ప్రహృష్యే న చ వ్యథే ॥

చూడు ప్రహ్లాద ! ఈ ప్రపంచంలోని ప్రాణుల పుట్టుక, పెరుగుదల, తరుగుదల, వినాశం ఇవన్నీ సత్స్వరూపమైన పరమాత్మ వల్లనే కలుగుతున్నాయి. ఈ కారణంగా నేను వాటిని గూర్చి సంతోషాన్ని దుఃఖాన్ని గాని ప్రకటించడం లేదు.

**11.** స్వభావాదేవ సందృశ్యా వర్తమానాః ప్రవృత్తయః ।
స్వభావ నిరతాస్సర్వాః పరితుష్యేన్న కేనచిత్ ॥

ముందు జన్మలో చేసిన కర్మలననుసరించే స్వభావంచేతనే ప్రాణుల వర్తమాన ప్రవృత్తులు కనబడుతున్నాయని తెలుసుకో! అందువల్ల ప్రజలు వారి స్వభావాలందు తత్పరులై ఉంటారు వారికి వేరే ఆశ్రయం ఏదీలేదు. ఈ రహస్యాన్ని తెలుసుకొని మానవులు ఎలాంటి పరిస్థితులలోకూడ తృప్తిపడడంలేదు.

**12.** పశ్య ప్రహ్లాద సంయోగాన్ విప్రయోగ పరాయణాన్ ।
సంచయాంశ్చ వినాశాన్తాన్ న క్వచిత్ విదధే మనః ॥

చూడు ప్రహ్లాద! ఎన్నికలయికలుంటాయో వాటిఅన్నింటి పర్యవసానం వియోగం నందుంటుంది. అలాగే ఎన్ని సంచయాలుంటాయో వాటి సమాప్తి వియోగం నందే ఉంటాయి. వీటన్నింటిని చూచి నేను ఎక్కడా నా మనస్సును లగ్నం చేయకున్నాను.

**13.** అన్తవన్తి చ భూతాని గుణయుక్తాని పశ్యతః ।
ఉత్పత్తి నిధనజ్ఞస్య కిం కార్యమవశిష్యతే ॥

ఎవడు గుణాలతోకూడుకొన్న మొత్తం ప్రాణుల నాశాన్ని చూస్తున్నాడో అట్లే చావుపుట్టుకల తత్వాన్ని తెలుసుకుంటున్నాడో అతనికి ఏపని మిగలడంలేదు.

**14.** జలజానామపిహ్యన్తం పర్యాయేణోపలక్షయే ।
మహతామపి కాయానాం సూక్ష్మాణాఞ్చ మహోదధౌ ॥

గొప్ప సముద్రపు నీటిలో పుట్టే భారీదేహంతోగల తిమింగళం మొదలైన చేపలు, అలాగే చిన్న చిన్న కీటకాలు పుట్టి చావడం నేను ఎన్నోసార్లు చూస్తున్నాను.

**15.** జఙ్గమస్థావరాణాఞ్చ భూతానామసురాధిప! ।
పార్థివానామపి వ్యక్తం మృత్యుం పశ్యామి సర్వశః ॥

రాక్షస రాజా! భూమండలంపై తిరిగే తిరుగని ఏ ప్రాణులైతే ఉన్నాయో వాటి చావును నేనెన్నోసార్లు చూస్తున్నాను

**16.** **అంతరిక్ష చరాణాఞ్చ దానవోత్తమ పక్షిణామ్ ।**
**ఉత్తిష్ఠతే యథాకాలం మృత్యుర్బలవతామపి ॥**

దానవ శ్రేష్ఠా! ఆకాశంలో తిరిగే బలమైన పక్షులకు కూడా తగిన సమయంలో చావు వచ్చిపడుతున్నది. దాన్నీ నేను చూస్తున్నాను

**17.** **దివి సఞ్చరమాణాని హ్రస్వాని చ మహాన్తి చ ।**
**జ్యోతీంష్యపి యథాకాలం పతమానాని లక్షయే ।**

ఆకాశంలో ఏ చిన్న పెద్ద జ్యోతిర్మయి నక్షత్రాలు తిరుగుతున్నాయో వాటికి కూడా తగిన సమయంలో మృత్యువు వచ్చి అవి క్రిందకు రాలిపడుతున్నాయి. వాటిని నేను చూస్తున్నాను.

**18.** **ఇతి భూతాని సమ్పశ్యన్ననుషక్తాని మృత్యునా ।**
**సర్వ సామాన్యగో విద్వాన్ కృతకృత్యః సుఖం స్వపే ॥**

ఈ విధంగా ప్రాణులన్నీ మృత్యుపాశంలో కట్టుబడియుండడం నేను చూస్తున్నాను. అందువల్ల తత్త్వాన్ని తెలిసికొని కృతకృత్యుడనై అందరిపై సమాన భావాన్ని ఉంచి సుఖంగా నిద్రిస్తూ ఉన్నాను.

**19.** **సుమహాన్తమపిగ్రాసం గ్రసేలబ్ధం యదృచ్ఛయా ।**
**శయే పునరభుంజానో దివసాని బహూన్యపి ॥**

ఒకవేళ దైవేచ్ఛవల్ల అనుకోకుండా భోజనం లభిస్తే ఎక్కువగా తింటాను. కేవలం పిడికెడే దొరికితే దాంతోనే సంతోషపడతాను. ఏమీ దొరక్కపోతే చాలా రోజులు తినకుండా తాగకుండానిద్రపోతాను.

**20.** **ఆశయన్త్యపి మామన్నం పునర్బహుగుణం బహు ।**
**పునరల్పం పునస్తోకం పునర్నైవోపపద్యతే ॥**

నేను పడుకొన్నప్పుడు ఎంతమందైనా ప్రజలు వచ్చి నాకు అనేకరకాలైన వంటకాలు ఎక్కువగా తినిపిస్తూ ఉంటారు. మరల ఎప్పుడైనా చాలా తక్కువగా మిక్కిలి తక్కువగా భోజనం లభిస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి అదికూడా దొరకదు.

**21.** **కణం కదాచిత్ ఖాదామి పిణ్యాకమపి చ గ్రసే ।**
**భక్షయే శాలిమాంసాని భక్ష్యాంశ్చోచ్చావచాన్ పునః ॥**

ఒకసారి నూకలను తింటూ ఉంటాను. వేరొకసారి నువ్వుల పిండిని తింటూఉంటాను. మరోసారి వరి అన్నం, ఇంకోసారి మాంసం, ఇలా రకరకాల పిండి వంటకాలు దొరకుతూ ఉంటాయి. అలా వాటిని తింటూ ఉంటాను.

**22.** శయే కదాచిత్పర్యఙ్కే భూమావపి పునః శయే ।
ప్రాసాదేచాపి మే శయ్యా కదాచిదుపపద్యతే ॥

ఒక సారి పాన్పుమీద, ఒక సారి భూమిమీద, ఇంకోసారి రాజమహలులో వేరేసారి హంసతూలికా తల్పంపై శయనిస్తూ ఉంటాను.

**23.** ధారయామి చ చీరాణి శాణక్షౌమాజినాని చ ।
మహార్హాణి చ వాసాంసి ధారయామ్యహమేకదా ॥

నేను ఒక సారి నారచీరలను, ఇంకోసారి పట్టుబట్టలను ధరిస్తూ ఉంటాను. మరోసారి జరీ, సిల్కు, మృగచర్మాలను ధరిస్తూంటాను.

**24.** న సంనిపతితం ధర్మ్యముపభోగం యదృచ్ఛయా ।
ప్రత్యాచక్షే చ న చాప్యేనమనురుధ్యే సుదుర్లభమ్ ॥

ఒక వేళ అనుకోకుండా ఏదైనా ధర్మానుకూలమైన భోగ్యపదార్థం దొరికితే నేను దానిపై ద్వేషాన్ని చూపడంలేదు. దొరకని ఏ దుర్లభమైన భోగాన్ని కూడా నేనెప్పుడు కోరుకోవడంలేదు.

**25.** అచలమనిధనం శివం విశోకం
శుచిమతులం విదుషాం మతే ప్రవిష్టమ్ ।
అనభిమతమసేవితం విమూఢై
ర్వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

నేను ఎల్లప్పుడు పవిత్ర భావంతో ఉండి ఈ ఆజగర వృత్తిని అనుసరిస్తూన్నాను. ఇది మిక్కిలి దృఢమైంది. మృత్యువు నుండి దూరంగా ఉంచేది. శుభాన్ని కలిగించేది. దుఃఖాన్ని పోగొట్టేది. శుభ్రమైంది. సాటిలేనిది. విద్వాంసుల మతానికి అనుకూలమైంది. మూర్ఖులైన మానవులు దీన్ని అంగీకరించడంలేదు సేవించడం లేదు.

**26.** అచలిత మతిరచ్యుతః స్వధర్మాత్
పరిమిత సంసరణః పరావరజ్ఞః ।
విగతభయకషాయ లోభమోహో
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

నా బుద్ధి స్థిరమైంది నేను నా ధర్మం నుండి ప్రక్కకు పోవడం లేదు. నా సాంసారిక వ్యవహారం పరిమితంగా ఉంది. నాకు ఉత్తమాధమ జ్ఞానం ఉంది. నా హృదయం నుంచి భయం, రాగం, ద్వేషం, లోభం, మోహం దూరమైనాయి. పవిత్ర భావంతోనుండి ఈ అజగరోచిత వ్రతాన్ని ఆచరిస్తూన్నాను.

27. అనియత ఫల భక్ష్య భోజ్యపేయం
విధిపరిణామ విభక్త దేశకాలమ్ ।
హృదయసుఖమసేవితం కదర్యై
ర్వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

ఈ అజగర సంబంధమైన వ్రతం నా హృదయానికి మిక్కిలి సుఖానిస్తూ ఉంది. ఇందులో భక్ష్యభోజ్యపేయ ఫలాదులు లభించుటకు ఏనియమిత వ్యవస్థాలేదు. అనియమిత రూపంలో ఏది లభిస్తాదో దానితోనే జీవనాన్ని గడపాలి. ఈ వ్రతంలో ప్రారబ్దానుసారం దేశకాల విభాగం నియమితమై ఉంది.

28. ఇదమిదమితి తృష్ణయాభిభూతం
జనమనవాప్తధనం విషీదమానమ్ ।
నిపుణమనునిశమ్య తత్త్వ బుద్ధ్యా
వ్రతమిద మాజగరం శుచిశ్చరామి ॥

ఏది దొరకాలో అది దొరుకుతుంది ఈ విధంగా అది ఆశచే తిరస్కరింపబడింది. డబ్బు దొరకని కారణాన ప్రజలెల్లప్పుడూ బాధతో ఉంటున్నారు. అట్టి ప్రజల స్థితిని చక్కగా చూసి తాత్విక బుద్ధితో పవిత్ర భావంతో ఈ ఆజగర వ్రతాన్ని పాలిస్తున్నాను.

29. బహువిధమనుదృశ్య చార్థహేతోః
కృపణమిహార్యమనార్యమాశ్రయన్తమ్ ।
ఉపశమరుచిరాత్మవాన్ ప్రశాన్తో
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

శ్రేష్ఠులైన మానవులు కూడా ధనంకోసం దీనభావంతో నీచపురుషుని ఆశ్రయిస్తూ ఉన్నారు. ఈ దృశ్యాన్ని నేను మాటిమాటికీ చూస్తున్నాను. ఇది చూసి కూడా నామనస్సు ప్రశాంతమవుతూఉంది. అందువల్ల నేను నా స్వరూపాన్ని పొంది అన్ని విధాల శాంతుడనై ఉన్నాను. పవిత్రభావంతో ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తూ ఉన్నాను.

30. సుఖదుఃఖమలాభమర్థలాభం
రతిమరతిం మరణఞ్చ జీవితఞ్చ ।
విధినియతమపేక్ష్య తత్త్వోఽహం
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

సుఖ-దుఃఖాలు, లాభ-నష్టాలు, అనుకూల - ప్రతికూలాలు జీవన - మరణాలు ఇవన్నీ దైవాధీనాలు. నిజరూపాన్ని తెలుసుకొని నేను శుద్ధభావంతో ఈ ఆజగరవ్రతాన్ని పాలిస్తూ ఉన్నాను.

**31.** అపగత భయరాగ మోహదర్పో
ధృతి మతి బుద్ధి సమన్విత ప్రశాన్తః।
ఉపగత ఫలరోగినో నిశమ్య
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

నాకు భయం, రాగం, మోహం, అభిమానం నశించాయి. నేను ధైర్య, మతి, బుద్ధులతో కూడుకొని పూర్తిగా శాంతుడనై ఉన్నాను. ప్రారబ్ధవశాన దానంతకై అదే నావద్దకు వచ్చిన వస్తువు ననుభవిస్తూ పవిత్రభావంతో ఈ ఆజగర వ్రతాన్ని ఆశ్రయిస్తూ ఉన్నాను.

**32.** అనియత శయనాసనః ప్రకృత్యా
దమనియమవ్రత సత్యశౌచయుక్తః ।
అపగత ఫలసఞ్చయః ప్రహృష్టో
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

నాకు కూర్చోడానికి, నిద్రపోవడానికి, ఏ నియత స్థానం లేదు. నేను స్వతస్సిద్ధంగా దమ, నియమ, సత్య శౌచాచారాలను కలిగి యున్నాను. నా కర్మఫల సంచయం నశించింది. నేను సంతోషపూర్వకంగా పవిత్ర భావంతో ఈ ఆజగర వ్రతాన్ని ఆశ్రయించి యున్నాను.

**33.** అపగత సుఖార్థమీహనార్థై
రుపగత బుద్ధిరవేక్ష్య చాత్మసంస్థమ్ ।
తృషితమనియతం మనోనియన్తుం
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

దేని పరిణామం దుఃఖమైందో దాన్ని కోరడం వల్ల విషయభూతసమస్త పదార్థాలవల్ల ఏ విరక్తి కల్గిందో అట్టి ఆత్మనిష్ఠ మహాపురుషున్ని చూసి నాకు జ్ఞాన ప్రాప్తికల్గింది. అందువల్ల నేను ఆశతో వ్యాకులుడనై అసంయత మనస్సును స్వాధీనం చేసుకోవడానికై పవిత్ర భావంతో ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తూ ఉన్నాను.

**34.** న హృదయమనురుధ్య వాఙ్మనో వా
ప్రియసుఖదుర్లభతామనిత్యతాఞ్చ ।
తదుభయముపలక్షయన్నివాహం
వ్రతమిదమాజగరం శుచిశ్చరామి ॥

మనస్సు, వాక్కు, బుద్ధి, వీటిని ఉపేక్షించి సంతోషాన్ని కలిగించు దుర్లభత, అనిత్యత అను ఈ రెండింటిని చూసి పవిత్ర భావంతో ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను.

**35.** బహుకథితమిదం హి బుద్ధిమద్భిః
కవిభిరపి ప్రథయద్భిరాత్మ కీర్తిమ్ ।
ఇదమిదమితి తత్ర తత్ర హన్త!
స్వపరమతైర్గహనం ప్రతర్కయద్భిః ॥

తన కీర్తిని వ్యాపింపజేసే ఈ ఆజగర వ్రతాన్ని గూర్చి విద్వాంసులు బుద్ధిమంతులు, నిగూఢతర్క వితర్కాలు చేసి ఇది ఇలా చేయాలి అని అనేక రకాలుగా వివరించి చెప్పినారు.

**36.** తదను నిశమ్య విప్రపాతం
పృథగభిపన్నమిహాబుధైర్మనుష్యైః ।
అనవసితమనన్త దోషపారం
నృషు విహరామి వినీతదోషతృష్ణః ॥

మూర్ఖప్రజలు ఈ ఆజగరవ్రతాన్ని విని దీన్ని కొండశిఖరం మీదపడుతున్నట్లుగా భయంకరమైందిగా భావిస్తున్నారు. కాని వీరి గుర్తింపు భిన్నమైంది. నేనేమో ఈ వ్రతాన్ని అజ్ఞాన నాశినిగా, దోషం లేని దానిగా భావిస్తూ ఉన్నాను. అందువల్ల తప్పులను చేయకుండా ఆశను వదలి తిరుగుతూ ఉన్నాను.

*భీష్మ ఉవాచ :-*

**37.** అజగరచరితం వ్రతం మహాత్మా
య ఇహ నరోఽనుచరేత్ వినీతరాగః ।
అపగత భయలోభ మోహమన్యుః
స ఖలు సుఖీ విచరేదిదం విహారమ్ ॥

*...డిట్లు పలికెను :-*

ఓ రాజా! ఏ మహాపురుషుడు రాగం, భయం, మోహం, కోపం, మొదలగు వాటిని వదిలి ఈ ఆజగరవ్రతాన్ని పాటిస్తాడో అతడు ఈ లోకంలో ఆనందంగా తిరగగలడు.

***179వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 180 వ అధ్యాయం

7. సద్బుద్ధినాశ్రయించినందువల్ల ఆత్మహత్య మొదలగు పాప కర్మాలనుండి ముక్తినొందవచ్చుననే విషయంపై కాశ్యప బ్రాహ్మణునికి ఇంద్రునికి మధ్య జరిగిన సంవాదం.

*యుధిష్ఠిర ఉవాచ :-*

**1.** బాన్ధవాః కర్మ విత్తం వా ప్రజ్ఞావేహపితామహ! ।
నరస్య కా ప్రతిష్ఠా స్యాదేతత్ పృష్టో వదస్వ మే ॥

*ధర్మరాజు పలికెను :-*

తాతా! బంధువులు, కర్మలు, డబ్బు, బుద్ధి అను నీ నాల్గింటిలో మానవుడు దేన్ని ఆశ్రయించాలి? అనే ప్రశ్నకు సమాధానాన్ని తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

*భీష్మ ఉవాచ:-*

**2.** ప్రజ్ఞా ప్రతిష్ఠా భూతానాం ప్రజ్ఞాలాభః పరో మతః ।
ప్రజ్ఞా నిశ్శ్రేయసీ లోకే ప్రజ్ఞాసర్గోమతః సతామ్ ॥

*భీష్ముడు పలికెను:-*

రాజా! ప్రాణుల ప్రధానాశయం బుద్ధి. బుద్ధే వారికి అన్నింటికంటె మిక్కిలి లాభకరమైంది. ప్రపంచంలో వాటికి మేలు చేకూర్చేది బుద్ధే. సత్పురుషుల దృష్టిలో బుద్ధే స్వర్గం.

**3.** ప్రజ్ఞయా ప్రాపితార్థో హి బలిరైశ్వర్య సంక్షయే ।
ప్రహ్లాదో నముచిర్మఙ్కిస్తస్యాః కిం విద్యతే పరమ్ ॥

బలిచక్రవర్తి తన ఐశ్వర్యాన్ని పోగొట్టుకొని మరల దానిని బుద్ధి బలంతోనే పొందినాడు. ప్రహ్లాదుడు, నముచి, మంకి మొదలగువారు బుద్ధిబలంతో తమతమ ఐశ్వర్యాలను పొందినారు. ప్రపంచంలో బుద్ధికి మించింది మరేదీ లేదు.

**4.** అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
ఇన్ద్రకాశ్యప సంవాదం తన్నిబోధ యుధిష్ఠిర! ॥

ధర్మరాజా! ఈ విషయంలో ఇంద్రకాశ్యపుల మధ్య జరిగిన సంవాదం అనే ఇతిహాసాన్ని నీకు వినిపిస్తున్నాను.

**5.** వైశ్యః కశ్చిదృషిసుతం కాశ్యపం సంశితవ్రతమ్ ।
రథేన పాతయామాస శ్రీమాన్ దృప్తస్తపస్వినమ్ ॥

పూర్వం డబ్బుమీది అభిమానంతో ఒక ధనికుడైన వైశ్యుడు కఠోర వ్రత తపస్సంపన్నుడైన ఋషి కుమారుడగు కాశ్యపున్ని తన రథం నుండి క్రిందకు పడత్రోసినాడు.

**6.** ఆర్తః స పతితఃక్రుద్ధస్త్యక్త్వాఽఽత్మానమథాబ్రవీత్ ।
మరిష్యామ్యధనస్యేహ జీవితార్థో న విద్యతే ॥

అతడు బాధతో పీడింపబడినవాడై క్రిందపడ్డాడు. ఆ తర్వాత కోపించిన వాడై ఆత్మహత్య చేసుకొనడానికి సంసిద్ధుడై ఇలా పలికినాడు. ఇప్పుడు నేను ప్రాణాన్ని వదలగలను. ఎందుకంటె డబ్బులేని వాని జీవితం వ్యర్థం.

**7.** తథా ముమూర్షుమాసీనమకూజన్తమచేతసమ్ ।
ఇన్ద్రః శృగాలరూపేణ బభాషే లుబ్ధమానసమ్ ॥

అతడీవిధంగా మరణించాలని నిశ్చయించి క్రిందకూర్చున్నాడు. మూర్ఛవల్ల అచేతనుడై ఏమీ పలకక మనస్సులోనే డబ్బుకై ఆశపడుట గాంచి ఇంద్రుడు నక్క రూపం ధరించి వచ్చి అతనితో ఇలా చెప్పసాగినాడు.

**8.** మనుష్యయోనిమిచ్ఛన్తి సర్వభూతాని సర్వశః ।
మనుష్యత్వే చ విప్రత్వం సర్వ ఏవాభినన్దతి ॥

ఓ మహర్షీ! ప్రాణులన్నీ అన్ని విధాల మానవజన్మ నెత్తడానికి ఇష్టపడుతున్నాయి. అందులోనూ బ్రాహ్మణ జన్మనెత్తాలని ఇష్టపడుతున్నాయి.

**9.** మనుష్యో బ్రాహ్మణశ్చాసి శ్రోత్రియశ్చాసి కాశ్యప ।
సుదుర్లభమవాప్యైతన్నదోషాన్మర్తుమర్హసి ॥

ఓ కాశ్యప మహర్షీ! నీవు మానవుడవు. అందులోను బ్రాహ్మణుడవు. అందులోను శ్రోత్రియుడవు. ఇట్టి పరమదుర్లభమగు శరీరాన్ని పొంది అందు దోష దృష్టి వహించి స్వయంగా చావడానికి సిద్ధపడం నీకు తగినట్టిది కాదు.

**10.** సర్వే లోభాః సాభిమానా ఇతి సత్యవ్రతీ శ్రుతిః ।
సంతోషణీయ రూపోఽసి లోభాత్ యదభిమన్యసే ॥

ప్రపంచంలో ఏ లాభాలున్నాయో అవన్నీ అభిమాన పూర్ణాలై ఉన్నాయి. ఇది సత్యమైన వేదవాక్కువంటిది. నీ స్వరూపాన్ని సంతోషంగా ఉంచుకోవడం నీకు తగి ఉంది. నీవు లోభంతో దాన్ని ఎగతాళిచేస్తున్నావు.

**11.** అహో! సిద్ధార్థతా తేషాం యేషాం సన్తీహ పాణయః ।
అతీవ స్పృహయే తేషాం యేషాం సన్తీహ పాణయః ॥

ఆహా! ఎవరిదగ్గర భగవంతుడిచ్చిన చేతులున్నాయో అతన్ని నేను కృతార్థునిగా భావిస్తూ ఉన్నాను. ఈ ప్రపంచంలో ఎవరికి ఒకటికన్నా ఎక్కువచేతులున్నాయో అతనికి ఎలాంటి సౌభాగ్యం పొందాలని కోరిక ఉందో అది నాకు మాటిమాటికీ కల్గుతూంది.

**12.** పాణిమద్భ్యః స్పృహాస్మాకం యథా తవ ధనస్య వై ।
న పాణిలాభాదధికో లాభః కశ్చన విద్యతే ॥

ఎట్లైతే నీకు మనస్సునందు ధన విషయకమైన కోర్కె ఉందో అదే ప్రకారంగా పశువులమైన మాకు మీ మనుష్యుల లాంటి చేతులు కలిగి ఉండాలనే కోరిక ఉంది. మా దృష్టిలో చేతులు లభించడం అనేదానికంటె మరో లాభంలేదు.

**13.** అపాణిత్వాద్ వయం బ్రహ్మన్ కణ్టకం నోద్ధరామహే ।
జంతూనుచ్చావచానఙ్గే దశతో న కషామ వా ॥

ఓ బ్రాహ్మణుడా! మా శరీరమంతా ముల్లులు గుచ్చుకుంటున్నాయి. చేతులు లేనందువల్ల మేము వాటిని తీసుకోలేక పోతున్నాం. చిన్నా పెద్దా జంతువులు మా శరీరం మీద వాలితే కరిస్తే వాటిని కూడా మేము తొలగించుకోలేకున్నాం.

**14.** అథ ఏషాం పునః పాణీ దేవదత్తే దశాఙ్గులీ ।
ఉద్ధరన్తి కృమీనఙ్గాన్ దశతో నికృషన్తి వా ॥

ఎవరివద్ద భగవంతుడిచ్చిన పదివ్రేళ్ళు గల రెండు చేతులున్నాయో వాటితో తమ శరీరాలను కరుస్తున్న క్రిములను తొలగించడమో లేక చంపడమో జరుగుతుంది.

**15.** వర్షా హిమాతపానాఞ్చ పరిత్రాణాని కుర్వతే ।
చైలమన్నం సుఖం శయ్యాం నివాతం చోపభుఞ్జతే ॥

ఆ చేతులు వర్షం, చలి, ఎండ మొదలగు వాటినుండి రక్షించుకొంటున్నాయి. వస్త్రాలను తొడుక్కుంటున్నాయి. సుఖంగా అన్నాన్ని తినిపిస్తున్నాయి. పడకను

వేసుకొని నిద్రించటానికి, ఏకాంత స్థానంలో ఉపభోగం పొందటానికి ఉపయోగపడుతున్నాయి.

**16. అధిష్ఠాయ చ గాం లోకే భుఞ్జతే వాహయన్తి చ ।**
**ఉపాయైర్బహుభిశ్చైవ వశ్యానాత్మని కుర్వతే ॥**

చేతులుగల మానవులు ఎద్దుల బండిపై నెక్కి వాటిని నడిపిస్తున్నారు. వాటిని ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకొంటున్నారు. అలాగే చేతులతోనే అనేక రకాలయిన ఉపాయాలను పన్ని ప్రజలను తమ అధీనంలో ఉంచుకొంటున్నారు.

**17. యే ఖల్వజిహ్వాః కృపణా అల్పప్రాణా అపాణయః ।**
**సహన్తే తాని దుఃఖాని దిష్ట్యా త్వం న తథా మునే ॥**

ఓ మునీ! చేతులులేకుండా దిక్కులేని బలంలేని మూగజంతువులు దుఃఖాలను సహిస్తున్నాయి. అదృష్టదశాన నీవు ఆ దుఃఖాన్ని పొందడం లేదు

**18. దిష్ట్యా త్వం శృగాలో వై న కృమిర్నచ మూషికః ।**
**న సర్పో న మండూకో న చాన్యః పాపయోనిజః ॥**

నీవు నక్క, క్రిమి, ఎలుక, పాము, కప్ప మొదలగు ఏ ఇతర పాప యోనియందు జన్మించడం లేదు. కాబట్టి నీ భాగ్యం గొప్పది.

**19. ఏతావతాపి లాభేన తోష్టుమర్హసి కాశ్యప ।**
**కిం పునర్యోఽసి సత్త్వానాం సర్వేషాం బ్రాహ్మణోత్తమః ॥**

కశ్యప మహర్షీ! నీవు ఈ లాభంతోనే సంతృప్తి పొందు. నీవు అన్ని ప్రాణులలో కెల్ల శ్రేష్ఠమైన బ్రాహ్మణుడవు. ఇంతకన్నా నీకు కావలసిందేమిటి?

**20. ఇమే మాం కృమయోఽదన్తి యేషాముద్ధరణాయ వై ।**
**నాస్తి శక్తిరపాణిత్వాత్ పశ్యావస్థామిమాం మమ ॥**

నన్ను ఈ క్రిములు పీడిస్తున్నాయి. వాటిని తీసి విసరివేయడానికి నాకు శక్తి లేదు. చేతులు లేనందువల్ల నాకు కలిగే ఈ దుఃస్థితిని నీవు ప్రత్యక్షంగానే చూస్తున్నావు.

**21. అకార్యమితి చైవేమం నాత్మానం సంత్యజామ్యహమ్ ।**
**నాతః పాపీయసీం యోనిం పతేయమపరామితి ॥**

ఆత్మహత్యా చేసుకోవడం పాపం. ఈ విధంగా ఆలోచించి నేను ఈ శరీరాన్ని వదలలేక పోతున్నాను. నేను ఈ మానవ జన్మను దాటి మరే ఇతర పాపయోని యందు ప్రవేశించకూడదని నిశ్చయించుకున్నాను.

22. మధ్యే వై పాపయోనీనాం శార్గాలీం యామహం గతః।
పాపీయస్యో బహుతరా ఇతోఽన్యాః పాపయోనయః॥

నేను ఈ సమయంలో నక్క జన్మయందున్నాను. ఈ నక్క జన్మపాపయోనిగా లెక్కింపబడి ఉంది. ఇతరమైన అనేక పాపయోనులు వీటికన్నా ఇంకా నీచశ్రేణిలో ఉన్నాయి.

23. జాత్యైవైకే సుఖితరాః సన్త్యన్యే భృశదుఃఖితాః।
నైకాన్తః సుఖమేవేహ క్వచిత్ పశ్యామి కస్యచిత్ ॥

కొన్ని జంతువులు జాతిచేతనే సుఖంగా ఉన్నాయి. కొన్ని మిక్కిలి దుఃఖంగా ఉన్నాయి అయితే ఎల్లప్పుడు సుఖంగా ఉండేవాటిని చూడడం లేదు.

24. మనుష్యాహ్యాఢ్యతాం ప్రాప్య రాజ్యమిచ్ఛత్యనన్తరమ్।
రాజ్యాత్ దేవత్వమిచ్ఛన్తి దేవత్వాదిన్ద్రతామపి॥

మానవులు డబ్బు సంపాదిస్తారు. డబ్బుంటే రాజ్యం కావాలనుకుంటారు. రాజ్యం వస్తే రాజ్యం ద్వారా దేవత్వం కావాలనుకుంటారు. దేవత్వం వస్తే ఇంద్రపదవి కావాలనుకుంటారు.

25. భవేస్త్వం యద్యపిత్వాఢ్యో న రాజా న చ దైవతమ్।
దేవత్వం ప్రాప్యచేన్ద్రత్వం నైవ తుష్యేస్తథా సతి॥

ఒక వేళ నీవు ధనవంతుడవైతే బ్రాహ్మణుడవైన కారణాన రాజువు కాలేవు. ఒక వేళ నీవు రాజువైతే దేవత్వాన్ని పొందలేవు. ఒక వేళ దేవత్వం పొందితే ఇంద్రపదవిని పొందలేవు. ఒకవేళ ఇంద్రపదవిని పొందినా అంతటితో తృప్తి పడలేవు.

26. న తృప్తి ప్రియలాభోఽస్తి తృష్ణా నాద్భిః ప్రశామ్యతి।
సమ్ప్రజ్వలతి సా భూయః సమిద్భిరివ పావకః ॥

27. అస్త్యేవ త్వయి శోకోఽపి హర్షశ్చాపి తథా త్వయి।
సుఖదుఃఖే తథాచోభే తత్ర కా పరిదేవనా?॥

నీ అంతరంగంలో సంతోషం దుఃఖం రెండూ ఉన్నాయి. వాటివెంట సుఖదుఃఖాలు రెండూ ఉంటాయి. ఇది తెలిసి దుఃఖించడమెందుకు?

28. పరిచ్ఛిద్యైవ కామానాం సర్వేషాం చైవ కర్మణామ్।
మూలం బుద్ధీన్ద్రియగ్రామం శకున్తానివ పఞ్జరే ॥

బుద్ధి, ఇంద్రియాలు అన్ని కోర్కెలకు కర్మలకు మూలాలు వాటిని పంజరాలలో బంధించిన పక్షుల వలె ఎవరు తన ఆధీనంలో ఉంచుకుంటారో వారికి భయమేమీ ఉండదు.

**29.** న ద్వితీయస్య శిరశ్ఛేదనం విద్యతే క్వచిత్ ।
న చ పాణే తృతీయస్య యన్నాస్తి న తతో భయమ్ ॥

మానవునికి రెండవ శిరస్సును, మూడవ చేతిని ఖండించుటలో ఎప్పటికీ భయం ఉండదు. నిజానికి ఏదీ ఉన్నా లేకున్నా దానికారణాన భయం ఉండదు

**30.** న ఖల్వపర సంజ్ఞస్య కామః క్వచన జాయతే ।
సంస్పర్శాత్ దర్శనాద్వాపి శ్రవణాత్ వాపి జాయతే ॥

ఎవడు ఏ విషయంలోని రసాన్ని తెలుసుకోలేడో అట్టివాని మనస్సులో ఎన్నడూ దానికి సంబంధించిన కోరిక ఉండదు. చూడడంవల్ల తగలడంవల్ల, వినడంవల్ల కోరిక కలుగుతూ ఉంటుంది.

**31.** న త్వం స్మరసి వారుణ్యా లట్వాకానాఞ్చ పక్షిణామ్ ।
తాభ్యాఞ్చాభ్యధికో భక్ష్యో న కశ్చిత్ విద్యతే క్వచిత్ ॥

సారాయి, ఊరపిచ్చుక ఈ రెండింటినీ నీవు ఎన్నడూ రుచిచూడలేదు. (తామసులు వీటిని రుచి చూస్తున్నారు) కాని ఎప్పుడైనా ఎక్కడైనా తినేపదార్థాలలో ఈ రెండింటినీ మించింది ఏదీలేదు.

**32.** యాని చా న్యాని భూతేషు భక్ష్యజాతాని కస్యచిత్ ।
యేషామభుక్తపూర్వాణి తేషామస్మృతిరేవ చ ॥

ప్రాణులకు చెందిన ఏ ఇతరేతర భక్ష్యపదార్థాలున్నాయో, అట్టివాటిని నీవు ఇంతకు ముందు తినకుండా ఉంటే ఆ భక్ష్య పదార్థాలకు చెందిన స్మృతి నీకెన్నటికీ ఉండదు.

**33.** అప్రాశనమసంస్పర్శమసందర్శనమేవ చ ।
పురుషస్యైవనియమో మన్యే శ్రేయో న సంశయః ॥

ఏ వస్తువును తినకపోవడం, తగలకపోవడం, చూడకపోవడం, అనే నియమాన్ని ఉంచుకోవడం పురుషునికి శుభప్రదమే. ఈ విషయంలో ఏ మాత్రం అనుమానం లేదని నేను భావిస్తున్నాను.

**34.** ప్రాణిమన్తో బలవన్తో ధనవన్తో న సంశయః ।
మనుష్యా మానుషైరేవ దాసత్వముపపాదితాః ॥

ఎవరికైతే రెండుచేతులుంటాయో అలాంటివారే నిస్సంశయంగా బలవంతులు ధనవంతులు మానవులు మానవులచేతనే దాసులుగా నియమింపబడియున్నారు.

**35.** వధబన్ధపరిక్లేశైః క్లిశ్యన్తే చ పునః పునః ।
తే ఖల్వపి రమన్తే చ మోదన్తే చ హసన్తి చ ॥

ఎంతోమంది మానవులు అనేకసార్లు చంపబడం, బంధించబడడం అనే ఈ దుఃఖాలను అనుభవిస్తున్నారు. (వారు ఆత్మహత్య చేసుకోవడం లేదు) అయినప్పటికీ తర్వాత వారు ఆడుతూ పాడుతూ నవ్వుతూ ఆనందంగా ఉంటున్నారు.

**36.** అపరే బాహుబలినః కృతవిద్యామనస్వినః ।
జుగుప్సితాం చ కృపణాం పాపవృత్తిముపాసతే ॥

ఇతరులు ఎంతోమంది బాహుబలసంపన్నులు, విద్వాంసులు మనస్సంపన్నులు ఉన్నారు అయితే వీరు దీనమైన, నిందితమైన, పాపపూర్ణమైన వృత్తిచే జీవిస్తున్నారు.

**37.** ఉత్సహన్తే చ తే వృత్తిమన్యామప్యుపసేవితమ్ ।
స్వకర్మణా తు నియతం భవితవ్యం తు తత్తథా ॥

వారు వేరొక వృత్తిని స్వీకరించడానికైనా ఉత్సాహం చూపుతారు కాని వారి కర్మానుసారం ఏదైతే నియమితమై ఉందో అదేవిధంగా వారి భవిష్యత్తు కూడా ఉంటుంది.

**38.** న పుల్కసో న చాణ్డాల ఆత్మానం త్యక్తుమిచ్ఛతి ।
తయా తుష్టః స్వయా యోన్యా మాయాం పశ్యస్వ యాదృశీమ్ ॥

మాలవాడు, మాదిగవాడు తమ శరీరాలను వదులుటకు ఇష్టపడడం లేదు వారు తమదైన యోనియందే సంతోషాన్ని పొందుతున్నారు. చూడు ! భగవంతుని మాయ ఎలాంటిదో !

**39.** దృష్ట్వా కుణీన్ పక్షహతాన్ మనుష్యానామయావినః ।
సుసంపూర్ణః స్వయా యోన్యా లబ్ధలాభోఽసి కాశ్యప ॥

కాశ్యప మహర్షీ! మానవులలో కొందరు నడ్డి, కుంటి, మొదలయినవారున్నారు. కొందరు పక్షవాతం కలవారున్నారు. కొంతమంది ఎప్పుడూ రోగాలతో బాధపడేవారున్నారు. వాళ్ళందరినీ చూసి నేనిలా చెబుతున్నాను. నీవు ఈ జన్మలో

ఏ రోగాలు లేక అన్ని అవయవాలను కలిగియున్నావు మానవ శరీరం వల్ల ఏయే లాభాలైతే ఉన్నాయో వాటన్నింటిని పొందియున్నావు.

**40.** యది బ్రాహ్మణ దేహస్తే నిరాతజ్కో నిరామయః ।
అజ్గాని చ సమగ్రాణి న చ లోకేషు ధిక్కృతః ॥

బ్రాహ్మణదేవా! నీ శరీరానికి ఏ భయం లేదు. ఏ రోగాలు లేవు. నీ అవయవాలన్నీ చక్కగా ఉన్నాయి. ఏ అవయవంలో ఏ వికారమూలేదు. కాబట్టి లోకంలో ఎవరిచేత నీవు తిరస్కరింపబడలేదు

**41.** న కేనచిత్ ప్రవాదేన సత్యేనైవాపహారిణా ।
ధర్మాయోత్తిష్ఠ విప్రర్షే! నాత్మానం త్యక్తుమర్హసి ॥

నీకేదయినా ప్రవాదంచే నిజమయిన కలంకం అంటుకున్నప్పటికీ ప్రాణత్యాగ విచారాన్ని గూర్చి ఆలోచించవద్దు. కాబట్టి ఓ బ్రహ్మర్షీ! నీవు ధర్మాన్ని ఆచరించాలి.

**42.** యది బ్రహ్మన్ శృణోష్యేతచ్ఛ్రద్ధదాసి చ మే వచః ।
వేదోక్తస్యైవ ధర్మస్య ఫలం ముఖ్యమవాప్స్యసి ॥

ఓ బ్రాహ్మణా! నీవు నామాట విన్నట్లయితే, నామాటమీద శ్రద్ధ ఉంచినట్లయితే, వేదం చెప్పిన, ధర్మపాలనకు చెందిన ముఖ్యఫలం కలుగుతుంది.

**43.** స్వాధ్యాయమగ్నిసంస్కారమప్రమత్తో ఽనుపాలయ ।
సత్యం దమ ఞ్చ దానం ఞ్చ స్పర్ధిష్ఠా మా చ కేనచిత్ ॥

ఓ కాశ్యప! నీవు సావధానుడవై స్వాధ్యాయం, అగ్నిహోత్రం, సత్యం, ఇంద్రియ నిగ్రహం దానధర్మాలను పాటించవలసింది. ఎవరిపైకూడా పోటీపెట్టుకోవద్దు.

**44.** యే కేచన స్వధ్యయనాః ప్రాప్తా యజన యాజనమ్ ।
కథం తే చానుశోచేయుర్ధ్యాయేయుర్వాప్య శోభనమ్ ॥
ఇచ్ఛన్తస్తే విహారాయ సుఖం మహదవాప్నుయుః ॥

ఏ బ్రాహ్మణులు స్వాధ్యాయం చేస్తున్నారో, యజ్ఞాలు చేస్తూ చేయిస్తున్నారో అలాంటివారు ఎలాంటి ఆలోచన చేయాల్సినపనిలేదు. వాళ్ళు అనుకున్నట్లయితే యజ్ఞయాగాదులు చేస్తూ అటూ ఇటూ తిరుగుతూ గొప్ప సుఖాన్ని పొందగలరు.

**45.** ఉత జాతాః సునక్షత్రే సుతిథౌ సుముహూర్తజాః ।
యజ్ఞదాన ప్రజేహాయాం యతన్తే శక్తిపూర్వకమ్ ॥

ఎవరు ఉత్తమ నక్షత్రం, ఉత్తమ తిథి, ఉత్తమ ముహూర్తంలో జన్మిస్తారో వారు తమ శక్తికి తగినట్లుగ యజ్ఞాలను చేస్తూ, దానాలను చేస్తూ, ధర్మ సంతానాన్ని పొందడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

**46.** నక్షత్రేష్వాసురేష్వన్యే దుస్థితౌ దుర్ముహూర్తజాః ।
సమ్భూతన్యాసురీం యోనిం యజ్ఞప్రసవ వర్జితాః ॥

ఎవరు రాక్షస నక్షత్రంలో, దుష్టతిథిలో అశుభముహూర్తంలో జన్మిస్తారో యజ్ఞాలు చేయలేక, సంతానాన్ని పొందలేకపోతారో వారు రాక్షసయోనిలో జన్మించగలరు.

**47.** అహమాసం పణ్డితకో హైతుకో వేదనిన్దకః ।
ఆన్వీక్షికీం తర్కవిద్యామనురక్తో నిరర్థికామ్ ॥

పూర్వజన్మంలో నేనొక పండితున్ని. అప్పుడు నేను చెడ్డగా వాదిస్తూ వేదనిందచేస్తూ ఉండేవాన్ని. ప్రత్యక్షాన్ని ఆధారంగా అనుమానాన్ని ప్రధానంగా చూపే తర్కవిద్యయందే ఆ సమయంలో నాకు ఎక్కువ అనురాగం ఉండేది.

**48.** హేతువాదాన్ ప్రవదితా వక్తా సంసత్సుహేతుమత్ ।
ఆక్రోష్టా చ విభక్తా చ బ్రహ్మవాక్యేషు చ ద్విజాన్ ॥

నేను సభలకు వెళ్ళి తర్క మరియు యుక్తికి చెందిన మాటలను మాట్లాడుతూ ఉండేవాన్ని. ఎక్కడ బ్రాహ్మణులు శ్రద్ధాపూర్వకంగా వేదవాక్యాలను గూర్చి విచారంచేస్తూ ఉండేవారో అప్పుడు నేను అక్కడికి వెళ్ళి బలపూర్వకంగా ఆక్రమణం చేసి వాటిని ఖండించి స్వయంగా నాతర్కవాదాన్ని వినిపిస్తూ ఉండేవాన్ని.

**49.** నాస్తికః సర్వశఙ్కీ చ మూర్ఖః పణ్డితమానికః ।
తస్యేయం ఫలనివృత్తిః శృగాలత్వం మమ ద్విజ! ॥

అప్పుడు నేను దేవున్ని విశ్వసించేవాన్ని కాను. అందరినీ అనుమానించేవాన్ని. మూర్ఖుడనై ఉండికూడా నన్ను నేను పండితునిగా భావించుకుంటూ ఉండేవాన్ని. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! ఆ చెడ్డపనికి ఫలితమే ఈ నక్క జన్మ.

**50.** అపి జాతు తథా తస్మాదహోరాత్రశతైరపి ।
యదహం మానుషీం యోనిం శృగాలః ప్రాప్నుయాం పునః ॥

ఇప్పుడు నేను వేలకొది రాత్రింబవళ్ళు కృషిచేసినప్పటికీ ఎప్పటికైనా ఆ ఉపాయాలను ప్రయోగించగలనా! లేదు. అప్పుడు నేను ఆ ఉపాయాలను ప్రయోగించినందువల్ల ఈ నక్క జన్మనెత్తినాను. నేను మరల మానవజన్మనెత్తగలనా!

**51.** **సంతుష్టశ్చాప్రమత్తశ్చ యజ్ఞదాన తపోరతిః ।**
**జ్ఞేయజ్ఞాతా భవేయం వై వర్జ్యవర్జయితా తథా ॥**

నేను మానవజన్మనెత్తి తృప్తిపడి యజ్ఞ దాన తపస్సులను చేయగలనా? తెలుసుకోదగిన వస్తువులను తెలుసుకోగలనా? వదలదగిన వస్తువులను వదలగలనా?

**52.** **తతః స మునిరుత్థాయ కాశ్యపస్తమువాచ హ ।**
**అహో! బతాసి కుశలో బుద్ధిమాంశ్చేతి విస్మితః ॥**

ఈ మాటలు విని కాశ్యపముని ఆశ్చర్యచకితుడై లేచి నిలబడి ఆహా! నీవు మిక్కిలి కుశలుడవు. బుద్ధిమంతుడవు అని పలికెను.

**53.** **సమవైక్షత తం విప్రో జ్ఞానదీర్ఘేణ చక్షుషా ।**
**దదర్శ చైనం దేవానాం దేవమిన్ద్రం శచీపతిమ్ ॥**

ఈ విధంగా పలికి బ్రహ్మర్షి అతన్ని జ్ఞానదృష్టితో చూశాడు. అప్పుడతనికి ఆ రూపంలో దేవదేవుడగు శచీపతి కనబడ్డాడు.

**54.** **తతః సంపూజయామాస కాశ్యపో హరివాహనమ్ ।**
**అనుజ్ఞాతస్తు తేనాథ ప్రవివేశ స్వమాలయమ్ ॥**

ఆ తర్వాత కాశ్యపుడు ఇంద్రుని పూజించి ఆయన అనుమతితో తిరిగి తన ఇంటికి వెళ్ళాడు.

***180 వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 181 వ అధ్యాయం

8. మంచి చెడు పనుల వల్ల కలిగే పరిణామాన్ని కర్త తప్పక అనుభవించాలని ప్రతిపాదన చేయడం.

**1. యద్యస్తి దత్తమిష్టం వా తపస్తప్తం తథైవ చ।**
**గురూణాం వాపి శుశ్రూషా తన్మే బ్రూహి పితామహ ॥**

*ధర్మరాజు పలికెను :*

తాతా! జ్ఞానం, యజ్ఞం, తపస్సు మరియు గురు శుశ్రూష, పుణ్యకర్మ వీటివల్ల కలిగే ఫలమేమో నాకు తెలియజేయవలసింది.

*భీష్మ ఉవాచ :-*

**2. ఆత్మనానర్థయుక్తేన పాపే నివిశతే మనః ।**
**స్వకర్మ కలుషం కృత్వా కృచ్ఛ్రే లోకే విధీయతే ॥**

రాజా! కామం, క్రోధం, లోభం, మొదలయిన దోషాలతో కూడిన బుద్ధి ప్రేరణతో మనస్సు పాపపు పనుల మీదికి మరలుతుంది. ఈ విధంగా మానవుడు తన పనులవల్ల పాపాన్నిచేసి దుఃఖమయమైన లోకంలో పడుతున్నాడు.

**3. దుర్భిక్షాదేవ దుర్భిక్షం క్లేశాత్ క్లేశం భయాత్ భయమ్ ।**
**మృతేభ్యః ప్రమృతం యాన్తి దరిద్రాః పాపకర్మిణః ॥**

పాపాన్ని ఆశ్రయించే దరిద్రుడైన మానవుడు దుర్భిక్షంతో దుర్భిక్షాన్ని, కష్టంతో కష్టాన్ని, భయంతో భయాన్ని, పొందుతూ మరణించిన వారికన్నా మిక్కిలి మరణించినవాడగుచున్నాడు.

**4. ఉత్సవాదుత్సవం యాన్తి స్వర్గాత్ స్వర్గం సుఖాత్ సుఖమ్ ।**
**శ్రద్ధధానాశ్చ దాన్తాశ్చ ధనాఢ్యాః శుభకారిణః॥**

ఎవరైతే శ్రద్ధాళువులు, జితేంద్రియులు, ధనసంపన్నులు, శుభకర్మ పరాయణులుగా ఉంటారో వారు ఉత్సవాన్నుండి అధిక ఉత్సవానికి, స్వర్గం నుండి అధిక స్వర్గానికి, అట్లే సుఖం నుండి అధిక సుఖానికి పోతున్నారు.

5. వ్యాలకుఞ్జరదుర్గేషు సర్పచోరభయేషు చ।
హస్తావాపేన గచ్ఛన్తి నాస్తికాః కిమతః పరమ్ ॥

రాజు దోషులకు అరదండాలువేసి రాజ్యంనుండి బయటకు పంపివేస్తున్నాడు. అప్పుడు వారు అడవిలో ప్రవేశిస్తున్నారు. ప్రవేశించుటకు వీలులేని ఆ అడవిలో ప్రవేశించి వారు మదపుటేనుగులు, పాములు, దొంగలు మొదలగువాటివల్ల భయం భయంగా ఉంటారు. దీనికి మించిన దండన వారికి ఏమైనా ఉంటుందా?

6. ప్రియదేవాతిథేయాశ్చ వదాన్యాః ప్రియసాధవః ।
క్షేమ్యమాత్మవతాం మార్గమాస్థితా హస్తదక్షిణమ్ ॥

ఎవరికి దేవపూజ, అతిథిసత్కారం ఇష్టంగా ఉంటుందో, ఎవరు ఉదారులుగా ఉంటారో, శ్రేష్ఠులైనవారు ఎవరికి ఇష్టంగా ఉంటారో అలాంటి పుణ్యాత్ములైన మానవులు మంగళకరమైన కుడిచేతిని కలిగి, మనస్సును అధీనంలో ఉంచుకొని యోగులు పొందుమార్గాన్ని పొందుతున్నారు.

7. పులకా ఇవ ధాన్యేషు పుత్తికా ఇవ పక్షిషు ।
తద్విధాస్తే మనుష్యాణాం యేషాం ధర్మో న కారణమ్ ॥

ధాన్యంలో పొల్లు, గడ్డి, రెక్కలున్న ప్రాణుల్లో దోమలు ఎలా ఉంటాయో అలాగే ధర్మహీనులూ ఉంటారు. ఎవరి ఉద్దేశ్యం ధార్మికంగా ఉండదో అలాంటి మానవులు మానవసమాజం వెలుపల అట్లే కనబడుతూ ఉంటారు.

8. సుశీఘ్రమపి ధావన్తం విధానమనుధావతి ।
శేతే సహ శయానేన యేన యేన యథా కృతమ్ ॥

9. ఉపతిష్ఠతి తిష్ఠన్తం గచ్ఛన్తమనుగచ్ఛతి ।
కరోతి కుర్వతః కర్మ ఛాయేవానువిధీయతే ॥

ఏఏ మానవుడు ఏఏ పనిని చేస్తున్నాడో ఆయా మానవుడు ఆయా పనులలో తగుల్కొంటున్నాడు. కర్తయైన పురుషుడు వేగంగా పరుగెత్తుతూంటే అతనికర్మ కూడా అతివేగంగా పరుగెత్తుతూ ఉంటుంది. ఎప్పుడైతే మానవుడు నిద్రపోతూ ఉంటాడో అప్పుడతని కర్మకూడా అతనితోపాటునిద్రపోతూ ఉంటుంది. ఎప్పుడైతే అతడు నిలబడి ఉంటాడో అప్పుడతని కర్మకూడా అతనితోపాటే నిలబడి ఉంటుంది. ఎప్పుడైతే మానవుడు నడుస్తూవుంటాడో అతని కర్మకూడా అతనితోపాటే నడుస్తూ ఉంటుంది. అంతేగాదు మానవుడు ఏ పని చేస్తున్నప్పటికీ కర్మ సంస్కారం అతన్ని వదలడంలేదు. కర్మఫలం ఎల్లప్పుడూ నీడవలె అతన్ని వెన్నాడుతూ ఉంటుంది.

**10.** **యేన యేన యథా యత్ యత్ పురాకర్మ సమీహితమ్ ।**
**తదేకతరో భుఙ్క్తే నిత్యం విహితమాత్మనా ॥**

ఏఏ మానవుడు తన తన పూర్వ జన్మంలో ఏఏ కర్మలను చేసియుంటాడో ఆయా మానవుడు తానుచేసిన ఆయా కర్మఫలాలను ఎప్పుడూ ఒంటరిగా అనుభవిస్తూ ఉంటాడు.

**11.** **స్వకర్మఫలనిరపేక్షం విధానపరిరక్షితమ్ ।**
**భూతగ్రామమిమం కాలః సమన్తాత్ పరిరక్షతి ॥**

తమ కర్మఫలం నిక్షేపంతో సమానమైనట్టిది. అది కర్మవల్ల పుట్టిన అదృష్టం ద్వారా సురక్షితంగా ఉంటుంది. తగినసమయం వచ్చినప్పుడు కాలమే కర్మఫలాన్ని ప్రాణి సమూహం వద్దకు ఈడ్చుకొని వస్తూఉంటుంది.

**12.** **అచోద్యమానాని యథా పుష్పాణి చ ఫలాని చ ॥**
**స్వం కాలం నాతివర్తన్తే తథా కర్మ పురాకృతమ్ ॥**

ఏ ప్రకారంగా పూలు పండ్లు ఎలాంటి ప్రేరణ లేకుండా సమయం వచ్చినప్పుడు చెట్ల మీదకనబడుతూ ఉంటాయో అదే ప్రకారంగా పూర్వ జన్మలో చేసిన కర్మకూడా తన ఫలాన్ని అనుభవించాల్సివచ్చినపుడు సమయం దాటకుండా వచ్చి అనుభవిస్తూ ఉంటుంది.

**13.** **సమ్మానశ్చావమానశ్చ లాభాలాభౌ క్షయోదయౌ ।**
**ప్రవృత్తా వినివర్తన్తే విధానాన్తే పునః పునః ॥**

సన్మానం - అవమానం, లాభం - హాని, ఉన్నతి - అవనతి ఇవి పూర్వజన్మలోచేసిన కర్మలననుసరించి ఎన్నోసార్లు వస్తూఉంటాయి. ప్రారబ్ధాన్ని అనుభవించిన తర్వాత తిరిగిపోతూ ఉంటాయి.

**14.** **ఆత్మనా విహితం దుఃఖమాత్మనా విహితం సుఖమ్ ।**
**గర్భశయ్యాముపాదాయ భుజ్యతే పౌర్వదేహికమ్ ॥**

దుఃఖమనేది ముందు తాను చేసుకొన్న కర్మఫలమే. సుఖంకూడా తానుముందు చేసుకొన్న కర్మల పరిణామమే. జీవుడు తల్లి గర్భశయ్యను చేరుకొన్నప్పటినుంచీ పూర్వజన్మ శరీరం ద్వారా సంపాదించుకొన్న సుఖదుఃఖాలను అనుభవించాల్సి ఉంటుంది.

**15.** **బాలో యువా చ వృద్ధశ్చ యత్కరోతి శుభాశుభమ్ ।**
**తస్యాం తస్యామవస్థయాం తత్ ఫలం ప్రతిపద్యతే ॥**

పిల్లవాడైనా, పెద్దవాడైనా, ముసలివాడైనా, ఎవడైనాసరే అతడు ముందు జన్మలో ఏఏ శుభాశుభకర్మలను చేసి ఉంటాడో అవి ఈ జన్మలో ఆయా అవస్థలయందు ఆయా కర్మఫలం అతనికి తప్పక లభిస్తూ ఉంటుంది.

**16. యథా ధేనుసహస్రేషు వత్సో విన్దతి మాతరమ్ ।**
**తథాపూర్వకృతం కర్మ కర్తారమనుగచ్ఛతి ॥**

ఏ ప్రకారం దూడ వేలకొలది ఆవులందు తనతల్లిని గుర్తుపట్టి దాన్ని చేరుకుంటూ ఉంటుందో అదే ప్రకారంగా ముందు జన్మలోచేసుకున్న కర్మకూడా తనయజమానిని చేరుకుంటూ ఉంటుంది.

**17. సమున్నమగ్రతో వస్త్రం పశ్చాచ్ఛుధ్యతి కర్మణా ।**
**ఉపవాసైః ప్రతప్తానాం దీర్ఘం సుఖమనన్తకమ్ ॥**

ఏ ప్రకారంగానైతే క్షారం మొదలగువానితో కూడిన వస్త్రం తిరిగి ఉతకగా ఎలా శుభ్రమవుతూ ఉందో అదే ప్రకారంగా ఎవడు ఉపవాసపూర్వకంగా తపస్సును చేస్తూ ఉంటాడో వానికి ఎన్నడూ తరగని గొప్ప సుఖం లభిస్తూ ఉంటుంది.

**18. దీర్ఘకాలేన తపసా సేవితేన తపోవనే ।**
**ధర్మనిర్ధూత పాపానాం సమ్పద్యన్తే మనోరథాః ॥**

తపోవనంలో ఉండి చాలాకాలం వరకు చేసిన తపస్సువల్ల ధర్మం వల్ల ఎవరి పాపం పూర్తిగా కడిగివేయబడుతున్నదో అట్టివాని కోర్కెలన్నీ నెరువేరుతూ ఉంటాయి

**19. శకునానామివాకాశే మత్స్యానామివచోదకే ।**
**పదం యథా న దృశ్యేతే తదాజ్ఞానవిదాం గతిః ॥**

ఏ విధంగా ఆకాశంలో పక్షుల కాలిగుర్తులు, నీటిలో చేపల కాలిగుర్తులు కనబడకుండా ఉన్నాయో అదే విధంగా జ్ఞానుల గతి, జాడలు కూడా తెలియకుండా ఉంటాయి.

**20. అలమన్యైరుపాలమ్భైః కీర్తితైశ్చ వ్యతిక్రమైః ।**
**పేశలం చానురూపం చ కర్తవ్యం హితమాత్మనః ॥**

ఇతరులను నిందించడం, అలాగే ఇతరుల అనేకానేక తప్పులనుగూర్చి చర్చించడం వల్ల ప్రయోజనం లేదు ఏ పని సుందరమో, అనుకూలమో తనకు మేలు చేకూర్చుతుందో అట్టి కర్మే చేయదగినట్టిది

***181 వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 182 వ అధ్యాయం

9. భరద్వాజ భృగు సంవాదంలో జగదుత్పత్తికి చెందిన విభిన్నతత్వాలను గూర్చి వర్ణించడం.

*యుధిష్ఠిర ఉవాచ:-*

**1.** కుతః సృష్టమిదం విశ్వం జగత్ స్థావరజఙ్గమమ్,
ప్రలయే చ కమభ్యేతి తన్మే బ్రూహి పితామహ! ॥

*ధర్మరాజు పలికెను:-*

పితామహా ! కదలే మరియు కదలని ఈ జగత్తు యొక్క పుట్టుక ఎవరివల్ల జరిగింది? ప్రళయకాలంలో ఇది ఎవరియందు లీనమవుతుంది? ఈ అంశాన్నిగూర్చి నాకు తెలియజేయవలసింది.

**2.** స సాగరః సగగనః స శైలః స బలాహకః ।
సభూమిః సాగ్నిపవనో లోకోఽయం కేన నిర్మితః ॥

సముద్రం, ఆకాశం, పర్వతాలు, మేఘాలు, భూమి, అగ్ని, వాయువులతో కూడిన ఈ జగత్తు ఎవరిచే నిర్మింపబడింది?

**3.** కథం సృష్టాని భూతాని కథం వర్ణవిభక్తయః ।
శౌచాశౌచం కథం తేషాం ధర్మాధర్మవిధిః కథమ్ ॥

జీవరాశుల సృష్టి ఏ విధంగా జరిగింది? బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర విభాగం ఎలా ఏర్పడింది? అందులో శౌచాశౌచ వ్యవస్థ ఎట్లు ఏర్పడింది? అలాగే ధర్మాధర్మాల విధానం ఏ విధంగా ఏర్పడింది?

**4.** కీదృశో జీవతాం జీవః క్వ వా గచ్ఛన్తి యే మృతాః ।
అస్మాల్లోకాదముం లోకం సర్వం శంసతు నో భవాన్ ॥

జీవించియున్న ప్రాణులలోని జీవాత్మ ఎలాంటిది? చచ్చిపోయిన వారు ఎక్కడికి పోతున్నారు? ఈలోకం నుండి ఆలోకానికి వెళ్ళడానికి గల క్రమం ఏది? ఈ విషయాలనన్నింటిని మీరు నాకు తెలియజేయవలసింది.

*భీష్మ ఉవాచ:-*

**5.** అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
భృగుణాభిహితం శాస్త్రం భరద్వాజాయ పృచ్ఛతే ॥

*భీష్ముడు పలికెను:-*

విజ్ఞులైన పురుషులు ఈ విషయంలో ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరణంగా ఇస్తున్నారు. ఆ ఇతిహాసంలో భరద్వాజుడు ప్రశ్నించిన విధం భృగువు చెప్పిన సమాధానం వివరింపబడింది.

**6.** కైలాస శిఖరే దృష్ట్వా దీప్యమానం మహౌజసమ్ ।
భృగుం మహర్షిమాసీనం భరద్వాజోఽన్వపృచ్ఛత ॥

కైలాస పర్వతంపై తన తేజస్సుతో ప్రకాశించుచుండే మహాతేజస్సంపన్నుడైన మహర్షి భృగువు కూర్చొనియుండగా భరద్వాజుడు ఆయన్ని సమీపించి ఇలా అడిగినాడు.

**7.** స సాగరః సగగనః సశైలః సబలాహకః ।
స భూమిః సాగ్నిపవనో లోకోఽయం కేన నిర్మితః ॥

సముద్రం, ఆకాశం, పర్వతాలు, మేఘాలు, భూమి, అగ్ని మరియు వాయువుతోకూడిన ఈ జగత్తు ఎవరిచే నిర్మింపబడింది?

**8.** కథం సృష్టాని భూతాని కథం వర్ణవిభక్తయః ।
శౌచాశౌచం కథం తేషాం ధర్మాధర్మ విధిః కథమ్ ॥

ప్రాణుల సృష్టి ఎలా జరిగింది? వర్ణ విభాగం ఎలా ఏర్పడింది? అందులో శౌచాశౌచ వ్యవస్థ ఎలా ఏర్పడింది? ధర్మాధర్మ విధానం ఎలా చేయబడింది?

**9.** కీ దృశో జీవతాం జీవః క్వ వా గచ్ఛన్తి యే మృతాః ।
పరలోకమిమం చాపి సర్వం శజ్శితుమర్హతి ॥

జీవించుచున్న ప్రాణుల జీవాత్మ ఎట్టిది? మరణించిన వారు ఎక్కడికి పోతున్నారు. ఈ లోకం పరలోకం ఎలా ఏర్పడినాయి. వీటన్నింటినీ గూర్చి నాకు తెలుపవలసిందిగా కోరుతున్నాను.

**10.** ఏవం స భగవాన్ పృష్టో భరద్వాజేన సంశయమ్ ।
బ్రహ్మర్షిర్బ్రహ్మ సంకాశః సర్వం తస్మై తతోఽబ్రవీత్ ॥

భరద్వాజముని ఈప్రకారంగా తన సంశయాన్ని అడుగగా బ్రహ్మతేజస్సువంటి తేజస్సులతో కూడిన ఆ బ్రహ్మర్షి అతనికి అంతా ఇలా చెప్పాడు.

భృగురువాచః :-

(నారాయణో జగన్మూర్తిరన్తరాత్మా సనాతనః ।
కూటస్థోక్షర అవ్యక్తో నిర్లేపః వ్యాపకః ప్రభుః ॥

ప్రకృతేః పరతో నిత్యమిన్ద్రియైరప్యగోచరః ।
ససిసృక్షుః సహస్రాంశాద సృజత్ పురుషం ప్రభుః ॥

11. మానసో నామ విభయాతః శ్రుతపూర్వ్వ మహర్షిభిః ।
అనాది నిధనో దేవస్తథా భేద్యోఽజరామరః ॥

ఓ బ్రాహ్మణుడా ! భగవంతుడైన నారాయణుడు సంపూర్ణ జగత్స్వరూపుడు. ఆయనే ప్రాణుల అంతరాత్మ మరియు సనాతన పురుషుడు, ఆయనే కూటస్థుడు, అవినాశి, అవ్యక్తుడు, నిర్లేపుడు, అంతటా వ్యాపించినట్టివాడు, ప్రభువు, ప్రకృతికంటె భిన్నమైనవాడు మరియు ఇంద్రియాతీతుడు. ఆ భగవంతుడగు నారాయణుని హృదయంలో సృష్టివిషయకమైన కోరిక ఎప్పుడు కల్గిందో అప్పుడు తన సహస్రాంశతో ఒక పురుషుని పుట్టించినాడు. మహర్షులాపురుషుని మానస పురుషుడని చెప్పినారు. మొదటి పుట్టిన ఆ మానసపురుషుడు ఆద్యంతాలు లేనివాడు. ఇతరులతో భేదింపబడనివాడు, చావు ముసలితనం లేనివాడు.

12. అవ్యక్త ఇతి విఖ్యాతః శాశ్వతోఽయథాక్షయోఽవ్యయః ।
యతః సృష్టాని భూతాని జాయన్తే చ మ్రియన్తి చ ॥

ఆ నారాయణుడే అవ్యక్తమనే పేరుతో ప్రసిద్ధినొందినాడు. అతడే శాశ్వతుడు, అక్షయుడు, అవినాశుడు. అతనివల్ల పుట్టిన ప్రాణులు చావుపుట్టుకలు కల్గినట్టివి.

13. సోఽసృజత్ ప్రథమం దేవో మహాన్తం నామ నామతః ।
మహాన్ ససర్జాహంకారం స చాపి భగవానథ ॥

స్వయంగా పుట్టిన ఆ దేవుడు మహాతత్త్వాన్ని సృష్టించినాడు. ఆ భగవంతుడు మరల గొప్పనైన అహంకారాన్ని సృష్టించినాడు. (సమష్టి అహంకారం)

14. ఆకాశమితి విఖ్యాతం సర్వభూతధరః ప్రభుః ।
ఆకాశాదభవత్ వారి సలిలాదగ్ని మారుతౌ ॥
అగ్నిమారుత సంయోగాత్ తతః సమభనన్మహీ॥

సమస్త భూతాలను ధరించే భగవంతుడు శబ్దతన్మాత్ర స్వరూపుడైన ఆకాశాన్ని సృష్టించినాడు. ఆ తర్వాత ఆకాశం నుండి నీటిని, నీటినుండి అగ్నిని, అగ్ని నుండి

వాయువును సృష్టించినాడు. ఆ తర్వాత అగ్నివాయువుల సంయోగం వల్ల ఈ భూమి పుట్టింది.

**15. తతస్తేజోమయం దివ్యం పద్మం సృష్టం స్వయంభువా ।**
**తస్మాత్ పద్మాత్ సమభవత్ బ్రహ్మవేదమయో హరిః ॥**

ఆ తర్వాత స్వయంభూ మానసపురుషుడు మొదట ఒక తేజోమయమైన దివ్యకమలాన్ని పుట్టించినాడు. ఆ కమలం నుండి వేదమయ నిధిరూపమైన బ్రహ్మపుట్టినాడు.

**16. అహంకార ఇతి ఖ్యాతః సర్వభూతాత్మ భూతకృత్ ।**
**బ్రహ్మ వై స మహాతేజా య ఏతే పఞ్చ ధాతవః ॥**

ఆ బ్రహ్మ అహంకారమనే పేరుతో విఖ్యాతినొందినాడు. సకల ప్రాణుల ఆత్మ అయనే. ప్రాణుల సృష్టికర్తకూడా ఆయనే. ఏ పంచభూతాలైతే ఉన్నాయో వాటి రూపాల్లో మహాతేజస్వియైన బ్రహ్మయే కనబడుతున్నాడు.

**17. శైలాస్తస్యాసిసంజ్ఞాస్తు మేదో మాంసం చ మేదినీ ।**
**సముద్రాస్తస్య రుధిరమాకాశముదరం తథా ॥**

పర్వతాలు అతని ఎముకలు. భూమి అతని క్రొవ్వు - మాంసం. సముద్రం అతని రక్తం, ఆకాశం అతనిపొట్ట.

**18. పవనశ్చైవ నిశ్వాసస్తేజోగ్నిర్నిమ్నగాః శిరాః ।**
**అగ్నీషోమౌ తు చన్ద్రార్కౌ నయనే తస్య విశ్రుతే ॥**

వాయువు అతని నిశ్వాసం. అగ్ని అతని తేజస్సు. అగ్నీసోమాలని చెప్పబడుతున్న సూర్యచంద్రులు ఆయన రెండు కన్నులుగా ప్రసిద్ధి నొందినారు.

**19. నభశ్చోర్ధ్వం శిరస్తస్య క్షితిః పాదౌ భుజౌ దిశః ।**
**దుర్విజ్ఞేయో హ్యచిన్త్యాత్మా సిద్ధైరపి న సంశయః ॥**

పైనున్న ఆకాశం అతని శిరస్సు. భూమి అతని కాళ్ళు. దిక్కులు అతని భుజాలు. ఆలోచించటానికి వీలుకాని రూపంగల బ్రహ్మ సిద్ధపురుషులకు కూడా తెలియదగినవాడుకాదు. ఇందేమాత్రం అనుమానం లేదు.

**20. య ఏష భగవాన్ విష్ణురనన్త ఇతి విశ్రుతః ।**
**సర్వ భూతాత్మ భూతస్థో దుర్విజ్ఞేయోఽకృతాత్మభిః ॥**

అనేక పేర్లతో పిలువబడే ఆ స్వయంభూ బ్రహ్మయే భగవంతుడైన విష్ణువైయున్నాడు. అతడే మొత్తం ప్రాణుల అంతఃకరణాలలో అంతర్యామియైన ఆత్మరూపంలో ఉన్నాడు. ఎవరి హృదయం పరిశుద్ధంగా ఉండదో అలాంటివారు ఈ స్వరూపాన్ని తెలుసుకోలేరు.

**21.** అహంకారస్య యః స్రష్టా సర్వభూతభవాయ వై ।
యతః సమభవత్ విశ్వం పృష్టోఽహం యదిహ త్వయా॥

ఆయనే సమస్త భూతాలను సృష్టించడంకోసం, ప్రాకృత అహంకారాన్ని సృష్టించినాడు. విశ్వాన్ని ఎవరు సృష్టించినారు? అని నీవే ప్రశ్న నడిగినావో దానికి సమాధానం నీకు చెప్పినాను.

**భరద్వాజ ఉవాచ:-**

**22.** గగనస్య దిశాంచైవ భూతలస్యానిలస్య వా।
కాన్యత్ర పరిమాణాని సంశయం ఛిన్ధి తత్త్వతః ॥

**భరద్వాజుడు పలికెను:-**

ఆర్యా! ఆకాశం, దిక్కులు, భూమి, వాయువు, ఇవి ఎంతెంతవైశాల్యాన్ని కల్గియున్నాయి. ఈ అంశాన్ని నాకు చక్కగా చెప్పి నా సంశయాన్ని తొలగించవలసిందిగా కోరుతున్నాను.

**భృగురువాచ:-**

**23.** అనన్తమేతదాకాశం సిద్ధదైవతశోభితమ్ ।
రమ్యం నానాశ్రయాకీర్ణం యస్యాన్తో నాధిగమ్యతే ॥

మహర్షీ! ఈ ఆకాశం అనంతమైంది ఇందు అనేకానేక సిద్ధులు, దేవతలు నివసిస్తూ ఉన్నారు. ఇందులోవారికి భిన్నభిన్నలోకాలు ఉంటాయి. ఈ ఆకాశం ఎంతో అందమైంది. ఇది ఎంత విశాలమైందంటే దీని అంతు ఎవరికీ తెలియదు.

**24.** ఊర్ధ్వం గతేరధస్తాత్తు చన్ద్రాదిత్యౌ న
తత్ర దేవాః స్వయం దీప్తాః భాస్కరాభాగ్ని వర్చసః ॥

క్రిందనుండి పైకి వెళ్ళినట్లయితే ఎక్కడైతే సూర్య చంద్రులు కనబడరో అక్కడ సూర్యాగ్నులతో సమానంగా దేవతలు స్వయంగా తమ కాంతితోనే ప్రకాశిస్తూ ఉంటారు.

**25.** తే చాప్యన్తం న పశ్యన్తి నభసః ప్రతితౌజసః ।
దుర్గమత్వాదనన్తత్వాదితి మే విద్ధి మానద! ॥

గొప్పనైనవాడా! తేజస్సంపన్నులైన నక్షత్రరూపదేవతలు కూడా ఈ ఆకాశపు తుదను చూడలేకున్నారు. ఎందుకంటే ఈ ఆకాశం దాటడానికి సాధ్యం కానట్టిది. అంతులేనిది. ఈ మాట నీవు నాముఖతః విని చక్కగా తెలుసుకోదగినదనంటిది.

**26.** ఉపరిష్టోపరిష్టాత్తు ప్రజ్వలద్భిః స్వయంప్రభైః ।
నిరుద్ధమేతదాకాశమప్రమేయం సురైరపి ॥

ఆకాశంలో పైపైన ప్రకాశించు స్వయం ప్రకాశకులైన దేవతలు కూడా తెలుసుకోవడానికి వీలులేనట్టిదీ ఆకాశం.

**27.** పృథ్వివ్యన్తే సముద్రాస్తు సముద్రాన్తే తమః స్మృతమ్ ।
తమసోన్తే జలం ప్రాహుర్జలస్యాన్తేఽగ్నిరేవ చ ॥

భూమికి చివర సముద్రాలున్నాయి. సముద్రాలకు చివర దట్టమైన చీకటి ఉంది. ఆ చీకటి తర్వాత నీళ్ళున్నాయి. ఆనీటికి అవతల అగ్ని ఉంది.

**28.** రసాతలాన్తే సలిలం జలాన్తే పన్నగాధిపాః ।
తదన్తే పునరాకాశమాకాశాన్తే పునర్జలమ్ ॥

పాతాళలోకానికి చివరనీళ్ళున్నాయి. నీళ్ళకు చివర నాగరాజు మొదలయిన సర్పరాజులున్నారు. వారి తర్వాత ఆకాశం ఉంది ఆకాశానికి చివర నీళ్ళున్నాయి.

**29.** ఏవమన్తం భగవతః ప్రమాణం సలిలస్య చ ।
అగ్ని మారుతతోయేభ్యః దుర్జ్ఞేయం దైవతైరపి ॥

ఈ విధంగా ఆకాశం, జలం, అగ్ని, వాయువు మొదలగువాటి అంతును వైశాల్యాన్ని తెలుసుకోవడం దేవతలకు కూడా మిక్కిలి కష్టం.

**30.** అగ్ని మారుత తోయానాం వర్ణాః క్షితితలస్య చ ।
అకాశాదవగృహ్యన్తే భిద్యన్తేఽతత్త్వ దర్శనాత్ ॥

అగ్ని, వాయువు, నీరు, భూమి, వీటి యొక్క రంగు, రూపం, ఆకాశం నుండే గ్రహింపబడ్డాయి. అందువల్ల పైన పేర్కొన్నవి ఆకాశానికంటె భిన్నమైనవి కావు. వాస్తవికజ్ఞానం లేనందువల్ల వాటియందలి భేదజ్ఞానం తెలియడం లేదు.

31. పఠన్తి చైవ మునయో శాస్త్రేషు వివిధేషు చ ।
త్రైలోక్యే సాగరే చైవ ప్రమాణం విహితం యథా ॥

32. అదృశ్యాయ త్వగమ్యాయ కః ప్రమాణముదాహరేత్ ।
సిద్ధానాం దేవతానాఞ్చ యదా పరిమితా గతిః ॥

ఋషులు వివిధ శాస్త్రాలలో ముల్లోకాలను, సముద్రాలను గూర్చి కొన్ని నిశ్చిత ప్రమాణాలను తెలిపియున్నారు. కాని దృష్టికన్నా పరంగా ఉండే ఇంద్రియాలకు కన్పించనట్టి పరమాత్మ వైశాల్యాన్ని ఎవరు చెప్పగలరు? చివరకు సిద్ధులు మరియు దేవతల జ్ఞానం కూడా పరిమితమైనట్టిదే గదా!

33. తదా గౌణమనన్తస్య నామానన్తేతి విశ్రుతమ్ ।
నామధేయానురూపస్య మానసస్య మహాత్మనః ॥

అందువల్ల పరమాత్మ మానసదేవుడు తనపేరుకు తగినట్లే అనంతుడై ఉన్నాడు. అతనికి సుప్రసిద్ధ అనంతుడు అనే పేరుంది. ఆ పేరు అతని గుణాలకు తగినట్లే ఉంది.

34. యదా తు దివ్యం తద్రూపం హ్రసతే వర్ధతే పునః ।
కోఽన్యస్తద్వేదితుం శక్తో యోఽపి స్యాత్ తద్విధోఽపరః ॥

ఎప్పుడైతే పరమాత్మ యొక్క దివ్యమైన రూపం అతని మాయ వల్ల ఒకప్పుడు చిన్నదిగా మరొకప్పుడు పెద్దగా వృద్ధిచెందుతూ ఉంటుందో అప్పుడు అతనికంటె భిన్నుడు, సమానమైనవాడు, ప్రతిభాశాలి ఎవడు ఉంటాడు? ఎవడు అతనియొక్క యథార్థపరిణామాన్ని తెలుసుకోగలుగుతున్నాడు?

35. తతః పుష్కరతః సృష్టః సర్వజ్ఞో మూర్తిమాన్ ప్రభుః ।
బ్రహ్మా ధర్మమయః పూర్వః ప్రజాపతిరనుత్తమః ॥

తర్వాత ముందుచెప్పబడిన కమలం నుండి పుట్టినవాడు, సర్వజ్ఞుడు, మూర్తిమంతుడు, ప్రభావశాలి, పరమోత్తముడు, మొదటి ప్రజాపతి మరియు ధర్మమయుడైన బ్రహ్మయొక్కపుట్టుక జరిగింది.

36. పుష్కరాత్ యదా సమ్భూతో జ్యేష్ఠం భవతి పుష్కరమ్ ।
బ్రహ్మాణం పూర్వజంచాహ భవాన్ సన్దేహ ఏవ మే ॥

ప్రభూ ! బ్రహ్మ కమలంనుండి పుట్టినట్లయితే కమలమే ముందు పుట్టినట్లు తెలుస్తున్నది. కాని మీరేమో బ్రహ్మ ముందు పుట్టినాడని చెబుతున్నారు. అందువల్ల నా మనస్సులోనున్న ఈ సందేహాన్ని తొలగింపవలసింది

*భృగురువాచ:-*

**37.** మానసస్యేహ **యా** మూర్తిర్బ్రహ్మత్వం సముపాగతా ।
తస్యాసన **విధానార్థం** పృథివీ పద్మముచ్యతే ॥

*భృగువు పలికెను:-*

మహర్షీ ! మానసదేవుని ఏ స్వరూపమైతే తెలిపినానో అది బ్రహ్మరూపంనందే ఉంది. ఆ బ్రహ్మ **ఆ**సనంకోసం ఈ భూమే పద్మంగా చెప్పబడింది.

**38.** కర్ణికా **తస్య పద్మస్య** మేరుర్గగనముచ్ఛ్రితః ।
తస్య మధ్యే **స్థితో** లోకాన్ సృజతే జగతః ప్రభుః ॥

ఏ మేరుపర్వ**తమైతే** ఆకాశంలో ఎక్కువ ఎత్తులో ఉందో అది కమలం చెవి ఆభరణం. ఆ పర్వ**త**పు మధ్యభాగంలో నున్న జగదీశ్వరుడగు బ్రహ్మ సకల లోకాలను సృష్టిస్తున్నాడు.

***182 వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 183 వ అధ్యాయం

10. ఆకాశం నుండి ఇతర నాలుగు స్థూలభూతాల పుట్టుకను గూర్చి వర్ణించడం

*భరద్వాజ ఉవాచ:-*

**1.** ప్రజావిసర్గం వివిధం కథం స సృజతే ప్రభుః ।
మేరు మధ్యే స్థితో బ్రహ్మ తద్ బ్రూహి ద్విజసత్తమ ॥

*భరద్వాజుడు పలికెను:-*

బ్రాహ్మణశ్రేష్ఠా! మేరు పర్వతపు మధ్యభాగంలో ఉండి బ్రహ్మదేవుడు నానారకమైన ప్రజాసృష్టిని ఎలా చేస్తున్నాడు? ఈ అంశాన్ని గూర్చినాకు తెలియజేయవలసింది.

భృగురువాచ:-

**2.** ప్రజావిసర్గం వివిధం మానసో మనసాసృజత్ ।
సంరక్షణార్థం భూతానాం సృష్టం ప్రథమతో జలమ్ ॥

*భృగుమహర్షి పలికెను:-*

ఆ మానసదేవుడు తన మానస సంకల్పంతోనే నానారకమైన ప్రజాసృష్టి చేస్తున్నాడు. అతడు ప్రాణులను రక్షించడానికై అన్నింటికంటె మొదట నీటిని సృష్టించాడు.

**3.** యద్ ప్రాణః సర్వభూతానాం వర్ధన్తే యేన చ ప్రజాః ।
పరిత్యక్తాశ్చ నశ్యన్తి తేనేదం సర్వమావృతమ్ ॥

ఆ నీరు సమస్త ప్రాణులకు జీవనాధారం. దానివల్లనే ప్రజల వృద్ధి జరుగుతూ ఉంది. నీరే దొరక్కపోతే ప్రాణులు నశిస్తాయి. నీటితోనే ఈ సంపూర్ణజగత్తు వ్యాప్తమైంది.

**4.** పృథివీ పర్వతా మేఘాః మూర్తిమన్తశ్చ యే పరే ।
సర్వం తద్ వారుణం జ్ఞేయమాపస్తస్తమ్భిరే యతః ॥

భూమి, పర్వతాలు, మేఘం, మరియు మూర్తిమంతాలైన ఏ వస్తువులున్నాయో అవి అగ్నిమయాలు జలమయాలు అని తెలుసుకోవాలి. ఎందుకంటే నీరే వీటన్నింటిని స్థిరంగా ఉండేటట్లు చేస్తున్నది.

*భరద్వాజ ఉవాచ:-*

**5.** కథం సలిలముత్పన్నం కథఞ్చైవాగ్నిమారుతౌ।
కథం వా మేదినీ సృష్టేత్యత్ర మే సంశయో మహాన్ ॥

*భరద్వాజుడు పలికెను!*

స్వామీ నీరెట్లు పుట్టింది? అగ్ని వాయువుల సృష్టి ఏ విధంగా జరిగింది? భూమి ఎలా పుట్టింది? ఈ విషయాలపై నాకు గొప్ప సందేహముంది. ఈ సందేహాన్ని నీవు తొలగించవలసింది.

*భృగురువాచ:-*

**6.** బ్రహ్మకల్పే పురా బ్రహ్మన్ బ్రహ్మర్షీణాం సమాగమే ।
లోకసమ్భవసన్దేహం సముత్పన్నో మహాత్మనామ్ ॥

ఓ బ్రాహ్మణా ! పూర్వకాలంలో అనగా బ్రహ్మకల్పం సాగేటప్పుడు బ్రహ్మర్షుల కలయిక (సమావేశం) జరిగింది. ఆ మహాత్ముల సభలో లోక సృష్టి విషయక సందేహం తల ఎత్తింది.

**7.** తేఽతిష్ఠన్ ధ్యానమాలమ్బ్య మౌనమాస్థాయ నిశ్చలాః ।
త్యక్తాహారాః పవనపాః దివ్యం వర్షశతం ద్విజాః ॥

ఆ బ్రహ్మర్షులు ఆహారాన్ని వదలి గాలిని త్రాగుతూ, వంద దివ్య సంవత్సరాల వరకు ధ్యానమగ్నులై మౌనంగా ఉండి నిశ్చలభావంతో కూర్చొనియుండినారు.

**8.** తేషాం బ్రహ్మమయీ వాణీ సర్వేషాం శ్రోత్రమాగమత్ ।
దివ్యా సరస్వతీ తత్ర సమ్బభూవ నభస్తలాత్ ॥

ఆ ధ్యానావస్థయందు వారందరి చెవుల్లో బ్రహ్మమయమైన వాణి విన్పించింది. ఆ సమయంలో అక్కడ ఆకాశంలో దివ్య సరస్వతి ప్రత్యక్షమైంది.

**9.** పురా స్తిమితమాకాశమనన్తమచలోపమమ్ ।
నష్ట చన్ద్రార్క పవనం ప్రసుప్తమివ సమ్బభౌ ॥

ఆకాశవాణి వారితో ఇలా పల్కింది. పూర్వకాలంలో ఈ ఆకాశం అనంతంగా పర్వతంతో సమానంగా ఉండి కదలకుండా ఉండేది. అందు చంద్రుడు, సూర్యుడు, వాయువు ఇవేవీ ఉండేవికావు. అప్పుడది నిద్రించునట్లుగా ఉండేది.

**10.** తతస్సలిలముత్పన్నం తమసీవాపరం తమః ।
తస్మాత్సలిలోత్పీడాదుదతిష్ఠత మారుతః ॥

ఆ తర్వాత ఆకాశంనుంచి నీరు పుట్టింది. అంటే చీకటి నుంచి మరో చీకటి పుట్టిందని తెలుసుకోవాలి. ఆజల ప్రవాహం నుండి వాయువు పుట్టింది.

**11.** యథా భాజనమచ్ఛిద్రం నిశ్శబ్దమివ లక్ష్యతే ।
తచ్చామ్భసా పూర్యమాణం సశబ్దం కురుతేఽనిలః ॥

రంధ్రాలు లేని పాత్ర నిశ్శబ్దంగా ఉంటుంది. ఆ పాత్రకు రంధ్రం వేసి నీటిని నింపితే వాయువు దానియందు ప్రవేశించి శబ్దం చేస్తూ ఉంటుంది.

**12.** తథా సలిల సంవృద్ధే నభసోఽన్తే నిరన్తరే ।
భిత్త్వార్ణవతలం వాయుః సముత్పతతి ఘోషవాన్ ॥

ఈ విధంగా నీటినుండి ఆకాశమంతా అవరుద్ధమైంది. ఇందుకొంచెమయినా అవకాశం లేకుండేది. అప్పుడా ఒకే సముద్రపు తలాన్ని భేదించి గొప్ప శబ్దంతో పాటు వాయువు పుట్టింది.

**13.** స ఏష చరతే వాయురర్ణవోత్పీడ సమ్భవః ।
ఆకాశస్థానమాసాద్య ప్రశాన్తిం నాధిగచ్ఛతి ॥

ఈ ప్రకారం సముద్రం నీటి సముదాయంతో వెలువడిన ఈ వాయువు అంతటా తిరుగడం మొదలుపెట్టింది. ఆకాశంలోని ఏ స్థానానికి వెళ్ళినా ఆ వాయువు శాంతిని పొందలేక పోయింది.

**14.** తస్మిన్ వాయ్వమ్బుసంఘర్షే దీప్తతేజా మహాబలః ।
ప్రాదురభూదూర్ధ్వశిఖః కృత్వా నిస్తిమిరం నభః ॥

గాలి నీటిసంఘర్షణచే అత్యంత తేజోమయం మహాబలశాలి అయిన అగ్ని పుట్టింది ఆ అగ్ని ఊర్ధ్వజాలలు పైకి ఎగుస్తూండినాయి. ఆ అగ్ని ఆకాశంలో ఉండే చీకటినంతా తొలగించి వేసింది.

15. అగ్నిః పవనసంయుక్తో ఖం సమాక్షిపతే జలమ్ ।
సోఽగ్నిర్మారుత సంయోగాత్ ఘనత్వముపపద్యతే ॥

గాలితో కలిసి అగ్ని నీటిని ఆకాశంపైకి ఎగురజిమ్ముతూ ఉండేది. మరల ఆ నీరే అగ్నిగాలుల సంయోగంతో ఘనీభూతమయింది.

16. తస్యాకాశే నిపతితః స్నేహస్తిష్ఠతి యోఽపరః ।
స సంఘాతత్వమాపన్నో భూతిత్వమనుగచ్ఛతి ॥

దానికి ఇతరమైన ఏ స్నేహముండేదో అది ఆకాశంపై పడింది. అదే గడ్డకట్టి ఇప్పటి ఈ భూమిరూపంగా మారింది.

17. రసానాం సర్వగన్ధానాం స్నేహానాం ప్రాణినాం తథా।
భూమిర్యోనిరిహ జ్ఞేయా యస్యాం సర్వం ప్రసూయతే ॥

ఈ భూమి యొక్క రసగంధ స్నేహాలు ప్రాణులకు కారణాలుగా తెలుసుకోదగినవి. దీనివల్ల అన్నింటి పుట్టుక జరుగుతూ ఉంటుంది

*183 వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 184 వ అధ్యాయం

11. పంచమహాభూతాల గుణాలను గూర్చి విస్తృతంగా వర్ణించడం.

*భరద్వాజ ఉవాచ:-*

1. త ఏతే ధాతవః పఞ్చ బ్రహ్మా యానసృజత్ పురా ।
ఆవృతా యైరిమే లోకా మహాభూతాని సంజ్ఞితా ॥

*భరద్వాజుడు పలికెను:-*

స్వామీ! లోకంలో ఈ ఐదు ధాతువులే మహాభూతాలని చెప్పబడుతున్నాయి. బ్రహ్మవీటిని సృష్ట్యాదియందు సృష్టించాడు. ఈ పంచమహాభూతాలే సమస్తలోకాలలో వ్యాపించినాయి.

2. యదా సృజత్ సహస్రాణి భూతానాం స మహామతిః ।
పఞ్చానామేవ భూతత్వం కథం సముపపద్యతే ॥

మహాబుద్ధిమంతుడైన బ్రహ్మ ఎప్పుడైతే వేలకొద్ది ప్రాణులను సృష్టించినాడో అప్పుడు ఆకాశం, నీరు మొదలగు ఐదింటిని మాత్రమే భూతాలని చెప్పడం ఎలాకుదురుతుంది.?

*భృగురువాచ:-*

3. అమితానాం మహాశబ్దో యాన్తి భూతాని సమ్భవమ్ ।
తతస్తేషాం మహాభూత శబ్దోఽయముపపద్యతే ॥

*భృగుమహర్షి పలికెను:-*

ఓ మునీ! ఈ ఐదుభూతాలే హద్దులేనట్టివి. అందువల్ల వీటివెంట మహాశబ్దం జోడించబడింది. వీటివల్లనే ప్రాణులు పుడ్తూఉన్నాయి. అందువల్ల వీటికే మహాశబ్ద ప్రయోగం కుదురుతుంది.

4. చేష్టా వాయుః ఖమాకాశమూష్మాగ్నిః సలిలం ద్రవః ।
పృథివీచాత్ర సంఘాతః శరీరం పాంచభౌతికమ్ ॥

ప్రాణుల శరీరం ఈ ఐదుభూతాల కలయికవల్లే జరిగింది. ఇందులో ఏ చేష్ట లేక ఏగతి ఉందో అదంతా వాయుభాగమే. ఏ మాట అయితే ఉందో అది ఆకాశానికి చెందిన భాగం. వేడి అగ్నికి చెందిన భాగం. తడి మొదలగు తరళ పదార్థం నీటికి చెందిన భాగం. ఎముకలు మాంసం మొదలగు పదార్థాలు భూమికి చెందిన భాగం.

**5.** ఇత్యేతైః పఞ్చభిర్భూతైర్యుక్తం స్థావరజఙ్గమాః ।
శ్రోత్రం ఘ్రాణం రసః స్పర్శో దృష్టిశ్చేన్ద్రియ సంజ్ఞితాః ।

ఈ ప్రకారం మొత్తం స్థావరజంగమ ప్రపంచం ఈ ఐదు మహాభూతాలతో కూడి ఉంది. వీటి సూక్ష్మాంశాలే చెవి, ముక్కు, నాలుక, చర్మం, కళ్ళు అనే ఐదు ఇంద్రియాలపేర్లతో ప్రసిద్ధాలై ఉన్నాయి.

*భరద్వాజ ఉవాచ:-*

**6.** పఞ్చభిర్యది భూతైస్తు యుక్తాః స్థావరజఙ్గమాః ।
స్థావరాణాం న దృశ్యన్తే శరీరే పఞ్చ ధాతవః ॥

*భరద్వాజుడు పలికెను:-*

స్వామీ! మీరు చెప్పినట్లుగానే సమస్తచరాచర పదార్థాలు ఈ ఐదు మహాభూతాలతో కూడుకొన్నట్లయితే స్థావర శరీరాలందు ఐదు మహాభూతాలు కనబడడం లేదు.

**7.** అనూష్మణామచేష్టానాం ఘనానాం చైవ తత్త్వతః ।
వృక్షాణాం నోపలభ్యన్తే శరీరే పఞ్చ ధాతవః ॥

చెట్ల శరీరాలలో వేడి ఉండదు. కదలిక ఉండదు. నిజానికి అవి ఘన పదార్థాలే, అందువల్ల వాటియందు పంచభూతాల అంశ ఉండదు. కాని అది కన్పించడం లేదు కదా!

**8.** న శృణ్వన్తి న పశ్యన్తి న గన్ధరసవేదినః ।
న చ స్పర్శం విజానన్తి తే కథం పాఞ్చభౌతికాః ।

ఆ చెట్లు వినడం లేదు. చూడడంలేదు. గంధరసాలను అనుభవించడంలేదు. స్పర్శ సుఖాన్ని అనుభవించడం లేదు. అలాంటి వాటిని పంచభూతాలకు చెందినవని ఎలా చెబుతున్నారు?

**9.** అద్రవత్వాదనగ్నిత్వాదభూమిత్వాదవాయుతః ।
ఆకాశస్యాప్రమేయత్వాత్ వృక్షాణాం నాస్తి భౌతికమ్ ॥

ఆ చెట్లలో , నీరు, అగ్ని, భూమి, గాలికి చెందిన భాగాలు కనుపించడంలేదు. ఆకాశం అప్రమేయమై ఉంది. అందువల్ల అదికూడా చెట్లలో కన్పించడంలేదు. కాబట్టి వృక్షాలలో పంచభూతాల తత్వం కన్పించడం లేదు.

*భృగురువాచ:-*

**10.** ఘనానామపి వృక్షాణామాకాశోఽస్తి న సంశయః ।
తేషాం పుష్పఫలవ్యక్తిర్నిత్యం సముపపద్యతే ॥

*భృగుమహర్షి పలికెను:-*

చెట్లు ఘనపదార్థాలుగా ఉన్నా వాటియందు ఆకాశం ఉంది. ఇందులో సంశయం లేదు. అందువల్ల వాటియందు ప్రతినిత్యం పండ్లు పూలు మొదలయినవి పుట్టుతూ ఉన్నాయి.

**11.** ఊష్మతోమ్లాయతే పర్ణం త్వక్ పర్ణం పుష్పమేవ చ।
మ్లాయతే శీర్యతే చాపి స్పర్శస్తేనాత్ర విద్యతే ॥

చెట్లలో ఏ వేడి ఉందో, ఆ వేడివల్లనే చెట్లు, బెరడు, పండ్లు, పూలు, వాడిపోతున్నాయి. ఎండిపోతున్నాయి. వీనివల్ల వాటియందు స్పర్శగుణం ఉందనీ తెలుస్తూ ఉంది.

**12.** వాయ్వగ్న్యశని నిర్ఘోషైః ఫలం పుష్పం విశీర్యతే ।
శ్రోత్రేణ గృహ్యతే శబ్దస్తస్మాచ్ఛృణ్వన్తి పాదపాః ।

వాయువు, అగ్ని, పిడుగుల భీషణ శబ్దాలకు పండ్లు పూలు వాడి రాలిపోతున్న విషయాన్ని మనం చూస్తున్నాం. శబ్దగ్రహణం చెవి ద్వారా కలుగుతున్నది. దీనివల్ల అవికూడా వింటున్నాయి అని తెలుస్తున్నది.

**13.** వల్లీ వేష్టయతే వృక్షం సర్వతశ్చైవ గచ్ఛతి ।
న హ్యదృష్టేశ్చ మార్గోఽస్తి తస్మాత్ పశ్యన్తి పాదపాః ॥

తీగ చెట్టుకు నాలుగువైపులా వ్రేలాడుతూ ఉంటుంది. అది చెట్ల పై భాగం వరకు ప్రాకుతూ ఉంటుంది. చూడకుండానే ఎక్కడికీ వెళ్ళటానికి ఏదానికి దారి తెలియదుకదా! దీని బట్టి చెట్లు కూడా చూస్తున్నాయని తెలుస్తున్నది.

**14.** పుణ్యాపుణ్యైస్తథా గన్ధైర్ధూపైశ్చ వివిధైరపి ।
అరోగాః పుష్పితాః సన్తి తస్మాజ్జిఘ్రన్తి పాదపాః ॥

పవిత్రాపవిత్రాలైన వాసనలవల్ల, రకరకాలైన ధూపాల వాసనలవల్ల చెట్లు రోగాలు లేనివై పుష్పిస్తూ ఫలిస్తూ ఉన్నాయి. దీనివల్ల చెట్లుకూడా వాసనను చూడగల్గుతున్నాయని తెలుస్తూ ఉంది.

**15.** **పాదైః సలిలపానాచ్చ వ్యాధీనాం చాపి దర్శనాత్ ।**
**వ్యాధి ప్రతిక్రియత్వాచ్చ విద్యతే రసనం ద్రుమే ॥**

చెట్లు తన వేర్లతో నీటిని తాగుతూ ఉన్నాయి. చెట్లకు రోగాలేమయినా ఉంటే వాటి వేర్ల ముందర మందులు చల్లి చికిత్సచేస్తున్నాం. దీనివల్ల చెట్లకు కూడా రసనేంద్రియం (నాలుక) ఉందని తెలుస్తూఉంది.

**16.** **వక్త్రేణోత్పల నాలేన యథోర్ధ్వం జలమాదదేత్ ।**
**తథా పవనసంయుక్తః పాదైః పిబతి పాదపః ॥**

ఏ విధంగా మానవుడు తామరతూడును నోట్లోఉంచుకొని దానిద్వారా నీటిని పీల్చుకొంటున్నాడో, అదే విధంగా గాలి సహాయంతో చెట్లు తన వేర్లతో నీటిని పైకి పీల్చుకుంటున్నాయి.

**17.** **సుఖదుఃఖయోశ్చ గ్రహణాచ్ఛిన్నస్య చ విరోహణాత్ ।**
**జీవం పశ్యామి వృక్షాణామచైతన్యం న విద్యతే ॥**

మనం చెట్లను నరికినప్పటికీ వాటినుండి మరల కొత్త మొలకలు పుట్టుతూ ఉన్నాయి. అవి సుఖదుఃఖాదులను కూడా అనుభవిస్తూ ఉన్నాయి. దీనివల్ల చెట్లల్లో ప్రాణం ఉందని నేను గమనిస్తూ ఉన్నాను. అందువల్ల అవి అచేతనాలు కావు.

**18.** **తేన తజ్జలమాదత్తం జరయత్యగ్ని మారుతౌ ॥**
**ఆహారపరిణామాచ్చ స్నేహో వృద్ధిశ్చ జాయతే ॥**

చెట్లు తనవేర్లద్వారా ఏ నీటిని పీల్చుతున్నాయో దానివల్ల దాని లోపల అగ్ని గాలులు పాకాన్ని చేస్తున్నాయి. ఆహారం పక్వం అవడం వల్ల చెట్లలో స్నేహం ఏర్పడుతూ ఉంది. దానివల్ల అవి వృద్ధిచెందుతూ ఉన్నాయి.

**19.** **జఙ్గమానాఞ్చ సర్వేషాం శరీరే పఞ్చ ధాతవః ।**
**ప్రత్యేకశః ప్రభిద్యన్తే యైః శరీరం విచేష్టతే ॥**

సమస్త ప్రాణుల శరీరాల్లో కూడా ఐదు భూతాలున్నాయి. కాని అక్కడ వాటి స్వరూపాల్లో భేదం ఉంటుంది. ఆ ఐదు భూతాల కలయికతోనే శరీరం గతిశీలమవుతూ ఉంది.

**20.** త్వక్ చ మాంసం తథాస్థీని మజ్జా స్నాయుశ్చ పఞ్చమమ్।
ఇత్యేతదిహ సంఘాతం శరీరే పృథివీమయమ్ ॥

శరీరం, చర్మం (నార) మాంసం, ఎముకలు, చేవ, సన్నని నరాలు ఈ ఐదింటి సముదాయం భూమిమయమే.

**21.** తేజోహ్యగ్నిస్తథా క్రోధశ్చక్షురూష్మా తథైవ చ ।
అగ్నిర్జరయతే యశ్చ పఞ్చాగ్నేయాః శరీరిణః ॥

తేజస్సు, కోపం, కన్ను, వేడి, జఠరాగ్ని, ఈ ఐదూ దేహధారుల శరీరమందు అగ్నిమయాలై ఉన్నాయి.

**22.** శ్రోత్రం ఘ్రాణం, తథాఽఽస్యం చ హృదయం కోష్ఠమేవ చ ।
ఆకాశాత్ ప్రాణినామేతే శరీరే పఞ్చ ధాతవః ॥

చెవి, ముక్కు, ముఖం, హృదయం, పొట్ట ఈ ఐదు ధాతువులు ఆకాశం నుండి పుట్టినాయి.

**23.** శ్లేష్మా పిత్తమథస్వేదో వసా శోణితమేవ చ।
ఇత్యాపః పఞ్చధా దేహే భవన్తి ప్రాణినాం సదా॥

దగ్గు, పిత్తం, చెమట, కొవ్వు, రక్తం ఈ ఐదు ద్రవపదార్థాలు నీటి రూపాలుగా ఉన్నాయి. అనగా ఇవి నీటినుంచి పుట్టినాయని అర్థం.

**24.** ప్రాణాత్ ప్రణీయతే ప్రాణీ వ్యానాత్ వ్యాయచ్ఛతే తథా ।
గచ్ఛత్యపానోఽధశ్చైవ సమానో హృద్యవస్థితః ॥

ప్రాణం వల్ల ప్రాణి వెళ్ళడం తిరుగడం అనే పనులను చేస్తూ ఉంటుంది. వ్యానం వల్ల వ్యాయామం అనుపని జరుగుతూఉంది. అపాయనవాయువు పై నుండి క్రిందకు వెళ్ళుతూఉంటుంది. సమానవాయువు హృదయంనందే ఉంటుంది. ఉదానవాయువుచే పురుషుడు ఉచ్ఛ్వాసాన్ని పొందుతుంటాడు. కంఠం పెదవులు మొదలగు స్థానభేదాలతో శబ్దాలు మరియు అక్షరాల ఉచ్చారణ జరుగుతూ ఉంటుంది. ఈ విధంగా ఏ ఐదు గాలులైతే ఉన్నాయో అవి శరీరధారిని చేష్టాశీలునిగా చేస్తుంటాయి.

**26.** భూమేర్గన్ధగుణాన్ వేత్తి రసం చాద్భ్యః శరీరవాన్ ।
జ్యోతిషా చక్షుషా రూపం స్పర్శం వేత్తి చ వాహినా ॥

జీవుడు భూమినుండే (ఘ్రాణేంద్రియం ద్వారా) వాసనగుణాన్ని తెలుసుకుంటున్నాడు. జలసంబంధమైన నాలుక అనే ఇంద్రియం ద్వారా దేహధారియైన

పురుషుడు రసాన్ని ఆస్వాదిస్తుంటాడు. తేజోమయమైన కన్నుద్వారా రూపాన్ని, అల్లే గాలి సంబంధమైన చర్మేంద్రియం ద్వారా స్పర్శజ్ఞానాన్ని పొందుతుంటాడు.

**27.** గన్ధః స్పర్శో రసో రూపం శబ్దశ్చాత్ర గుణాః స్మృతాః ।
తస్య గన్ధస్య వక్ష్యామి విస్తారాభిహితాన్ గుణాన్ ॥

వాసన, స్పర్శ, రసం, రూపం, శబ్దం, ఇవి భూమికి చెందిన గుణాలుగా అంగీకరింపబడ్డాయి. ఇందులో ప్రధానమైన గంధపు (వాసన) గుణాలను నేను విస్తారపూర్వకంగా వర్ణించి చెబుతున్నాను వినవల్సింది.

**28.** ఇష్టశ్చానిష్టగన్ధశ్చ మధురః కటురేవ చ ।
నిర్హారీ సంహతః స్నిగ్ధో రూక్షో విశద ఏవ చ ॥
ఏవం నవవిధో జ్ఞేయః పార్థివో గంధ విస్తరః ।

అనుకూలం, ప్రతికూలం, మధురం, కటువు, (కారం) నిర్హారీ (దూరం నుండి వచ్చునట్టిది) తేజస్సు, గంధమిశ్రమం, స్నిగ్ధం, రూక్షం, విశదం అనే ఈ తొమ్మిదింటిని వాసన భేదాలని తెలుసుకోవల్సింది. ఈ విదంగా భూ సంబంధమైన గంధవిస్తారం తెలియజేయబడింది.

**29.** జ్యోతిః పశ్యతి చక్షుర్భ్యాం స్పర్శం వేత్తి చ వాయునా ।
శబ్దః స్పర్శశ్చ రూపఞ్చ రసశ్చాపి గుణాః స్మృతాః ।
రసజ్ఞానఞ్చ వక్ష్యామి తన్మే నిగదతః శృణు ॥

మానవుడు రెండు కండ్లద్వారా రూపాన్ని చూస్తున్నాడు. చర్మేంద్రియం వల్ల స్పర్శను అనుభవిస్తున్నాడు. శబ్దం, స్పర్శ, రూపం, రసం అనే నాలుగు నీటి గుణాలుగా అంగీకరింపబడ్డాయి. అందులో ప్రధానగుణం రసం, దాన్ని తెలుసుకోవడానికి ఇప్పుడు నేను వాటి భేదాలను వర్ణిస్తున్నాను. వాటిని నీవు నా ద్వారా వినవల్సింది.

**31.** రసో బహువిధః ప్రోక్తః ఋషిభిః ప్రథితాత్మభిః।
మధురోలవణస్తిక్తః కషాయోऽమ్లః కటుస్తథా ॥

ఉదారమైన మనస్సుగల మహర్షులు రసానికి చెందిన అనేక భేదాలను తెలిపినారు. అవి మధురం, లవణం, చేదు, కషాయం, ఆమ్లం, కటువు (కారం) అను ఈ ఆరింటి రూపాలతో కూడుకొన్నరసం జలమయమైందని అంగీకరింపబడింది.

**32.** ఏవం షడ్విధ విస్తారో రసో వారిమయః స్మృతః ।
శబ్దః స్పర్శశ్చ రూపఞ్చ త్రిగుణం జ్యోతిరుచ్యతే ॥

**33.** జ్యోతిః పశ్యతి రూపాణి రూపఞ్చ బహుధా స్మృతమ్ ॥

శబ్దం, స్పర్శ, రూపం ఈ మూడు అగ్ని రూపాలని చెప్పబడ్డాయి. జ్యోతిర్మయాలైన కళ్ళు రూపాలను చూస్తున్నాయి. అగ్ని ప్రధాన గుణమైన రూపంకూడా అనేకవిధాలుగా ఉంది.

**34.** హ్రస్వో దీర్ఘస్తథా స్థూలశ్చతురస్రోఽనువృత్తవాన్ ।
శుక్లః కృష్ణస్తథా రక్తః పీతో నీలారుణస్తథా ॥

**35.** కఠినశ్చిక్కణః శ్లక్ష్ణః పిచ్ఛిలో మృదు దారుణః ।
ఏవం షోడశవిస్తారో జ్యోతీరూపగుణస్మృతః ॥

హ్రస్వం, దీర్ఘం, స్థూలం, చతురస్రం, గోళాకారం, తెలుపు, నలుపు, ఎరుపు, పసుపు, నీలం, దట్టమగు ఎరుపు, కఠినం, చిక్కన, అల్పం, జిడ్డు, మృదువు, దారుణం, అని జ్యోతిర్మయరూపానికి 16 విధాలయిన భేదాలున్నాయి.

**36.** శబ్దః స్పర్శౌ చ విజ్ఞేయౌ ద్విగుణో వాయురిత్యుత ।

వాయవ్యస్తు గుణః స్పర్శః స్పర్శశ్చ బహుధా స్మృతః ॥

శబ్దం, స్పర్శ అనే ఈ రెండూ వాయుగుణాలు గాలి ప్రముఖ గుణం స్పర్శ దానికి అనేక గుణాలున్నాయి.

**37.** ఉష్ణః శీతః గుణో దుఃఖః స్నిగ్ధోవిశద ఏవ చ ।
తథా ఖరో మృదూ రూక్షో లఘుర్గురుతరోఽపి చ ।
ఏవం ద్వాదశధా స్పర్శో వాయవ్యో గుణ ఉచ్యతే ॥

ఉష్ణం, శీతం, సుఖం, దుఃఖం, స్నేహం, విశదం, ఖరం, మృదువు, రూక్షం, తేలిక, అధికభారం ఈ విధంగా వాయుసంబంధమయిన స్పర్శకు 12 భేదాలు చెప్పబడ్డాయి.

**38.** తత్రైకగుణమాకాశం శబ్ద ఇత్యేవ తత్ స్మృతమ్ ।
తస్య శబ్దస్య వక్ష్యామి విస్తరం వివిధాత్మకమ్ ॥

**39.** షడ్జ ఋషభగాన్ధారౌ మధ్యమో దైవతస్తథా ।
పఞ్చమశ్చాపి విజ్ఞేయస్తథా చాపి నిషాదవాన్ ॥
ఏష సప్తవిధో ప్రోక్తోగుణ ఆకాశసమ్భవః ।

ఆకాశపుగుణం శబ్దమనే స్మరింపబడింది. ఆ శబ్దగుణమనేది అనేక భేదాలుగా విస్తరింపబడింది. షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం

మరియు నిషాదం ఇవి ఆకాశం నుండి పుట్టిన శబ్దగుణానికి చెందిన ఏడు భేదాలు. ఇవి తెలుసుకోదగినవి.

**40.** ఐశ్వర్యేణ తు సర్వత్ర స్థితో ऽపి పటహాదిషు ॥
మృదఙ్గ భేరీశంఖానాం స్తనయిత్నో రథస్య చ ।

**41.** యః కశ్చిచ్ఛ్రూయతే శబ్దః ప్రాణిన్యో ప్రాణినో ऽపి వా ।
ఏతేషామేవ సర్వేషాం విషయే సమ్ప్రకీర్తితః ॥

శబ్దం తన వ్యాపక శరీరంతో అంతానిండి ఉంది. కాని నగారా మొదలగు వాటియందు శబ్దం విశేషరూపంతో అభివ్యక్తమవుతూ ఉంది. మృదంగం, భేరీ, శంఖం, మేఘం, రసధ్వని మొ॥ వాటియందు ఏ శబ్దం వినబడుతుందో మరియు జడంకాని చేతనంకాని ఏ శబ్దం వినబడుతుందో అది ఈ ఏడు భేదాలలో అంతర్గతమని తెలియజేస్తున్నాను.

**42.** ఏవం బహువిధాకారః శబ్ద ఆకాశసమ్భవః ।
ఆకాశజం శబ్దమాహురేభిర్వాయు గుణైస్సహ ॥

ఈ ప్రకారం ఆకాశం నుండి పుట్టిన శబ్దానికి అనేక భేదాలున్నాయి. వాయు సంబంధమైన గుణాలవెంట ఆకాశజనితమైన శబ్దం ఉంటుందని విద్వాంసులైన పురుషులు చెబుతూ ఉన్నారు.

**43.** అవ్యాహతైశ్చేతయతే న వేత్తి విషమస్థితైః ।
ఆప్యాయన్తే చ తే నిత్యం ధాతవస్తైస్తు ధాతుభిః ॥

ఎప్పుడైతే వాయుసంబంధమయిన గుణం బాధింపబడక శబ్దం వెంట ఉంటుందో అప్పుడు మానవుడు శబ్దం వింటున్నాడని తెలుసుకోవాలి. ఎప్పుడు వాయుసంబంధమైన గుణం గోడలేక ప్రతికూలమైన వాయువుతో బాధింపబడి విషమావస్థయందున్నట్లయితే అప్పుడు శబ్దం గ్రహించబడదు. ఆ శబ్దాల ఉత్పాదక ధాతువు (ఇంద్రియ గోళకాలు) ముందు చెప్పబడ్డ ఐదు ధాతువుల ద్వారా పోషింపబడుతూ ఉంది.

**44.** ఆపో ऽగ్ని ర్మారుతశ్చైవ నిత్యం జాగ్రతి దేహిషు ।
మూలమేతే శరీరస్య వ్యాప్య ప్రాణానిహ స్థితాః ॥

నీరు, అగ్ని, వాయువు, ఈ మూడు తత్త్వాలు ఎల్లప్పుడు దేహధారులందు మేల్కొని ఉంటాయి. ఇవే శరీరానికి మూలాలు. ఇవి ప్రాణాలందు పడుగు పేకలవలె ఉండి శరీరంలో నివసిస్తూ ఉన్నాయి.

***184 వ అధ్యాయం ముగిసింది***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 185 వ అధ్యాయం

12. శరీరంలోనున్న జఠరాగ్ని ప్రాణాపాన వాయువుల స్థితిని గూర్చి వర్ణించడం.

*భరద్వాజ ఉవాచ:-*

**1.** పార్థివం ధాతుమాసాద్య శారీరోఽగ్నిః కథం ప్రభో! ।
అవకాశవిశేషేణ కథం వర్తయతేఽనిలః ॥

*భరద్వాజుడు పలికెను :-*

ప్రభూ! శరీరంలోని అగ్ని పాంచభౌతిక దేహాన్ని ఆశ్రయించి ఎలా ఉంటుంది? వాయువు ఆ పార్థివ ధాతువు నాశ్రయించి అవకాశ విశేషంద్వారా దేహాన్ని ఎలా చేష్టాశీలంగా చేస్తున్నది?

**2.** వాయోర్గతిమహం బ్రహ్మన్ కథయిష్యామి తేఽనఘ ।
ప్రాణినామనిలో దేహాన్ యథా చేష్టయతే బలీ ॥

*భృగుమహర్షి పలికెను:-*

ఓ బ్రాహ్మణుడా ! పాపరహితుడవైన మహర్షీ ! నేను నీకు వాయువు గతిని గూర్చి వివరిస్తున్నాను. ప్రబలవాయువు శరీరాలను ఏవిధంగా గతి శీలాలుగా చేస్తుందో అఆ అంశాన్ని కూడా తెలియజేస్తున్నాను.

**3.** శ్రితో మూర్ధానమాత్మా తు శరీరం పరిపాలయన్ ।
ప్రాణోమూర్ధని చాగ్నౌ చ వర్తమానో విచేష్టతే ॥

ఆత్మ బ్రహ్మరంధ్రంలో ఉండి మొత్తం శరీరాన్ని రక్షిస్తూ ఉంటుంది. ప్రాణం తల అగ్ని అనే ఈ రెండింటియందుండి శరీరాన్ని గతి శీలంగా చేస్తూ ఉంటుంది.

**4.** సజన్తుః సర్వభూతాత్మా పురుషః స సనాతనః ।
మనో బుద్ధిరహఙ్కారో భూతాని విషయశ్చ సః ॥

ప్రాణంతో కూడుకొన్న ఆత్మయే జీవం. అదే మొత్తం భూతాల ఆత్మ. ఆ ఆత్మే సనాతన పురుషుడు. అదే మనస్సు, బుద్ధి, అహంకారం పంచభూతాలు మరియు విషయరూపాలె ఉంది.

5. ఏవం త్విహ స సర్వత్ర ప్రాణేన పరిచాల్యతే ।
పృష్ఠతస్తు సమానేన స్వాం స్వాం గతిముపాశ్రితః ॥

ఈ విధంగా జీవాత్మతో కూడిన ప్రాణం ద్వారా శరీరం నందలి అన్ని భాగాలు ఇంద్రియాలు మొదలయిన బాహ్యావయవాలు కదిలింపబడుతున్నాయి. ఆ తర్వాత సమాన వాయురూపంనందు పరిణతమగు వాయువే తన తన గతి నాశ్రయించి శరీరం కదులుటకు కారణమవుతూఉంది.

6. బస్తి మూలం గుదఞ్చైవ పావకం సముపాశ్రితః ।
వహన్ మూత్రం పురీషం చాప్యమానః పరివర్తతే ॥

అపానవాయువు, జఠరానలం, మూత్రాశయం, మరియు గుదాన్నాశ్రయించి మల మూత్రాలను వెలుపలికి పంపుతూ, పై నుండి క్రిందికి తిరుగుతూ ఉంటుంది

7. ప్రయత్నే కర్మణి బలే య ఏకస్త్రిషు వర్తతే ।
ఉదాన ఇతి తం ప్రాహురధ్యాత్మ విదుషో జనాః ॥

ఏ వాయువు ప్రయత్నం, కర్మ, బలం అనే మూడింటియందు ప్రవృత్తాలవుతూ దాని ఆధ్యాత్మిక తత్వాన్ని తెలుసుకుంటూ ఉంటుందో అది ఉదానవాయువని విద్వాంసులు చెప్పియున్నారు.

8. సంధిష్వపి చ సర్వేషు సంనివిష్టస్తథానిలః ।
శరీరేషు మనుష్యాణాం వ్యాన ఇత్యుపదిశ్యతే ॥

ఏదైతే మానవుల శరీరాలందూ వారి సమస్త సంధులందూ వ్యాప్తి చెంది ఉందో అది వ్యానమనే వాయువుగా చెప్పబడింది.

9. ధాతుష్వగ్నిస్తు వితతః సమానేన సమీరితః ।
రసాన్ ధాతూంశ్చ దోషాంశ్చ వర్తయన్నవతిష్ఠతే ॥

శరీరధాతువులన్నిటియందు వ్యాపించిన ఏ అగ్ని ఉందో అది సమాన వాయువుద్వారా కదలింపబడుతూ ఉంది. ఆ సమానవాయువే శరీరగత రసాలను, ఇంద్రియాలను, దోషాలను కదిలింపజేస్తూ ఉండి మొత్తం శరీరంనందుంటుంది.

10. అపానప్రాణయోర్మధ్యే ప్రాణాపాన సమాహితః ।
సమన్వితస్త్వధిష్ఠానం సమ్యక్పచతి పావకః ॥

అపాన వాయువుకు ప్రాణవాయువుకు మధ్యలో (బొడ్డులో) ప్రాణాపానాలను ఆశ్రయించుకొన్న జఠరాగ్ని తిన్న ఆహారాన్ని చక్కగా పక్వం చేస్తున్నది.

11 ఆస్యం హి పాయుపర్యన్తమన్తే స్యాద్ గుదసంజ్ఞితమ్ ।
స్రోతస్తస్మాత్ ప్రజాయన్తే సర్వస్రోతాంసి దేహినామ్ ॥

ముఖంనుండి గుదం వరకు ప్రాణవాయువు ప్రసరించటానికి ఏ గొప్ప మార్గమైతే ఉందో అది గుదం అనే పేరుతో ప్రసిద్ధిచెందింది. ఆ మహామార్గమే దేహధారుల ఇతర చిన్న చిన్న నాడులకు ఆశ్రయంగా ఉంది.

12. ప్రాణానాం సన్నిపాతాచ్చ సన్నిపాతః ప్రజాయతే ।
ఊష్మాచాగ్నిరితిజ్ఞేయో యోఽన్నం పచతి దేహినామ్ ॥

ఆయా మార్గాల ద్వారా అన్ని అవయవాలందు ప్రాణాల సంబంధం లేక ప్రసారముండటం వల్ల వాటివెంట ఉండే జఠరాన్ని కూడా సంబంధ ప్రసారాలను కలిగి యుంటుంది. ప్రాణుల శరీరంలో ఏ అగ్ని ఉంటుందో దాన్ని జఠరాగ్ని తాపంగానే గ్రహించాలి.

13. అగ్నివేగవహః ప్రాణః గుదాన్తే ప్రతిహన్యతే ।
స ఊర్ధ్వమాగమ్య పునః సముత్క్షిపతి పావకమ్ ॥

అగ్నివేగంవల్ల ప్రవహించే ప్రాణం గుదం చివరికి వెళ్ళి కొట్టబడుతూ ఉంది. మరల అది పైకి వెళ్ళి తిరిగివచ్చి దగ్గరలోనున్న అగ్నిని కూడా పైకెత్తుతూ ఉంది.

14. ఏకాశయస్త్వధో నాభ్యామూర్ధ్వమామాశయః స్థితః ।
నాభి మధ్యే శరీరస్య సర్వే ప్రాణాశ్చ సంస్థితాః ॥

బొడ్డుక్రింద పక్వాశయం దానిపైన అమాశయం ఉంది. అట్లే బొడ్డు మధ్యభాగాన శరీరసంబంధాలైన వాయువులన్నీ ఉన్నాయి.

15. ప్రస్థితా హృదయాత్సర్వే తిర్యగూర్ధ్వమధస్తథా ।
వహన్త్యన్య రసాన్ నాడ్యో దశ ప్రాణ ప్రచోదితాః ॥

ఆ ప్రాణాలన్నీ హృదయాన్నుంచి ఇటూ అటూ మరియు పైకి క్రిందికి పయనిస్తూ ఉంటాయి. అందువల్ల పది ప్రాణాలు కదిలింపబడి నాడులన్నీ అన్నిరసాలను మోస్తుంటాయి.

16. ఏష మార్గోఽథయోగినాం యేన గచ్ఛన్తి తత్పదమ్ ।
జితక్లమా సమాధీరాః మూర్ధన్యాత్మానమాదధన్ ॥

ఇది ముఖం నుండి గుదం వరకు గల పెద్ద మార్గం. అది యోగుల మార్గం. దానివల్ల యోగులు పరమపదాన్ని పొందుతున్నారు. ఎవరు కష్టాలన్నింటినీ జయిస్తున్నారో, ఎవరు అంతటా సమానమైన దృష్టికలిగి ఉంటారో, ఎవరు ధీరులో,

ఏ మహాత్ములు సుషమ్నానాడి ద్వారా తలపైభాగాన్ని చూచి అక్కడే తమను తాము నిలుపుకుంటారో అలాంటి యోగులు పరమపదాన్ని పొందుతున్నారు.

**17. ఏవం సర్వేషు విహితః ప్రాణాపానేషు దేహినామ్ ।**
**తస్మిన్ సమిధ్యతే నిత్యమగ్నిః స్థాల్యామివాహితః ॥**

ప్రాణుల ప్రాణం, అపానం మొదలగు వాయువులందుంచబడిన జఠరాగ్ని శరీరంనందుండి ఎల్లప్పుడు హోమగుండంనందున్నట్టి అగ్నివలె ప్రకాశిస్తూ ఉంటుంది.

***185 వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 186వ అధ్యాయం

13. జీవశక్తిని నానారకాలైన యుక్తులతో శంకోపస్థాపనం చేయడం.

*భరద్వాజ ఉవాచ:-*

**1.** యది ప్రాణయతే వాయుర్వాయురేవ విచేష్టతే ।
శ్వసిత్యాభాసతే చైవ తస్మాజ్జీవో నిరర్థకః ॥

*భరద్వాజుడు పలికెను:-*

స్వామీ ! ఒకవేళ వాయువే ప్రాణికి జీవమైతే వాయువే శరీరానికి చేష్టాశీలమవుతూ ఉంది. అదే శ్వాసిస్తూ ఉంది అదే మాట్లాడుతూ ఉంది. అట్లయితే శరీరంలో జీవశక్తిని స్వీకరించడం వ్యర్థమే అవుతున్నది కదా!

**2.** యద్యూష్మభావ ఆగ్నేయో వహ్నినా పచ్యతే యది।
అగ్నిర్జరయతే చైతత్ తస్మాజ్జీవో నిరర్థకః ॥

ఒకవేళ శరీరంలోని వేడి అగ్ని అంశమైతే, ఆ అగ్నియే తిన్న అన్నాన్ని పక్వం చేస్తున్నట్లయితే, అదే అన్నింటిని జీర్ణం చేస్తున్నట్లయితే అప్పుడు జీవశక్తిని అంగీకరించడం వ్యర్థమే.

**3.** జన్తోః ప్రమీయమానస్య జీవో నైవోపలభ్యతే ।
వాయురేవ జహాత్యేనమూష్మభావశ్చ నశ్యతి ॥

ఎప్పుడైనా ఏదైనా ప్రాణి మరణించినట్లయితే అప్పుడక్కడ జీవం ఉండడంలేదు. ప్రాణవాయువే ఈ ప్రాణిని వదలివేస్తున్నది. అప్పుడు శరీరంనందలి వేడికూడా నశిస్తున్నది.

**4.** యది వాయుమయో జీవః సంశ్లేషో యది వాయునా।
వాయుమండలవత్ దృశ్యో గచ్ఛేత్ సహమరుద్గణైః ॥

ఒకవేళం జీవం వాయుమయమైతే, వాయువువల్ల దానికి ఘనిష్ఠ సంపర్కం ఉన్నట్లయితే అప్పుడు వాయుమండలంతో సమానంగా దానికి ప్రత్యక్ష అనుభవం ఉండాలి. అది మృత్యువు తర్వాత వాయుగణాలతో వెళ్ళి ఉండాలి.

**5.** సంశ్లేషో యది వాతేన యది తస్మాత్ ప్రణశ్యతి ।
మహార్ణవ విముక్తత్వాదన్యత్ సలిల భాజనమ్ ॥

ఒకవేళ వాయువుతోపాటి జీవానికి దృఢమైన సంబంధం ఉన్నట్లయితే దాని కారణంగానే అది వాయువుతోపాటి నశిస్తూ ఉంది ఏ విధంగానైతే నీటి పాత్రను రాళ్ళతో నింపి ఏదైనా సముద్రంలో వేసినట్లయితే అది ఎలా మునిగిపోతుందో అదేవిధంగా వాయుసంపర్కంతో జీవానికి వినాశం ఉందని అంగీకరించవలసి ఉంటుంది. ఆ దశలో రాళ్ళవల్ల ప్రత్యేకమయిన నీటిపాత్ర ఎలా లభిస్తుందో అదే విధంగా ప్రాణవాయువువల్ల జీవికి ఉపలబ్ధి ఉండాలి.

**6. కూపే వా సలిలం దద్యాత్ ప్రదీపం వా హుతాశనే ।**
**క్షిప్రం ప్రవిశ్య నశ్యేత యథా నశ్యత్యసౌ తథా ॥**

**7. పఞ్చ ధారణకేహ్యస్మిన్ శరీరే జీవితం కుతః ।**
**తేషామన్యతరాభావాచ్చతుర్ణాం నాస్తి సంశయః ॥**

ఏవిధంగానైతే బావుల్లోకి నీరు వచ్చిపడుతుందో లేక అగ్నిలో మండుతున్న దీపాన్ని వేస్తే ఆ రెండూ వెంటనే వాటియందు ప్రవేశించి తమ ప్రత్యేక ఉనికిని పోగొట్టుకుంటున్నాయో అదే విధంగా పాంచభౌతిక శరీరం నాశనమైనప్పటికీ జీవంకూడా ఐదుతత్త్వాలలో విలీనమై తనదైన ప్రత్యేక ఉనికిని పోగొట్టుకున్నది కావాలి ఈ విధంగా అంగీకరించినట్లయితే ఐదు భూతాలను ధరిస్తే ఈ దేహంలో జీవం ఎక్కడ ఉంటుంది? అందువల్ల పాంచభౌతిక సంఘాతం కంటె జీవం భిన్నంగా లేదు. ఈ ఐదు తత్త్వాలలో ఏదైనా ఒకటి లోపించినప్పటికీ మిగిలిన నాల్గింటికీ లోపం కల్గుతూ ఉంటుంది. ఇందు ఏ మాత్రం అనుమానం లేదు.

**8. నశ్యన్త్యాపోహ్యనాహారాద్ వాయురుచ్ఛ్వాస నిగ్రహాత్ ।**
**నశ్యతే కోష్ఠభేదాత్ ఖమగ్నిర్నశ్యత్యభోజనాత్ ॥**

నీటిని అన్ని విధాల వదలివేసినట్లయితే శరీరం నందలి నీటి అంశ నాశనమవుతుంది. శ్వాసను అరికట్టినట్లయితే వాయువు నశిస్తుంది. పొట్టను భేదించినట్లయితే అకాశతత్త్వం నశిస్తుంది. ఆహారాన్ని నివారించినట్లయితే శరీరం నందలి అగ్ని తత్వం కూడా నశిస్తుంది.

**9. వ్యాధివ్రణపరిక్లేశైర్మేదినీ చైవ శీర్యతే ।**
**పీడితేఽన్యతరేహ్యేషాం సంఘాతో యాతి పఞ్చధా ॥**

జ్వరం మొదలయిన రోగాలు, గాయాలు, ఇతర క్లేశాలవల్ల శరీరంనందలి పృథివీతత్వం నశిస్తూ ఉంది. ఈ ఐదుతత్త్వాల్లో ఒక తత్త్వానికి హాని కల్గినట్లయితే వీటి సంఘాతమే పంచత్వాన్ని పొందుతూ ఉంది.

**10. తస్మిన్ పఞ్చత్వమాపన్నే జీవః కిమనుధావతి ।**
**కిం వేదయతి వా జీవః కిం శృణోతి బ్రవీతి చ ॥**

పాంచభౌతిక దేహం నష్టమైనప్పుడు ఒకవేళ జీవుడనే వాడు ఉంటే అది ఎవరివెంట పరుగెత్తుతుంది? ఏమి అనుభవిస్తుంది.? ఏమి వింటుంది? ఏమి చెబుతుంది?

**11.** ఏషా గౌః పరలోకస్థం తారయిష్యతి మామయమ్ ।
యో దత్త్వా క్రియతే జన్తుః సా గౌః కం తారయిష్యతి ॥

చనిపోయేముందు ఆశతో గోదానం చేస్తూ ఉంటారు. ఆ ఆశ ఏమనగా పరలోకానికి వెళ్ళేటప్పుడు ఆ ఆవు తమను తరింపజేస్తుందని విశ్వాసం. కాని జీవుడు గోదానంచేసి చనిపోతున్నాడు. మరి ఆ ఆవు వారిని ఎలా తరింపచేస్తున్నది?

**12.** గౌశ్చ ప్రతిగ్రహీతా చ దాతాచైవ సమం యదా ।
ఇహైవ విలయం యాన్తి కుతస్తేషాం సమాగమః ॥

గోవు, గోదానం చేసే మానవుడు, దాన్ని తీసుకొనిపోయే బ్రాహ్మణుడు ఈ ముగ్గురూ ఎప్పుడిక్కడ చచ్చిపోతున్నారో అప్పుడా ముగ్గురు ఇక్కడే లయమైపోతున్నారు? వారు పరలోకంలో ఎలా కలుసుకుంటున్నారు?

**13.** విహగైరుపభుక్తస్య శైలాగ్రాత్ పతితస్య చ ।
అగ్నినాచోపయుక్తస్య కుతః సంజీవనం పునః ॥

చనిపోయిన వాన్ని పక్షులు తినేస్తున్నాయి. లేక అతడు పర్వత శిఖరం మీదనుండి పడి నుగ్గు నుగ్గు అయిపోతున్నాడు. లేక అగ్నిలోపడి కాలి చచ్చిపోతున్నాడు. ఇట్టి దశలో అతడు మరల జీవించడం ఎలా సాధ్యం?

**14.** ఛిన్నస్య యది వృక్షస్య న మూలం ప్రతిరోహతి ।
బీజాన్యస్య ప్రవర్తన్తే మృతః క్వ పునరేష్యతి॥

సమూలంగా నరికివేయబడ్డ చెట్టువేరు మరల మొలకెత్తడం లేదు చెట్లకు కేవలం విత్తనాలు మాత్రమే ఉంటాయి. మరి చచ్చిపోయిన మానవుడు మరల ఎక్కడి నుండి వస్తున్నాడు.

**15.** బీజమాత్రం పురాసృష్టం యదేతత్ పరివర్తతే ।
మృతామృతాః ప్రణశ్యన్తి బీజాత్ బీజం ప్రవర్తతే ॥

పూర్వకాలంలో విత్తనం వరకు మాత్రమే సృష్టి జరిగింది. దానివల్ల ఈ ప్రపంచం ఇలా కొనసాగుతున్నది. ఎవరు మరణిస్తున్నారో వారే నశిస్తున్నారు. విత్తనం విత్తనం వల్లే పుడుతూ ఉంది.

*186 వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 187 వ అధ్యాయం

14. జీవశక్తి నిత్యత్వాన్ని యుక్తులతో సిద్ధింపజేయడం.

భృగురువాచ:-

**1. న ప్రణాశోऽస్తి జీవస్య దత్తస్య చ కృతస్య చ ।**
**యాతి దేహాన్తరం ప్రాణీ శరీరన్తు విశీర్యతే ॥**

*భృగుమహర్షి పలికెను :-*

ఓ బ్రాహ్మణుడా! జీవునికి, అతడిచ్చిన దానానికి, అతడు చేసిన కర్మకు ఎప్పుడూ నాశనం లేదు. జీవుడు ఈ శరీరాన్ని వదలి వేరే శరీరంలోకి పోతున్నాడు. కేవలం జీవుడు వదిలిపెట్టిన శరీరమే ఇక్కడ నశిస్తూఉంది.

**2. న శరీరాశ్రితో జీవస్తస్మిన్ నష్టే ప్రణశ్యతి ।**
**సమిధామివదగ్ధానాం యథాగ్నిర్దృశ్యతే తథా ॥**

శరీరాన్ని ఆశ్రయించి ఉండే జీవుడు శరీరం నశించినప్పటికీ నశించడం లేదు. ఏ విధంగానైతే సమిధల నాశ్రయించిన అగ్ని అవి నశించినప్పటికీ కనబడుతూ ఉంటుందో అదే విధంగా జీవుని ఉనికి మనకు ప్రత్యక్షంగా అనుభవమవుతూ ఉంటుంది.

*భరద్వాజ ఉవాచ :-*

**3. అగ్నేర్యథా తథా తస్య యది నాశో న విద్యతే ।**
**ఇన్ధనస్యోపయోగాన్తే స చాగ్నిర్నోపలభ్యతే ॥**

*భరద్వాజుడు పలికెను :-*

స్వామీ ! అగ్నితోసమానంగా జీవునికి నాశనం లేకపోయినట్లయితే ఇంధనం కాలిపోయిన పిమ్మట అది ఆరిపోతున్నది. మరల దాని ఉనికి ఉండదు కదా!

**4. నశ్యతీత్యేవ జానామి శాన్తమగ్నిమనిన్ధనమ్ ।**
**గతిర్యస్య ప్రమాణం వా సంస్థానం వా న విద్యతే ॥**

అందువల్లే నేను ఇంధనంలేని ఆరిపోయిన అగ్నిగా దీన్ని భావిస్తూ ఉన్నాను. అది నశించినట్టిది. ఎందుకంటే దాని గతి, ప్రమాణం లేక స్థితిలేదు. దాని నాశనం కూడా అంగీకరింపదగిందే ఇదే దశలో జీవుడు కూడా ఉన్నాడు.

*భృగురువాచ :-*

**5. సమిధాముపయోగాన్తే యథాగ్నిర్నోపలభ్యతే ।**
**ఆకాశానుగతత్వాద్ధి దుర్గ్రాహ్యో హి నిరాశ్రయః ॥**

*భృగువు పలికెను :*

మహర్షీ ! సమిధలు కాలిన పిమ్మట అగ్ని నశించదు. అది ఆకాశంలో అవ్యక్తరూపంలో ఉంటుంది. అందువల్ల దానికి ఉనికి ఉండదు. ఎందుకంటె ఏ ఆశ్రయం లేకుండా అగ్నిని తీసుకోవడం అనేది మిక్కిలి కఠినమైన పని.

**6. తథా శరీర సంత్యాగే జీవోహ్యాకాశవత్ స్థితః ।**
**న గృహ్యతే తు సూక్ష్మత్వాత్ యథా జ్యోతిర్నసంశయః ॥**

ఈ విధంగా శరీరాన్ని వదలినప్పటికీ జీవుడు ఆకాశంలో ఉంటాడు. అప్పుడు జీవుడు మిక్కిలి సూక్ష్మంగా ఉండడం వల్ల ఆరిపోయిన అగ్నివలె మనకు కన్పించడు. కాని జీవుడు తప్పక ఉంటాడు. ఈ విషయంలో కొంచెంకూడా అనుమానం అక్కరలేదు.

**7. ప్రాణాన్ ధారయతేహ్యగ్నిః సజీవ ఉపధార్యతామ్ ।**
**వాయుసంధారణే హ్యగ్నిర్నశ్యత్యుచ్ఛ్వాస నిగ్రహాత్ ।**

అగ్ని ప్రాణాలను ధరిస్తున్నది. కాబట్టి జీవున్ని అగ్నితో సమానంగా జ్యోతిర్మయమని తెలుసుకో. ఆ అగ్నిని వాయువు శరీరంలోనే ధరించి ఉంటుంది. శ్వాస నిరోధింపబడినప్పటికీ వాయువు వెంటవెంటనే అగ్నికూడా నశిస్తూ ఉంది.

**8. తస్మిన్ నష్టే శరీరాగ్నౌ తతో దేహమచేతనమ్ ।**
**పతితం యాతి భూమిత్వమయనం తస్య హి క్షితిః ।**
**జఙ్గమానాం హి సర్వేషాం స్థావరాణాం తథైవ చ ॥**

**9. ఆకాశం పవనోన్వేతి జ్యోతిస్తమనుగచ్ఛతి ।**
**తేషాం త్రయాణామేకత్వాత్ ద్వయం భూమౌ ప్రతిష్ఠితమ్ ॥**

ఆ శరీరాగ్ని నష్టమైనప్పటికీ అచేతన శరీరం భూమిపైబడి భూభావాన్ని పొందుతూ ఉంది. ఎందుకంటె భూమే దాని ఆధారం. కదిలే జీవులు కదలని

జీవులయొక్క ప్రాణవాయువు ఆకాశాన్ని చేరుకొంటున్నది. అగ్ని ఆ వాయువునే అనుసరిస్తూ ఉంది. ఈ విధంగా ఆకాశం, వాయువు, అగ్ని, ఈ మూడు తత్వాలు ఒక చోటనే ఉంటున్నాయి. నీరు భూమి అనే ఈ రెండు తత్త్వాలు భూమి మీదనే ఉంటున్నాయి.

**10.** యత్ర ఖం తత్ర పవనస్తత్రాగ్నిర్యత్ర మారుతః ।
అమూర్తయస్తే విజ్ఞేయాః మూర్తిమన్తః శరీరిణామ్ ॥

ఎక్కడ ఆకాశం ఉంటుందో అక్కడ వాయువుకూడా ఉంటుంది. ఎక్కడ వాయువు ఉంటుందో అక్కడ అగ్నికూడా ఉంటుంది. ఈ మూడు తత్వాలు నిరాకారాలైనప్పటికీ దేహధారుల శరీరాలనుపొంది ఆకారాలు కలవిగా కన్పిస్తున్నాయి.

*భరద్వాజ ఉవాచ :-*

**11.** యద్యగ్నిమారుతౌ భూమిః ఖమాపశ్చ శరీరిషు ।
జీవః కిం లక్షణస్తత్రేత్యేతదాచక్ష్వ మేఽనఘ ॥

పాపరహితుడవైన ఓ మునిశ్రేష్ఠా ! దేహధారుల శరీరాలందు కేవలం అగ్ని, వాయువు, భూమి, ఆకాశం, మరి నీటి తత్వాలు ఉన్నట్లయితే వాటియందుండే జీవులకు గల లక్షణాలేవి? వీటిని గూర్చి నాకు తెలుపవలసింది.

**12.** పఞ్చాత్మకే పఞ్చరతౌ పఞ్చ విజ్ఞానచేతనే ।
శరీరే ప్రాణినాం జీవం వేత్తుమిచ్ఛామి యాదృశమ్ ॥

ప్రాణుల శరీరం ఐదు భూతాలతో కూడుకొని ఉంది. ఐదు విషయాలతో కూడ దీనికి సంబంధం ఉంది. ఇందు ఐదు జ్ఞానేంద్రియాలు మనస్సు ఉంటున్నాయి. ఇందున్నట్టి జీవుల స్వరూపం ఎలా ఉంటుంది? ఈ అంశాన్ని గూర్చి నాకు తెలుపవల్సింది.

**13.** మాంసశోణితసంఘాతే మేదః స్నాయ్వస్థి సఞ్చయే ।
భిద్యమానే శరీరే తు జీవో నైవోపలభ్యతే ॥

రక్తం, మాంససమూహం, క్రొవ్వు, నాడులు, ఎముకల సముదాయం గల ఈ శరీరాన్ని కోస్తే దీనిలోపల ఏ ప్రాణి దొరకదు.

**14.** యద్యజీవం శరీరం తు పఞ్చభూతసమన్వితమ్ ।
శారీరే మానసే దుఃఖే కస్తాం వేదయతే రుజమ్ ॥

పాంచభౌతిక శరీరంలో జీవం లేదని తెలుసుకుంటే అప్పుడు శరీరం లేదా మనస్సులో బాధ కలిగినప్పుడు దాని కష్టాన్ని ఏది తెలుసుకుంటున్నది?

**15.** శృణోతి కథితం జీవః కర్ణాభ్యాం న శృణోతి తత్ ।
మహర్షే మనసి వ్యగ్రే తస్మాజ్జీవో నిరర్థకః ॥

మహర్షీ! జీవం ఏదైనా మనం చెప్పిన మాటను మొదట రెండు చెవులద్వారా వింటూఉంది. కాని మనసులో వ్యగ్రత ఉన్నట్లయితే అది విన్నప్పటికీ విననట్టే. అందువల్ల మనసుకన్నా భిన్నంగా జీవపు ఉనికిని అంగీకరించడం వ్యర్థమే.

**16.** సర్వం పశ్యతి యద్ దృశ్యం మనోయుక్తేన చక్షుషా ।
మనసి వ్యాకులే చక్షుః పశ్యన్నపి న పశ్యతి ॥

దృశ్యపదార్థమేదైతే ఉందో, ఎప్పుడైతే దాని దృష్టివెంట మనస్సంయోగం ఉంటుందో, అప్పుడే అదిదాన్ని చూడగలుగుతుంది. ఎప్పుడైతే మనస్సు బాధాకరంగా ఉంటుందో అప్పుడు దాన్ని కన్ను చూస్తున్నప్పటికీ చూడలేకపోతూ ఉంది.

**17.** న పశ్యతి న చాఘ్రాతి న శృణోతి న భాషతే ।
న చ స్పర్శరసౌవేత్తి నిద్రావశగతః పునః ॥

నిద్రాపరవశుడైన పురుషుడు ఇంద్రియాలన్నీ ఉన్నప్పటికీ చూడలేకపోతున్నాడు. వాసన చూడలేకపోతున్నాడు. మాట్లాడలేకున్నాడు. స్పర్శించలేకున్నాడు. రుచి చూడలేకపోతున్నాడు.

**18.** హృష్యతి క్రుధ్యతే కోఽత్ర శోచత్యుద్విజతే చ కః ।
ఇచ్ఛతి ధ్యాయతి ద్వేష్టి వాచమీరయతే చ కః ॥

ఈ శరీరంతో ఎవడు సంతోషిస్తున్నాడు. ఎవడు కోపపడుతున్నాడు. ఎవడు ఆలోచిస్తున్నాడు. ఎవడు కోరుకొంటున్నాడు. ఎవడు ధ్యానిస్తూ ఉన్నాడు. ఎవడు మాట్లాడుతూ ఉన్నాడు.

*భృగురువాచ :-*

**19.** న పఞ్చ సాధారణమత్ర కిఞ్చిచ్ఛరీరమేకోవహతేన్తరాత్మా।
స వేత్తి గన్ధాశ్చ రసాన్ శ్రుతీశ్చ స్పర్శఞ్చ రూపఞ్చ గుణాశ్చ యేఽన్యే ॥

*భృగుమహర్షి పలికెను :*

ఓ మునీ! మనస్సుకూడా పాంచభౌతికమే. అందు పంచభూతాలకంటె భిన్నమయిన ఏ ఇతర తత్త్వం లేదు. ఏకమాత్రం అంతరాత్మయే ఈ శరీరాన్ని మోస్తున్నది. అదే రూపరసగంధ స్పర్శ శబ్దాలను, ఇతర గుణాలను, వాటి అనుభవాలను పొందుతూ ఉంది.

**20.** పఞ్చాత్మకే పఞ్చగుణప్రదర్శీ స సర్వ గాత్రాను గతోఽన్తరాత్మా।
స వేత్తి దుఃఖాని సుఖాని చాత్ర తద్విప్రయోగాత్ తు న వేతి దేహః ॥

ఆ అంతరాత్మ పంచేంద్రియ గుణాలను ధరించునట్టి మనస్సు యొక్క ద్రష్టగా ఉన్నది. అదే ఈ పాంచ భౌతిక శరీరం యొక్క సంపూర్ణ అవయవాలందు వ్యాప్తిచెంది సుఖ దుఃఖ అనుభవాన్ని పొందుతున్నది. ఎప్పుడైతే దానికి శరీరంతోగల సంబంధం తొలగిపోతుందో అప్పుడు ఈ శరీరానికి సుఖదుఃఖాలతో సంబంధం ఉండదు (ఈ మనస్సుకు భిన్నంగా దాని సాక్షిభూతమయిన ఆత్మయొక్క అస్తిత్వం స్వతహాగా సిద్ధిస్తున్నది)

**21.** యదా న రూపం న స్పర్శో నోష్మభావశ్చ పఞ్చకే ।
తదాశాన్తే శరీరాగ్నౌ దేహత్యాగే న నశ్యతి ॥

ఎప్పుడైతే పాంచభౌతిక శరీరంలో రూపం, రసం, వేడి అంగీకరింపబడవో అప్పుడు ఆ అవస్థయందు శరీరంనందుండే అగ్ని ఉపశమనం పొందినప్పటికీ జీవాత్మ ఈ శరీరాన్ని వదలినప్పటికీ నష్టాన్ని పొందదు.

**22.** ఆపోమయమిదం సర్వమాపోమూర్తిః శరీరిణామ్ ।
తత్రాత్మా మానసో బ్రహ్మా సర్వభూతేషు లోకకృత్॥

ఈ ప్రపంచమంతా జలమయమే. ప్రాణుల శరీరమంతా జలమయమే జీవుల మనస్సుల్లో ఉండే ఆత్మ మానసబ్రహ్మ. ఆ బ్రహ్మ ప్రాణుల యందుండి లోకస్రష్టయైన బ్రహ్మపేరుతో ప్రఖ్యాతమై ఉన్నాడు. ఎందుకంటె సమస్త జీవులసమూహమే బ్రహ్మ.

**23.** ఆత్మా క్షేత్రజ్ఞ ఇత్యుక్తః సంయుక్తః ప్రాకృతైర్గుణైః ।
తైరేవ తు వినిర్ముక్తః పరమాత్మేత్యుదాహృతః ॥

ఆత్మ ఎప్పుడు ప్రాకృత గుణాలతో కూడుకొని ఉంటుందో అప్పుడు దాన్ని క్షేత్రజ్ఞుడని పిలుస్తున్నారు. ఆ గుణాలతో ఎప్పుడది విముక్తి నొందుతున్నదో అప్పుడు పరమాత్మగా చెప్పబడుచున్నది.

**24.** ఆత్మానం తం విజానీహి సర్వలోక హితాత్మకమ్।
తస్మిన్ యః సంశ్రితో దేహే హ్యబ్బిందురివ పుష్కరే॥

నీవు క్షేత్రజ్ఞుని ఆత్మగానే తెలుసుకో. సర్వలోక హితకారియై ఆ ఆత్మ ఉన్నది. ఆ ఆత్మ శరీరం నందుండి కూడా తామరాకుమీది నీటిబిందువు వలె వాస్తవంగా దీనికంటె వేరుగా ఉంది.

**25.** క్షేత్రజ్ఞం తం విజానీహి నిత్యం లోకహితాత్మకమ్ ।
తమోరజశ్చ సత్త్వఞ్చ విద్ధి జీవగుణానిమాన్ ॥

ఆ క్షేత్రజ్ఞుని ఎల్లప్పుడూ ఆత్మగానే తెలుసుకో. అది సంపూర్ణ జగత్తుకు హితస్వరూపమై ఉంది. సత్త్వరజస్తమోగుణాలైన ఈ మూడు ప్రాకృత గుణాలను జీవగుణాలుగా తెలుసుకో.

**26.** సచేతనం జీవగుణం వదన్తి
సచేష్టతే చేష్టయతే చ సర్వమ్ ।
అతఃపరం క్షేత్రవిదో వదన్తి
ప్రావర్తయత్ యో భువనాని సప్త ॥

చేతనం జీవసంబంధంవల్ల పైన చెప్పబడిన జీవుని గుణాలు చేతనాయుక్తంగా చెప్పబడినాయి. ఆ జీవం స్వయంగా పనిచేస్తున్నది. అన్ని చేష్టలను చేయిస్తూ ఉంది. శరీరతత్త్వాలను తెలుసుకునే పురుషులు ఈ క్షేత్రజ్ఞుడైన ఆత్మవల్ల ఆ శ్రేష్ఠపరమాత్మను తెలుపుతున్నారు దానివల్ల భూలోకం, భువర్లోకం మొదలగు ఏడులోకాలు పుట్టినాయి.

**27.** న జీవనాశోఽస్తి హి దేహ భేదే మిథ్యైతదాహుర్మ్రృత ఇత్యబుద్ధాః ।
జీవస్తు దేహాన్తరితః ప్రయాతి దశార్ధతైవాస్య శరీరభేదః ॥

దేహం నశించినప్పటికీ జీవం నశించడం లేదు. ఎవరు జీవునికి మృత్యువు ఉందని తెలుపుతున్నారో వారే అజ్ఞానులు. వారు ఆ విధంగా చెప్పడం అంతా మిథ్య. జీవం మృతదేహాన్ని వదిలి వేరే దేహంలో ప్రవేశిస్తున్నది. శరీరంలోని ఐదు తత్త్వాలు వేరువేరు కావడం కూడా శరీర నాశనమే అని చెప్పబడుతున్నది.

**28.** ఏవం సర్వేషు భూతేషు గూఢశ్చరతి సంవృతః ।
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా తత్త్వదర్శిభిః ॥

ఈ ప్రకారం ఆత్మ అన్ని ప్రాణులలో వాటి హృదయ గుహలందు రహస్యంగా తిరుగుతూ ఉంది. అది తత్త్వవేత్తలద్వారా తీక్ష్ణ మరియు సూక్ష్మబుద్ధివల్ల చూడబడుతూ ఉంది.

**29.** తం పూర్వాపర రాత్రేషు యుఞ్జానః సతతం బుధః ।
లఘ్వాహారో విశుద్ధాత్మా పశ్యత్యాత్మానమాత్మని ॥

ఏ విద్వాంసుడు రాత్రికి ముందు మధ్యాహ్నం పరిమితాహారాన్ని భుజించి ఎల్లప్పుడు ధ్యానయోగాభ్యాసం చేస్తాడో అతడు శుద్ధమైన అంతఃకరణంతో తన హృదయంలోనే ఆత్మను చూసుకొంటున్నాడు.

**30.** చిత్తస్య హి ప్రసాదేన హిత్వా కర్మ శుభాశుభమ్ ।
ప్రసన్నాత్మాఽఽత్మని స్థిత్వా సుఖమానన్త్యమశ్నుతే ॥

చిత్తం శుద్ధమైనప్పటికీ అది శుభాశుభకర్మలవల్ల తన సంబంధాన్ని తొలగించుకొని ప్రసన్నచిత్తమైన ఆత్మస్వరూపంలో ఉంటుంది. అనంత ఆనందానుభవాన్ని పొందుతుంది.

**31.** మానసోఽగ్నిః శరీరేషు జీవ ఇత్యభిధీయతే ।
సృష్టి ప్రజాపతేరేషా భూతాధ్యాత్మ వినిశ్చయే ॥

సమస్త శరీరాలలో మనస్సుకు వెలుపల ఉన్నట్టి అగ్నితో సమానమైన ఏ ప్రకాశ స్వరూప చైతన్యం ఉందో ఆ స్వరూపాన్నే సమిష్టి జీవ స్వరూప ప్రజాపతియని చెప్పడం జరుగుతున్నది. ఆ ప్రజాపతిచేతనే ఈ సృష్టి ఏర్పడుతూ ఉంది. ఇది అధ్యాత్మతత్త్వం యొక్క నిశ్చయం కోసమే చెప్పబడింది.

*187 వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 188వ అధ్యాయం

15. వర్ణవిభాగాలతో కూడిన మానవులు మరియు ప్రాణుల ఉత్పత్తిని గూర్చి వర్ణించడం :-

*భృగురువాచ:-*

**1. అసృజత్ బ్రాహ్మణానేవ పూర్వం బ్రహ్మ ప్రజాపతీన్।**
**ఆత్మతేజోఽభినివృత్తాన్ భాస్కరాగ్ని సమప్రభాన్॥**

*భృగు మహర్షి పలికెను:-*

మహర్షీ! బ్రహ్మ సృష్ట్యాదిలో సూర్యుడు మరియు అగ్నితో సమానమైన ప్రకాశంగల బ్రాహ్మణులను మరీచి మొదలగు ప్రజాపతులను సృష్టించినాడు.

**2. తతః సత్యఞ్చ ధర్మఞ్చ తపో బ్రహ్మ చ శాశ్వతమ్।**
**ఆచారఞ్చైవ శౌచఞ్చ స్వర్గాయ విదధే ప్రభుః॥**

అతని తర్వాత భగవంతుడగు బ్రహ్మ స్వర్గప్రాప్తికి సాధనభూతాలైన సత్యం, ధర్మం, తపస్సు, సనాతన వేదాలు మరియు ఆచార శౌచనియమాలను తయారు చేసినాడు.

**3. దేవదానవ గన్ధర్వాః దైత్యాసుర మహోరగాః।**
**యక్షరాక్షసనాగాశ్చ పిశాచామనుజాస్తథా॥**

ఆ తర్వాత దేవతలను, దానవులను, గంధర్వులను, దైత్యులను, అసురులను, మహాసర్పాలను, యక్షులను, రాక్షసులను, నాగులను, పిశాచాలను, మానవులను పుట్టించినాడు.

**4. బ్రాహ్మణాః క్షత్రియాః వైశ్యాః, శూద్రాశ్చ ద్విజసత్తమ।**
**యేచాన్యే భూతసంఘానాం సంఘాస్తాంశ్చాపి నిర్మమే॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! మరల ఆ బ్రహ్మ బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, శూద్రులు అనే నాలుగు వర్ణాల వారిని సృష్టించినాడు. ప్రాణి సమూహాలలో ఏ ఇతర సంప్రదాయాలున్నాయో వాటినికూడా సృష్టించినాడు.

5. బ్రాహ్మణానాం సితో వర్ణః క్షత్రియాణాం తు లోహితః।
వైశ్యానాం పీతకో వర్ణః శూద్రాణామసితస్తథా॥

ఆ తర్వాత బ్రాహ్మణులకు తెల్లని రంగును, క్షత్రియులకు ఎర్రని రంగును, వైశ్యులకు పసుపురంగును, శూద్రులకు నలుపురంగును నిర్దేశించినాడు.

*భరద్వాజ ఉవాచ:-*

6. చాతుర్వర్ణ్యస్య వర్ణేన యది వర్ణో విభిద్యతే।
సర్వేషాం ఖలు వర్ణానాం దృశ్యతే వర్ణసంకరః॥

*భరద్వాజుడు పలికెను:-*

ప్రభూ! నాలుగు వర్ణాలనుండి ఒక వర్ణానికి మరో వర్ణభేదం ఉంటే అప్పుడు అన్ని వర్ణాలలో భిన్నభిన్న వర్ణాల మానవులు ఉంటే వర్ణసంకరం కనబడుతున్నది కదా!

7. కామః క్రోధో భయం లోభః శోకశ్చిన్తా క్షుధాశ్రమః।
సర్వేషాం న ప్రభవతి కస్మాత్ వర్ణో విభద్యతే॥

కామం, క్రోధం, భయం, లోభం, శోకం, చింత, ఆకలి, అలసట వీటి ప్రభావం అన్ని ప్రాణులపై సమానంగా పడుతూ ఉందికదా! మరి వర్ణభేదం ఎలా కలుగుతూ ఉంది?

8. స్వేదమూత్ర పురీషాణి శ్లేష్మాపిత్తం సశోణితమ్।
తనుఃక్షరతి సర్వేషాం కస్మాత్ వర్ణో విభజ్యతే॥

బ్రాహ్మణుడు మొదలగు నాలుగు వర్ణాలకు చెందిన వారి శరీరం నుండి చెమట, మలం, మూత్రం, కఫం, పిత్తం, రక్తం వెలువడుతున్నాయి ఇలాంటి దశలో రంగుకారణంగా వర్ణవిభజన ఎలా చేయుటకు వీలు అవుతుంది?

9. జఙ్గమానామసంఖ్యేయాః స్థావరాణాఞ్చ జాతయః।
తేషాం వివిధ వర్ణానాం కుతో వర్ణవినిశ్చయః॥

పశువులు, పక్షులు, మానవులు మొదలగు తిరిగే ప్రాణులు, అట్లే చెట్లు, పర్వతాలు మొదలగు కదలని జాతులు లెక్కలేనన్ని ఉన్నాయి. వాటికి రంగులుకూడా అనేకంగా ఉన్నాయి. అందువల్ల వాటిరంగు నిర్ణయం ఎలా చేయవచ్చును?

*భృగురువాచ:-*

**10.** న విశేషోఽస్తి వర్ణానాం సర్వం బ్రాహ్మమిదం జగత్ ।
బ్రహ్మణా పూర్వసృష్టం హి కర్మభిర్వర్ణతాం గతమ్ ॥

*భృగుమహర్షి పలికెను:-*

ఓ మునీ! మొదట వర్ణాలలో ఏ భేదం ఉండేది కాదు. బ్రహ్మ వల్ల ఉత్పన్నమైన కారణాన ఈ జగత్తంతా బ్రహ్మసంబంధంగా ఉండేది. ఆ తర్వాత విభిన్న కర్మల కారణంగా వాటిలో వర్ణభేదాలు ఏర్పడ్డాయి.

**11.** కామభోగప్రియాస్తీక్ష్ణాః క్రోధనాః ప్రియసాహసాః ।
త్యక్త స్వధర్మా రక్తాఙ్గాస్తేద్విజాః క్షత్రతాం గతాః ॥

ఎవరు తమ బ్రాహ్మణోచిత ధర్మాన్ని వదిలి విషయభోగాలపై ప్రేమగలిగి తీక్ష్ణస్వభావం కలిగి కోపం మరియు సాహస కార్యాలలో ఆసక్తి కలిగి ఉంటారో. అప్పుడు వారి శరీరం ఎర్రగా మారింది. ఈ కారణం వల్ల కొంత మంది బ్రాహ్మణులు క్షత్రియులైనారు.

**12.** గోభ్యో వృత్తిం సమాస్థాయ పీతాః కృష్యుపజీవినః ।
స్వధర్మాన్ నానుతిష్ఠన్తి తే ద్విజాః వైశ్యతాం గతాః ॥

ఎవరు ఆవులను పోషిస్తూ, వ్యవసాయం ద్వారా తమ జీవనాన్ని సాగించినారో అట్టివారి రంగు పసుపు పచ్చగా మారింది. ఈ విధంగా బ్రాహ్మణోచితమైన ధర్మాన్ని ఎవరు వదిలి పెట్టినారో అలాంటి బ్రాహ్మణులు వైశ్యులయినారు.

**13.** హింసానృతప్రియా లుబ్ధాః సర్వకర్మోపజీవినః ।
కృష్ణాః శౌచపరిభ్రష్టాస్తే ద్విజాః శూద్రతాం గతాః ॥

ఎవరు శౌచసదాచారాలనుండి భ్రష్టులై హింసాసత్య ప్రేమికులై లోభవశాన అన్ని విధాల నింద్యకర్మలను చేసి జీవించినారో అలాంటి వారి శరీరం నల్లనైంది. అలాంటి బ్రాహ్మణులు శూద్రులైనారు.

**14.** ఇత్యేతైః కర్మభిర్వ్యస్తా ద్విజా వర్ణాంతరం గతాః ।
ధర్మోయజ్ఞక్రియా తేషాం నిత్యం న ప్రతిషిధ్యతే ॥

ఈ పనులవల్ల బ్రాహ్మణులంతా వేరువేరు వర్ణాలవారైనారు. కాని వారి కొఱకై నిత్యధర్మానుష్ఠానం మరియు యజ్ఞకర్మ ఎప్పుడూ నిషేధింపబడలేదు.

**15.** ఇత్యేతే చతురో వర్ణాః యేషాం బ్రాహ్మీ సరస్వతీ ।
విహితా బ్రహ్మణా పూర్వం లోభాత్ త్వజ్ఞానతాం గతాః ॥

ఈ విధంగా నాలుగు వర్ణాలు ఏర్పడినాయి. వారికొఱకై మొదట బ్రహ్మ వేదవాణిని సృష్టించినాడు. కాని లోభవిశేష కారణంగా బ్రాహ్మణులు అజ్ఞాన భావాన్ని పొంది వేదాధ్యయనంలో మనసు నిలుపలేక పోయిరి. (అనధికారులైరి)

**16.** బ్రాహ్మణా బ్రహ్మ తంత్రస్థాస్తపస్తేషాం న నశ్యతి ।
బ్రహ్మధారయతాం నిత్యం వ్రతాని నియమాంస్తథా ॥

ఏ బ్రాహ్మణులు వేదాజ్ఞకు అధీనులై అన్ని కార్యాలను చేస్తూ, వేదమంత్రాలను స్మరిస్తూ ఎల్లప్పుడూ, వ్రతాలను, నియమాలను పాలిస్తూ ఉంటారో అట్టివారి తపస్సు ఎన్నటికీ వ్యర్థం కాదు.

**17.** బ్రహ్మ చైవ పరం సృష్టం యే న జానన్తి తేఽద్విజాః ।
తేషాం బ్రహ్మవిధాస్త్వన్యాస్తత్ర తత్ర హి జాతయః ॥

ఎవరు ఈ మొత్తం సృష్టిని పరబ్రహ్మ పరమాత్మరూపంగా తెలుసుకోలేకపోతున్నారో వారు బ్రాహ్మణులని చెప్పుకొనుటకు అధికారం లేదు. ఇట్టివారు నానారకాలైన యోనుల్లో జన్మించవలసి ఉంటుంది.

**18.** పిశాచా రాక్షసాః ప్రేతా వివిధా మ్లేచ్ఛజాతయః ।
ప్రణష్టజ్ఞాన విజ్ఞానాః స్వచ్ఛాన్దాచార చేష్టితాః ॥

వారు జ్ఞానవిజ్ఞానాలు **లేక** స్వేచ్ఛాప్రియులై పిశాచ రాక్షసప్రేతాలైన వివిధ మ్లేచ్ఛజాతులందు జన్మించి మూఢాచారులై నడుచుకొంటూ ఉంటారు.

**19.** ప్రజా బ్రాహ్మణ సంస్కారాః స్వకర్మకృతనిశ్చయాః ।
ఋషిభిః స్వేన తపసా సృజ్యన్తే చాపరైః పరైః ॥

పూర్వం ఋషులు తమ తపోబలం వల్ల కొంత మందిని సృష్టించినారు. వారెట్టివారనగా వైదిక సంస్కార సంపన్నులై తమ ధర్మకర్మలందు కృతనిశ్చయులై ఉండినారు. ఈ ప్రకారం ప్రాచీన ఋషులద్వారా అర్వాచీన ఋషుల సృష్టి జరిగింది.

**20.** ఆదిదేవ సముద్భూతా బ్రహ్మమూలాక్షయాత్యయా ।
సా సృష్టిర్మానసీ నామ ధర్మతన్త్ర పరాయణాః ॥

కాని ఏ సృష్టి ఆదిదేవుడగు బ్రహ్మ మనస్సుతో ఉత్పత్తి అయ్యిందో ఆ సృష్టి వృక్షానికి మూలం కేవల బ్రహ్మయే. ఏ సృష్టి అక్షయ అవికార ధర్మంనందు తత్పరమై ఉందో ఆ సృష్టి మానవులకు చెందిన సృష్టి అని చెప్పబడుతున్నది.

***188వ అధ్యాయం ముగిసింది***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 189వ అధ్యాయం

### 16. నాలుగు వర్ణాల వారికి చెందిన వేరువేరు కర్మలు - సదాచారం-వైరాగ్యం వల్ల కలిగే పరబ్రహ్మప్రాప్తిని గూర్చి వర్ణించడం.

*భరద్వాజ ఉవాచ:-*

1. బ్రాహ్మణః కేన భవతి క్షత్రియో వా ద్విజోత్తమ! ।
వైశ్యః శూద్రశ్చ విప్రర్షే! తద్బ్రూహి వదతాం వర ॥

*భరద్వాజుడు పలికెను:-*

మాట్లాడువారిలో శ్రేష్ఠుడైన ఓ బ్రహ్మర్షీ! బ్రాహ్మణోత్తమ! మనుష్యులే కర్మ చేయడం వల్ల బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులౌతున్నారు. అనే ఈ అంశాన్ని నాకు చెప్పవలసిందిగా కోరుచున్నాను.

*భృగురువాచ:-*

2. జాతకర్మాదిభిర్యస్తు సంస్కారైః సంస్కృతః శుచిః ।
వేదాధ్యయనసంపన్నః షట్సు కర్మస్వవస్థితః ॥

3. శౌచాచారస్థితః సమ్యగ్విఘసాశీ గురుప్రియః ।
నిత్యవ్రతీ సత్యపరః స వై బ్రహ్మ ఉచ్యతే ॥

*భృగు మహర్షి పలికెను:-*

ఎవడు జాతి, కర్మ మొదలగు వానితో సంస్కారుడై, పవిత్రుడై స్వాధ్యాయపరుడై, యజన - యాజన - అధ్యయన - దాన - ప్రతిగ్రహం అనే ఆరు కర్మలను చేస్తూ శౌచం మరియు సదాచారాలను పాటిస్తూ, పరమోత్తమ యజ్ఞశేషాన్ని భుజిస్తూ, గురువుపై భక్తిని చూపుతూ, నిత్యం వ్రతపాలన చేస్తూ, సత్యతత్పరుడై ఉంటాడో అతడే బ్రాహ్మణుడని పిలువబడుతూ ఉన్నాడు

4. సత్యదానమథాద్రోహ ఆనృశంస్యం త్రపా ఘృణా ।
తపశ్చ దృశ్యతే యత్ర సబ్రాహ్మణ ఇతి స్మృతః ॥

ఎవనియందు సత్యం, దానం, అద్రోహం, అక్రూరం, సిగ్గు, దయ, తపస్సు అనే ఏ సద్గుణాలుంటాయో, అతడు బ్రాహ్మణుడని చెప్పబడుతున్నాడు.

5. క్షత్రజం సేవతే కర్మ వేదాధ్యయన సంగతః।
దానాదానరతిర్యస్తు స వై క్షత్రియ ఉచ్యతే॥

ఎవడు క్షత్రియోచిత యుద్ధం మొదలగు కర్మలను చేస్తూ, వేదాలను చదివి, బ్రాహ్మణులకు దానం చేస్తూ, ప్రజలనుండి పన్నులు వసూలు చేస్తూ ప్రజలను కాపాడుతాడో అతడు క్షత్రియుడని చెప్పబడుతున్నాడు.

6. వణిజ్యా పశురక్షా చ కృష్యాదానరతిః శుచిః।
వేదాధ్యయన సంపన్నః స వైశ్య ఇతి సంజ్ఞితః॥

ఈ విధంగా ఎవడు వేదాధ్యయనంతో సంపన్నుడై, వ్యాపారం, పశుపాలన, వ్యవసాయం చేస్తూ, అన్న సంగ్రహణం చేయడంలో అభిరుచిని చూపుతూ పవిత్రుడై ఉంటాడో, అతడు వైశ్యుడని చెప్పబడుతున్నాడు.

7. సర్వభక్షరతిర్నిత్యం సర్వకర్మకరోఽశుచిః।
త్యక్తవేదస్త్వనాచారో స వై శూద్ర ఇతి స్మృతః॥

ఎవడు వేదాలను చదువక, సదాచారాన్ని వదలి, ఎల్లప్పుడు అన్నింటిని తినుటయందు ఆసక్తుడై, అన్ని పనులను చేస్తూ, పైకి, లోపల అపవిత్రుడై ఉంటాడో అలాంటి వాడు శూద్రుడని చెప్పబడుతున్నాడు.

8. శూద్రేచైతద్భవేల్లక్ష్యం ద్విజే తచ్చ న విద్యతే।
న వై శూద్రో భవేచ్ఛూద్రో బ్రాహ్మణో న చ బ్రాహ్మణః॥

ముందు చెప్పబడిన సత్యం మొదలగు గుణాలు శూద్రుని యందు ఉన్నట్లయితే బ్రాహ్మణునియందు లేకపోయినట్లయితే ఆ శూద్రుడు శూద్రుడు కాడు. ఆ బ్రాహ్మణుడు బ్రాహ్మణుడు కాదు.

9. సర్వోపాయైస్తు లోభస్య క్రోధస్య చ వినిగ్రహః।
ఏతత్ పవిత్రం జ్ఞానానాం తథాచైవాత్మ సంయమః॥

అన్ని ఉపాయాలతో లోభం, కోపం జయింపబడాలి. ఇలా చేయడమే జ్ఞానమని తెలుసుకోవాలి. ఇదే జ్ఞానాలందు పవిత్ర జ్ఞానం. ఇదే ఆత్మసంయమనం అని తెలుసుకోవాలి.

10. వార్యౌ సర్వాత్మనా తౌ హి శ్రేయోఘాతార్థముచ్ఛ్రితౌ।
నిత్యం క్రోధాచ్ఛ్రియం రక్షేత్ తపోరక్షేచ్చ మత్సరాత్॥

11. విద్యాం మానాపమానాభ్యామాత్మానం తు ప్రమాదతః।

కోపం మరియు లోభం మానవుల శ్రేయో విషయాలందు ఎల్లప్పుడూ బాధ కల్గించడానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. అందువల్ల శక్తినంతా ఉపయోగించి ఈ రెండింటినీ నివారించాలి. ధనసంపత్తిని క్రోధాఘాతం నుండి రక్షించాలి. తపస్సును మాత్సర్యాఘాతం నుండి రక్షించాలి. విద్యను మానావమానాల నుండి రక్షించాలి. ప్రమాదాల నుండి తనకు తాను రక్షించుకోవాలి.

**యస్య సర్వే సమారమ్భా నిరాశీర్బంధనాద్విజ ॥**

**12. త్యాగే యస్యహుతం సర్వం స త్యాగీ స చ బుద్ధిమాన్।**

బ్రాహ్మణుడా! ఎవడు కోర్కెలనన్నింటినీ వదులుతాడో అలాగే ఎవడు త్యాగమనే అగ్నిలో అన్నింటినీ హోమం చేస్తాడో అట్టివాడే త్యాగి మరియు బుద్ధిమంతుడు.

**అహింస్రః సర్వభూతానాం మైత్రాయణగతశ్చరేత్ ॥**

**13. పరిగ్రహాన్ పరిత్యజ్య భవేత్ బుద్ధ్యా జితేన్ద్రియః।**
**అశోకం మానమావిష్ఠేదిహ చాముత్ర చాభయమ్ ॥**

నీవు ఏ ప్రాణినీ హింసించరాదు. అందరి ఎడల మిత్రభావాన్ని చూపించాలి. స్త్రీ పుత్రుల ఎడల మమకారాన్ని ఆసక్తిని వదిలి బుద్ధిద్వారా ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. ఈ లోకంలోగాని పరలోకంలోగాని భయంలేనట్టి దుఃఖం లేనట్టి స్థితిని పొందాలి.

**14. తపో నిత్యేన దాన్తేన మునినా సంయతాత్మనా।**
**అజితం జేతుకామేన భావ్యం సఙ్గేష్వసఙ్గినా ॥**

నిత్యం తపస్సుచెయ్యి, మనన శీలుడవై ఇంద్రియాలను అదిమి మనస్సును నిగ్రహించు. ఆసక్తికి ఆశ్రయభూతమైన దేహగృహం మొదలగు వాటియందు ఆసక్తుడవు గాక పరమాత్మను పొందుటకు ఇష్టపడు.

**15. ఇన్ద్రియైర్గృహ్యతే యద్యద్ తత్తద్ వ్యక్తమితిస్థితిః।**
**అవ్యక్తమితి విజ్ఞేయం లిఙ్గగ్రాహ్యమతీన్ద్రియమ్ ॥**

ఇంద్రియాల ద్వారా ఏది గ్రహింపబడుతుందో అదంతా వ్యక్తమని చెప్పబడుతూ ఉంది. ఏది ఇంద్రియాతీతమో దాని కారణంగా అనుమానం ద్వారా తెలుసుకోదగిందో దాన్ని అవ్యక్తంగా భావించు.

**16. అవిస్రమ్భే న గన్తవ్యం విస్రమ్భే ధారయేన్మనః।**
**మనః ప్రాణే నిగృహ్ణీయాత్ ప్రాణం బ్రహ్మణి ధారయేత్ ॥**

ఏ మార్గం విశ్వాసయోగ్యం కాదో ఆ మార్గంలో ప్రయాణం చేయవద్దు. ఏది విశ్వసించుటకు యోగ్యమయిందో దానియందు మనస్సును లగ్నం చేయాలి. మనస్సును ప్రాణంనందు ప్రాణాన్ని బ్రహ్మయందూ ఉంచాలి.

**17.** నిర్వేదాదేవ నిర్వాణం న చ కిఞ్చిత్ విచిన్తయేత్।
సుఖం వై బ్రాహ్మణో బ్రహ్మ నిర్వేదాదధిగచ్ఛతి ॥

వైరాగ్యం ద్వారానే మోక్షాన్ని పొందవచ్చు. దాన్ని పొంది మానవుడు ఏ అనాత్మపదాన్ని గూర్చి ఆలోచించడం లేదు. బ్రాహ్మణుడు సంసారం నుండి వైరాగ్యాన్ని పొంది సుఖస్వరూపమైన పరబ్రహ్మయైన పరమాత్మను పొందుతున్నాడు.

**18.** శౌచేన సతతం యుక్తః సదాచార సమన్వితః।
సానుక్రోశశ్చ భూతేషు తద్ ద్విజాతిషు లక్షణమ్ ॥

ఎల్లప్పుడూ శౌచాన్ని సదాచారాన్ని పాలించాలి. సమస్త ప్రాణుల ఎడల దయాభావాన్ని ఉంచాలి. ఇదే బ్రాహ్మణుని ప్రధాన లక్షణం.

***189వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 190వ అధ్యాయం

17. సత్యమహిమ - అసత్యదోషం - ఇహలోక పరలోకాలందలి సుఖ దుఃఖ వివేచనాన్ని గూర్చి తెలుపడం :-

భృగురువాచ:-

**1.** సత్యం బ్రహ్మ తపస్సత్యం సత్యం విసృజతే ప్రజాః।
సత్యేన ధార్యతే లోకః స్వర్గం సత్యేన గచ్ఛతి॥

భృగు మహర్షి పలికెను :-

ఓ మునీ! సత్యమే బ్రహ్మ. సత్యమే ప్రజలను సృష్టిస్తూ ఉంది. సత్యాన్ని ఆధారంగా చేసుకొనే ఈ ప్రపంచం నిలిచి ఉంది. సత్యప్రభావం చేతనే మానవుడు స్వర్గానికి వెళ్తున్నాడు.

**2.** అనృతం తమసోరూపం తమసానీయతేహ్యధః।
తమోగ్రస్తా న భవన్తి ప్రకాశం తమసాఽఽవృతాః॥

అసత్యం, చీకటిరూపం, అది మానవుని క్రింద పడవేస్తున్నది. అజ్ఞానమనే చీకటిలో పడవేయబడ్డ మానవుడు చీకటి అనే త్రాటిచే పట్టుబడ్డవాడై జ్ఞానమనే ప్రకాశాన్ని చూడలేక పోతున్నాడు.

**3.** స్వర్గః ప్రకాశ ఇత్యాహుర్నరకం తమ ఏవ చ।
సత్యానృతం తదుభయం ప్రాప్యతే జగతీచరైః॥

స్వర్గం ప్రకాశమయమనీ, నరకం చీకటిమయమనీ చెబుతున్నారు. సత్యమనే అబద్ధంతో కూడి ఏ మానవయోని ఉందో అది జ్ఞానం మరియు అజ్ఞానంతో కూడి ప్రపంచంలోని జీవులకు లభిస్తూ ఉంది.

**4.** తత్రాప్యేవం విధాలోకే వృత్తిః సత్యానృతే భవేత్।
ధర్మాధర్మౌ ప్రకాశశ్చ తమోదుఃఖం సుఖం తథా॥

ఏవైతే సత్యాబద్ధాలో అవే ధర్మాధర్మాలనీ, ప్రకాశం మరీ అంధకారమనీ, సుఖదుఃఖాలనీ, అందులో ఇలాంటి విధం కలదనీ తెలుసుకోవాలి.

**5.** తత్ర యద్ సత్యం సధర్మో యోధర్మః స ప్రకాశో యః।
ప్రకాశస్తత్ సుఖమితి, తత్ర యదనృతం సోఽధర్మోయోఽ
ధర్మస్తత్ తమోయద్ తమస్తత్ దుఃఖమితి ॥

అచట ఏ సత్యముందో అదే ధర్మం. ఏది ధర్మమో అదే ప్రకాశం ఏది ప్రకాశమో అదే సుఖం. ఈ ప్రకారం అచట ఏది అసత్యమో (అబద్ధమో) అదే అధర్మం. ఏది అధర్మమో అదే అంధకారం. ఏది అంధకారమో అది దుఃఖం.

**6.** శారీరికైర్మానసైర్దుఖైః సుఖైశ్చాప్యసుఖోదయైః।
లోకసృష్టిం ప్రపశ్యన్తో న ముహ్యన్తి విచక్షణాః॥

ఈ విషయంలో ఇలా చెప్పబడుతూ ఉంది. ప్రపంచ సృష్టి శారీరక మానసిక క్లేశాలతో కూడినట్టిది. ఇందులో ఏ సుఖాలు ఉన్నాయో అవికూడా చివరకు దుఃఖాన్ని కలుగుజేస్తున్నాయి. ఇట్టి దృష్టిని కలిగియున్న విద్యాంసులైన పురుషులు మోహాన్ని పొందడం లేదు.

**7.** తత్ర దుఃఖవిమోక్షార్థం ప్రయతేత విచక్షణః।
సుఖం హ్యనిత్యం భూతానామిహ లోకే పరత్ర చ॥

అందువల్ల విజ్ఞుడు మరియు బుద్ధిమంతుడైన పురుషుడు ఎల్లప్పుడూ దుఃఖాన్నుండి విముక్తుడవటానికి ప్రయత్నించాలి. ఇహలోకపరలోకాలందు ప్రాణులకు ఏ సుఖం లభిస్తుందో అది అనిత్యమే.

**8.** రాహుగ్రస్తస్య సోమస్య యథా జ్యోత్స్నా న భాసతే।
తథా తయోఽభిభూతానాం భూతానాం నశ్యతే సుఖమ్॥

ఏ ప్రకారం రాహువుతో గ్రహింపబడ్డ చంద్రుని వెన్నెల ప్రకాశించదో అదే విధంగా చీకటిలో (అజ్ఞానం మరియు దుఃఖం) పీడింపబడు ప్రాణుల సుఖం నష్టమవుతూ ఉంది.

**9.** తత్ఖలు ద్వివిధం సుఖముచ్యతే శారీరం మానసఞ్చ
ఇహఖల్వాముష్మికంశ్చ వస్తుప్రవృత్తయః సుఖార్థమభిధీయన్తే.।
నహ్యతఃపరం త్రివర్గఫలం విశిష్టతరమస్తి స ఏవ కామ్యో
గుణవిశేషో ధర్మార్థగుణారమ్భస్తద్ధేతు రస్యోత్పత్తిః సుఖ
ప్రయోజనార్థ ఆరమ్భః ॥

సుఖం రెండు విధాలని తెలుస్తున్నది. అందు మొదటిది శారీరకం. రెండవది మానసికం. ఇహలోక పరలోకాలందు వస్తువులను పొందుటకు ఏ ప్రవృత్తులున్నాయో

అవి సుఖం కోసమే చెప్పబడినాయి. ఈ సుఖాన్ని మించి త్రివర్గాల కంటె (ధర్మార్థకామాలు) ఏదీ మిక్కిలి విశిష్టమైన ఫలం లేదు. ఆ సుఖమే ప్రాణిచే కోరదగిన విశేషం. ధర్మం మరియు అర్థం దేని యొక్క అంగాలుగా యున్నాయో, వాటి యొక్క సుఖం కొఱకే కర్మలు ఆరంభించబడుతున్నాయి. ఎందువలననగా సుఖోత్పత్తి యందే ఉద్యమ హేతువులున్నాయి. అందువల్ల సుఖోద్దేశ్యం చేతనే కర్మారంభాలు చేయబడుతున్నాయి.

భరద్వాజ ఉవాచ :-

**10.** యదేతత్ భవతాభిహితం సుఖానాం
పరమాస్థితిరితి న తదుపగృహ్ణిమో నహ్యేషామృషీణాం మహతి
స్థితానామప్రాప్య ఏష కామ్యోగుణ విశేషో నచైనమభిలషన్తి చ
తపసి శ్రూయతే త్రిలోకకృత్ బ్రహ్మప్రభురేకాకీ తిష్ఠతి. బ్రహ్మచారీ
న కామసుఖేషాత్మానమవదధాతి. అపి చ భగవాన్ విశ్వేశ్వర ఉమా
పతిః కామమభివర్తమానమనఙ్గత్వేన శమమనయత్. తస్మాద్ బ్రూమో
నతు నతు మహాత్మభిరయం ప్రతిగృహీతో నత్వేషాం తావద్విశిష్టో
గుణవిశేషో ఇతి. నైతత్ భగవతః ప్రత్యేమి. భగవతాతూక్తం సుఖాన్న
పరమస్తీతి. లోక ప్రవాదో హి ద్వివిధః ఫలోదయః సుకృతాత్ సుఖమ
వాప్యతే దుష్కృతాత్ దుఃఖమితి. ॥

భరద్వాజుడు పలికెను :-

ప్రభూ! సుఖాలకే అన్నింటి కన్న గొప్పస్థానముందని సుఖాన్ని మించి త్రివర్గానికి ఏ ఫలం లేదనీ నీ మాటద్వారా తెలుస్తుంది. కాని ఈ మాటలో సారాన్ని గ్రహింపలేకున్నాను. ఎందుకంటె గొప్ప తపస్సులోనుండిన ఏ ఋషులైతే ఉన్నారో, వారికి ఈ అవసరమైన గుణవిశేష సుఖం లభించినప్పటికీ వారు దీన్ని కోరడం లేదు. మనం విన్నదేమంటే ముల్లోకాలను సృష్టించు భగవంతుడైన బ్రహ్మ ఒంటరిగా ఉన్నాడని. ఆయన భగవతి పార్వతీదేవి వల్లభుడు. భగవంతుడైన విశ్వనాథుడు తన ఎదుటనున్న కాముని భస్మంచేసి శాంతుడై అతన్ని శరీరంలేని వానిగా చేసినాడు. అందువల్ల కామసుఖం అనగా సాంసారిక భోగాల సుఖం అన్నింటికంటె మించిన సుఖంకాదు. కాని మీ మాటల వల్ల నాకెలాంటి జ్ఞానం కలుగడం లేదు. పుణ్యకర్మలవల్ల సుఖం పాపకర్మల వల్ల దుఃఖం అని ఫలోత్పత్తి రెండు విధాలుగా చెప్పబడింది లోకంలో.

భృగురువాచ:-

**11.** అత్రోచ్యతే **అనృతాత్** కిల తమః ప్రాదుర్భూతం
తమస్తమోగ్రస్తా అధర్మమేవానువర్తతే న ధర్మం క్రోధ ధర్మహింసానృతాభి
రవచ్ఛన్నా నఖల్వస్మింల్లోకే నాముత్ర సుఖమాప్నువన్తి. వివిధవ్యాధి
రుజోపతాపైరవకీర్యన్తే! వధబంధన పరిక్లేశాదిభిశ్చ క్షుత్పిపాసా
శ్రమకృతైరుపతప్యన్తే వర్షవాతాత్యుష్ణాతిశీతకృతైశ్చ ప్రతిభయైః
శారీరైర్దుఃఖైరుపతప్యన్తే. బంధుజన వినాశ విప్రయోగ కృతైశ్చ మానసైః
శోకైరభిభూయన్తే జరామృత్యుకృతైశ్చాన్యైరితి ॥

భృగు మహర్షి పలికెను:-

ఓ మునీ! అసత్యం వల్ల అజ్ఞానం పుట్టింది. అందువల్ల చీకటిలో పట్టువడ్డ మానవులవలె వారు అధర్మం వెంట పోతూ ఉంటారు. వారు ధర్మాన్ననుసరించడం లేదు. ఏ మానవులు కోపం, లోభం, హింస, అసత్యం మొదలగు వాటితో ఆవరింపబడి ఉన్నారో, వారు ఈ లోకంలోగాని, పరలోకంలోగాని, సుఖంగా ఉండడం లేదు. వారు నానారకాలైన వ్యాధులతో, రోగాలతో బాధలతో పీడింపబడుతున్నారు. చంపడం, బంధించడం మొదలగు కష్టాలతోను, ఆకలి, దప్పిక, అలసట మొదలగు బాధలతోను పీడింపబడుతున్నారు. ఇంతేగాక వారు వర్షం, పెనుగాలి, అతివేడి, అతిచల్లన మొదలగు వాటివల్ల గలిగే భయంకర శారీరక కష్టాలను కూడా సహించవలసి ఉంటుంది. బంధుజనుల మృతి, ధననష్టం, ప్రేమికుల ఎడల గల వియోగకారణంతో గలిగిన మానసిక శోకాలు కూడా వారిని బాధిస్తూఉన్నాయి. వృద్ధత్వం, మృత్యుకారణం, అనేక ఇతరకారణాల వల్ల కూడా వారు పీడింపబడుతూనే ఉన్నారు.

**12.** యస్త్వేతైః శారీరమానసైర్దుఃఖైర్న సంస్పృశ్యతే స సుఖం వేద।
న చైతే దోషాః స్వర్గేప్రాదుర్భవన్తి తత్రఖలు భవన్తి ॥

ఎవరికి శారీరక మానసిక దుఃఖాలవల్ల సంబంధం ఉండదో, అతనికే సుఖానుభవం ఉంటుంది. స్వర్గలోకంలో ముందు చెప్పబడ్డ దుఃఖరూపదోషాలు ఉండడంలేదు - అక్కడ గల సౌకర్యాలు ఇలా ఉన్నాయి.

**13.** సుసుఖః పవనః స్వర్గే గన్ధశ్చ సురభిస్తథా।
క్షుత్పిపాసా శ్రమో నాస్తి న జరా న చ పావకమ్ ॥

స్వర్గంలో అత్యంత సుఖాన్ని కలుగుజేయు గాలి వీస్తూ ఉంటుంది. అందు మనోహరమైన సువాసన వస్తూ ఉంటుంది. ఆకలి, దప్పిక, కష్టం, ముసలితనం పాపఫలకష్టం అక్కడ ఎప్పటికీ అనుభవించబడవు.

**14.** నిత్యమేవ సుఖం స్వర్గే సుఖం దుఃఖమిహోభయమ్ ।
నరకే దుఃఖమేవాహుః సుఖం తత్పరమం పదమ్ ॥

స్వర్గంలో ఎల్లప్పుడూ సుఖమే ఉంటుంది మానవలోకంలో సుఖదుఃఖాలు రెండూ ఉంటాయి. నరకంలో కేవలం దుఃఖమే ఉంటుంది. నిజమయిన సుఖం అనేది పరమపద స్వరూప పరబ్రహ్మ పరమాత్మయే.

**15.** పృథివీ సర్వభూతానాం జనిత్రీ తద్విధాః స్త్రియః ।
పుమాన్ ప్రజాపతిస్తత్ర శుక్రం తేజోమయం విదుః ॥

ఈ భూమి సంపూర్ణ భూతాలకు తల్లి. ప్రపంచంలోని స్త్రీలుకూడా భూమితో సమానంగా సంతానాన్నిచ్చే తల్లులై ఉన్నారు. పురుషుడే అచట ప్రజాపతి. పురుషుని ఏ వీర్యమైతే ఉందో దాన్ని తేజో స్వరూపంగా తెలుసుకోవాలి.

**16.** ఇత్యేతల్లోక నిర్మాణం బ్రహ్మణా విహితం పురా ।
ప్రజాః సమనువర్తనే స్వైఃస్వైః కర్మభిరావృతాః ॥

పూర్వకాలంలో బ్రహ్మదేవుడే ఈ స్త్రీ పురుషరూప ప్రపంచాన్ని సృష్టించినాడు. ఇచట సమస్త ప్రజలు తమ తమ పనులతో ఆవరింపబడి సుఖదుఃఖాలను పొందుతూ ఉన్నారు.

*190వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 191వ అధ్యాయం

18. బ్రహ్మచర్య గృహస్థాశ్రమ ధర్మాలను గూర్చి వర్ణించడం:-

*భరద్వాజ ఉవాచ:-*

**1.** దానస్య కిం ఫలం ప్రాహుర్ధర్మస్య చరితస్య చ।
తపసశ్చ సుతప్తస్య స్వాధ్యాయస్య హుతస్య వా॥

*భరద్వాజుడు పలికెను :-*

ఓ బ్రాహ్మణుడా! ఆచరణలోకి తీసుకొని రాబడ్డ దానరూప ధర్మం, చక్కగా చేసిన తపస్సు, స్వాధ్యాయం మరియు అగ్నిహోత్రానికి చెందిన ఫలాలు ఎటువంటివి?

*భృగురువాచ :-*

**2.** హుతేన శామ్యతే పాపం స్వాధ్యాయైః శాన్తిరుత్తమా।
దానేన భోగానిత్యాహుస్తపసా స్వర్గమాప్నుయాత్॥

*భృగుమహర్షి పలికెను:-*

ఓ మునీ! అగ్నిహోత్రం వల్ల పాపం నివారింపబడుతూ ఉంది. స్వాధ్యాయం వల్ల ఉత్తమ శాంతి లభిస్తూ ఉంది. దానం వల్ల భోగం ప్రాప్తిస్తూ ఉంది. తపస్సువల్ల స్వర్గలోకం లభిస్తుందని చెప్పబడ్డాయి.

**3.** దానం తు ద్వివిధం ప్రాహుః పరత్రార్థమిహైవ చ।
సద్భ్యో యద్దీయతే కిఞ్చిత్ తత్పరత్రోపతిష్ఠతే॥

**4.** అసద్భ్యో దీయతే యత్తు తద్ దానమిహ భుజ్యతే।
యాదృశం దీయతే దానం తాదృశం ఫలమశ్నుతే॥

దానం రెండు విధాలుగా చెప్పబడింది. అందు ఒకటి పరలోకం కొఱకు మరొకటి ఈ లోకం కొఱకు ఉద్దేశింపబడింది. సత్పురుషులకు ఏదానం ఇవ్వబడుతుందో ఆ దానం పరలోకంలో తనకు ఫలాన్నివ్వడానికై సిద్ధంగా ఉంటుంది. అట్లే సత్పురుషులు కాని వారికి ఏ దానం ఇవ్వబడుతుందో అది ఇక్కడే అనుభవింపబడుతూ

ఉంటుంది. ఏ విధంగా దానమివ్వబడుతూ ఉంటుందో అదే ఆ విధంగా అనుభవించబడుతూ ఉంటుంది.

*భరద్వాజ ఉవాచ:-*

**5.** కిం కస్య ధర్మాచరణం కిం వా ధర్మస్య లక్షణమ్ ।
ధర్మః కతివిధో వాపి తద్ భవాన్ వక్తుమర్హతి ॥

*భరద్వాజుడు పలికెను:-*

బ్రాహ్మణుడా! ఎవరి ధర్మాచరణం ఎలా ఉంటుంది? ధర్మం యొక్క లక్షణమేది? ధర్మం యొక్క బేధాలేవి? వీటన్నింటినీ గూర్చి నాకు తెలుపవల్సింది.

*భృగురువాచ:-*

**6.** స్వధర్మాచరణే యుక్తా యే భవన్తి మనీషిణః ।
తేషాం స్వర్గఫలావాప్తిర్యోఽన్యథా స విముహ్యతే ॥

ఓ మహర్షీ! ఏ విద్వాంసులైన పురుషులు తమ వర్ణాశ్రమానికి తగినట్లు ధర్మాచరణంనందు సావధానులై నిమగ్నమవుతున్నారో వారికి స్వర్గరూపమైన ఫలం లభిస్తూ ఉంది. ఎవడు దానికి భిన్నంగా అధర్మాన్నాచరిస్తూ ఉంటాడో అతడు మోహాన్ని పొందుతుంటాడు.

*భరద్వాజ ఉవాచ:-*

**7.** యదేతచ్చాతురాశ్రమ్యం బ్రహ్మర్షి విహితం పురా ।
తేషాం స్వే స్వే సమాచారాస్తాన్ మే వక్తుమిహార్హసి ॥

*భరద్వాజుడు పలికెను :-*

స్వామీ! బ్రహ్మర్షులు పూర్వం ఏ నాలుగు ఆశ్రమాలను విభాగం చేసి ఉన్నారో వాటి యొక్క ధర్మాలేవి? దయచేసి వాటిని గూర్చి నాకు తెలుపవల్సింది.

*భృగురువాచ:-*

**8.** పూర్వమేవ భగవతా బ్రహ్మణా లోకహితమనుతిష్ఠతా ధర్మసంరక్షణార్థ
మాశ్రమాశ్చత్వారోఽభినిర్దిష్టాః తత్ర గురుకులవాసమేవ ప్రథమాశ్ర
మముదాహరన్తి సమ్యగ్ యత్ర శౌచ సంస్కార నియమవ్రత వినియ
తాత్మా ఉభే సంధ్యే భాస్కరాగ్ని దైవతాన్యుపస్థాప్య విహాయ

**తన్మాలస్యే గురోరభివాదన వేదాభ్యాస శ్రవణ పవిత్రీకృతాన్తరాత్మా త్రిషవణముపస్పృశ్య బ్రహ్మచర్యాగ్ని పరిచరణ శుశ్రూషా నిత్య భిక్షా భైక్ష్యాది సర్వనివేదితాన్తరాత్మా గురువచన నిర్దేశానుష్ఠానాప్రతికూలో గురుప్రసాదలబ్ధ స్వాధ్యాయ తత్పరః స్యాత్ ॥**

*భృగువు పలికెను:-*

ఓ మునీ! జగత్కల్యాణాన్ని కోరే భగవంతుడైన బ్రహ్మ పూర్వకాలంలో ధర్మాన్ని రక్షించటానికి గాను నాలుగు ఆశ్రమాలను కల్పించినాడు. అందు బ్రహ్మచర్యపాలన పూర్వక గురుకుల నివాసమే మొదటి ఆశ్రమమని చెబుతున్నారు. ఆ ఆశ్రమంలో ఉండే బ్రహ్మచారికి అంతరంగ బహిరంగ శుద్ధి, వైదిక సంస్కారం, బ్రహ్మచర్యవ్రత నియమాలపాలన మనస్సును అధీనంలో ఉంచుకోవడం అవసరం. ఉదయం, సాయంత్రం ఈ రెండుపూటల సంధ్యోపాసన, సూర్యోపస్థాపనం, అగ్నిహోత్రం ద్వారా అగ్ని ఆరాధన చేయడం, ఉన్మత్తత, సోమరితనం మొ॥ లేకుండా ప్రతిదినం గురువుకు నమస్కరించాలి. వేదాభ్యాసం, శ్రవణం మొదలగు వాటిద్వారా అంతరాత్మను పవిత్రంగా ఉంచుకోవాలి. ప్రొద్దున, మధ్యాహ్నం, సాయంకాలం, మూడుపూటలా స్నానం చేయాలి. బ్రహ్మచర్యపాలన, అగ్నిఉపాసన, గురువుకు నమస్కరించడం చేయాలి. ప్రతిదినం భిక్షాటన చేయాలి. భిక్షాటనలో ఏది దొరుకుతుందో అదంతా గురువుకు సమర్పించాలి. తన అంతరాత్మను గురువు పాదాలముందుంచాలి. గురువు ఏది చెబుతాడో, ఏమి సైగచేస్తాడో, ఏ కార్యాన్ని గూర్చి స్పష్టమైన శబ్దాలతో ఆజ్ఞాపిస్తాడో దానికి భిన్నంగా నడుచుకోరాదు. గురుకృపవల్ల పొందిన విద్యను మరచిపోకుండా స్వాధ్యాయతత్పరుడు కావాలి.

*భవతి చాత్ర శ్లోకః :-*

**9.** **గురుం యస్తు సమారాధ్య ద్విజో వేదమవాప్నుయాత్ ।**
**తస్య స్వర్గఫలావాప్తిః సిధ్యతే చాస్యమానసమ్ ॥ ఇతి॥**

ఈ విషయాన్ని గూర్చి ఈ శ్లోకం గలదు.

ఏ బ్రాహ్మణుడు గురువునారాధిస్తూ వేదాధ్యయనం చేస్తుంటాడో అతనికి స్వర్గలోకం ప్రాప్తిస్తుంది. మరియు అతని మానసిక సంకల్పం కూడా సిద్ధిస్తుంది.

**10.** **గార్హస్థం ఖలు ద్వితీయమాశ్రమం వదన్తి. తస్య సముదాచార లక్షణం సర్వమనువ్యాఖ్యాస్యామః**
**సమావృత్తానాం సదాచారాణాం సహధర్మచర్య ఫలార్థినా గృహాశ్రమో విధీయతే**

ధర్మార్థకామావాప్తిర్హ్యత్ర త్రివర్గసాధనమపేక్షా గర్హితేన కర్మణా ధనాన్యాదాయ స్వాధ్యాయోపలబ్ధి ప్రకర్షేణ వా బ్రహ్మర్షి నిర్మితేన వా అద్రిసారగతేన వా. హవ్య కవ్య నియమాభ్యాస దైవత ప్రసాదోపలబ్ధేన వా ధనేన గృహస్థో గార్హస్థ్యం వర్తయేత్ తద్ధి సర్వాశ్రమాణాం మూలముదాహరన్తి గురుకుల నివాసినః పరివ్రాజకాః యేచాన్యే సంకల్పిత వ్రతనియమ ధర్మానుష్ఠాయినస్తే షామప్యత ఏవ భిక్షాబలి సంవిభాగాః ప్రవర్తన్తే.

గృహస్థాశ్రమాన్ని రెండవ ఆశ్రమంగా చెబుతున్నారు. ఇప్పుడు మనం దాని యందు పాటింపదగిన యోగ్యసమస్తోత్తమఆచరణలను గూర్చి చెబుతున్నాం. ఎవరు సదాచారపాలనం చేయు బ్రహ్మచారులై విద్యనభ్యసించి గురుకులాన్నుండి స్నాతకులై తిరిగి వస్తున్నారో ఆ తర్వాత సహధర్మచారిణి వెంట ఉండి ధర్మాన్నాచరించాలని దాని ఫలాన్ని పొందాలని కోరిక ఉంటుందో వారికి గృహస్థాశ్రమంలో ప్రవేశించే అర్హత ఉంది. ఈ ఆశ్రమంలో ధర్మార్థకామాలైన మూడు విధాలైన పురుషార్థాలు లభిస్తూ ఉన్నాయి. అందువల్ల త్రివర్గసాధనం నందలి కోర్కెతో గృహస్థుడు ఉత్తమ కర్మద్వారా ధనాన్ని సంపాదించవలసి ఉంటుంది. అనగా అతడు స్వాధ్యాయం వల్ల పొందిన విశిష్ట యోగ్యతతో బ్రహ్మర్షుల ద్వారా ధర్మశాస్త్రాలతో నిర్ణయింపబడిన మార్గంలో లేక పర్వతాల వల్ల లభించిన సారభూత మణిరత్నాలను, దివ్యౌషధాలను, బంగారం మొదలగు ధనాన్ని సంపాదించాలి. లేకపోతే యజ్ఞం, శ్రాద్ధం, నియమం, వేదాభ్యాసం, దేవతలను ప్రసన్నం చేసుకోవడంతో పొందిన ధనంతో గృహస్థుడు తన గృహస్థ ధర్మాన్ని నిర్వర్తించాలి. ఎందుకంటె గృహస్థాశ్రమం అన్ని ఆశ్రమాలకు మూలమని చెబుతున్నారు ఋషులు. గురుకులంలో నివసించే బ్రహ్మచారులు వనం నందుండి సంకల్పానుసారం వ్రత నియమ ధర్మపాలనాలు చేసే ఇతరేతర వాన ప్రస్థులు అన్నింటినీ వదలి అంతటా తిరిగే సన్యాసులు ఈ గృహస్థాశ్రమం నుండే భిక్షను, బలిని, ఉపహారాలను దానాలను పొంది తమ తమ ధర్మపాలనలో ప్రవృత్తులవుతూ ఉన్నారు.

11. వానప్రస్థానాఞ్చ ద్రవ్యోపస్కార ఇతి ప్రాయశః ఖల్వేతే సాధవః సాధుపథౌదనాః స్వాధ్యాయ ప్రసఙ్గినస్తీర్థాభిగమనాభివాదనాన సూయ వాక్ప్రదాన సుఖశక్త్యాసన సుఖశయనాభ్యాహారసత్క్రియాచేతి.

వానప్రస్థాశ్రమం కొఱకై డబ్బు సంపాదించడం, నిషేధించడమైంది. శ్రేష్ఠమైన ఈ ధర్మాన్నాశ్రయించే వారు బహుశా శుద్ధం హితకరం అయిన అన్నాన్ని తినటానికి ఇష్టపడి, స్వాధ్యాయం, తీర్థయాత్ర, దేశసందర్శన నిమిత్తమై భూమండలమంతా తిరుగుతూ ఉంటారు. వీరు ఇంటికి వచ్చినట్లయితే లేచి ఎదురేగి వీరికి స్వాగతం పలకాలి వీరి పాదాలకు నమస్కరించాలి. దోషదృష్టితో చూడక వారితో మంచిగా

మాట్లాడాలి. శక్తిననుసరించి సుఖాసనాలను వేయాలి. సుఖాన్ని కలిగించే పడకలను వేయాలి.

మంచి భోజనాన్ని పెట్టాలి. ఈ ప్రకారం వారిని తగిన విధంగా సత్కరించాలి. ఇదే ఆశ్రేష్ఠమైన పురుషుల ఎడల గృహస్థుడు చేయాల్సిన కర్తవ్యాలు.

*భవన్తి చాత్ర శ్లోకాః :-*

**12. అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ ప్రతినివర్తతే।**
**సదత్వా దుష్కృతం తస్మై పుణ్యమాదాయ గచ్ఛతి ॥**

ఈ విషయంలో క్రింది శ్లోకాలు ప్రసిద్ధి గాంచినాయి. ఏ గృహస్థుని వాకిలి ముంగిట ఏ అతిథీ అయినా భిక్షను పొందక నిరాశుడై తిరిగి పోతున్నాడో అతడా గృహస్థునికి పాపాన్నిచ్చి అతని పుణ్యాన్ని తీసికొని పోతున్నాడు.

**13. అపి చాత్ర యజ్ఞ క్రియాభిర్దేవతాః ప్రీయన్తే।**
**నివాపేన పితరో విద్యాభ్యాసశ్రవణ ధారణేన ఋషయః అపత్యోత్పాదనేన ప్రజాపతిరితి ॥**

ఇంతేకాక గృహస్థాశ్రమంలో ఉండి యజ్ఞం చేయడంవల్ల ఋషులను సంతానోత్పత్తి వల్ల ప్రజాపతిని ప్రసన్నులను గావించుకొంటున్నాడు

**14. శ్లోకౌచాత్ర భవతః :-**

**వాత్సల్యాత్సర్వభూతేభ్యః వాచ్యాః శ్రోత్ర శుభాగిరః।**
**పరితాపోపఘాతశ్చ పారుష్యఞ్చాత్ర గర్హితమ్ ॥**

ఈ విషయంలో ఈ రెండు శ్లోకాలు ప్రసిద్ధిగాంచినాయి. వాక్కు ఎలా ఉండాలంటే ప్రాణులన్నింటి ఎడల స్నేహాన్ని కల్గించునదిగా వినిన వెంటనే చెవికి ఇంపు కల్గునట్లుగా ఉండాలి. ఇతరులకు బాధ కల్గించడం, కొట్టడం, కఠినమైన మాటలను మాట్లాడడం ఇవన్నీ నిందింపదగిన కార్యాలు.

**15. అవజ్ఞానమహంకారో దమ్భశ్చైవ విగర్హితః।**
**అహింసా సత్యమక్రోధః సర్వాశ్రమగతం తపః ॥**

ఇతరుల ఎడల అనాదరం చూపించడం, అహంకారాన్ని ప్రదర్శించడం, డంబాలు పలుకడం, ఈ గుణాలన్నీ విశేషంగా నిందింపబడ్డాయి. ఏ ప్రాణులను హింసింపకుండా ఉండడం, సత్యాన్ని మాట్లాడడం, కోపాన్ని తెచ్చుకోకపోవడం ఇవన్నీ అన్ని ఆశ్రమాలలో ఉన్నవారికి ఉపయోగపడు తపస్సువంటివి.

**16.** అపి చాత్ర మాల్యాభరణవస్త్రాభ్యఙ్గ నిత్యోపభోగ నృత్య గీతవాదిత్ర శ్రుతి సుఖనయనాభిరామ దశనానాం ప్రాప్తిర్భక్ష్యభోజ్యలేహ్యాపేయ చోష్యాణాం వివిధానాముపభోగః స్వవిహార సన్తోషః కామసుఖావాప్తిరితి॥

ఇంతేగాక గృహస్థాశ్రమ ధర్మంనందు పుష్పమాలలు, నానారకాలైన అభరణాలు, వస్త్రాలు, అంగరాగం, నిత్యోపభోగవస్తువులు, నృత్యం, పాటలు, వాద్యాలు, చెవికి ఇంపు గల్గించే శబ్దాలు, కంటికి ఇంపు గల్గించే రూపదర్శనాలు ఉంటాయి. భక్ష్యం, భోజ్యం, లేహ్యం, పేయం, చోష్యరూపమయిన నానారకాలైన భోజన సంబంధ పదార్థాలు తినుటకు త్రాగుటకు దొరుకుతూ ఉంటాయి. తన ఉద్యానవనం నందు తిరగడం అనే ఆనందం కలుగుతూ ఉంది. అంతేగాదు కామసుఖం కూడా లభిస్తూ ఉంటుంది.

**17.** త్రివర్గగుణనివృత్తిర్యస్య నిత్యం గృహాశ్రమే ।
సుఖాన్యనుభూయేహ శిష్టానాం గతిమాప్నుయాత్॥

ఏ పురుషునికి గృహస్థాశ్రమంలో ఎల్లప్పుడూ ధర్మార్థకామగుణాల సిద్ధి కలుగుతూ ఉంటుందో అతడు ఈ లోకంలో సుఖాన్ననుభవించి చివరకు శిష్ట పురుషులగతిని పొందుతూ ఉన్నాడు.

**18.** ఉఞ్ఛవృత్తిర్గృహస్థో యః స్వధర్మాచరణే రతః ।
త్యక్తకామ సుఖారమ్భః స్వర్గస్తస్య న దుర్లభః ॥

ఏ గృహస్థుడైన వ్యక్తి తన ధర్మాచరణయందు తత్పరుడై కోసిన ధాన్యాన్ని ఎత్తగా పడిన వెన్నుల నేరుకొని జీవనాన్ని గడుపుతాడో, కామ సుఖాన్ని వదులుకుంటాడో, అలాంటి వానికి స్వర్గలోకం దుర్లభమైన వస్తువు కాదు.

**191వ అధ్యాయం ముగిసింది.**

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 192వ అధ్యాయం

19. వానప్రస్థ - సన్యాసాశ్రమ ధర్మాలను వర్ణించడం - హిమాలయానికి ఉత్తరపు దిక్కున ఉన్న ఉత్కృష్టలోకం యొక్క విశిష్టత - దాని మహత్వ ప్రతిపాదన - భృగుభరద్వాజుల సంవాదపు ముగింపు.

*భృగురువాచ:-*

1. వానప్రస్థాః ఖల్వపి ధర్మమనుసరన్తః పుణ్యాని తీర్థాని నదీ ప్రస్రవణాని సువివిక్తేష్వరణ్యేషు మృగమహిషవరాహ శార్దూల వనగజాకార్ణేషు తపస్యన్తోఽను చరన్తి త్యక్త గ్రామ్యవ్యవహారోపభోగా వన్యౌషధి ఫలమూల పర్ణపరిమిత విచిత్ర నియతాహారాః స్థానాసనినో భూమి పాషాణ సికతా శర్కరా వాలుకా భస్మశాయినః కాశకుశ చర్మవల్కల సంవృతాఙ్గాః కేశస్మశ్రునఖరోమధారిణో నియతకాలోప స్పర్శనా అస్కన్దిత కాలబలి హోమానుష్ఠాయినః సమిత్కుశ సుమాపహార సమ్మార్జన లబ్ధ విశ్రామాః శీతోష్ణ వర్షపవన విష్టమ్భ విభిన్న సర్వత్వచో వివిధ నియమోపయోగ చర్యానుష్ఠాన విహిత పరశుష్క మాంస శోణిత త్వగస్థిభూతా ధృతిపరాః సత్త్వయోగాచ్ఛరీరాణ్యుద్వహన్తే ॥

*భృగుమహర్షి పలికెను:-*

ఓ మునీ! మూడవ ఆశ్రమమైన వానప్రస్థాశ్రమాన్ని గడిపే మానవులు ధర్మాన్ని అనుసరిస్తూ, పవిత్ర తీర్థాలలో, నదీతీరాలలో, సెలయేళ్ళ చుట్టు ప్రక్కలందు అలాగే మృగాలు, దున్నలు, పందులు, సింహాలు, అడవి ఏనుగులతో నిండియుండే ఏకాంతవనాలలో తపస్సు చేస్తూ తిరుగుతూ నివసిస్తూ ఉంటారు. గృహస్థుల అనుభవంలో ఉన్నట్టి గ్రామాలలో నివసించే ప్రజలకు యోగ్యమయినట్టి సుందరవస్త్రాలు, రుచికరమైన భోజనం, విషయభోగాలను వదిలి అరణ్యంలో వాటంతట అవే లభించు అన్నం, పండ్లు, గడ్డలు, ఆకులతో పరిమితాలు, విచిత్రం మరియు నియతమైన ఆహారాన్ని స్వీకరిస్తూ ఉంటారు. భూమిపైన కూర్చుంటూ ఉంటారు. భూమి, రాయి, మొరుం, కంకర, మట్టి, ఇసుక, బూడిదపై నిద్రిస్తూ ఉంటారు. ఱెల్లు, దర్భలు, చర్మం, నారచీరలను తమ వస్త్రాలుగా ధరిస్తూ ఉంటారు. తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు, గోళ్ళు వెంట్రుకలు వీటిని ఎల్లప్పుడూ కలిగి ఉంటారు. (అనగా వాటిని కత్తరించుకోరని భావం). నియమిత సమయంలో స్నానం చేసి

నిర్ణీత కాలం దాటకుండా బలివైశ్వదేవ మరియు అగ్ని హోత్రం మొదలగు కర్మలను చేస్తుంటారు. ఉదయం హవనం, పూజకొఱకై సమిధలు, దర్భలు, పూలు మొదలగు వాటిని సంగ్రహించి ఆశ్రమాన్ని ఊడ్చుకొన్న తర్వాత కొంత విశ్రాంతిని తీసుకుంటారు. చలి, వేడి, వర్షం, గాలి మొదలగు వాటి ధాటిని తట్టుకొని ఉండడం వల్ల వారి శరీరం పగిలి ఉంటుంది (బీటలు వారి ఉంటుంది) నానారకాలైన నియమాలను పాటించడం వల్ల వారి రక్తమాంసాలు ఎండిపోయి ఉంటాయి. శరీరంలో ఎముకలు మాత్రం కన్పిస్తూ ఉంటాయి - అయినప్పటికీ ధైర్యం వహించి సత్త్వయోగం వల్ల శరీరాలను మోస్తూ ఉంటారు.

2. యస్త్వేతాం నియతశ్చర్యాం బ్రహ్మర్షి విహితాం చరేత్, సదహే
దగ్నివద్దోషాన్ జయేల్లోకాంశ్చ దుర్జయాన్ ॥

ఏ పురుషుడు నియమాలను పాలిస్తూ ఉండి బ్రహ్మర్షుల ద్వారా ఆచరణలోకి తీసుకొని రాబడ్డ ఈ వానప్రస్థ ధర్మం యొక్క విధిని అనుష్ఠానం చేస్తూ ఉంటాడో అతడు అగ్నివలె తన దోషాలను భస్మం చేసి దుర్లభలోకాలను జయించగలడు.

3. పరివ్రాజకానాం పునరాచారః :-

తద్ యథా విముచ్యాగ్ని ధనకలత్ర పరిబర్హణం సంగేష్వాత్మనః స్నేహపాశాన వధూయ పరివ్రజన్తి సమలోష్టాశ్మకాఞ్చనాస్త్రివర్గ ప్రవృత్తేష్వసక్త బుద్ధయోఽరిమిత్రోదాసీనానాం తుల్యదర్శనాః స్థావర జరాయుజాణ్డ జస్వేదజోద్భిజ్జానాం భూతానాం వాఙ్మనః కర్మభిరనభిద్రోహిణోఽనికేతాః పర్వత పులిన వృక్షమూల దేవాయతనాన్యనుచరన్తో వాసార్థముపేయుర్నగరం గ్రామం వా నగరే పఞ్చరాత్రికా గ్రామేచైకరాత్రికాః ప్రవిశ్య చ ప్రాణధారణార్థం ద్విజాతీనాం భవనాన్య సంకీర్ణకర్మణాముపతిష్ఠేయుః పాత్రపతితా యాచిత భైక్ష్యాః కామక్రోధ దర్పలోభ మోహ కార్పణ్యదమ్భ పరివాదాభిమాన హింసా నివృత్తా ఇతి ॥

ఇపుడు సన్యాసుల ఆచరణ చెప్పబడుతూ ఉంది. అది ఈ ప్రకారంగా ఉంటుంది. ఇందు ప్రవేశించే పురుషులు అగ్ని హోత్రం, ధనం, స్త్రీలు, మొదలగు పరివారాన్ని, ఇంటిలో నున్న సామగ్రినంతా వదలి భోగాలు మరియు సంగమాల ఎడల తమ ఆసక్తి బంధనాలను త్రుంచి వేసుకొని శేషజీవనాన్ని ఆ ప్రకారంగా గడుపుటకు బయటకు వెళ్ళుతూ ఉంటారు. వీరు మట్టిపెళ్ళను, రాతిని, బంగారాన్ని సమానంగా భావిస్తూ ఉంటారు. ధర్మార్థకామాలలో వారి బుద్ధి ఆసక్తిని కల్గి ఉండదు. శత్రువులు, మిత్రులు మరియు ఉదాసీనులందరి ఎడల వారు సమానమైన

దృష్టికలిగి ఉంటారు. స్థావరాలు, పిండజాలు, అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలైన ప్రాణుల ఎడల మనోవాక్కాయ కర్మల ద్వారా ఎప్పుడూ ద్రోహచింతన లేకుండా ఉంటారు. వీరు కుటీరం లేదా మఠాన్ని కట్టుకొని నివసించరు. వీరు నాలుగు వైపుల తిరుగుతూ ఉంటారు. రాత్రి సమయాల్లో తలదాచుకోవటానికి గుహ, నదీతీరం, చెట్లమూలం, దేవమందిరాలను ఆశ్రయిస్తారు. నగరం లేక గ్రామాల్లోకి ప్రాణధారణకై వెళ్ళుతూ ఉంటారు. వారు నగరంలో ఐదు రాత్రులు, గ్రామంలో ఒక రాత్రికన్నా ఎక్కువగా ఉండకూడదు. ప్రాణాలను కాపాడు కోవటానికి తమ విశుద్ధ ధర్మాలను పాలిస్తూ బ్రహ్మ, క్షత్రియ, వైశ్యుల ఇళ్ళకు వెళ్ళి ఎక్కడ సంకీర్ణత ఉండదో అచట పోయినిలబడతారు. అడక్కుండానే పాత్రలో ఎంత భోజనం లభిస్తుందో అంతే తీసుకోవాలి. వీరు కామం, క్రోధం, పొగరు, లోభం, మోహం, పిసినిగొట్టుతనం, ప్రగల్బం, నింద, అభిమానం, హింస మొదలగు వాటికి దూరంగా ఉండాలి.

*భవతి చాత్ర శ్లోకః :-*

**4.** అభయం సర్వభూతేభ్యో దత్వా యశ్చరతే మునిః।
న తస్య సర్వభూతేభ్యో భయముత్పద్యతే క్వచిత్॥

ఈ విషయంలో ఈ శ్లోకం ప్రసిద్ధిగాంచింది.

ఏ ముని ప్రాణులన్నింటికి అభయమిచ్చి తిరుగుతూ ఉంటాడో అతనికి సంపూర్ణ ప్రాణులందు దేనివల్ల ఎప్పటికీ భయం కలుగదు.

**5.** కృత్వాగ్నిహోత్రం స్వశరీరసంస్థం
శారీరమగ్నిం స్వముఖే జుహోతి।
విప్రస్తు భైక్షొపగతైర్హవిర్భి
శ్చితాగ్నినాం స వ్రజతే హి లోకమ్॥

ఏ బ్రాహ్మణుడు అగ్నిహోత్రాన్ని తన శరీరంనందు ఆరోపించుకొని శరీరం నందలి అగ్నినుద్దేశించి తన ముఖంలో లభించిన భిక్షారూపమైన బవిస్సుతో హోమం చేస్తున్నాడో అతడు అగ్నిచయనం చేయు అగ్నిహోత్రులు ఏ లోకానికి వెళుతారో ఆ లోకానికి వెళ్ళుతున్నాడు.

**6.** మోక్షాశ్రమం యశ్చరతే యథోక్తం
శుచిః సుసంకల్పితముక్త బుద్ధిః।
అనిన్ధనం జ్యోతిరివ ప్రశాన్తం
స బ్రహ్మలోకం శ్రయతే మనుష్యః॥

ఎవడు బుద్ధిని సంకల్పరహితంగా నుంచుకొని పవిత్రుడై శాస్త్రోక్తంగా మోక్షాశ్రమ (సన్యాసాశ్రమం) నియమాలను పాలిస్తున్నాడో ఆ మానవుడు ఇంధనం లేని అగ్నివలె పరమశాంతజ్యోతిర్మయ బ్రహ్మ లోకాన్ని చేరుకొంటున్నాడు.

భరద్వాజ ఉవాచ:-

7. అస్మాల్లోకాత్ పరోలోకః శ్రూయతే నోపలభ్యతే।
తమహం జ్ఞాతుమిచ్ఛామి తద్ భవాన్ వక్తుమర్హతి॥

భరద్వాజుడు పలికెను:-

బ్రహ్మనిష్ఠుడా! ఈ లోకం కంటె శ్రేష్ఠమైన లోకం ఒకటి కలదని వినబడుతున్నది. కాని అది కనుపించడం లేదు. దాని గూర్చి తెలుసుకోవాలని ఉంది. నీవు దాన్ని గూర్చి తెలియజేయ వలసింది.

భృగురువాచ:-

8. ఉత్తరే హిమవత్పార్శ్వే పుణ్యే సర్వగుణాన్వితే।
పుణ్యం క్షేమ్యశ్చ కామ్యశ్చ స పరో లోక ఉచ్యతే॥

మహర్షీ! ఉత్తర దిక్కునందలి హిమాలయ పర్వత ప్రక్కభాగంలో సర్వగుణ సంపన్నం, పుణ్యమయమైన ప్రదేశం ఏది ఉందో ఆ భూభాగంపైగల శ్రేష్ఠలోకాన్ని తెలియజేస్తున్నాను. అది పవిత్రమైంది. కల్యాణకరమైంది. మరియు అందమైనది.

9. తత్ర హ్యపాపకర్మాణః శుచయోఽత్యన్త నిర్మలాః।
లోభమోహ పరిత్యక్తా మానవా నిరుపద్రవాః॥

అక్కడ పాపకర్మరహితులు, పవిత్రులు, అత్యంత నిర్మలులు, లోభ మోహ శూన్యులు, అన్ని విధాలైన ఉపద్రవాలచే రహితులు అయిన మానవులు నివాసం చేస్తుంటారు.

10. స స్వర్గ సదృశో దేశస్తత్ర హ్యుక్తాః శుభాః గుణాః।
కాలే మృత్యుః ప్రభవతి స్పృశన్తి వ్యాధయో న చ॥

ఆ దేశం స్వర్గంతో సమానమైంది. అక్కడ అన్ని శుభగుణాలు ఉంటాయి. అక్కడ నిర్దిష్టసమయంలోనే మృత్యువు వస్తుంది. రోగాలు వ్యాధులు ఏవీ అక్కడ ఉండవు.

11. న లోభః పరదారేషు స్వదార నిరతో జనః।
నాన్యోన్యం బధ్యతే తత్ర ద్రవ్యేషు న చ విస్మయః।
పరోహ్యధర్మో నైవాస్తి సందేహో నాపి జాయతే॥

అక్కడ ఎవరి మనస్సు ఇతర స్త్రీలపై ప్రసరించదు. ప్రజలంతా తమ స్త్రీలయందే అనురక్తులై ఉంటారు. అక్కడ ఉన్నవాడు డబ్బుకోసం ఒకరిని మరొకరు చంపుకోరు. ఎవరినీ బంధనాగారంలో ఉంచరు. వారికెన్నడూ గొప్ప ఆశ్చర్యకర విషయమనేది ఉండదు. అధర్మం పేరైనా అక్కడ వినబడదు. అక్కడ ఎవరి మనసులోనైనా సందేహం ఉండదు.

12. కృతస్య తు ఫలం తత్ర ప్రత్యక్షముపలభ్యతే।
పానాసనాశనోపేతాః ప్రాసాద భవనాశ్రయాః॥

13. సర్వకామైర్వృతాః కేచిద్ధేమాభరణ భూషితాః।
ప్రాణధారణమాత్రన్తు కేషాంచిదుపపద్యతే।
శ్రమేణ మహతా కేచిత్ కుర్వన్తి ప్రాణధారణమ్॥

అక్కడ చేయబడ్డ కర్మఫలం ప్రత్యక్షంగా కనబడుతూ ఉంటుంది. ఆ లోకంలో కొందరు ప్రజలు పెద్దపెద్ద భవంతులలో నివసిస్తూ ఉంటారు. మంచిమంచి ఆసనాలపై కూర్చుండి ఉత్తమోత్తమ వస్తువులను తింటూ, త్రాగుతూ ఉంటారు. సమస్త కోర్కెలతో కూడి సువర్ణమయ ఆభరణాలను ధరించి ఉంటారు. అలాగే కొందరు ప్రాణాన్ని ధరించటానికి మాత్రమే ఆహారం తీసుకుంటూ ఉంటారు. కొందరు గొప్ప పరిశ్రమ చేసి తపోమయజీవనం గడుపుతూ ప్రాణధారణ చేస్తూ ఉంటారు. (ఈ విధంగా ఆ లోకం ఈ లోకం కంటె గొప్పనైంది)

14. ఇహ ధర్మపరాః కేచిత్ కేచిన్నైకృతికా నరాః।
సుఖితా దుఃఖితా కేచిన్నిర్ధనా ధనినోఽపరే॥

ఈ లోకంలో కొందరు ధర్మపరాయణులవుతూ ఉంటారు. మరికొందర గొప్ప అధర్మ పరాయణులుగా ఉంటారు. అందువల్ల కొందరు సుఖసంపన్నుల కొందరు దుఃఖితులు అవుతూ ఉంటారు. కొందరు ధనవంతులు కొందరు నిర్ధనులుగ కూడా ఉంటారు.

15. ఇహ శ్రమో భయం మోహః క్షుధా తీవ్రా చ జాయతే।
లోభశ్చార్థకృతో నృణాం యేన ముహ్యన్త్యపణ్డితాః॥

ఈ లోకంలో పరిశ్రమ, భయం, మోహం, తీవ్ర ఆకలి యొక్క కష్టం ఉంటుంది. మానవులకు డబ్బుపై విశేషమైన ఆశ ఉంటుంది. దానివల్ల అజ్ఞానులైన పురుషులు మోహంలో పడుతూ ఉంటారు.

**16.** ఇహ వార్తా బహువిధా ధర్మాధర్మస్య కారిణః ।
యస్తద్వేదోభయం ప్రాజ్ఞః పాప్మనా న స లిప్యతే ॥

ఈ దేశంలో ధర్మాధర్మాలను చేసే మానవులు నానారకాలైన మాటలను వింటూ ఉంటారు. ఎవడు ధర్మాధర్మాలనే రెండింటి పరిమాణాన్ని తెలుసుకొంటున్నాడో అట్టివిద్వాంసుడైన పురుషునికి పాపం అంటుకోవడం లేదు.

**17.** సోపధం నికృతిః స్తేయం పరీవాదోహ్యసూయతా ।
పరోపఘాతో హింసా చ పైశున్యమనృతం తథా ॥

**18.** ఏతానాసేవతే యస్తు తపస్తస్య ప్రహీయతే ।
యస్త్వేతాన్ నాచరేత్ విద్వాంస్తపస్తస్య ప్రవర్ధతే ॥

కపటం, శఠత్వం, దొంగతనం, నిందించడం, ఇతరుల దోషాలనెన్నడం, ఇతరులకు హానిని కలుగజేయడం, ప్రాణులను హింసించడం, కొండెములు చెప్పడం, అబద్ధమాడడం, మొదలయిన దుర్గుణాలకు ఎవడు అలవాటు పడుతాడో, అతని తపస్సు నశిస్తుంది. ఏ విద్వాంసుడు ఈ దోషాలను ఆచరణలో పెట్టుకుంటాడో అతని తపస్సు నిరంతరం వృద్ధి పొందుతూ ఉంటుంది.

**19.** ఇహ చిన్తా బహువిధా ధర్మాధర్మస్య కర్మణః ।
కర్మభూమిరియం లోకే ఇహ కృత్వా శుభాశుభమ్ ॥
శుభైః శుభామవాప్నోతి తథాశుభమథాన్యథా ॥

ఈ లోకంలో పుణ్యాపాపకర్మల సంబంధంలో అనేక ప్రకారాలైన విచారాలు కలుగుతూ ఉంటాయి. ఇది కర్మభూమి అయి ఉంది. ఈ ప్రపంచంలో శుభాశుభకర్మాలను చేసే మానవుడు శుభాశుభఫలాలను పొందుతూ ఉన్నాడు. అంతేగాక శుభాశుభఫలాన్ని కూడా అనుభవిస్తూ ఉన్నాడు.

**20.** ఇహ ప్రజాపతిః పూర్వం దేవాసర్షిగణాస్తథా ।
ఇష్ట్వేష్టతపసః పూతా బ్రహ్మలోకముపాశ్రితాః ॥

పూర్వకాలంలో ఇక్కడ ప్రజాపతి, దేవతలు, ఋషులు యజ్ఞాలను అభీష్టతపాన్ని చేసి పవిత్రులై బ్రహ్మలోకాన్ని పొందినారు.

21. ఉత్తరః పృథివీభాగః సర్వపుణ్యతమః శుభః।
ఇహస్థాస్తత్ర జాయన్తే యే వై పుణ్యకృతో జనాః॥

భూమండలం యొక్క ఈ ఉత్తరభాగం అన్నింటికంటె మిక్కిలి పవిత్రం మరియు మంగళమయమై ఉంది. ఈ లోకంలో ఏ పుణ్యాత్ములైన మానవులున్నారో వారే మృత్యువు తర్వాత ఆ భూభాగాలందు జన్మిస్తున్నారు.

22. అసత్కర్మాణి కుర్వన్తి స్తిర్యగ్యోనిషు చాపరే।
క్షీణాయుషస్తథా చాన్యే నశ్యన్తి పృథివీతలే॥

ఇతర ప్రజలు ఎవరైతే పాపకర్మలను చేస్తున్నారో వారు పశుపక్ష్యాదుల యోనిలో జన్మిస్తున్నారు. మరియు మిగిలినవారు ఎంత ఆయుక్షయమైనప్పటికీ నష్టాన్ని పొందుచూ పాతాళ లోకానికి వెళ్ళుతున్నారు.

23. అన్యోన్య భక్షణాసక్తా లోభమోహ సమన్వితాః।
ఇహైవ పరివర్తన్తే న తే యాన్త్యుత్తరాం దిశమ్॥

ఎవరు లోభమోహాలతో కూడుకొని ఉండి ఒకరినొకరు కబలించటానికి సన్నద్ధులవుతారో వారుకూడా ఈ లోకానికి వస్తూ పోతూ ఉంటారేగాని ఉత్తర దిశయందున్న ఉత్తమమైన లోకానికి వెళ్ళడం లేదు.

24. యే గురూన్ పర్యుపాసన్తే నియతా బ్రహ్మచారిణః।
పన్థానం సర్వలోకానాం విజానన్తి మనీషిణః॥

ఎవరు మనస్సును ఇంద్రియాలను అధీనంలో ఉంచుకొని బ్రహ్మ చర్యపాలన చేస్తూ గురుజనుల ఉపాసన చేస్తుంటారో అలాంటి విద్వాంసులైన పురుషులు అన్ని లోకాలకు గల మార్గాలను తెలుసుకొంటూ ఉంటారు.

25. ఇత్యుక్తోఽయం మయా ధర్మః సంక్షిప్తో బ్రహ్మ నిర్మితః।
ధర్మాధర్మౌ హి లోకస్య యో వై వేత్తి స బుద్ధిమాన్॥

ఈ ప్రకారం నేను ఇక్కడ బ్రహ్మద్వారా నిర్మించిన ఈ ధర్మాన్ని సంక్షిప్తంగా వర్ణనచేసి ఉన్నాను. ఎవడు లోకంలో చేయదగినది చేయదగనిది అగు ధర్మాధర్మాలను తెలుసుకొంటున్నాడో అతడే బుద్ధిమంతుడు.

**26.** ఇత్యుక్తో భృగుణా రాజన్! భరద్వాజః ప్రతాపవాన్ ।
భృగుం పరమధర్మాత్మా విస్మితః ప్రత్యపూజయత్ ॥

భీష్ముడు పలికెను:-

ఓ రాజా! భృగుమహారాజు ఈ ప్రకారంగా చెప్పిన పిమ్మట పరమధర్మాత్ముడు పరాక్రమశాలియైన భరద్వాజుడు ఆశ్చర్యచకితుడై ఆయన్ను పూజించాడు.

**27.** ఏష తే ప్రసవో రాజన్! జగతః సమ్ప్రకీర్తితః ।
నిఖిలేన మహాప్రాజ్ఞ! కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥

పరమ బుద్ధిమంతుడవైన ఓ రాజా! ఈ ప్రకారం నేను నీకు జగదుత్పత్తికి చెందిన సమస్త అంశాలను తెలిపి ఉన్నాను. ఇప్పుడిక ఏమి వినాలనుకుంటున్నావో నాకు తెలియజేయవలసింది.

*192వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మ పర్వం

## 193వ అధ్యాయం

### 20. శిష్టాచారఫలం - పాపాన్ని కప్పిపుచ్చడం వల్ల గలిగే హాని - ధర్మ ప్రశంసను గూర్చి వర్ణించడం :-

*యుధిష్ఠిర ఉవాచ:-*

1. **ఆచారస్య విధిం తాత ప్రోచ్యమానం త్వయానఘ! ।**
   **శ్రోతుమిచ్ఛామి ధర్మజ్ఞ! సర్వజ్ఞో హ్యాసి మే మతః ॥**

ధర్మజ్ఞుడైన ఓ పితామహా! మీరు సర్వజ్ఞులు కావున ఇప్పుడు నేను మీద్వారా సదాచార విధిని గూర్చి వినాలని ఉంది. ఆ సదాచారాన్ని గూర్చి నాకు వివరించి చెప్పేది.

*భీష్మ ఉవాచ:-*

2. **దురాచారా దుర్విచేష్టా దుష్ప్రజ్ఞాః ప్రియసాహసాః ।**
   **ఆసన్తస్త్వితి విఖ్యాతాః సన్తశ్చాచార లక్షణాః ॥**

*భీష్ముడు పలికెను:-*

ఓ రాజా! ఎవరు దురాచారులో, దుర్మార్గాచారులో, దుర్మార్గ చేష్టలు గలవారో దుష్టబుద్ధిని, దుస్సాహసాన్ని ప్రియంగా భావిస్తూ ఉంటారో వారు దుష్టమైన ఆత్మగలవారిగా ప్రఖ్యాతి నొందుచున్నారు. ఎవరు వేటియందు సదాచారాన్ని చూస్తున్నారో సదాచారం ఎవరికి ఉంటుందో వారు శ్రేష్ఠమైన పురుషులు.

3. **పురీషం యది వా మూత్రం యేన కుర్వన్తి మానవాః ।**
   **రాజమార్గే గవాం మధ్యే ధ్యాన మధ్యే చ తే శుభాః ॥**

ఏ మానవులు వచ్చిపోయేదారిలో, ఆవుల మధ్య, ధాన్యరాశుల యందు మల మూత్రాలను విసర్జించకుండా ఉంటారో వారు శ్రేష్ఠులని తెలుసుకోవాలి.

4. **శౌచమావశ్యకం కృత్వా దేవతానాఞ్చ తర్పణమ్ ।**
   **ధర్మమాహుర్మనుష్యాణాముపస్పృశ్య నదీం స్పృశేత్ ॥**

ప్రతిదినం శౌచం చేసి ఆచమనం చేయాలి. మరల నదిలో స్నానం చేయాలి. ఆ తర్వాత తన అధికారాన్ని అనుసరించి సంధ్యోపాసన చేసి ఆతర్వాత దేవతలు

మొదలయిన వారికి పూజచేయాలి. దీన్నే విద్వాంసులు మానవమాత్ర ధర్మంగా తెలియ జేసినారు.

**5. సూర్యం సదోపతిష్ఠేత న చ సూర్యోదయే స్వపేత్।**
**సాయం ప్రాతర్జపేత్ సన్ధ్యాం తిష్ఠన్ పూర్వాం తథేతరామ్॥**

ప్రతినిత్యం సూర్యోపాసన చేయాలి. సూర్యోదయ సమయంలో ఎన్నడూ నిద్రపోకూడదు. ఉదయం సాయంకాలం రెండుసార్లు సంధ్యోపాసన చేసి గాయత్రీమంత్రాన్ని జపించాలి.

**6. పఞ్చార్ద్రో భోజనం భుఞ్జ్యాత్ ప్రాఙ్ముఖో మౌనమాస్థితః।**
**న నిన్ద్యాదన్నభక్ష్యాంశ్చ స్వాద్వస్వాధు చ భక్షయేత్॥**

రెండు చేతులు, రెండు కాళ్ళు, ముఖం ఈ ఐదు అవయవాలను కడుక్కొని పూర్వాభిముఖుడై భోంచేయాలి. భోజన సమయంలో మౌనంగా ఉండాలి. ఏ తినుభండారాలను నిందించరాదు. అది రుచికరమైనా కాకపోయినా ప్రేమతో భుజించాలి.

**7. ఆర్ద్రపాణిః సముత్తిష్ఠేన్నార్ద్రపాదః స్వపేన్నిశి।**
**దేవర్షిర్నారదః ప్రాహ ఏతదాచార లక్షణమ్॥**

భోంచేసిన పిమ్మట చేతులు కడుక్కొని లేయాలి. రాత్రులందు తడికాళ్ళతో నిద్ర పోకూడదు. దేవర్షి నారదుడు దీన్నే సదాచారం లక్షణంగా పేర్కొన్నాడు.

**8. శుచిం దేశమనడ్వాహం దేవగోష్ఠం చతుష్పథమ్।**
**బ్రాహ్మణం ధార్మికం చైత్యం నిత్యం కుర్యాత్ ప్రదక్షిణమ్॥**

**9. అతిథీనాఞ్చ సర్వేషాం ప్రేష్యాణాం స్వ జనస్య చ।**
**సామాన్యం భోజనం భృత్యైః పురుషస్య ప్రశస్యతే॥**

యజ్ఞశాల మొదలైన పవిత్రస్థానాలను, ఎద్దులను దేవాలయాలను, నగర చత్వారాలను, (నాలుగు రోడ్ల కూడళ్ళను) బ్రాహ్మణులను, ధర్మాత్ములైన మానవులను, దేవసంబంధమైన అశ్వత్థవృక్షం, జమ్మి వృక్షం, మొదలైన వాటికి ప్రదక్షిణ చేసి మరీ వెళ్ళాలి. గృహస్థుడైన పురుషుడు అతిథులకు సేవకులకు బంధుజనులకు ఒకే విధమయిన భోజనాన్ని పెట్టాలి. ఈ సదాచారమే పురుషునికి శ్రేష్ఠమైందని తెలుపబడింది.

**10. సాయం ప్రాతర్మనుష్యాణామశనం వేదనిర్మితమ్।**
**నాన్తరా భోజనం దృష్టముపవాసీ తథాభవేత్॥**

శాస్త్రాలందు మానవుడు ఉదయం సాయంకాలం రెండుసార్లే భోంచేయాలని నిర్దేశించడం జరిగింది. మధ్యలో భోంచేయాలనే నియమం ఏమీ లేదు. ఎవడీ నియమాన్ని పాటిస్తాడో వానికి ఉపవాసం చేయడం వల్ల గలిగే ఫలితం లభిస్తాది.

**11. హోమకాలే తథా జుహ్వన్నృతుకాలే తథా వ్రజన్।**
**అనన్య స్త్రీజనః ప్రాజ్ఞో బ్రహ్మచారీ తథా భవేత్॥**

ఎవడు ప్రతిదినం హోమ సమయంలో హవనం చేస్తున్నాడో, ఋతుకాలంలోనే ఎవడు స్త్రీ దగ్గరకు వెళ్తున్నాడో, మరియు ఇతర స్త్రీలపై దృష్టిని నిలుపకున్నాడో అట్టి బుద్ధిమంతుడైన పురుషుడు బ్రహ్మచారితో సమానంగా భావింపబడుతున్నాడు.

**12. అమృతం బ్రాహ్మణోచ్ఛిష్టం జనన్యా హృదయం కృతమ్।**
**తజ్జనాః పర్యుపాసన్తే సత్యం సన్తః ముపాసతే॥**

బ్రాహ్మణుడు భుజించిన పిమ్మట మిగిలిన అన్నం అమృతంతో సమానం. అది తల్లిపాలవలె హితకరం. అలాంటి భోజనాన్ని ఎవరు సేవిస్తున్నారో ఆ శ్రేష్ఠులైన పురుషులు సత్యస్వరూప పరబ్రహ్మ పరమాత్మను పొందుతున్నారు.

**13. లోష్టమర్దీ తృణచ్ఛేదీ నఖ ఖాదీ తు యో నరః।**
**నిత్యోచ్ఛిష్టో శంకు శుకో నేహాయుర్విన్దతే మహత్॥**

ఏ మానవుడు మట్టిగడ్డలు నలుముతూ ఉంటాడో, గడ్డిని పెరుకుతూ ఉంటాడో, గోళ్ళను కొరుక్కుంటూ ఉంటాడో, నిత్యం ఇతరుల ఎంగిలి భుజిస్తూ ఉంటాడో, అతడు పంజరంలో బంధించిన చిలుకవలె పరాధీన జీవనాన్ని గడుపుతూ ఉంటాడు. అతడీ లోకంలో గొప్ప ఆయుష్షును పొందలేక పోతున్నాడు.

**14. యజుషా సంస్కృతం మాంసం నివృత్తో మాంస భక్షణాత్।**
**న భక్షయేత్ వృథా మాంసం పృష్టమాంసఞ్చ వర్జయేత్॥**

మాంస భక్షణం చేయరాదు. యజుర్వేద మంత్రాల ద్వారా సంస్కరింపబడిన మాంసాన్ని తినరాదు. వ్యర్థమాంసాన్ని, శ్రాద్ధ శేష మాంసాన్ని వదిలిపెట్టాలి.

**15. స్వదేశే పరదేశే వా అతిథిః నోపవాసయేత్।**
**కామ్యకర్మఫలం లబ్ధ్వాగురుణాముపపాదయేత్॥**

మానవుడు, స్వదేశం నందున్నా, పరదేశంనందున్నా, తన వద్దకు వచ్చిన అతిథిని ఆకలితో ఉంచరాదు. సకామ కర్తవ్యకర్మల రూపంలో దొరికిన పదార్థాలను తమ గురువులకు అందిస్తూ ఉండాలి.

**16.** గురుభ్య ఆసనం దేయం కర్తవ్యం చాభివాదనమ్ ।
గురూనభ్యర్చ్య యుజ్యన్తే ఆయుషా యశసా శ్రియా ॥

గురువులొచ్చినపుడు వారికి ఆసనాన్నియ్యాలి. నమస్కరించాలి. గురువులను సేవించినందువల్ల ఆయురారోగ్య ఐశ్వర్యాన్ని పొందుతుంటారు.

**17.** నేక్షేతాదిత్యముద్యన్తం న చ నగ్నాం పరస్త్రియమ్ ।
మైథునం సతతం ధర్మ్యం గుహ్యేచైవ సమాచరేత్ ॥

ఉదయిస్తున్న సూర్యుని చూడరాదు. దిగంబరంగా నున్న పరాయిస్త్రీని చూడరాదు. ఎల్లప్పుడూ ధర్మానుసారం ఋతుకాలంలో తన భార్యతో ఏకాంతంగా సంగమించాలి.

**18.** తీర్థానాం హృదయం తీర్థం శుచీనాం హృదయం శుచిః ।
సర్వమార్యకృతం చౌక్ష్యం వాల సంస్పర్శనాని చ ॥

తీర్థాలందు శ్రేష్ఠమైన తీర్థం విశుద్ధమైన హృదయం. పవిత్ర వస్తువులందు అతి పవిత్రమైన వస్తువుకూడా విశుద్ధ హృదయమే. విసనకర్ర మొదలగు వాటికి ఆవుతోక వెంట్రుకలు తగిలిన కూడా శిష్టాచార ఆమోదాన్ని పొందడం వల్ల అది కూడా శుద్ధమైందే.

**19.** దర్శనే దర్శనే నిత్యం సుఖప్రశ్నముదాహరేత్ ।
సాయం ప్రాతశ్చ విప్రాణాం ప్రదిష్టమభివాదనమ్ ॥

పరిచయస్తులను ఎప్పుడెప్పుడు కలుసుకుంటామో అప్పుడు వారి కుశల సమాచారాన్ని అడుగుతూ ఉండాలి. ఉదయం సాయంకాలం ఈ రెండు పూటలా విద్వాంసులకు నమస్కరిస్తూ ఉండాలి. ఇది శాస్త్రం యొక్క ఆజ్ఞ.

**20.** దేవాగారే గవాం మధ్యే బ్రాహ్మణానాం క్రియాపథే ।
స్వాధ్యాయే భోజనేచైవ దక్షిణం పాణిముద్ధరేత్ ॥

దేవ మందిరంలో, ఆవుల మధ్యలో, బ్రాహ్మణుల యజ్ఞమందిరాలలో శాస్త్రాల స్వాధ్యాయ మధ్యలో, భోంచేసేటప్పుడు కుడిచేతిని ఉపయోగిస్తూ ఉండాలి.

**21.** సాయం ప్రాతశ్చ విప్రాణాం పూజనఞ్చ యథావిధి ।
పణ్యానాం శోభతే పణ్యం కృషీణాం బాధ్యతే కృషిః ॥

**22.** బహుకారఞ్చ సస్యానాం వాహ్యేవాహో గవాం యథా ।

ఉదయం సాయంకాలం ఈ రెండు సమయాలలో శాస్త్రోక్తంగా బ్రాహ్మణులను పూజిస్తూ ఉండాలి. ఇదే వ్యాపారాలన్నింటిలో ఉత్తమ వ్యాపారమై ప్రకాశిస్తూ ఉంది. ఇదే వ్యవసాయం నందు ఉత్తమ వ్యవసాయమై ప్రత్యక్ష ఫలదాయకమై ఉంది. విద్వాంసులను పూజించే పురుషునికి వివిధ అన్నాల వృద్ధి కలుగుతూ ఉంది. అతనికి వాహనాలందు గోజాతి యొక్క శ్రేష్ఠవాహనాలను సులభంగా దొరుకుతూ ఉంటాయి.

**సమ్పన్నం భోజనం నిత్యం పానీయే తర్పణం తథా।**
**సుశృతం పాయసే బ్రూయాత్ యవాగ్వాం కృసరే తథా॥**

భోంచేసిన తర్వాత భోజనం బాగుందా? లేదా? అని అడిగితే భోజనం చక్కగా ఉందని చెప్పాలి. అదే విధంగా నీళ్ళు తాగిన తర్వాత దాత తృప్తి అయిందా? అని పలికితే తృప్తిగా ఉందని సమాధానమియ్యాలి. పాయసం త్రాగిన తర్వాత పాయసం బాగుందా? అని యజమాని అడిగితే అప్పుడు భుజించిన వారు చక్కగా ఉందని సమాధానమియ్యాలి. ఈ విధంగా హల్వా కిచడి మొదలగు వాటిని వడ్డించిన పిమ్మట ప్రశ్నోత్తరాలుండాలి.

**23.** **శ్మశ్రుకర్మణి సమ్ప్రాప్తే క్షుతే స్నానేఽథ భోజనే।**
**వ్యాథితానాఞ్చ సర్వేషామాయుష్యమభివర్ధనమ్॥**

కేశఖండనం చేసుకోవడం, తుమ్మడం, స్నానం చేయడం, భుజించడం అన్ని అవస్థల్లో సమస్తరోగుల కర్తవ్యమేమనగా వారు విద్వాంసులను ప్రసన్నంగా చేసుకొంటూ ఉండాలి. దీని వల్ల వారి ఆయుష్షుకూడా వృద్ధి పొందుతూ ఉంటుంది.

**24.** **ప్రత్యాదిత్యం న మేహేత నపశ్యేదాత్మనః శకృత్। సహ**
**స్త్రియాథ శయనం సహ భోజ్యాఞ్చ వర్జయేత్॥**

సూర్యుని వైపు ముఖం చేసి మూత్రాన్ని విసర్జించరాదు. తన మలాన్ని తాను చూడరాదు. స్త్రీతో కలిసి ఒకే శయ్యమీద పడుకోరాదు. ఆమెతో కలిసి ఒకే పళ్ళెంలో భుజించరాదు

**25.** **త్వఙ్కారం నామధేయఞ్చ జ్యేష్ఠానాం పరివర్జయేత్।**
**ఆవరాణాం సమానానాముభయేషాం న దుష్యతి॥**

తన కంటె పెద్దవారిని పేరు పెట్టి పిలువడం గాని నీవు అని సంబోధించడం గాని చేయరాదు. ఎవడైతే తనకంటె చిన్నగా ఉంటాడో లేక సమాన వయస్సు కల్గి ఉంటాడో అతన్ని పై విధంగా పిలిచినా లేక సంబోధించినా తప్పులేదు.

**26.** హృదయం పాపవృత్తానాం పాపమాఖ్యాతి వైకృతమ్।
జ్ఞానపూర్వం వినశ్యన్తి గూహమానా మహాజనే॥

పాపాత్ముల హృదయం వారి కన్నులు ముఖాల వికారాలే వారి పాపాలను తెలియజేస్తుంటాయి. ఏ మానవులైతే జ్ఞానపూర్వకంగా తాము చేసిన పాపాన్ని బుద్ధిపూర్వకంగా మహాపురుషులనుండి రక్షించు కొంటున్నారో వారు నశిస్తారు.

**27.** జ్ఞానపూర్వకృతం పాపం ఛాదయత్య బహుశ్రుతః।
నైనం మనుష్యాః పశ్యన్తి పశ్యన్త్యేవ దివౌకసః॥

మూర్ఖమానవులే బుద్ధిపూర్వకంగా చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకుంటూ ఉంటారు. ఒకవేళ వారి పాపాన్ని మానవులు చూడనప్పటికీ దేవతలు చూస్తూ ఉంటారు.

**28.** పాపేనాపిహితం పాపం పాపమేవానువర్తతే।
ధర్మేణాపిహితో ధర్మో ధర్మమేవానువర్తతే॥

పాపాత్ముడైన మానవుడు తనపాపాన్ని కప్పిపుచ్చుకుంటే ఆ పాపం మరల అతన్ని అనుసరిస్తూ ఉంటుంది. ధర్మాత్ముని ద్వారా కప్పిపుచ్చబడిన ధర్మం మరల అతన్నే అనుసరిస్తూ ఉంటుంది. ధార్మికుని ద్వారా చేయబడ్డ ధర్మం అతన్ని ధర్మంనందే ప్రవృత్తుడయ్యేటట్లు చేస్తుంది.

**29.** పాపంకృతం న స్మరతీహ మూఢో
వివర్తమానస్య తదేతి కర్తుః।
రాహుర్యథా చంద్రముపైతి చాపి
తథా బుధం పాపముపైతి కర్మ॥

మూర్ఖమానవుడు తాను చేసిన పాపాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడం లేదు. కాని పాపప్రవృత్తుడయిన కర్తయొక్క పాపం స్వయంగా అతన్ని వెన్నాడుతూ ఉంటుంది. ఏ ప్రకారంగా రాహువు చంద్రుని దగ్గరకు సొంతంగా వెళ్తున్నాడో అదే విధంగా ఆ మూర్ఖమానవుని దగ్గరకు స్వయంగా వెళ్ళుతుంది.

**30.** ఆశయా సఞ్చితం ద్రవ్యం దుఃఖేనైవోపభుజ్యతే।
తద్ బుధా న ప్రశంసన్తి మరణం న ప్రతీక్ష్యతే॥

ఏదైనా విశేష కోర్కెను నెరవేర్చుటకుగాను ఆశతో ఏ డబ్బు సంపాదింపబడిందో అది దుఃఖపూర్వకంగా అనుభవింపబడుతూ ఉంటుంది. అందువల్ల విద్వాంసులైన పురుషులు దాన్ని ప్రశంసించలేరు. ఎందు వలననగా మృత్యువు ఏ కోరికను పూర్తి చేసుకొనుటకు కూడా వేచియుండడం లేదు.

**31.** మానసం సర్వభూతానాం ధర్మమాహుర్మనీషిణః।
తస్మాత్సర్వేషు భూతేషు మనసా శివమాచరేత్॥

విద్వాంసులు చెప్పేదేమనగా సమస్త ప్రాణులకు మనస్సు ద్వారా చేయబడే ధర్మమే శ్రేష్ఠమయిందని అందువల్ల మనస్సుద్వారా సకల జీవులకు శుభం కలిగేటట్లు ఆచరించాలి.

**32.** ఏక ఏవ చరేద్ ధర్మం నాస్తి ధర్మే సహాయతా।
కేవలం విధిమాసాద్య సహాయః కిం కరిష్యతి॥

కేవలం వేదవిధినాశ్రయించి ఒంటరిగానే ధర్మాన్ని ఆచరించాలి. ఇందు ఎవరి సహాయం అవసరం లేదు. వేరే సహాయకుడు వచ్చి ఏమి చేయగలడు?

**33.** ధర్మయోనిర్మనుష్యాణాం దేవానామమృతం దివి।
ప్రేత్యభావే సుఖం ధర్మాచ్ఛాశ్వతైరుపభుజ్యతే॥

ధర్మమే మానవుల పుట్టుక అయి ఉంది. అదే స్వర్గం నందు దేవతలకు అమృతమై ఉంది. ధర్మాత్ములైన మానవులు మరణించిన పిమ్మట ధర్మబలం వల్లే ఎల్లప్పుడు సుఖాలననుభవిస్తుంటారు.

*193వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 194వ అధ్యాయం

### 21. అధ్యాత్మజ్ఞాన నిరూపణం

*యుధిష్ఠిర ఉవాచ:-*

**1.** అధ్యాత్మం నామ యదిదం పురుషస్యేహ చిన్త్యతే ।
యదధ్యాత్మం యథాచైతత్ తన్మే బ్రూహి పితామహ! ॥

*యుధిష్ఠిరుడు పలికెను:-*

పితామహా! శాస్త్రాలందు మనుష్యులకోసం అధ్యాత్మం అనే పేరుతో ఏ విచార ధార ఉందో ఆ అధ్యాత్మజ్ఞానమేది? అది ఎలాంటిది? అనే అంశాన్ని నాకు తెలియజేయ వలసింది.

**2.** కుతః సృష్టమిదం విశ్వం బ్రహ్మన్! స్థావర జఙ్గమమ్ ।
ప్రలయే కథమభ్యేతి తన్మేవక్తుమిహార్హసి ॥

బ్రహ్మజ్ఞాన సంపన్నుడా! ఈ చరాచర జగత్తు ఎవరివల్ల సృష్టింపబడింది? ప్రళయకాలంలో దీని లయమెలా జరుగుతుంది? ఈ విషయాలను నాకు వివరించ వలసింది.

*భీష్మ ఉవాచ:-*

**3.** అధ్యాత్మమితి మాం పార్థ! యదేతదనుపృచ్ఛసి ।
తద్ వ్యాఖ్యాస్యామి తే తాత శ్రేయస్కరతమం సుఖమ్ ॥

*భీష్ముడు పలికెను :-*

నాయనా! కుంతీకుమార! నీవు ఏ అధ్యాత్మ జ్ఞానాన్ని గూర్చి అడుగుతున్నావో దాన్ని గూర్చి నీకు తెలుపుతున్నాను. అది పరమ కల్యాణకరం మరియు సుఖస్వరూపమై ఉంది.

**4.** సృష్టి ప్రళయ సంయుక్తమాచార్యైః పరిదర్శితమ్ ।
యద్ జ్ఞాత్వా పురుషో లోకే ప్రీతిం సౌఖ్యఞ్చ విన్దతి ।
ఫలలాభశ్చ తస్య స్యాత్ సర్వభూతహితఞ్చ యద్ ॥

సృష్టిప్రళయ విషయం వ్యాఖ్యానంతో పాటు అధ్యాత్మ జ్ఞాన వివేచనాన్ని కూడా ఆచార్యులు చేసి ఉన్నారు. దేన్ని తెలుసుకొని మానవుడీ ప్రపంచంలో సుఖాన్ని ప్రసన్నతను పొందుచున్నాడో దాని ద్వారా ఫలాన్ని కూడా పొందుతున్నాడు. ఆ అధ్యాత్మ జ్ఞానం సమస్త ప్రాణులకు హితకరమై ఉంది.

**5. పృథివీ వాయురాకాశమాపో జ్యోతిశ్చ పఞ్చమమ్ ।**
**మహాభూతాని భూతానాం సర్వేషాం ప్రభవాప్యయౌ ॥**

భూమి, వాయువు, ఆకాశం, జలం, అగ్ని ఈ ఐదు మహాభూతాలు సకల ప్రాణుల యొక్క ఉత్పత్తికి ప్రళయానికి స్థానాలై ఉన్నాయి.

**6. యతః సృష్టాని తత్రైవ తాని యాన్తి పునః పునః ।**
**మహాభూతాని భూతేభ్యః సాగరస్యోర్మయో యథా ॥**

ఏ ప్రకారం అలలు సముద్రాన్నుంచి వచ్చి మరల సముద్రం నందు లీనమవుతున్నాయో అదే విధంగా ఏ పంచమహాభూతాలు ఏ పరమాత్మ ద్వారా ఉత్పన్నమవుతున్నాయో, మరల ప్రాణులన్నింటితో బాటు అవికూడా పరమాత్మ యందే లీనమవుతున్నాయి.

**7. ప్రసార్య చ యథాఙ్గాని కూర్మః సంహరతే పునః ।**
**తద్వత్ భూతాని భూతాత్మా సృష్టాని హరతే పునః ॥**

ఏ విధంగా తాబేలు తన అవయవాలను వ్యాపింపజేసి మరల లోనికి ముడుచుకుంటుందో అదే విధంగా సంపూర్ణ ప్రాణులకు ఆత్మ అయిన పరమేశ్వరుడు తాను సృష్టించిన సకల ప్రాణులను వ్యాపింపజేసి మరల తనయందే లయం చేసుకొంటున్నాడు.

**8. మహాభూతాని పఞ్చైవ సర్వభూతేషు భూతకృత్ ।**
**అకరోత్ తేషు వైషమ్యం తత్తు జీవో న పశ్యతి ॥**

సమస్త ప్రాణులను సృష్టించే పరమాత్మ సకల ప్రాణుల శరీరం నందు ఐదు మహాభూతాల తత్త్వాలనుంచినాడు. కాని అందులో వైషమ్యాన్ని ఉంచినాడు. ఒక మహాభూతానికి చెందిన అంశాన్ని ఎక్కువగా మరొక మహాభూతానికి చెందిన అంశాన్ని తక్కువగా ఉంచినాడు. ఆ వైషమ్యాన్ని సాధారణ ప్రాణి చూడలేకున్నది.

**9. శబ్దం శ్రోత్రం తథా ఖాని త్రయమాకాశయోనిజమ్ ।**
**వాయో స్పర్శస్తథా చేష్టా త్వక్చైవ త్రితయం స్మృతమ్ ॥**

శబ్దగుణం, శ్రోత్రేంద్రియం, శరీరంలోని రంధ్రాలు ఈ మూడు ఆకాశం యొక్క పనులైనాయి. స్పర్శ, చేష్ట, చర్మేంద్రియం ఈ మూడు వాయువు పనులుగా చెప్పబడినాయి.

**10. రూపం చక్షుస్తథా పాకస్త్రివిధం తేజ ఉచ్యతే।**
**రసః క్లేదశ్చ జిహ్వా చ త్రయో జలగుణాః స్మృతాః॥**

రూపం, నేత్రం, పరిపాకం, ఈ మూడు తేజస్సుకు చెందిన కార్యాలుగా చెప్పబడినాయి. రసం, నాలుక, ప్రసరణం ఈ మూడు కూడా నీటికి చెందిన గుణాలుగా చెప్పబడినాయి

**11. ఘ్రేయం ఘ్రాణం శరీరఞ్చ ఏతే భూమి గుణాస్త్రయః।**
**మహాభూతాని పఞ్చైవ షష్ఠఞ్చ మన ఉచ్యతే॥**

వాసన, ముక్కు, దేహం ఈ మూడు భూమికి చెందిన కార్యాలు. ఈ ప్రకారం శరీరంనందు ఐదు మహాభూతాలు ఆరవది మనస్సని తెలుపబడింది.

**12. ఇన్ద్రియాణి మనశ్చైవ విజ్ఞానాన్యస్య భారత!।**
**సప్తమీ బుద్ధిరిత్యాహుః క్షేత్రజ్ఞః పునరష్టమః॥**

ఓ భరతనందన! చెవి మొదలగు ఐదు ఇంద్రియాలు, మనస్సు ఇవి జీవాత్మకు విషయజ్ఞానాన్ని కలుగజేస్తున్నవి. శరీరం నందు ఈ ఆరు ఇంద్రియాలు. ఏడవది బుద్ధి, ఎనిమిదవ వాడు క్షేత్రజ్ఞుడై ఉన్నాడు.

**13. చక్షురాలోచనాయైవ సంశయం కురుతే మనః।**
**బుద్ధిరధ్యవసానాయ క్షేత్రజ్ఞః సాక్షివత్ స్థితః॥**

ఇంద్రియాలు విషయాలను గ్రహిస్తూ ఉన్నాయి. మనస్సు సంకల్ప వికల్పాలను చేస్తున్నది, బుద్ది నిశ్చయాన్ని చేస్తూ ఉంది. క్షేత్రజ్ఞుడు (ఆత్మ) సాక్షివలె ఉంటున్నాడు.

**14. ఊర్ధ్వం పాదతలాభ్యాం యదర్వాక్చోర్ధ్వం చ పశ్యతి।**
**ఏతేన సర్వమేవేదం విశుద్ధ్యభివ్యాప్తమనన్తరమ్॥**

రెండు పాదతలాలనుండి పై భాగం వరకు ఏ శరీరమైతే ఉందో దాని యందు ఏ సాక్షి భూతమైన చేతనం పైకి క్రిందికి అన్ని వైపుల చూస్తూ ఉందో అది ఈ మొత్తం శరీరం లోపల వెలుపల అంతా వ్యాపించి ఉంది. ఈ అంశాన్ని నీవు చక్కగా తెలుసుకో

15. పురుషైరిన్ద్రియాణీహ వేదితవ్యాని కృత్స్నశః।
తమోరజశ్చ సత్త్వఞ్చ తేఽపి భావాస్తదాశ్రితాః॥

మానవులంతా తమ ఇంద్రియాలను బాగా కాపాడుకొంటూ వీటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. సత్వరజస్తమో గుణాలనే మూడు గుణాలు వాటిని ఆశ్రయించే ఉంటాయి.

16. ఏతాం బుధ్వా నరో బుద్ధ్యా భూతానామాగతిం గతిమ్
సమవేక్ష్య శనైశ్చైవ లభతే శమముత్తమమ్॥

మానవుడు తన బుద్ధిబలంతో ఇంద్రియాలనన్నింటిని మరియు జీవుల గమనాగమనాల అవస్థను తెలుసుకొని మెల్లమెల్లగా వాటిని గూర్చి ఆలోచించడం ద్వారా ఉత్తమ శాంతిని పొందుతున్నాడు.

17. గుణైర్నీయతే బుద్ధిర్బుద్ధిరేవేన్ద్రియాణ్యపి।
మనః షష్ఠాని సర్వాణి తదభావే కుతో గుణాః॥

తమము మొదలగు గుణాలు బుద్ధిని మాటిమాటికి విషయాల వైపు తీసుకొని పోతూ ఉంటాయి. బుద్ధివెంట మనస్సుతో కూడిన ఐదు ఇంద్రియాలను వాటి సమస్త వృత్తులను కూడా తీసుకొని పోతూ ఉంటాయి. ఆ బుద్ధి లేనప్పుడు గుణాలు ఎలా ఉంటాయి.

18. ఇతి తన్మయమేవైతత్ సర్వం స్థావర జఙ్గమమ్।
ప్రలీయతే చోద్భవతి తస్మాన్నిర్దిశ్యతే తథా॥

కదలే కదలని ఈ జగత్తు బుద్ధిపుట్టిన తర్వాతనే తెలుస్తున్నది. అది లయం చెందిన వెంటనే లీనమైపోతూ ఉంది. అందువల్ల ఈ ప్రపంచమంతా బుద్ధిమయమై ఉంది. అన్నింటికీ బుద్ధే మూలమని శ్రుతి నిర్దేశించి ఉంది.

19. యేన పశ్యతి తచ్చక్షుః శృణోతి శ్రోత్రముచ్యతే।
జిఘ్రతి ఘ్రాణమిత్యాహు రసం జానాతి జిహ్వయా॥

బుద్ధి దేనిద్వారా చూస్తుందో అది కన్ను అని, దేని ద్వారా వింటుందో అది చెవి అని చెప్పబడుతుంది. ఇదే విధంగా ఏది వాసన చూస్తుందో దానికి ముక్కని, ఏది రుచిని చూస్తుందో దానికి నాలుక అని పేర్లు పెట్టుకున్నాం.

20. త్వచా స్పర్శయతే స్పర్శం బుద్ధిర్విక్రియతేఽసకృత్।
యేన ప్రార్థయతే కిఞ్చిత్ తదా భవతి తన్మనః॥

బుద్ధి చర్మం వల్ల స్పర్శజ్ఞానాన్ని పొందుతూ ఉంది ఈ ప్రకారం అది మాటిమాటికి వికారాన్ని పొందుతూ ఉంది. అది ఏ కారణం వల్ల ఏ అనుభవాన్ని పొందాలని అనుకుంటుందో అప్పుడు మనస్సుకూడా ఆ రూపాన్ని ధరిస్తూ ఉంది.

**21.** అధిష్ఠానాని బుద్ధేర్హి పృథగర్థాని పఞ్చధా।
ఇన్ద్రియాణీతి యాన్యాహుస్తాన్యదృశ్యోఽధితిష్ఠతి॥

భిన్నభిన్న విషయాలను గ్రహించడానికి బుద్ధికి ఏ ఐదు అధిష్ఠానాలున్నాయో వాటికే ఐదు ఇంద్రియాలని పేరు. కనుపించని జీవాత్మ వాటికన్నిటికీ అధిష్ఠాత (ప్రేరకమై) అయి ఉన్నది.

**22.** పురుషే తిష్ఠతి బుద్ధిస్త్రిషు భావేషు వర్తతే।
కదాచిల్లభతే ప్రీతిం కదాచిదనుశోచతి॥

**23.** న సుఖేన న దుఃఖేన కదాచిదపి వర్తతే।

జీవాత్మను ఆశ్రయించి బుద్ధి (సుఖం, దుఃఖం, మోహం) దాన్ని ఆశ్రయించి మూడు భావాలు ఉన్నాయి. బుద్ధి ఒకసారి ప్రసన్నంగా ఉంటాది. ఒకసారి దుఃఖంలో మునిగి ఉంటాది. వేరొకసారి సుఖదుఃఖాలతో కూడుకొని మోహచ్ఛన్నమై ఉంటుంది

ఏవం నరాణాం మనసి త్రిషుభావేష్వవస్థితా॥

**24.** సేయం భావాత్మికా భావాం స్త్రీనేతానతివర్తతే।
సరితాం సాగరో భర్తా మహావేలమివోర్మిమాన్॥

ఈ విధంగా బుద్ధి మానవుల మనస్సుల్లో మూడు రకాలుగా ఉంది. ఈ భావాత్మకమైన బుద్ధి (సమాధి అవస్థయందు) సుఖదుఃఖమోహాత్మకమై మూడు భావాలను అతిక్రమిస్తూ ఉంటుంది. ఏవిధంగా నదులకు భర్తయైన సముద్రుడు ఉత్తుంగ తరంగాలతో కూడి యుండి తన విశాలమైన చెలియలి కట్టను అప్పుడప్పుడూ దాటుతూ ఉంటాడో అదేవిధంగా ముందు చెప్పిన భావాలను అతిక్రమించినప్పటికీ బుద్ధి భావాత్మకమగు మనస్సునందు సూక్ష్మరూపంగా ఉంటుంది. ఆ తర్వాత సమాధి నుండి లేచే సమయంలో ప్రవృత్యాత్మకమైన రజోగుణం బుద్ధిభావాన్ని అనుసరిస్తూ ఉంటుంది.

**26.** ఇన్ద్రియాణి హి సర్వాణి ప్రవర్తయతి సా తదా।
తతః సత్త్వం తమో భావః ప్రీతియోగాత్ ప్రవర్తతే॥

ఆ సమయంలో తమోగుణంతో కూడిన బుద్ధి సకల ఇంద్రియాలను ప్రవృత్తి యందు ఉంచుతూ ఉంటుంది. ఆ తర్వాత విషయసంబంధంతో ప్రీతిరూపమైన సత్వగుణాన్ని ప్రకటిస్తూ ఉంటుంది. ఆ తర్వాత పురుషుని యందు ఆసక్తి మొదలగు దోషాలతో తమోమయ భావం ఉదయిస్తూ ఉంటుంది.

**27. ప్రీతిః సత్త్వం రజః శోకస్తమో మోహస్తు తే త్రయః।**
**యే యే చ భావాః లోకేఽస్మిన్ సర్వేష్వేతేషు వై త్రిషు॥**

ప్రసన్నత లేక సంతోషం సత్త్వగుణానికి చెందిన కార్యమై ఉంది. శోకం రజోగుణరూపం. మోహం తమోగుణరూపం. ఈ ప్రపంచంలో ఏఏ భావాలైతే ఉన్నాయో అవన్నీ ఈ మూడింటిలో కలిసి పోతున్నాయి.

**28. ఇతి బుద్ధిగతిః సర్వా వ్యాఖ్యాతా తవ భారత!।**
**ఇన్ద్రియాణి చ సర్వాణి విజేతవ్యాని ధీమతా॥**

భరతవంశానికి చెందిన ధర్మరాజా! ఈ ప్రకారం నేను బుద్ధికి చెందిన సంపూర్ణగతిని చక్కగా విశదీకరించినాను. బుద్ధిమంతుడైన పురుషుడు తన సకల ఇంద్రియాలను జయించాలి.

**29. సత్త్వం రజస్తమశ్చైవ ప్రాణినాం సంశ్రితాః సదా।**
**త్రివిధా వేదనా చైవ సర్వ సత్త్వేషు దృశ్యతే॥**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి భారత।**

ఓ భారత! సత్త్వం, రజస్సు, తమస్సు ఈ మూడుగుణాలు ఎల్లప్పుడు ప్రాణులయందుంటాయి. దీని కారణంగా ప్రాణులన్నింటిలో సాత్త్విక - రాజస - తామస సంబంధమయిన మూడురకాల అనుభూతి ఉంటాది

**30. సుఖస్పర్శః సత్త్వగుణో దుఃఖస్పర్శో రజోగుణః।**
**తమోగుణేన సంయుక్తౌ భవతోఽవ్యావహారికౌ॥**

సత్త్వగుణం సుఖానుభూతిని కలిగిస్తుంది. రజోగుణం దుఃఖాన్ని కలిగిస్తుంది. ఆ రెండు గుణాలు ఎప్పుడైతే తమోగుణంతో కలుస్తాయో అప్పుడు వ్యవహారానికి చెందిన విషయాలు ఉండవు.

**31. తత్ర యద్ ప్రీతిసంయుక్తం కాయే మనసి వా భవేత్।**
**వర్తతే సాత్త్వికో భావో ఇత్యాచక్షీత తత్ తథా॥**

ఎప్పుడు శరీరం లేక మనస్సునందు ఏదో ఒక రకంగా ప్రసన్నత ఉంటుందో అప్పుడు సాత్త్విక భావం ఉదయించిందని చెప్పవచ్చు.

**32.** అథ యద్ దుఃఖసంయుక్తమప్రీతికరమాత్మనః।
ప్రవృత్తం రజ ఇత్యేవ తన్న సంరభ్య చిన్తయేత్॥

ఎవనికి మనస్సులో దుఃఖంతో కూడిన అప్రసన్నతా భావం కలుగుతుందో అప్పుడు రజోగుణం అతనియందు ఉందని తెలుసుకోవాలి. అందువల్ల ఆ దుఃఖం పొంది మనస్సు దుఃఖిస్తూ ఉంటుంది. ఎందుకంటే దిగులుతో దుఃఖాన్ని వృద్ధి అవుతూ ఉంటుంది కదా!

**33.** అథ యన్మోహ సంయుక్తమవ్యక్త విషయం భవేత్।
అప్రతర్క్యమవిజ్ఞేయం తమస్తదుపధారయేత్॥

ఎప్పుడు మనస్సులో ఏదేని మోహంతో కూడిన భావం కలుగుతుంటూందో ఏదేని ఇంద్రియభావం స్పష్టంగా తెలియకుండా ఉంటుందో, ఆ విషయంలో ఏ తర్కంకూడా పనిచేయదో అతడు ఏ రకమయిన అంశాన్ని తెలుసుకోలేడో అప్పుడు అతని యందు తమోగుణం వృద్ధి అయిందని భావించాలి.

**34.** ప్రహర్షః ప్రీతిరానన్దః సుఖం సంశాన్తచిత్తతా।
కథంచిదభివర్తన్త ఇత్యేతే సాత్త్వికా గుణాః॥

ఎప్పుడు మనస్సులో ఏ విధమయిన సంతోషం, ప్రేమ, ఆనందం, సుఖం మరియు శాంతులకు చెందినట్టి అనుభవం కలుగుతూ ఉంటుందో అప్పుడు ఆ గుణాలను సాత్త్విక గుణాలని తెలుసుకోవాలి.

**35.** అతుష్టిః పరితాపశ్చ శోకో లోభస్తథా క్షమా।
అఙ్గాని రజసస్తాని దృశ్యన్తే హేత్వహేతుభిః॥

ఏదైనా కారణం వల్ల, కారణం లేకుండా అసంతోషం, శోకం, సంతాపం, లోభం, అసహనశీలత మొదలగు భావాలు కనబడుతాయో వాటిని రజోగుణాలుగా తెలుసుకోవాలి.

**36.** అవమానస్తథా మోహః ప్రమాదః స్వప్నతన్ద్రితా।
కథం చిదభివర్తన్తే వివిధాస్తామసా గుణాః॥

ఈ ప్రకారం ఎప్పుడైతే అవమానం, మోహం, ప్రమాదం, స్వప్నం, నిద్ర, ఆలస్యం మొదలైన దోషాలు ఏ విధంగానైతే కలుగుతాయో వాటిని తమోగుణానికి చెందిన వివిధరూపాలుగా తెలుసుకోవాలి

**37.** దూరగం బహుధాగామి ప్రార్థనా సంశయాత్మకమ్ ।
మనః సునియతం యస్య స సుఖీ ప్రేత్య చేహ చ ॥

చాలా దూరం వరకు వెళ్ళేది, అనేక విషయాలను తెలుసుకునేది, కోరికలు లేనట్టి, సంశయాలు లేనట్టి మనస్సు చక్కగా అధీనంలో ఉంటుంది. ఆ మానవుడు ఈ లోకంలో మరణించిన తర్వాత పై లోకంలో కూడా సుఖాన్ని పొందుతున్నాడు.

**38.** సత్త్వక్షేత్రజ్ఞయోరేతదన్తరం పశ్య సూక్ష్మయోః ।
సృజతే హి గుణానేక ఏకో న సృజతే గుణాన్ ॥

బుద్ధి, ఆత్మ ఈ రెండూ సూక్ష్మమైన తత్త్వాలు. అయినప్పటికీ వీటి యందు గొప్ప తేడా ఉంది. నీవు దీని తేడాపై దృష్టినుంచాలి ఇందులో బుద్ధిగుణాలను సృష్టిస్తూ ఉంటాది. ఆత్మ గుణాల సృష్టినుండి వేరుగా ఉంటాది.

**39.** మశకోదుమ్బరౌ వాపి సమ్ప్రయుక్తౌ యథా సదా ।
అన్యోన్యమేతౌ స్యాతాం చ సమ్ప్రయోగస్తథా తయోః ॥

ఏ విధంగా మేడిపండులోనున్న పురుగులు ఒకేచోట ఉన్నప్పటికీ ఒకదానితో మరొకటి వేరుగా ఉంటుందో అదే విధంగా బుద్ధి ఆత్మ ఈ రెండూ ఒకే చోట ఉన్నప్పటికీ రెండూ వేరువేరుగా ఉన్నట్లు తెలుసుకోవాలి.

**40.** పృథగ్భూతౌ ప్రకృత్యా తౌ సమ్ప్రయుక్తౌ చ సర్వదా ।
యథా మత్స్యో జలంచైవ సమ్ప్రయుక్తౌ తథైవ తౌ ॥

బుద్ధి ఆత్మలు ఈ రెండూ స్వతహా వేరువేరుగా ఉన్నప్పటికీ ఎల్లప్పుడూ ఒకదానితో ఒకటి కలుస్తూ ఉంటాది. చేప - నీరు వేరువేరుగా ఉన్నప్పటికీ రెండూ ఎలా కలిసి ఉంటాయో అదే విధంగా బుద్ధి ఆత్మలు కలిసి ఉంటాయి.

**41.** న గుణా విదురాత్మానం సగుణాన్ వేత్తి సర్వశః ।
పరిద్రష్టా గుణానాన్తు సంసృష్టాన్మన్యతే తథా ॥

సత్త్వం మొదలయిన గుణాలు జడాలైన కారణంగా ఆత్మను తెలుసుకోలేకపోతున్నాయి. కాని ఆత్మ చేతనం. అందువల్ల అది గుణాలను అన్ని విధాల తెలుసుకొంటూ ఉంది. ఆత్మ గుణాలకు సాక్షిగా ఉంది. అందు వల్ల అది అన్ని విధాల వాటికన్న భిన్నంగా ఉంటుంది. అయినప్పటికీ అది తనను ఆ గుణాలతో కూడిన దానిగా భావిస్తూ ఉంటుంది.

**42.** ఇన్ద్రియైస్తు ప్రదీపార్థం కురుతే బుద్ధి సప్తమైః ।
నిర్విచేష్టైరజానద్భిః పరమాత్మా ప్రదీపవత్ ॥

ఏ విధంగా ఘటం (కడవ) నందుంచిన దీపం ఘటం నుండి తనకాంతిని వ్యాపింపజేసి వస్తుజ్ఞానాన్ని కలుగజేస్తుందో అదే విధంగా పరమాత్మ శరీరంలో ఉండి చేష్ట మరియు జ్ఞానశూన్యాలైన ఇంద్రియాలను మనస్సు బుద్ధి మొదలగు ఏడింటిద్వారా సంపూర్ణ పదార్థానుభవాలను కలుగజేస్తుంటుంది.

**43.** సృజతే హి గుణాన్ సత్త్వం క్షేత్రజ్ఞః పరిపశ్యతి ।
సమ్ప్రయోగస్తయోరేష సత్త్వక్షేత్రజ్ఞయోర్ధ్రువః ॥

బుద్ధిగుణాలను సృష్టిస్తూ ఉంటుంది. ఆత్మసాక్షిగా ఉండి చూస్తూ ఉంటుంది. బుద్ధి మరియు ఆత్మల కలయిక అనాది నుండి ఉంటున్నది.

**44.** ఆశ్రయో నాస్తి సత్త్వస్య క్షేత్రజ్ఞస్య చ కశ్చన ।
సత్త్వం మనః సంసృజతే న గుణాన్ వై కదాచన ॥

పరమాత్మ తప్ప బుద్ధికి మరే ఇతర ఆశ్రయం లేదు. అలాగే క్షేత్రజ్ఞునికి కూడా వేరే ఆశ్రయమేదీ లేదు. బుద్ధి మనస్సుతోనే ఘనిష్ఠమైన సంబంధాన్ని ఉంచుకొంటున్నది. గుణాలతో దానికి సాక్షాత్ సంబంధం ఎప్పటికో గానీ ఉండదు.

**45.** రశ్మీంస్తేషాం స మనసా యదా సమ్యక్ నియచ్ఛతి ।
తదా ప్రకాశతేఽస్యాత్మా ఘటే దీపోజ్వలన్నివ ॥

ఎప్పుడైతే జీవుడు బుద్ధిరూపమైన సారథిని మనోరూపమైన కళ్ళెం ద్వారా ఇంద్రియ రూపాలైన గుఱ్ఱాలను చక్కగా అధీనంలో ఉంచుకొంటున్నాడో అప్పుడు ఘటం నందుంచిన ప్రకాశించు దీపం వలె తనలోనే అతని ఆత్మ ప్రకాశిస్తూ ఉంటుంది.

**46.** త్యక్త్వా యః ప్రాకృతం కర్మ నిత్యమాత్మరతిర్మునిః ।
సర్వభూతాత్మ భూస్తస్మాత్ స గచ్ఛేదుత్తమాం గతిమ్ ॥

ఎవడు సాంసారిక కర్మలను వదలి ఎల్లప్పుడు తనలోనే అనురక్తుడై ఉంటున్నాడో అతడు మననశీలుడై మునియై సమస్త భూతాలకు ఆత్మయై ఉత్తమగతిని పొందుతుంటాడు.

**47.** యథా వారిచరో పక్షీ సలిలేన న లిప్యతే ।
ఏవమేవ కృతప్రజ్ఞో భూతేషు పరివర్తతే ॥

ఏ విధంగా నీటిలో తిరిగే పక్షి నీరు తగులకుండా ఎలా ఉంటుందో అదే విధంగా విశుద్ధ బుద్ధితో కూడిన జ్ఞానియైన పురుషుడు ఇతరులతో కలియనప్పటికీ సకల ప్రాణుల్లో తిరుగుతూనే ఉంటాడు.

48. ఏవం స్వభావమేవైతత్ స్వబుద్ధ్యా విహరేన్నరః।
అశోచన్నప్రహృష్యంశ్చ సమో విగత మత్సరః॥

ఈ ఆత్మతత్త్వం ఇలాగే నిర్లిప్తమై ఉండి శుద్ధ బుద్ధి స్వరూపంగా ఉంటుంది ఈ విధంగా తన బుద్ధిద్వారా నిశ్చయం చేసుకొని జ్ఞానియైన పురుషుడు సంతోషం, దుఃఖం, అసూయ మొదలగు దోషరహితుడై అందరి ఎడల సమాన భావముంచి తిరుగుతూ ఉంటాడు.

49. స్వభావ యుక్త్యా యుక్తస్తు స నిత్యం సృజతే గుణాన్।
ఊర్ణనాభిర్యథా సూత్రం విజ్ఞేయాస్తన్తువత్ గుణాః॥

ఆత్మ తన స్వరూపం నందున్నప్పటికీ ఎల్లప్పుడూ గుణాలను సృష్టిస్తూనే ఉంటుంది. అదే విధంగా సాలెపురుగు తన స్వరూపం నందుండి దారాలను తయారు చేస్తూ ఉంటుంది. సాలెపురుగు దారాలతో సమానంగా సమస్తగుణాల ఉనికిని తెలుసుకోవాలి.

50. ప్రధ్వంస్తా న నివర్తన్తే నివృత్తిర్నోపలభ్యతే।
ప్రత్యక్షేణ పరోక్షం తదనుమానేన సిధ్యతి॥

51. ఏవమేకేఽధ్యవస్యన్తి నివృత్తిరితి చాపరే।
ఉభయం సంప్రధార్యైతద్ వ్యవస్యేత యథామతి॥

సాక్షాత్తు ఆత్మ ఉన్నప్పటికీ గుణాలు నష్టమవుతూనే ఉంటాయి. అయినప్పటికీ అన్ని విధాల అవి నివారింపబడుటలేదు. ఎందువలననగా వాటి నివారణను ప్రత్యక్షంగా చూడలేం. ఏ పరోక్ష వస్తువుందో అది అనుమానంతోనే సిద్ధిస్తూ ఉంటుంది. ఉత్తమ శ్రేణి విద్వాంసులు ఈ విధంగానే నిశ్చయిస్తూ ఉన్నారు. గుణాలు అన్ని విధాల నివృత్తినిపొందుతున్నాయని ఇతరుల అంగీకరిస్తూ ఉన్నారు. ఈ రెండు రకాలైన అభిప్రాయాలను చక్కగా విచారించి తన బుద్ధికి తగినట్లుగ యథార్థవస్తువును నిశ్చయించాలి.

52. ఇతీయం హృదయగన్థిం బుద్ధిభేదమయం దృఢమ్।
విముచ్య సుఖమాసీత న శోచేచ్ఛిన్నసంశయః॥

బుద్ధివల్ల కల్పింపబడ్డ ఏ భేదమైతే ఉందో అది హృదయానికి చెందిన సుదృఢమైన గ్రంథి. దాన్ని విప్పి సంశయరహితుడైన జ్ఞానియైన పురుషుడు ఎల్లప్పుడు సుఖాన్ని పొందుతాడే గాని ఎన్నటికీ దుఃఖాన్ని పొందడు.

**53.** మలినాః ప్రాప్నుయుః శుద్ధిం యథా పూర్ణాం నదీం నరాః।
అవగాహ్య సువిద్వాంసో విద్ధి జ్ఞానమిదం తవ॥

ఏ ప్రకారం మలినమైన శరీరం గల మానవులు నీటితో నిండిన నదులందు స్నానం చేసి శుభ్రమైన శరీరంగలవారు అవుతారో అలాగే మలినమైన మనస్సుగల మానవులు కూడా పరిశుభ్రమై జ్ఞాన సంపన్నులౌతున్నారని తెలుసుకోవాలి.

**54.** మహానద్యా హి పారజ్ఞస్తప్యతే న తదన్యథా।
న తు తప్యతి తత్త్వజ్ఞః ఫలే జ్ఞాతే తరత్యుత॥

ఏదైనా మహానదిని దాటడం తెలుసుకొన్న పురుషులు కేవలం తెలుసుకున్నంత మాత్రాననే కృతకృత్యుడు కావడం లేదు. ఎంత వరకు అతడు పడవలు మొదలగు వాటి ద్వారా అచటికి అతడు చేరుకొనలేడో, అంతవరకు అతడు దిగులువల్ల బాధ పడుతూనే ఉంటాడు. కాని తత్త్వజ్ఞుడైన పురుషుడు జ్ఞానమాత్రంతోనే సంసార సాగరాన్ని దాటుతూ ఉంటాడు. అందువల్ల అతనికి సంతాపం ఉండదు. ఎందువలననగా ఈ జ్ఞానం స్వయంగా ఫలస్వరూపమై ఉంది.

**55.** ఏవం యే విదురాధ్యాత్మం కేవలం జ్ఞానముత్తమమ్।

**56.** ఏతాం బుద్ధ్వా నరః సర్వాం భూతానామాగతిం గతిమ్।
అవేక్ష్య చ శనైర్బుద్ధ్యా లభతే శమనం తతః॥

ఏ మానవుడు బుద్ధివల్ల జీవుల గమనాగమనాలను మెల్లమెల్లగా ఆలోచించి విశుద్ధ ఉత్తమ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందుతున్నాడో అతడు గొప్ప శాంతిని పొందగలడు.

**57.** త్రివర్గో యస్య విదితః ప్రేక్ష్య యశ్చ విముఞ్చతి।
అన్విష్య మనసా యుక్తస్తత్త్వదర్శీ నిరుత్సుకః॥

ఎవనియందు ధర్మార్థకామాలైన మూడు పురుషార్థాలలో చక్కటి జ్ఞానముంటుందో, ఎవడు బాగుగా ఆలోచించి తెలుసుకొని వాటిని వదులు చున్నాడో, మనస్సుద్వారా ఆత్మతత్త్వానుసారం అనుసంధానం చేసి యోగయుక్తుడౌతున్నాడో, ఆత్మకంటె భిన్నమైన వస్తువు మీద ఉత్సాహాన్ని వదలి వేస్తున్నాడో అతడే తత్త్వవేత్త అయి ఉన్నాడు.

**58.** న చాత్మా శక్యతే ద్రష్టుమిన్ద్రియైశ్చ విభాగశః।
తత్ర తత్ర విసృష్టైశ్చ దుర్వారైశ్చాకృతాత్మభిః॥

ఎవడైతే తన మనస్సును అధీనంలో ఉంచుకోలేకున్నాడో వారు భిన్నభిన్న విషయాలవైపు ప్రేరితులై నివారించడానికి వీలులేని ఇంద్రియాల ద్వారా ఆత్మసాక్షాత్కారాన్ని పొందలేకున్నారు.

**59.** ఏతద్ బుద్ధ్వా భవేద్ బుద్ధః కిమన్యద్ బుద్ధలక్షణమ్ ।
విజ్ఞాయ తద్ధి మన్యన్తే కృతకృత్యామనీషిణః ॥

దీన్ని తెలుసుకొని మానవులు బుద్ధిమంతులవుతున్నారు. జ్ఞానికి దీన్ని మించిన లక్షణమేదీ లేదు. ఎందువలననగా విద్వాంసులైన పురుషులు ఆ పరతత్త్వాన్ని తెలుసుకొని తమను తాము ధన్యులుగా భావించుకొంటున్నారు.

**60.** న భవతి విదుషాం తతో భయం
యదవిదుషాం సుమహత్ భయం భవేత్ ।
న హి గతిరధికాస్తి కస్యచిత్
సతి హి గుణే ప్రవదన్త్యతుల్యతామ్ ॥

అజ్ఞానులకు ప్రపంచమనే ఏ భయంకర స్థానముందో ఆ ప్రపంచం వల్ల జ్ఞానులైన పురుషులకు భయం కలుగడం లేదు. జ్ఞానమున్నప్పటికీ అందరికీ ఒకేవిధమయిన గతి ఉంటుంది. ఎవరికీ ఉత్తమ లేక అధమ గతి ఉండదు. ఎందువలననగా గుణాలవల్ల సంబంధమున్నప్పటికీ వాటి తారతమ్యాన్ననుసరించి ఉన్నట్టి గతియందు కూడా ఆ సమానత తెలుపబడుతూ ఉంది (జ్ఞానికి గుణాలతో సంబంధం లేదు)

**61.** యః కరోత్యనభిసన్ధిపూర్వకం
తచ్చ నిర్ణుదతి యత్పురాకృతమ్ ।
నా ప్రియం తదుభయం కుతః ప్రియం
తస్య తజ్జనయతీహ సర్వతః ॥

ఎవడు నిష్కామభావంతో పనిచేస్తూ ఉంటాడో అతనికి ఆ కర్మ ముందు చేయబడ్డ సమస్త కర్మ సంస్కారాలను నాశనం చేస్తున్నది. పూర్వజన్మ మందు చేయబడిన రెండు కర్మలు అతనికి అప్రియఫలాలను కాని ప్రియఫలాలను కాని కలుగజేయడం లేదు. ఎందుకంటే కర్తృత్వం లోని అభిమానం ఫలంలోని ఆసక్తి వల్ల శూన్యమైన కారణం వల్ల అతనికి ఆ కర్మలతో సంబంధముండడం లేదు.

**62.** లోకమాతర మసూయతేజన
స్తస్య తజ్జనయతీహ సర్వతః ।

ఎవడు కామం క్రోధం మొదలయిన చెడ్డ వ్యసనాలతో కూడుకొని ఉంటాడో అతన్ని జ్ఞానులైన పురుషులు ధిక్కరిస్తూ ఉంటారు. నిందనీయమైన అతని ఆ కర్మ ఆతుర మానవునికి పశుపక్ష్యాదులందు జన్మనిప్పిస్తూ ఉంటుంది.

**63.** **లోక ఆతురజనాన్ విరాగిణ**
**స్తత్తదేవ బహుపశ్యశోచతః।**
**తత్ర పశ్యకుశలానశోచతో**
**యే విదుస్తదుభయం పదం సతామ్॥**

లోకంలో భోగాసక్తి కారణంగ ఆతురులైన ప్రజలు స్త్రీ పుత్రులు మొదలైన వారు నశించినప్పుడు వారికై గొప్పగా దుఃఖింతురు. అంతే గాక వెక్కి వెక్కి ఏడ్చుదురు. వారి ఈ దశను నీవు గమనించు. ఎవరు సారాసార కుశలురో, సత్పురుషులకు లభించే సగుణోపాసన నిర్గుణోపాసన ఫలాలను తెలుసుకొంటున్నారో వారు ఎన్నడూ దుఃఖించడం లేదు. వారి స్థితిగతులపై దృష్టి మరల్చవద్దు. నీకు ఏది హితకరంగా ఉందో ఆ మార్గాన్ని ఆశ్రయించు.

*194వ అధ్యాయం ముగిసింది.*

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 195వ అధ్యాయం

22. ధ్యానయోగాన్ని వర్ణించడం.

*భీష్మ ఉవాచ:-*

**1. హన్త వక్ష్యామి తే పార్థ! ధ్యానయోగం చతుర్విధమ్ ।**
**యం జ్ఞాత్వా శాశ్వతీం సిద్ధిం గచ్ఛన్తీహ మహర్షయః ॥**

*భీష్ముడు పలికెను:-*

కుంతీనందన! ఇప్పుడు నేను ధ్యానయోగాన్ని గూర్చి వర్ణించి చెబుతున్నాను. ధ్యానయోగం ఆలంబన భేదంతో నాలుగు విధాలుగా ఉంది.

**2. యథాస్వనుష్ఠితం ధ్యానం తథా కుర్వన్తి యోగినః ।**
**మహర్షయో జ్ఞానతృప్తా నిర్వాణగతమానసాః ॥**

నిర్వాణస్వరూపమోక్షంనందు మనస్సు నుంచు జ్ఞానతృప్త యోగయుక్త మహర్షి గణాలు ఆ ఉపాయాన్ని ఆలంబనంగా చేసుకొంటున్నవి. దానివల్ల ధ్యానం చక్కగా అనుష్ఠింపబడుతూ ఉంది.

**3. నావర్తన్తే పునః పార్థ! ముక్తాః సంసారదోషతః ।**
**జన్మదోషపరిక్షీణాః స్వభావే పర్యవస్థితాః ॥**

కుంతీకుమార! మహర్షులు ప్రపంచం నందలి కామం, క్రోధం, లోభం మొదలయిన దోషాలతో ముక్తులై అలాగే జన్మ సంబంధ దోషాలతో శూన్యులై పరమాత్మ స్వరూపులై ఉంటారు. అందువల్ల వారు మరల ఈ ప్రపంచానికి తిరిగి రావడం లేదు.

**4. నిర్ద్వంద్వాః నిత్య సత్త్వస్థా విముక్తా నియమస్థితాః ।**
**అసఙ్గాన్యవివాదీని మనః శాన్తికరాణి చ ॥**

**5. తత్ర ధ్యానేన సంశ్లిష్టమేకాగ్రం ధారయేన్మనః ।**
**పిణ్డీకృత్యేన్ద్రియ గ్రామమాసీనః కాష్ఠవన్మునిః ॥**

చలి, వేడి మొదలగు ద్వంద్వరహితులవడం, నిత్యం సత్త్వ గుణం కలిగి ఉండడం, అన్ని దోషాల నుండి విముక్తులుగావడం, శౌచం, సంతోషం మొదలగు నియమాలలో తత్పరులై ఉండడం మొదలయిన ఈ గుణాలు ధ్యానయోగసాధకులకు అవసరం. ఏ స్థానాలు అన్ని విధాలయిన భోగాలకు సంగమ శూన్యాలుగా ఉండి ధ్యాన విరోధ వస్తురహితాలై మనస్సుకు శాంతినిస్తాయో, ఆ ఇంద్రియాలను విషయాలపైకి మరల్చక కర్రవలె స్థిరభావంతో కూర్చుండి మనస్సును ఏకాగ్రంగా ఉంచి పరమాత్మునిపై మరలించాలి.

**6.** శబ్దం న విన్దేచ్ఛ్రోత్రేణ స్పర్శం త్వచా న వేదయేత్ ।
రూపం న చక్షుషా విద్యాజ్జిహ్వయా న రసాంస్తథా ॥

**7.** ప్రేయాణ్యపి చ సర్వాణి జహ్యాద్ ధ్యానేన యోగవిత్ ।
పఞ్చవర్గప్రమాథీని నేచ్ఛేచ్చైతాని వీర్యవాన్ ॥

చెవుల ద్వారా శబ్దాన్ని వినకూడదు. చర్మంద్వారా స్పర్శానుభవం పొందకూడదు. కన్నుల ద్వారా రూపాన్ని చూడకూడదు. నాలుకద్వారా రసాన్ని గ్రహించకూడదు. ధ్యానంలో వాసన చూడటానికి యోగ్యాలయిన వస్తువుల వాసన చూడరాదు. ఐదు ఇంద్రియాలకు ప్రమాదాల్ని కలిగించే ఈ విషయాలనన్నింటినీ ఎన్నటికీ మనస్సు నందుంచుకోరాదు. పై విషయాలన్నీ యోగం తెలుసుకోవాలనే వారందరికీ అవసరం.

**8.** తతో మనసి సంగృహ్య పఞ్చ వర్గం విచక్షణః ।
సమాదధ్యాన్మనో భ్రాన్తమిన్ద్రియైః సహ పఞ్చభిః ॥

ఆ తర్వాత బుద్ధిమంతుడు మరియు విద్వాంసుడైన పురుషుడు తన ఐదు ఇంద్రియాలను మనస్సునందు స్థిరంగా ఉంచుకోవాలి. ఆ తర్వాత ఐదు ఇంద్రియాలతో కూడిన చంచల మనస్సును పరమాత్మ ధ్యానంలో ఏకాగ్రంగా ఉంచాలి.

**9.** విసఞ్చారి నిరాలమ్బం పఞ్చద్వారం చలాచలమ్ ।
పూర్వం ధ్యానపథే ధీరః సమాదధ్యాన్మనోఽన్తరా ॥

మనస్సు రకరకాలయిన విషయాలలో సంచరిస్తూ ఉంటుంది. అందు ఏదైనా స్థిరమైన ఆలంబనం ఉండదు. ఐదు జ్ఞానేంద్రియాలు దానికి అటూఇటూ వెళ్ళటానికి గల ద్వారాలై ఉన్నాయి. దానికి నిలకడ ఉండదు. ఇలాంటి మనస్సును ధీరమైన యోగపురుషుడు మొదట తన హృదయంనందే ధ్యానమార్గంలో ఏకాగ్రతగా నుంచాలి.

10. ఇన్ద్రియాణి మనశ్చైవ యదా పిణ్డీకరోత్యయమ్ ।
ఏష ధ్యానపథః పూర్వో మయా సమనువర్ణితః ॥

ఎప్పుడైతే ఈ యోగి ఇంద్రియాలతో కూడిన మనస్సును ఏకాగ్రంగా ఉంచుతాడో అప్పుడు అతనిలో ఆరంభధ్యాన మార్గం ఆరంభమవుతూ ఉంటుంది. ధర్మరాజా! నేను వర్ణించి చెప్పిన మొదటి ధ్యానమార్గం ఇదే.

11. తస్య తద్ పూర్వ సంరుద్ధమాత్మనః షష్ఠమాన్తరమ్ ।
స్ఫురిష్యతి సముద్భ్రాన్తా విద్యుదమ్బుధరే యథా ॥

ఈ విధంగా ప్రయత్నం చేయడంవల్ల ఇంద్రియాలతో కూడిన మనస్సు కొంతసేపు స్థిరంగా ఉంటుంది. ఏ విధంగా మేఘాలలో విద్యుత్తు ప్రకాశిస్తుందో అదే విధంగా అవకాశం చూసుకొని మరల మాటిమాటికి విషయాలవైపు వెళ్ళటానికి మనస్సు సిద్ధంగా ఉంటుంది. ఈ విధంగా మనస్సు నిలకడ లేకుండా విషయాలవైపు మరలుతూ ఉంటుంది.

12. జలబిన్దుర్యథాలోలః పర్ణస్థః సర్వతశ్చలః ।
ఏవమేవాస్య చిత్తఞ్చ భవతి ధ్యానవర్త్మని ॥

ఏ విధంగా ఆకుపై బడిన నీటి బిందువు అన్నివైపులా వెళ్ళడానికి ప్రయత్నిస్తుందో అదే విధంగా ధ్యానమార్గం నందున్నట్టి సాధకుని మనస్సుకూడా ఆరంభంలో చంచలంగా ఉంటుంది.

13. సమాహితం క్షణం కిఞ్చిత్ ధ్యానవర్త్మని తిష్ఠతి ।
పునర్వాయుపథం భ్రాన్తం మనో భవతి వాయువత్ ॥

మనస్సును ఏకాగ్రంగా ఉంచినప్పటికీ అది కొంతసేపటి వరకు ధ్యానంలో ఉంటుంది. మరల నాడీ మార్గాన్ని చేరుకొని భ్రాంతిని చెందినదై వాయువుతో సమానంగా చంచలంగా ఉంటుంది.

14. అనిర్వేదో గతక్లేశో గత తన్ద్రిరమత్సరీ ।
సమాదద్యాత్ పునశ్చేతో ధ్యానేన ధ్యాన యోగవిత్ ॥

ధ్యానయోగాన్ని తెలుసుకొన్న తర్వాత ఇట్టి విక్షేప సమయంలో దుఃఖం లేక కష్టాన్ని పొందకూడదు. సోమరితనాన్ని, మాత్సర్యాన్ని వదలి ధ్యానం ద్వారా మనస్సును ఏకాగ్రంగా ఉంచటానికి ప్రయత్నం చేస్తూ ఉండాలి.

**15.** విచారశ్చ వివేకశ్చ వితర్కశ్చోపజాయతే ।
మునేః సమాదధానస్య ప్రథమం ధ్యానమాదితః ॥

యోగి ఎప్పుడైతే ధ్యానాన్ని ఆరంభిస్తున్నాడో అప్పుడు మొదట అతని మనస్సులో ధ్యాన విషయకమయిన విచారం, వివేకం, వితర్కం మొదలయినవి కనబడుతూ ఉంటాయి.

**16.** మనసా క్లిశ్యమానస్తు సమాధానఞ్చ కారయేత్ ।
న నిర్వేదం మునిర్గచ్ఛేత్ కుర్యాదేవాత్మనో హితమ్ ॥

ధ్యాన సమయంలో ఎంతో కష్టం కలుగుతుంది. అయినా సాధకుడు దాన్ని తట్టుకొని నిలబడాలి. తత్పరతతో పాటు మనస్సును ఏకాగ్రంగా ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. ధ్యానయోగి అయిన ముని అన్ని విధాల తన శ్రేయస్సును గూర్చే ప్రయత్నిస్తూ ఉండాలి.

**17.** పాంసు భస్మ కరీషాణాం యథా వై రాశయశ్చితాః ।
సహసా వారిణా సిక్తా న యాన్తి పరిభావనమ్ ॥

**18.** కిఞ్చిత్ స్నిగ్ధం యథా చ స్యాచ్ఛుష్కచూర్ణమభావితమ్ ।
క్రమశస్తు శనైర్గచ్ఛేత్ సర్వం తత్పరిభావనమ్ ॥

**19.** ఏవమేవేన్ద్రియ గ్రామం శనైః సమ్పరిభావయేత్ ।
సంహరేత్ క్రమశశ్చైవ స సమ్యక్ ప్రశమిష్యతి ॥

ఏ విధంగా దుమ్ము, బూడిద, ఎండిన పేడ, వీటిని వేరు వేరుగా ప్రోగు చేసిన వాటిపై నీటిని పోసినట్లయితే అవి తడిసి పోతాయి. వాటితో అప్పుడు మనమేమీ చేయలేం. వాటిని నీటితో తడుపకపోతే అవి అలాగే ఉంటాయి. తడిపితే అవి మొత్తం తడుస్తాయి. అలాగే యోగి అయినవాడు విషయాలపై ప్రసరించే ఇంద్రియాలను మెల్లమెల్లగా దూరం చేసి మనస్సును ధ్యానంపై మరలించాలి. ఈ విధంగా చేసినట్లయితే మనసు శాంతిస్తుంది.

**20.** స్వయమేవ మనశ్చైవం పఞ్చవర్గఞ్చ భారత ।
పూర్వం ధ్యానపథే స్థాప్య నిత్యయోగేన శామ్యతి ॥

భరతకుమార! ధ్యానయోగి అయిన పురుషుడు స్వయంగా మనస్సును ఇంద్రియాలను మొదట ధ్యానమార్గంలో ఉంచి, ఎల్లప్పుడూ యోగాభ్యాసం చేస్తూ శాంతిని పొందుతూ ఉంటాడు.

**21.** న తత్పురుషకారేణ న చ దైవేన కేనచిత్ ।
సుఖమేష్యతి తద్ తస్య యదేవం సంయతాత్మనః ॥

ఈ విధంగా మనో నిగ్రహపూర్వకంగా ధ్యానం చేసే యోగికి ఏ దివ్య సుఖం లభిస్తుందో అది మానవునికి ఏ ఇతర పురుషార్థం వల్లగాని దైవయోగం వల్లగాని లభించదు.

**22.** సుఖేన తేన సంయుక్తో రంస్యతే ధ్యానకర్మణి ।
గచ్ఛన్తి యోగినోహ్యేవం నిర్వాణం తన్నిరామయమ్ ॥

అట్టి ధ్యానం వల్ల కలిగిన సుఖంతో సంపన్నుడైన యోగి ఆ ధ్యానయోగంలో మిక్కిలి అనురక్తులై క్రీడిస్తూ ఉంటాడు. ఈ విధంగా యోగులైన వారు దుఃఖ శోకరహితులై మోక్షపదాన్ని పొందుతుంటారు.

**195వ అధ్యాయం ముగిసింది.**

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 196వ అధ్యాయం

23. జప యజ్ఞ విషయానికి చెందిన ధర్మరాజు ప్రశ్న - అందుకు భీష్ములవారి సమాధానం - జపం - ధ్యానం వీటి మహిమను గూర్చి వర్ణించడం - దాని ఫలాన్ని గూర్చి వివరించడం.

*యుధిష్ఠిర ఉవాచ:-*

**1. చాతురాశ్రమ్యముక్తం తే రాజధర్మాస్తథైవ చ।**
**నానాశ్రయాశ్చ బహవ ఇతిహాసాః పృథగ్విధాః॥**

*యుధిష్ఠిరుడు పలికెను :-*

పితామహా! నీవు నాలుగు ఆశ్రమాలను అలాగే రాజ ధర్మాలను గూర్చి వర్ణించినావు. ఈ ప్రకారం అనేకానేక విషయాలతో సంబంధమున్నట్టి రకరకాలైన ఇతిహాసాలను వర్ణించినావు.

**2. శ్రుతాస్త్వత్తః కథాశ్చైవ ధర్మయుక్తా మహామతే!।**
**సన్దేహోఽస్తి తు కశ్చిన్మే తద్ భవాన్ వక్తుమర్హతి॥**

గొప్ప బుద్ధిగలవాడా! నేను మీ ద్వారా అనేక ధర్మాలతో కూడిన కథలను విని ఉన్నాను. అయినప్పటికీ నా మనస్సులో ఒక సందేహముండి పోయింది. దాన్ని నీవు నాకు తెలుపవలసింది.

**3. జాపకానాం ఫలావాప్తిం శ్రోతుమిచ్ఛామి భారత!।**
**కిం ఫలం జపతాముక్తం క్వ వా తిష్ఠన్తి జాపకాః॥**

భరతకుమార! జపం చేసే వారికి ఫలప్రాప్తి ఎలా ఉంటుంది? జపం చేసేవారి జపఫలం ఏమని వర్ణింపబడింది? జపం చేసే పురుషులు ఏ లోకంలో ఏ స్థానాన్ని పొందుతున్నారు? ఈ అంశాలనన్నింటినీ నేను ఇప్పుడు వినగోరుతున్నాను.

**4. జపస్య విధిం కృత్స్నం వక్తుమర్హసి మేఽనఘ!।**
**జాపకాః ఇతి కిఞ్చైతత్ సాంఖ్యయోగ క్రియావిధిః॥**

పాపరహితుడవైన పితామహా! నీవు నాకు జపానికి చెందిన సంపూర్ణ విధిని తెలుప వలసింది. "జాపకుడు" అనే పదానికి గల తాత్పర్యమేమి? ఈ సాంఖ్యయోగం, ధ్యానయోగం లేక క్రియాయోగం యొక్క అనుష్ఠానమేమి?

5. కిం యజ్ఞవిధిరేవైష కిమేతజ్జప్యముచ్యతే ।
ఏతన్మే సర్వమాచక్ష్వ సర్వజ్ఞో ఽహ్యసి మే మతః ॥

లేక ఈ జపం ఏ యజ్ఞం యొక్క విధి అయిఉంది. దేని యొక్క జపం చేయబడుతుందో అది ఏ వస్తువు? నీవు ఈ విషయాల నన్నింటినీ నాకు తెలుపవలసింది. ఎందుకంటె నీవు సర్వజ్ఞుడవు కావున నీవే ఈ అంశాలను చెప్పడానికి తగినవాడవు.

*భీష్మ ఉవాచ:-*

6. అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
యమస్య యత్పురావృత్తం కాలస్య బ్రాహ్మణస్య చ ॥

*భీష్ముడు పలికెను :-*

రాజా! ఈ విషయంలో విద్వాంసులైన పురుషులు యముడు, కాలం మరియు బ్రాహ్మణులకు మధ్య జరిగిన ఈ ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరణంగా ఇస్తున్నాను.

7. సాంఖ్యయోగౌ తు యా ఉక్తౌ మునిభిర్మోక్షదర్శిభిః ।
సన్న్యాస ఏవ వేదాన్తే వర్తతే జపనం ప్రతి ॥

మోక్షదర్శులైన మునులచే ఏ సాంఖ్యయోగ వర్ణన చేయబడిందో వేదాంతంలో సన్న్యాసమని ఏది చెప్పబడిందో అదే జపమని తెలుసుకో.

8. వేదవాదాశ్చ నిర్వృత్తాః శాన్తా బ్రహ్మణ్యవస్థితాః ।
సాంఖ్యయోగౌ తు యావుక్తౌ మునిభిః సమదర్శిభిః ॥

9. మార్గౌ తావప్యుభావేతౌ సంశ్రితౌ న చ సంశ్రితౌ ।

ఉపనిషద్వాక్యాలు పరమానందాన్ని, శాంతిని, బ్రహ్మనిష్ఠను బోధిస్తున్నాయి. (అందువల్ల అక్కడ జపం యొక్క ఆవశ్యకత లేదు) సమదర్శులైన మునులు ఏ సాంఖ్య యోగాలను తెలిపినారో ఆ రెండు మార్గాలు చిత్తశుద్ధివల్ల జ్ఞానప్రాప్తి యందు ఉపకారకాలు అవడం వల్ల అవి కొన్నిచోట్ల జపాన్ని ఆశ్రయిస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఆశ్రయించడం లేదు.

యథా సంశ్రూయతే రాజన్ కారణం చాత్ర వక్ష్యతే ॥

10. మనఃసమాధిరత్రాపి తథేన్ద్రియజయః స్మృతః ।

రాజా! ఇక్కడ ఎలాంటి కారణమైతే వినబడుతుందో దాన్ని ముందు తెలియజేస్తాను. సాంఖ్యం మరియు యోగం ఈ రెండు మార్గాలకు కూడా మనోనిగ్రహాలు ఇంద్రియ నిగ్రహాలు అవసరమని తెలియ జేయబడింది.

సత్యమగ్ని పరీచారో వివిక్తానాఞ్చసేవనమ్ ॥

11. ధ్యానం తపో దమః క్షాన్తిరనసూయా మితాశనమ్ ।
విషయప్రతిసంహారో మితజల్పస్తథా శమః ॥

12. ఏష ప్రవర్తకో యజ్ఞో నివర్తకమథో శృణు ।
యథా నివర్తతే కర్మ జపతో బ్రహ్మచారిణః ॥

సత్యం, అగ్నిహోత్రం, ఏకాంతసేవ, ధ్యానం, తపస్సు, దయ, ఓర్పు, అసూయలేకుండడం, మితంగా ఆహారాన్ని తీసుకోవడం, విషయ సంకోచం, మితభాషణం, శమం మొదలయినవి ప్రవర్తక యజ్ఞానికి చెందినవి. దేని ఆధారంగా జపం చేసే బ్రహ్మచారియైన సాధకుని కర్మలన్నీ నివృత్తాలు అవుతున్నాయో అది నివర్తక యజ్ఞం. దాన్ని గూర్చి వర్ణిస్తున్నాను. వినవలసింది.

13. ఏతద్ సర్వమశేషేణ యథోక్తం పరివర్తయేత్ ।
నివృతం మార్గమాసాద్య వ్యక్తావ్యక్తమనాశ్రయమ్ ॥

మనో నిగ్రహం మొదలయిన ముందు చెప్పబడ్డ అన్ని సాధానాలను నిష్కామభావంతో అనుష్ఠానం చేసి వాటి ప్రవృత్తికన్న విపరీత నివృత్తి మార్గాన మార్చాలి. నివృత్తి మార్గం వ్యక్తం, అవ్యక్తం, అనాశ్రయం అని మూడు విధాలుగా ఉంది. సాధకుడు ఈ మార్గాలను ఆశ్రయించి స్థిరచిత్తుడు కావాలి.

14. కుశోచ్చయ నిషణ్ణః సన్ కుశహస్త కుశైఃశిఖీ ।
కుశైః పరివృతస్తస్మిన్ మధ్యే ఛన్నః కుశైస్తథా ॥

నివృత్తి మార్గాన్ని చేరుకొనే మార్గం ఈ ప్రకారంగా ఉంది. జపం చేసే వాడు దర్భాసనం మీద కూర్చోవాలి. అతడు తన చేతులందు దర్భలను ఉంచుకోవాలి. జుట్టులో కూడా దర్భల నుంచుకోవాలి. అతడి చుట్టూ దర్భలుండాలి. అతని మధ్యభాగంలో దర్భలుండాలి.

**15.** విషయేభ్యో నమస్కుర్యాద్ విషయాన్న చ భావయేత్।
సామ్యముత్పాద్య మనసా మనస్యేవ మనో దధత్॥

విషయాలకు దూరంగా ఉండే నమస్కరించాలి. ఎప్పటికీ వాటిని మనస్సునందు ఉంచుకో కూడదు. మనస్సునందు సమాన భావాన్ని ఉంచి మనస్సును మనస్సునందే లయం చేయాలి.

**16.** తద్ ధియా ధ్యాయతి బ్రహ్మ జపన్ వై సంహితామ్ హితామ్।
సంన్యస్యత్యథవా తాం వై సమాధౌ పర్యవస్థితః॥

మరల బుద్ధి ద్వారా పరబ్రహ్మ పరమాత్మను గూర్చి ధ్యానించాలి. అలాగే సర్వహితకరమైన వేద సంహితను, ఓంకారాన్ని గాయత్రీ మంత్రాన్ని జపించాలి. ఆ తర్వాత సమాధియందుండి ఆ సంహితను గాయత్రీ మంత్రం మొదలగు వాటి జపాన్ని కూడా వదలాలి.

**17.** ధ్యానముత్పాదయత్యత్ర సంహితా బలసంశ్రయాత్।
శుద్ధాత్మా తపసా దాన్తో నివృత్తద్వేషకామవాన్॥

**18.** అరాగమోహో నిర్ద్వన్ద్వో న శోచతి న సజ్జతే।
న కర్తా కారణానాఞ్చ న కార్యాణామితి స్థితిః॥

సంహితాజపం వల్ల ఏ బలం లభిస్తుందో దాన్ని ఆశ్రయంగా చేసుకొని సాధకుడు తన ధ్యానాన్ని సిద్ధం చేసుకొంటున్నాడు. అతడు స్వచ్ఛమైన మనస్సుగలవాడై, తపస్సుద్వారా మనస్సును ఇంద్రియాలను జయిస్తూ ఉన్నాడు. అలాగే ద్వేషం మరియు కోరికలు లేనివాడై, మోహం లేనివాడై శీతం ఉష్ణం మొదలగు సమస్త ద్వంద్వాలకు అతీతుడై ఉన్నాడు. అందువల్ల అతడు ఎన్నడూ దుఃఖాన్ని పొందడం లేదు. ఏ దానియందు ఆసక్తుడు కావడం లేదు. అతడు కర్మలకు కారకుడుగాని కార్యానికి కర్తకాని కాకున్నాడు. (అనగా అతడు కర్తృత్వం నందు అభిమానం లేని వాడై ఉన్నాడు అని భావం).

**19.** నచాహఙ్కార యోగేన మనః ప్రస్థాపయేత్ క్వచిత్।
న చార్థగ్రహణేయుక్తః నావమానీ నచాక్రియః॥

అతడు అహంకారయుతుడై ఎందులోనూ తన మనస్సును లగ్నం చేయలేకున్నాడు. అతడు తన సొంత లాభం కోసం పాటుపడడం లేదు. ఎవరినీ అవమానించడం లేదు. అలాగని ఏ పనులుచేయక ఊరకుండడం లేదు.

**20.** ధ్యానక్రియా పరో యుక్తో ధ్యానవాన్ ధ్యాన నిశ్చయః।
ధ్యానే సమాధిముత్పాద్య తదపి త్యజతి క్రమాత్॥

అతడు ధ్యానరూపమైన కార్యం నందే తత్పరుడై ఉన్నాడు. ధ్యాననిష్ఠుడై ధ్యానం ద్వారానే తత్త్వాన్ని నిశ్చయించుకొంటున్నాడు. ధ్యానం నందు సమాజనిష్ఠుడై క్రమంగా ధ్యాన రూప క్రియను వదలి వేస్తున్నాడు.

**21.** స వై తస్యామవస్థాయాం సర్వత్యాగకృతః సుఖమ్।
నిరిచ్ఛస్త్యజతి ప్రాణాన్ బ్రాహ్మీం సంవిశతే తనుమ్॥

అతడు అలాంటి అవస్థయందుండి నిస్సందేహంగా సర్వత్యాగ రూపమైన నిర్బీజ సమాధిస్థితి నుండి లభించిన పరమానందాన్ని అనుభవిస్తూ ఉన్నాడు. అతడు యోగం వల్ల పుట్టిన అణిమ మహిమ మొదలయిన ఐశ్వర్యాలందుకూడా కోరికలేక అన్నివిధాల నిష్కాముడై ప్రాణపరిత్యాగం చేస్తున్నాడు. అంతేగాక విశుద్ధ పరమాత్మ స్వరూపం నందు ప్రవేశిస్తున్నాడు.

**22.** అథవా నేచ్ఛతే తత్ర బ్రహ్మకాయనిషేవణమ్।
ఉత్క్రామతి చ మార్గస్థో నైవ క్వచన జాయతే॥

ఒకవేళ అతడు పరబ్రహ్మసాయుజ్యాన్ని పొందడానికి ఇష్టపడకపోతే దేవయాన మార్గంనుండి ఊర్ధ్వలోకాలకు పోతున్నాడు. లేక పరబ్రహ్మయైన పరమాత్మ పరమధామానికి వెళ్ళుతున్నాడు. అతడు మరల ఈ ప్రపంచంనందు ఎప్పటికీ జన్మనొందడం లేదు.

**23.** ఆత్మబుద్ధ్యా సమాస్థాయ శాన్తీ భూతో నిరామయః।
అమృతం విరజః శుద్ధమాత్మానం ప్రతిపద్యతే॥

ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవడం వల్ల రజోగుణరహితుడైన నిర్మల శాంత స్వరూపయోగి అమృత స్వరూప విశుద్ధ ఆత్మను పొందుతున్నాడు.

**196వ అధ్యాయం ముగిసింది.**

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 197వ అధ్యాయం

24. జపం చేసే వానికి దోషం వచ్చేటప్పుడు అతనికి గలిగే నరక ప్రాప్తిని గూర్చి వర్ణించడం.

*యుధిష్ఠిర ఉవాచ:-*

**1.** గతీనాముత్తమా ప్రాప్తిః కథితాం జాపకేష్విహ।
ఏకైవైషా గతిస్తేషాముతయాన్త్య పరామపి ॥

*ధర్మరాజు పలికెను:-*

పితామహా! జపించే వారికి గలుగు గతులందు ఉత్తమ గతిని గూర్చి తెలిపి ఉన్నావు. వారికి గలుగు ఏకమాత్ర గతి ఇదేనా? లేక వారు మరోగతిని కూడా పొందుతున్నారా?

*భీష్మ ఉవాచ:-*

**2.** శృణుష్వావస్థితో రాజన్! జాపకానాం గతిం విభో!।
యథా గచ్ఛన్తి నిరయాననేకాన్ పురుషర్షభాన్॥

*భీష్ముడు పలికెను:-*

రాజా! నీవు సావధానుడవై జపం చేసే వాడికి ఏ స్థితిగలుగుతుందో దాన్ని గూర్చి వివరిస్తాను. ప్రభూ! పురుష శ్రేష్ఠా! వారిలో కొందరు ఏ విధమయిన నరకాలకు వెళుతున్నారో చెప్పెదను విను.

**3.** యథోక్త పూర్వం యో నానుతిష్ఠతి జాపకః।
ఏకదేశక్రియశ్చాత్ర నిరయం స చ గచ్ఛతి॥

ముందు చెప్పిన జాపకుడు ఆయారకాలైన నియమాలను అన్నింటిని చక్కగా పాలించక కొన్నింటిని మాత్రమే పాలించి, కొన్నింటిని పాలించక పోతే అతడు నరకంలో పడుతున్నాడు.

**4.** అవమానేన కురుతే న ప్రీయతి న హృష్యతి।
ఈదృశో జాపకో యాతి నిరయం నాత్ర సంశయః॥

ఎవడు ఎగతాళికై జపం చేస్తున్నాడో అతని ఎడల ప్రేమ లేక ప్రసన్నత కన్పించదు. ఇలాంటి జాపకుడు కూడా నిస్సందేహంగా నరకంలో పడుతున్నాడు.

5. అహఙ్కారకృతశ్చైవ సర్వే నిరయగామినః।
పరావమానీ పురుషో భవితా నిరయోపగః॥

జపించే సమయంలో తన యందు అహంకారాన్ని ప్రదర్శించే జాపకులు నరకానికి పోతున్నారు. ఇతరులను అవమానించే జాపకుడు కూడా నరకానికి పోతున్నాడు.

6. అభిధ్యాపూర్వకం జప్యం కురుతే యశ్చ మోహితః।
యత్రాభిధ్యాం స కురుతే తం వై నిరయమృచ్ఛతి॥

ఎవడు మోహంతో ఫలాన్ని కోరి జపం చేస్తున్నాడో అతడు ఏ ఫలాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉంటాడో దానివల్లనే అతడు నరకాన్ని పొందుతున్నాడు.

7. అథైశ్వర ప్రవృత్తేషు జాపకస్తత్ర రజ్యతే।
స ఏవ నిరయస్తస్య నాసౌ తస్మాత్ ప్రముచ్యతే॥

ఒక వేళ జపం చేసే సాధకునికి అణిమాది ఐశ్వర్యాలు ప్రాప్తించి నట్లయితే అతడు వాటియందు అనురక్తుడైతే అదే అతనికి నరకం వంటిది. అలాంటప్పుడు అతడు దాని నుండి విడువబడడం లేదు.

8. రాగేణ జాపకో జప్యం కురుతే తత్ర మోహితః।
యత్రాస్యరాగః పతతి తత్ర తత్రోపపద్యతే॥

ఏ జాపకుడు మోహపరవశుడై విషయాసక్తి పూర్వకంగా జపం చేస్తూ ఉంటాడో, అతనికి ఏ ఫలం మీద ఆసక్తి ఉంటాదో దానికి అనుగుణంగా శరీరాన్ని పొందుతూ ఉంటాడు. ఈ ప్రకారంగా అతని పతనం జరుగుతూ ఉంటుంది.

9. దుర్బుద్ధిరకృతప్రజ్ఞశ్చలే మనసి తిష్ఠతి।
చలామేవ గతిం యాతి నిరయం వా నియచ్ఛతి॥

ఎవని బుద్ధి భోగాలపై ఆసక్తి కారణంగా దూషితమై ఉంటుందో, అలాగే ఎవడు వివేకశీలుడు కాకుండా ఉంటాడో అలాంటి జాపకుడు ఒక వేళ చంచలుడైనప్పటికీ జపం చేస్తుండినట్లయితే వినాశశీలగతిని పొందుచున్నాడు. లేక నరకంలో పడుతున్నాడు. అనగా వినాశ శీలం లేక స్వర్గాది విచలిత స్వభావంగల లోకాలను పొందుతున్నాడు. లేక పక్షి యోనులందు జన్మిస్తూ ఉన్నాడు.

**10.** అకృత ప్రజ్ఞకో బాలో మోహం గచ్ఛతి జాపకః।
స మోహాన్నిరయం యాతి తత్ర గత్వానుశోచతి ॥

ఏ వివేకశూన్యుడైన మూఢజాపకుడు మోహగ్రస్తుడవుతున్నాడో అతడు ఆ మోహకారణంగ నరకంలో పడుతున్నాడు. ఆ నరకంలో పడి నిరంతరం శోకంలో కూరుకొని పోతున్నాడు.

**11.** దృఢగ్రాహీ కరోమీతి జాప్యం జపతి జాపకః।
న సంపూర్ణో న సంయుక్తో నిరయం సోఽనుగచ్ఛతి ॥

నేను నిశ్చయంగా జపాన్ని పూర్తి చేస్తున్నాను అని ఈ ప్రకారంగా దృఢంగా నిశ్చయించుకొని ఏ జాపకుడు జపంలో ప్రవృత్తుడవుతూ అందు చక్కగా మనస్సును లగ్నం చేయక పూర్తి చేయకుండా ఉంటాడో అతడు నరకంలో పడుతున్నాడు

*యుధిష్ఠిర ఉవాచ:-*

**12.** అనివృత్తం పరం యత్తదవ్యక్తం బ్రహ్మణి స్థితమ్।
తద్భూతో జాపకః కస్మాత్ స శరీరమిహావిశేత్॥

*యుధిష్ఠిరుడు పలికెను :-*

ఎవరైతే ఎన్నడూ నివృత్తుడు కానట్టి సనాతన అవ్యక్త బ్రహ్మను దృష్టి యందుంచుకొని జపిస్తాడో అతడు మరల ఎందుకు జన్మిస్తాడు? అనగా అతనికి పునర్జన్మ ఉండదని భావం.

*భీష్మ ఉవాచ:-*

**13.** దుష్ప్రజ్ఞానేన నిరయా బహవః సముదాహృతః|
ప్రశస్తం జాపకత్వఞ్చ దోషాశ్చైతే తదాత్మకాః॥

*భీష్ముడు పలికెను :-*

రాజా! కామం మొదలైన వాటితో బుద్ధి దూషితమైనందున వారికి అనేక నరకాలు కలుగుతాయి. అనగా వారు రకరకాలైన యోనులందు జన్మిస్తారని చెప్పబడింది. జాపకుడు కావడం చాలా ఉత్తమమైంది. వారికి ముందు చెప్పిన రాగాది దోషాలు వారియందలి దూషిత బుద్ధి కారణంగానే వస్తుంటాయి.

***197వ అధ్యాయం ముగిసింది.***

# మహాభారతం - మోక్షధర్మపర్వం

## 198వ అధ్యాయం

25. పరమధామానికి అధికారియైన జాపకునికి దేవలోకం కూడా నరకంతో సమానము - అనే అంశాన్ని ప్రతిపాదించడం.

*యుధిష్ఠిర ఉవాచ:-*

1. కీదృశం నిరయం యాతి జాపకో వర్ణయస్వ మే ।
కౌతూహలం హి రాజన్! తద్ భవాన్ వక్తుమర్హతి ॥

*యుధిష్ఠిరుడు పలికెను :-*

తాతా! జపంచేసే వాడికి ఆ దోషాల కారణంగా ఎలాంటి నరకం కలుగుతున్నాది. వాటిని గూర్చి నాకు వర్ణించి చెప్పు. రాజా! వాటిని తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉంది. అందువల్ల ఈ అంశాన్ని తప్పక చెప్పవల్సింది.

*భీష్మ ఉవాచ:-*

2. ధర్మస్యాంశప్రసూతోఽసి ధర్మిష్ఠోఽసి స్వభావతః ।
ధర్మమూలాశ్రయం వాక్యం శృణుష్వావహితోఽనఘ! ॥

*భీష్ముడు పలికెను :-*

పాపరహితుడా! నీవు ధర్మానికి చెందిన అంశం వల్ల పుట్టినావు. స్వభావం చేతనే ధర్మనిష్ఠుడవైనావు. అందువల్ల సావధానుడవై ధర్మానికి మూల భూతమైన వేద సంబంధం మరియు పరమాత్మ సంబంధం అయిన నా మాట వినవల్సింది.

3. అమూని యాని స్థానాని దేవానాం పరమాత్మనామ్ ।
నానాసంస్థాన వర్ణాని నానారూప ఫలాని చ ॥

4. దివ్యాని కామచారీణి విమానాని సభాస్తథా ।
ఆక్రీడా వివిధా రాజన్! పద్మిన్యశ్చైవ కాఞ్చనాః ॥

పరమబుద్ధిమంతులైన దేవతలకు ఏవి స్థానాలు చెప్పబడినాయో, వాటి యొక్క రూపం రంగులు అనేక ప్రకారాలుగా ఉన్నాయి. వారి ఫలాలు కూడా

నానారకాలుగా ఉన్నాయి. దేవతలు ఇష్టానుసారంగా తిరుగుటకు గాను దివ్య విమానాలు దివ్య సభలు ఉన్నాయి. రాజా! వారికి ఇక్కడ నానారకాలైన క్రీడా స్థలాలు బంగారు కమలాలతో కూడిన బావులు ఉన్నాయి.

**5.** చతుర్ణాం లోకపాలానాం శుక్రసాధ్యబృహస్పతేః।
మరుతాం విశ్వదేవానాం సాధ్యానాం అశ్వినోరపి॥

**6.** రుద్రాదిత్య వసూనాఞ్చ తథాన్యేషాం దివౌకసామ్।
ఏతే వై నిరయాస్తాత స్థానస్య పరమాత్మనః॥

కుమార! వరుణుడు, కుబేరుడు, ఇంద్రుడు, యముడు, శుక్రుడు, బృహస్పతి, మరుత్తులు, విశ్వేదేవతలు, సాధ్యులు, అశ్వినీకుమారులు, రుద్రులు, ఆదిత్యులు, వసువులు మరియు ఇంద్ర దేవతలకు చెందిన ఏ లోకాలైతే ఉన్నాయో అవి అన్నీ పరమాత్మ పరంధామం ఎదుట నరకాలే అయి ఉన్నాయి.

**7.** అభయం చానిమిత్తఞ్చ న తద్ క్లేశసమావృతమ్।
ద్వాభ్యాం ముక్తం త్రిభిర్ముక్తమష్టాభిస్త్రిభిరేవ చ॥

పరమాత్మ పరంధామం వినాశభయరహితమైనట్టిది. ఎందుకంటె అది కారణరహిత నిత్యసిద్ధం. అది అవిద్య, అస్మిత, రాగం, ద్వేషం, అభినివేశం అనే పేర్లుగల ఐదు క్లేశాలతో ఆవరింపబడలేదు. అందు ప్రియాప్రియాలనే రెండు భావాలు లేవు. ప్రియాప్రియాలకు కారణభూతాలయిన సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు అందు ఉండవు. అట్లే ఆ పరంధామం భూతాలు, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ఉపాసన, కర్మ, ప్రాణం, అవిద్య అనే ఈ ఎనిమిది పురాలనుండి విముక్తి పొంది ఉన్నది. అక్కడ జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం అనే మూడు ఉండవు.

**8.** చతుర్లక్షణవర్జన్తు చతుష్కారణ వర్జితమ్।
అప్రహర్షమనానన్దమశోకం విగతక్లమమ్॥

ఇంతేకాదు అది దృష్టి, శ్రుతి, మతి, విజ్ఞాతి అనే నాలుగు లక్షణాలచే రహితమై ఉంది. జ్ఞానం యొక్క కారణభూతం ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం అనే ఈ నాల్గింటికంటె భిన్నమైంది. అక్కడ ఇష్టవిషయ ప్రాప్తివల్ల కలిగే సంతోషం, వాటి భోగజనిత ఆనందం కూడా లేకున్నది. అది ఎల్లప్పుడూ శోకశ్రమ రహితమైంది.

**9.** కాలః సమ్పద్యతే తత్ర కాలస్తత్ర న వై ప్రభుః।
సకాలస్య ప్రభుః రాజన్ స్వర్గస్యాపి తథేశ్వరః॥

రాజా! కాలం యొక్క ఉత్పత్తి కూడా అక్కడినుండే కలుగుతూ ఉంది. ఆ పరంధామంపై కాలం, అధికారం పనిచేయదు. ఆ పరమాత్మ కాలానికి స్వామి మరియు స్వర్గానికి అధిపతి.

**10. ఆత్మకేవలతాం ప్రాప్తస్తత్ర గత్వా న శోచతి ।**
**ఈదృశం పరమం స్థానం నిరయాస్తే చ తాదృశాః ॥**

ఎవడు ఆత్మకైవల్యాన్ని పొందుతున్నాడో ఆ మానవుడు అక్కడికి వెళ్ళి దుఃఖంలేని వాడు అవుతున్నాడు. ఆ పరంధామం స్వరూపం అలాంటిదై ఉంది. మొదట ఏఏ రకాలైన సంపన్న లోకాలు తెలియజేయబడ్డాయో అవి అన్నీ పరంధామాన్ని పోల్చినట్లయితే నరకాలే.


**11. ఏతే తే నిరయాః ప్రోక్తాః సర్వ ఏవ యథాతథమ్ ।**
**తస్య స్థానపరస్యేహ సర్వే నిరయసంజ్ఞితాః ॥**

రాజా! ఈ విధంగా నేను నీకు యథార్థమైన నరకాలన్నింటినీ తెలిపినాను. నిజానికి ఆ పరమపదం ఎదుట ఆ లోకాలన్నీ నరకాలే అని చెప్పడానికి తగి ఉన్నాయి.

***198వ అధ్యాయం ముగిసింది.***

*మహాభారతం - మోక్షధర్మ పర్వం మొదటి భాగం ముగిసింది.*

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
53812




డాక్టర్ కానాల నలచక్రవర్తి
సీనియర్ లెక్చరర్,
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం,
డీమ్డ్ యూనివర్సిటీ,
తిరుపతి, ఆం.ప్ర. 517 507


| | | |
|---|---|---|
| తల్లిదండ్రులు | : | వేంకటాంబ - వేంకటసుబ్బయ్య |
| జన్మస్థానం | : | కానాల (గ్రామం) నంద్యాల (మండలం) కర్నూలు (జిల్లా) |
| జన్మించిన తేది | : | 1-7-1953 |
| విద్యార్హతలు | : | న్యాకరణశిరోమణి(సంస్కృతం), శిక్షాశాస్త్రి (సంస్కృతం) M.A. (సంస్కృతం), M.A. (తెలుగు), M.Ed. (ఆంగ్లం) విద్యావారిధి (Ph.D) (ఆంధ్రప్రదేశంలో స్వాతంత్ర్యోత్తర కాలం తర్వాత సంస్కృత విద్యాప్రగతి యొక్క ఐతిహాసిక సర్వేక్షణం. (విద్యావాచస్పతి D.Lit) |

ప్రకాశిత గ్రంథాలు :

1. వ్యాససిద్ధాంతమార్తాండం (విశిష్టాద్వైత అనువాద గ్రంథం)
2. శ్రీమదయ్యప్పగీత (అద్వైత వేదాంతానువాద గ్రంథం)
3. శ్రీమధ్వమంత్రార్థమంజరి (ప్రకాశిత - తాళపత్ర గ్రంథం)
4. సంస్కృత శిక్షణే ప్రాయోగికాధ్యాపన విధానం (శిక్షాశాస్త్రం)
6. సంస్కృతాధ్యాపనం (శిక్షాశాస్త్రం)
7. మహాభారతం - మోక్షధర్మ పర్వం (అనువాద గ్రంథం - మొదటి భాగం)
8. విప్లవవాల్మీకీయం (ప్రముఖ విమర్శగ్రంథం)

అప్రకాశిత గ్రంథాలు:

1. శ్రీ మలయాళ యతీంద్ర జీవనచరితం (అనువాద గ్రంథం)
2. శ్రీ మలయాళ యతీంద్ర శతకం (సంస్కృతం)
3. సిద్ధిత్రయం (విశిష్టాద్వైతానువాద గ్రంథం)
4. శ్రీ వేంకటేశ్వర శతకం (సంస్కృతం)
5. శ్రీమదయ్యప్ప పూజావిధానం (సంకలనం)
6. సంస్కృత శిక్షణే ప్రాయోగికాధ్యాపన విధానం (హిందీ)
7. సంస్కృతాధ్యాపనం (హిందీ)
8. విప్లవ వాల్మీకీయమ్ (హిందీ)
9. వృక్షవేదం (తెలుగు)
10. వృక్షవేదం (హిందీ)
11. మహాభారతం - మోక్షధర్మ పర్వం (2,3,4,5 భాగాలు)